

www.andhrajyothy.com

వెల (Price) : Rs. 6.50

వరంగల్

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శుక్రవారం | 29-11-2024 | పేజీలు: 14 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 241

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, బహుళపక్షం; తిథి: త్రయోదశి పూర్తి; నక్షత్రం: చిత్ర ఉ. 7.36 తదుపరి స్వాతి; వర్జ్యం: మ.1.49-3.36; దుర్ముహూర్తం: ఉ.10.12-10.56, మ.2.37-3.22; అమృతఘడియలు: రా.12.30-2.17; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 6.31; సూర్యాస్తమయం: 5.34

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem |Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

12న విచారణకు హాజరు కావాలి

కొండా సురేఖకు నాంపల్లి కోర్టు నోటీసులు

అక్కినేని నాగార్జున పరువునష్టం దావా

మంత్రిపై కేసు నమోదుకు ఆదేశాలు



హైదరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సినీనటుడు అక్కినేని నాగార్జున దాఖలు చేసిన పరువునష్టం కేసులో డిసెంబర్ 12వ తేదీన విచారణకు హాజరుకావాలని మంత్రి కొండా సురేఖకు నాంపల్లి కోర్టు నోటీసులు జారీచేసింది. మంత్రిపై కేసు నమోదుకు ఉత్తర్వులు

మిగతా 14వ పేజీలో...

16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా నిషేధం

కీలక బిల్లును ఆమోదించిన ఆస్ట్రేలియా పార్లమెంటు

జాబితాలో యూట్యూబ్‌కు మాత్రం మినహాయింపు

వయసు ధ్రువీకరణ బాధ్యత సంబంధిత వేదికలదే

ఉల్లంఘిస్తే రూ.280 కోట్ల జరిమానాలు

పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యం రీత్యా నిర్ణయం

తల్లిదండ్రులు మద్దతివ్వాలి: ప్రధాని అల్బనీస్



కాన్‌బెర్రా, నవంబరు 28: ఆస్ట్రేలియా పార్లమెంటు గురువారం రాత్రి మైలురాయిలాంటి నిర్ణయం తీసుకొంది. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని 16 ఏళ్లలోపు పిల్లలకు సామాజిక మాధ్యమాలను నిషేధిస్తూ బిల్లును ఆమోదించింది. పిల్లల వయసు ధ్రువీకరణకు సామాజిక మాధ్యమాల వేదికలే 'హేతుబద్ధమైన చర్యలు' తీసుకోవాలని సూచించింది. ఇందుకు ఏడాది గడువు ఇచ్చింది. ఆ ప్రక్రియ అంతా పూర్తయిన తరువాత వచ్చే ఏడాది

మిగతా 2వ పేజీలో...



లోక్‌సభలో కొత్త కళ

సభ్యురాలిగా ప్రియాంక ప్రమాణం

గ్యాలరీ నుంచి వీక్షించిన సోనియా

పార్లమెంటులోకి వస్తుండగా 2

ఫొటోలు తీసిన అన్న రాహుల్‌గాంధీ

ఇండియా కూటమిలో చిచ్చు!

కాంగ్రెస్‌కు రబ్బర్ స్టాంపుగా ఉండం

పార్లమెంటు స్తంభనపై మమత ఆగ్రహం

అతివిశ్వాసంతోనే మహారాష్ట్రలో ఓటమి

సంక్రాంతికి పంచాయతీ భేరి!

జనవరి 14న నోటిఫికేషన్.. ఫిబ్రవరి రెండోవారంలో ఎన్నికలు

3 దశల్లో నిర్వహణ.. తర్వాత జడ్పీటీసీ, ఎంపీటీసీలకు

ఇద్దరు పిల్లలకు మించి సంతానం నిబంధన ఎత్తివేత

సమగ్ర కులగణనపై డిసెంబరు 10 వరకు నివేదిక

అనంతరం బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం నిర్ణయం

కొన్ని మండలాల్లో పెరగనున్న ఎంపీటీసీ స్థానాలు

రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు.. ఈలోపు రైతుభరోసా



హైదరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర సర్కారు దృష్టిపెట్టింది. రానున్న సంక్రాంతికి ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసేందుకు ముమ్మర కసరత్తు చేస్తోంది. ఈ మేరకు ఫిబ్రవరి రెండో వారంలో సర్పంచ్ ఎన్నికలు నిర్వహించే అవకాశాలున్నాయి. తెలంగాణ వ్యాప్తంగా సర్పంచ్ ఎన్నికలను ఒకేరోజు జరిపితే ఎదురయ్యే సవాళ్లను దృష్టిలో ఉంచుకొని మొత్తం మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన సంగతి తెలిసిందే. సర్పంచ్ ఎన్నికలు ముగిశాక జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను నిర్వహించనుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా అభ్యర్థులకు 'ఇద్దరు పిల్లలకు మించి సంతానం' నిబంధనను ఎత్తివేస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. రిజర్వేషన్లలో మార్పులు చేర్పులపైనా వేగంపెంచినట్లు సమాచారం. వీటికి సంబంధించిన నిబంధనలపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి బిల్లుపెట్టి.. ఆమోదింపచేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ ఏడాది జనవరి 31న సర్పంచుల పదవీకాలం పూర్తయింది. అయితే గత 10నెలలుగా పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని వెంటనే ఎన్నికలు జరపాలని పలు వర్గాల నుంచి డిమాండ్ వస్తున్నప్పటికీ.. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తిచేసి, స్థానిక ఎన్నికలు జరిపేవిధంగా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటుచేసింది. ఈ కమిషన్ సమగ్ర కులగణన పూర్తిచేసి.. డిసెంబరు 10నాటికి నివేదిక అందజేయనున్నట్లు తెలుస్తోంది. ఆ నివేదికను పరిశీలించిన అనంతరం బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకోవాలన్న ఉద్దేశంతో ఉంది. బీసీ రిజర్వేషన్లను ప్రభుత్వ పరంగా పెంచే అవకాశాలను పరిశీలించనుంది. ఒకవేళ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం మొత్తం రిజర్వేషన్లు 50శాతం మించకూడదన్న నిబంధనను పాటించాల్సి ఉన్నందున.. ప్రత్యామ్నాయ మార్గంపై కూడా ఆలోచిస్తున్నట్లు

12,867 పంచాయతీలు

538 జడ్పీటీసీలు

5,817 ఎంపీటీసీలు

మిగతా 3వ పేజీలో...



10వ తరగతిలో

ఇంటర్నల్ మార్కుల రద్దు

వార్షిక పరీక్షల్లో మార్కులతోనే గ్రేడింగ్

విద్యాశాఖ అధికారుల కీలక నిర్ణయం

సమాధానాలకు 24 పేజీల బుక్‌లెట్

అదనపు సమాధాన పత్రాలు ఉండవు

పరీక్ష ఫీజు 5వ తేదీ దాకా పొడిగింపు

హైదరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి వార్షిక పరీక్షల్లో కీలక మార్పులు జరిగాయి. ఇకపై ఇంటర్నల్ మార్కులను పరిగణనలోకి తీసుకోరు. వార్షిక పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగానే గ్రేడింగ్‌ను ఇస్తారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ అధికారులు గురువారం ఆదేశాలను జారీ చేశారు. ఈ మార్పులు ప్రస్తుత(2024-2025) విద్యాసంవత్సరం నుంచే అమల్లోకి వస్తాయి. ఇప్పటి వరకు ఉన్న విధానం ప్రకారం.. పదోతరగతిలో రెండు రకాల మార్కులను పరిగణనలోకి తీసుకునేవారు. వార్షిక పరీక్షల్లో 80%.. ఇంటర్నల్ అసెస్‌మెంట్‌కు 20% మార్కులను కేటాయించేవారు. అంటే.. సమ్మెటివ్ అసెస్‌మెంట్(ఎస్ఏ)-1,2,3,4 పరీక్షల్లో వచ్చిన మార్కులను సరాసరి చేసి, వీటిని 20 శాతంగా వార్షిక ఫలితాల్లో కలిపేవారు. ఇకపై ఇంటర్నల్ మార్కులను పరిగణనలోకి తీసుకోరు. కేవలం వార్షిక పరీక్షల్లో వచ్చే మార్కుల

మిగతా 14వ పేజీలో...

పాఠశాలలు, గురుకులాలను తరచూ తనిఖీ చేయండి

విద్యార్థులను కన్నబిడ్డల మాదిరిగా చూడాలి



పూలేకు నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

పరిశుభ్ర వాతావరణంలో పౌష్టికాహారం ఇవ్వాలి

కలెక్టర్లకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనలు

కలుషిత ఆహార ఘటనలపై సీఎం తీవ్ర ఆగ్రహం

బాధ్యులపై వేటు వేయాలని ఆదేశం

'కలుషిత ఆహారం'పై టాస్క్‌ఫోర్స్

ఘటనలపై విచారణ నిమిత్తం త్రిసభ్య కమిటీ 13

కారణాలు, బాధ్యుల్ని గుర్తించి నివేదికకు ఆదేశం

హాస్టల్, విద్యాలయంలో ఆహార భద్రత కమిటీలు

రోజూ కిచెన్, ఆహారపదార్థాల ఫొటోలు తీయాలి

మధ్యాహ్న భోజనం బియ్యానికి మళ్లీ పాలిషింగ్

హైదరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను కన్నబిడ్డల్లా చూడాలని.. వారికి పరిశుభ్రమైన వాతావరణంలో పౌష్టికాహారం అందించడంలో నిర్లక్ష్యం వద్దని సీఎం రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్లకు సూచించారు. తరచూ పాఠశాలలు, వసతి గృహాలు, గురుకులాలను తనిఖీ చేసి నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. విద్యార్థులకు ఆహారం అందించే విషయంలో ఉదాసీనంగా వ్యవహరించే అధికారులు, సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ విషయంలో ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు రుజువైతే వారిని ఉద్యోగాల నుంచి తొలగించేందుకు వెనుకాడబోమని స్పష్టం చేశారు. విద్యార్థులకు మంచి విద్య అందించాలనే ఉద్దేశంతో వేల సంఖ్యలో ఉపాధ్యాయ నియామకాలు చేపట్టడంతో పాటు, పిల్లలకు పౌష్టికాహారం అందించేందుకు డైట్ చార్జీలు పెంచిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. విద్యార్థుల విషయంలో తాము సానుకూల నిర్ణయాలు తీసుకుంటున్నప్పటికీ.. ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, అటువంటి శక్తుల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని, బాధ్యులైన వారిని చట్టప్రకారం శిక్షిస్తామని సీఎం హెచ్చరించారు. వసతి గృహాల్లో ఆహారం విషయంలో కొందరు ఉద్దేశపూర్వకంగా పుకార్లు సృష్టించి విద్యార్థుల తల్లిదండ్రుల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారని, వారిపైనా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

విద్యా కమిషన్ పర్యటన

రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యా కమిషన్ పర్యటించనుంది. కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి నేతృత్వంలో సభ్యులు విశ్వేశ్వర్, వెంకటేశ్, జ్యోత్స్న గురువారం మొదలుపెట్టిన ఈ పర్యటన డిసెంబరు 7 దాకా సాగనుంది.



సెకీతో ఒప్పందంపై జగన్ అడ్డగోలు వాదన

ట్రాన్స్‌మిషన్ చార్జీలు లేవంటూ బుకాయింపు

'నెట్‌వర్క్' చార్జీలపై అప్పుడే చెప్పిన అధికారి

2021లో యూనిట్ సౌర విద్యుత్తు రూ.2.14

2.49తో పాతికేళ్లు కొనడం భారం కాదా?

కార్పొరేషన్ టెండర్లలోనూ అదే ధర పలకలేదా?

ఆ టెండర్లను రద్దు చేసి సెకీతో ఎందుకు డీల్?

సెకీ నుంచి కొనేది అదానీ పవర్‌ను కాదా?

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఆంధ్ర ప్రదేశ్ ప్రజలారా... వినండి! మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి శాలువాలు కప్పాలట! సన్మానాలు చేయాలట! రాష్ట్రానికి ఆయన లక్షల కోట్లు మిగిల్చారట! ఈ మాటలన్నీ ఎవరో చెప్పినవి కావు! ఆయనకు ఆయనే చెప్పుకొన్నారు. తనకు తాను జేజేలు కొట్టుకున్నారు. 'జగన్-అదానీ.. ముడుపుల కహానీ'ని అమెరికా బయటపెట్టిన వారం తర్వాత ఆయన ఇప్పుడు, ఇన్నాళ్లకు నోరు తెరిచారు. తాడేపల్లిలో ఎంపిక చేసిన, ఎదురు ప్రశ్నించని 'సొంత మీడియా' ప్రతినిధులతో సమావేశమయ్యారు. గంటన్నరపాటు

మిగతా 10వ పేజీలో...

తెరచాటు ఒప్పందం

కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధ్వజం.. ఒకరు గిల్లితే.. మరొకరు ఏడ్చినట్లుందని ఎద్దేవా



బీఆర్ఎస్ మాదిరిగా బీజేపీ డ్రామాలు చేయదు, అబద్ధాలు చెప్పదు

'కారు' షెడ్డులో ఉన్నా.. దాని తాళాలు 'చేతి'లోనే: బండి సంజయ్

హైదరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గురివింద చందంగా బీఆర్ఎస్ పార్టీ తీరు ఉందని.. ఆ పార్టీ విధానాన్ని చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన వారిని కాంగ్రెస్‌లోకి.. చేతి గుర్తుపై గెలిచిన వారిని గులాబీ పార్టీలోకి పంపించుకుని మంత్రిపదవులు తీసుకున్నారని.. అప్పుడు ఎవరు ఎవరితో కలిసినట్లు? అనే విషయాన్ని కేసీఆర్ చెప్పగలరా? అని ట్విటర్ వేదికగా ప్రశ్నించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ తెరచాటు ఒప్పందంతో కలిసి పనిచేస్తున్నాయని.. బయటకు మాత్రం మేం గిల్లినట్లు చేస్తాం.. మీరు ఏడ్చినట్లు చేయండి అన్నట్లుగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. పదేళ్లపాటు బీఆర్ఎస్ మోసపూరిత విధానాలను అనుసరించిందని, వాటినే ఏడాదిగా కాంగ్రెస్ పాటిస్తోందని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్ వంటి కుంభకోణాలు, కేసుల విషయంలో పురోగతి లేకపోవడమే ఎవరితో ఎవరు కలిసున్నారనేది చెబుతోంది? రైతులను మోసం చేయడంలో, నిరుద్యోగ యువతను నడిరోడ్డుపై నిలబెట్టడంలో, ప్రజల మధ్య గొడవలు పెట్టి రెచ్చగొట్టడంలో, హిందూ సమాజాన్ని నిట్టనిలువునా చీల్చడంలో, కుటుంబ పాలనను ప్రోత్సహించడంలో, అవినీతిని పెంచి పోషించడంలో.. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాల ఆలోచన, పరిపాలనలో సారూప్యత ఉందని ఆరోపించారు. ఎవరు, ఎవరి చేతుల్లో ఉన్నారో, ఎవరు సంగీతం వాయిస్తే.. ఎవరు డ్యాన్స్ చేస్తున్నారో ప్రజలకు

మిగతా 12వ పేజీలో...



దీక్షాదివస్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కేటీఆర్, తలసాని

నిలదీస్తే నిర్బంధం.. ప్రశ్నిస్తే కేసులు

కమలం, హస్తం కలిసి పనిచేస్తున్నాయి

రేవంత్ సర్కారుపై ధ్వజమెత్తిన కేటీఆర్

నేడు తెలంగాణ భవన్‌లో దీక్షాదివస్

హైదరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా పాలనలో ప్రశ్నిస్తే కేసులు నమోదు చేస్తారా? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. సమస్యలపై సర్కారును నిలదీస్తే నిర్బంధిస్తారా? అని ధ్వజమెత్తారు. రైతు భరోసాకు ఎగనామం పెట్టి, రుణమాఫీ పేరుతో పంగనామాలు పెట్టి, పంటల కొనుగోళ్లకు శఠగోపం పెట్టి, ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ ఎగ్గొట్టి, దిలావర్‌పూర్‌లో దమనకాండ సృష్టించి, రామన్నపేటను

మిగతా 12వ పేజీలో...



ఇథనాల్ పరిశ్రమపై కిం కర్తవ్యం?

కేంద్రం నుంచి కేవలం ఇథనాల్ తయారీకి అనుమతి..

గత ప్రభుత్వ హయాంలో ఇతర ఉత్పత్తులకూ ఓకే

ఇప్పుడు ఈ మేరకు అనుమతులను రద్దు చేయాలా?

పూర్తిగా రద్దుకు కేంద్రానికి సిఫారసు చేయాలా?

రాష్ట్ర ప్రభుత్వంలో ఉన్నత స్థాయిలో చర్చ

ఇథనాల్ పరిశ్రమ డైరెక్టర్లుగా తలసాని కొడుకు, వియ్యంకుడి కొడుకు

గ్రామసభ పెట్టకుండా కేటీఆర్ అనుమతిచ్చారు

రాష్ట్రంలో దాడుల వెనుక రాజకీయ కుట్రలు

వాటిని త్వరలో బయటపెడతాం: మంత్రి సీతక్క

హైదరాబాద్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటు అంశంపై ఏం చేయాలని రాష్ట్ర ప్రభుత్వంలో చర్చ నడుస్తోంది. పెట్రోలులో కలిపేందుకు ఇథనాల్ తయారీ కోసం మాత్రమే కేంద్ర ప్రభుత్వం అనుమతులిస్తే.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మద్యం తయారీలో అవసరమయ్యే ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కహాల్, ఇండస్ట్రియల్ అబ్సల్యూట్ ఆల్కహాల్ లాంటి ఉత్పత్తుల తయారీకీ అనుమతులిచ్చింది. పరిశ్రమలో ఉత్పత్తి ప్రారంభమైతే వాయు కాలుష్యం తీవ్రంగా పెరుగుతుందన్న స్థానికుల ఆందోళనతో నిర్మాణ పనులకు బ్రేక్ పడింది. అయితే దీని అనుమతులను కేంద్ర ప్రభుత్వమే ఇచ్చినందున

మిగతా 14వ పేజీలో...

కాంగ్రెస్‌తోనే రైతు రాజ్యం: తుమ్మల 13

30న రైతులకు మరో శుభవార్త: మంత్రి దామోదర

పాలమూరులో రైతు ఉత్సవాలు ఘనంగా ప్రారంభం

కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీ

వ్యాగన్ తయారీ పరిశ్రమను అప్‌గ్రేడ్ చేస్తూ ఆదేశాలు

ఆలస్యంగా వెలుగు చూసిన రైల్వే శాఖ ఉత్తర్వులు

విభజన హామీలపై సమీక్షలో కేంద్ర ప్రభుత్వం స్పష్టీకరణ

త్వరలో ఎన్టీపీసీ విద్యుత్తు ప్లాంట్ రెండో దశ.. 3

'బయ్యారం'పై లోతైన అధ్యయనం అవసరమని వెల్లడి

ఆ భూమిపై ఆధారాలు చూపండి

ఈడీ ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈఐపీఎల్‌తోపాటు నలుగురికి నోటీసులు

100 ఎకరాల భూదాన్ భూమిలో 50 ఎకరాలు అమ్మేసినట్లు పేర్కొన్న ఈడీ

6న ఆధారాలతో హాజరుకావాలి.. భూదాన్ బోర్డు కార్యదర్శి ఆదేశాలు

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం భూముల వ్యవహారం

14

ఐఎన్ఎస్ అరిఘాత్ నుంచి కే-4 క్షిపణి పరీక్ష

విశాఖతీరంలోని బంగాళాఖాతంలో నిర్వహణ.. ఫలితాన్ని విశ్లేషిస్తున్న రక్షణ వర్గాలు



విశాఖపట్నం, నవంబరు 28: ఇటీవలే ప్రారంభించిన అణు జలాంతర్గామి ఐఎన్ఎస్ అరిఘాత్ నుంచి భారత నౌకాదళం.. కే-4 బాలిస్టిక్ క్షిపణిని పరీక్షించింది. విశాఖపట్నం సమీపంలోని బంగాళాఖాతంలో బుధవారం ఉదయం ఈ పరీక్ష నిర్వహించినట్టు రక్షణ వర్గాలు పేర్కొన్నాయి. ఈ పరీక్ష ప్రమాణాలకు అనుగుణంగా ఉందో లేదో తెలుసుకోవడానికి ఫలితాన్ని క్షుణ్ణంగా విశ్లేషిస్తున్నామని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. సబ్‌మెరైన్ నుంచి ప్రయోగించగల ఈ అణ్వాయుధ సామర్థ్యం కలిగిన అధునాతన కే-4 బాలిస్టిక్ క్షిపణి (ఎస్ఎల్‌బీఎం) 3,500 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదు. 6,000 టన్నుల బరువున్న ఐఎన్ఎస్ అరిఘాత్ నుంచి కే-4 క్షిపణిని పరీక్షించడం ఇదే తొలిసారి. గతంలో వీటిని సబ్‌మెర్సిబుల్ పాంటూన్ల నుంచి మాత్రమే పరీక్షించారు. తీర ప్రాంత రక్షణను బలోపేతం చేసుకునే ప్రక్రియలో భాగంగా భారత నౌకాదళం కే-4 క్షిపణి పరీక్ష నిర్వహించింది. ఐఎన్ఎస్ అరిఘాత్ భారత నౌకాదళంలో ఉన్న రెండో అణు జలాంతర్గామి. ఈ ఏడాది ఆగస్టు 29న రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ దీన్ని ప్రారంభించారు. ఇది అణ్వస్త్రాలు కలిగిన బాలిస్టిక్ క్షిపణులను మోసుకెళ్లగలదు. భారత్‌కు చెందిన తొలి అణు జలాంతర్గామి ఐఎన్ఎస్ అరిహంత్‌లో 750 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగల ఎస్ఎస్‌బీఎన్ కే-15 క్షిపణులు ఉన్నాయి. కాగా, వచ్చే ఏడాది భారత నౌకాదళానికి అందుబాటులోకి రానున్న మరో అణు జలాంతర్గామి ఐఎన్ఎస్ అరిధమన్‌లోనూ కే-4 క్షిపణిని చేర్చేందుకు తాజా పరీక్ష ఉపయోగపడనుంది.

ఢిల్లీలో ఈడీ అధికారులపై దాడి

» ఫర్నిచర్, కుర్చీలతో కొట్టిన దుండగులు.. ఒకరికి గాయాలు

న్యూఢిల్లీ, నవంబరు 28: దర్యాప్తు కోసం వెళ్లిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులపై గుర్తుతెలియని దుండగులు దాడి చేశారు. కుర్చీలు, ఫర్నీచర్‌తో భౌతిక దాడికి తెగబడటంతో ఓ అధికారి గాయపడ్డారని ఈడీ అధికారులు ఎక్స్ వేదికగా తెలిపారు. ఈ ఘటన ఢిల్లీలోని బిజ్వాసన్ ప్రాంతంలో జరిగింది. పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, క్యూఆర్ కోడ్ చీటింగ్ వంటి సైబర్ మోసాల కేసులో ముడిపడి ఉన్న చార్టెడ్ అకౌంటెంట్స్ లక్ష్యంగా గురువారం దేశవ్యాప్తంగా ఈడీ సోదాలు నిర్వహించింది. ఈ క్రమంలో బిజ్వాసన్ ప్రాంతంలోని అశోక్ శర్మ అనే సీఏ ఫామ్‌హౌస్‌పై అధికారులు దర్యాప్తుకు వెళ్లారు. సోదాలు నిర్వహిస్తున్న వారిపై అశోక్, అతడి సోదరుడు చేతికి దొరికిన ఫర్నిచర్, కుర్చీలతో దాడికి దిగారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు ఈడీ అధికారులు తెలిపారు.



9 నెలల్లో రూ.11,333 కోట్ల దోపిడీ

» దేశంలో పెరిగిపోతున్న సైబర్ నేరాలు

» నెలకు సగటున లక్షకు పైగా ఫిర్యాదులు: నివేదిక

న్యూఢిల్లీ, నవంబరు 28: ఇటీవలి కాలంలో సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోయాయి. మన దేశంలో నెలకు సగటున లక్షకు పైగా ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబరు వరకు 9 నెలల్లో సైబర్ స్కామ్‌ల్లో బాధితులు దాదాపు రూ.11,333 కోట్లు నష్టపోయినట్టు తాజాగా ఓ నివేదిక వెల్లడించింది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పరిధిలోని భారత సైబర్ క్రైమ్ కో-ఆర్డినేషన్ సెంటర్ (14సీ) విభాగం డేటాను ఉటంకిస్తూ జాతీయ మీడియా ఈ నివేదికను ప్రచురించింది. ఈ జాబితాలో స్టాక్ ట్రేడింగ్ మోసాలకు సంబంధించినవి ఎక్కువగా ఉన్నాయి. ఆ తర్వాతి స్థానాల్లో పెట్టుబడుల పేరిట మోసాలకు సంబంధించి లక్ష ఫిర్యాదులు (రూ.3,216 కోట్లు), డిజిటల్ అరెస్ట్ కేసులకు సంబంధించి 63 వేల ఫిర్యాదులు (రూ.1,616 కోట్లు) ఉన్నాయి. కాగా ది సిటిజన్ ఫైనాన్షియల్ సైబర్ ఫ్రాడ్ రిపోర్టింగ్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (సీఎఫ్‌సీఎఫ్ఆర్ఎంఎస్) డేటా ప్రకారం ఈ ఏడాది 12 లక్షల ఫిర్యాదులు అందినట్టు పేర్కొంది. ఇందులో 45% కంబోడియా, మయన్మార్, లావోస్‌కు సంబంధించినవి ఉన్నాయి. 2021 నుంచి సైబర్ మోసాలకు సంబంధించి రూ.27,914 కోట్లు నష్టపోయినట్టు సీఎఫ్‌సీఎఫ్ఆర్ఎంఎస్‌కు దాదాపు 30.05 లక్షల ఫిర్యాదులు అందాయి.

యంత్రాలతో కాదు.. యంత్రాంగంతోనే సమస్య

» ఈవీఎంలను సమర్థించిన కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్

న్యూఢిల్లీ, నవంబరు 28: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం)తో సమస్యేమీ లేదని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ అన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సహా పలువురు నేతలు ఈవీఎంలపై అనుమానాలు వ్యక్తం చేయడంతో పాటు బ్యాలెట్ పేపర్ విధానంలో ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో శశిథరూర్ ఈవీఎంలను సమర్థించడం గమనార్హం. "మహారాష్ట్ర ఎన్నికల తర్వాత ఈవీఎంల అంశం తెరపైకి వచ్చింది. ఈవీఎంలను తారుమారు చేయొచ్చన్న వాదనలను నేను అంగీకరించను. బ్యాలెట్ పేపర్ల కంటే మెరుగైనవి కాబట్టే మన ఎన్నికల ప్రక్రియలో ఈవీఎంలను భాగం చేశారు" అని థరూర్ ఎక్స్‌లో పేర్కొన్నారు. ఇక్కడ సమస్య యంత్రాలతో కాదని, ఎన్నికల వ్యవస్థను నడిపే యంత్రాంగంతోనేనని వ్యాఖ్యానించారు. ఈవీఎంలపై నేతలు లేవనెత్తిన ప్రశ్నలకు ఈసీ సమాధానం చెప్పాల్సి ఉంటుందని, నిశ్శబ్దంగా ఉంటే అనుమానాలకు తావిచ్చినట్లవుతుందని పేర్కొన్నారు. బ్యాలెట్ పేపర్లతో ఎన్నికలు నిర్వహించడమనేది సమస్యకు పరిష్కారం కాదన్నారు.

ఆగ్రాలో 1,700 ఇళ్లకు పగుళ్లు

» ఏ క్షణమైనా కూలనున్న 146 ఇళ్లు

» భూగర్భ మెట్రో నిర్మాణమే కారణమని ప్రజల ఆరోపణ

ఆగ్రా, నవంబరు 28: ఆగ్రాలోని మోతీకట్రా, సయ్యద్ గల్లీలోని 1,700 ఇళ్లకు పగుళ్లు వచ్చాయి. ఈ ఏడాది జూలై నుంచి పగుళ్లు దారుణంగా విస్తరిస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. 146 ఇళ్లు ఏ క్షణమైనా కూలిపోయే దశకు చేరుకోగా.. పలు ఇళ్లను, భవనాలను వాటి యజమానులు జాక్‌ల సపోర్టుతో నిలబెట్టారు. ఇందుకు ప్రధాన కారణం భూగర్భ మెట్రో నిర్మాణమేనని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉత్తరప్రదేశ్ మెట్రోరైల్ ప్రాజెక్టు లిమిటెడ్(యూపీఎంపీఎల్) అధికారులు ఆగ్రా కాలేజీ నుంచి మన్‌కామేశ్వర్ మందిర్ స్టేషన్ వరకు రెండు కిలోమీటర్ల మేర.. 100-150 అడుగుల లోతులో మెట్రోమార్గం కోసం సొరంగాన్ని నిర్మిస్తున్నారు. ఈ పనులు గత ఏడాది అక్టోబరులో మొదలవ్వగా.. అప్పట్లోనే కొన్ని ఇళ్లకు పగుళ్లు రావడం మొదలైంది. ఈ ఏడాది జూలై నుంచి పగుళ్లు వేగంగా విస్తరిస్తున్నాయి. ఇలా.. 1,700 భవనాలు, ఇళ్లకు పగుళ్లు వచ్చాయి. అయితే.. భూగర్భ సొరంగమార్గం నిర్మాణానికి.. ఇళ్ల పగుళ్లకు ఎలాంటి సంబంధం లేదని యూపీఎంపీఎల్ పీఆర్వో పంచానన్ మిశ్రా మీడియాకు తెలిపారు. నిర్దేశిత ప్రమాణాలతోనే టన్నెల్ నిర్మాణం జరుగుతోందని వివరించారు. అయితే.. టన్నెల్ నిర్మాణం సందర్భంగా జరుపుతున్న పేలుళ్లు, డ్రిల్లింగ్ కారణంగా.. తమ ఇళ్ల పునాదులు కదులుతున్నాయని స్థానికులు వాపోతున్నారు.

అంగన్‌వాడీల్లో 38.9% పిల్లల్లో లోపించిన ఎదుగుదల: కేంద్రం

న్యూఢిల్లీ, నవంబరు 28: అంగన్‌వాడీల్లో చేరిన 5ఏళ్ల లోపు పిల్లల్లో దాదాపు మూడో వంతు (38.9%) మందిలో ఎదుగుదల లోపించిందని కేంద్ర మహిళా శిశు సంక్షేమ మంత్రిత్వశాఖ వెల్లడించింది. ఈ మేరకు గురువారం రాజ్యసభలో ఓ ప్రశ్నకు ఆ శాఖ మంత్రి సావిత్రి ఠాకూర్ సమాధానమిస్తూ.. దేశవ్యాప్తంగా అంగన్‌వాడీల్లో 7.54 కోట్ల మంది ఐదేళ్ల లోపు పిల్లలు నమోదై ఉన్నారని చెప్పారు. అంగన్‌వాడీలలో ఉన్న పిల్లల ఎదుగుదలను మొబైల్ ఆధారిత అప్లికేషన్ 'పోషన్ ట్రాకర్' ద్వారా క్రమం తప్పకుండా కొలుస్తున్నట్లు వెల్లడించారు. ఈ ఏడాది ఇప్పటి వరకు పోషణ్ ట్రాకర్ యాప్ ద్వారా 7.31 కోట్ల మంది పిల్లల ఎదుగుదలను కొలవగా 38.9% మంది పిల్లల్లో ఎదుగుదల తక్కువగా ఉన్నట్లు తేలిందని ఆమె వివరించారు. 17% మంది వారి వయసుకు తగ్గట్టు బరువు లేరని, 5.2% మందిలో ఎత్తుకు తగ్గ బరువు లోపించిందని తెలిపారు.

ఢిల్లీలో 'మెదడువాపు'

» 13 ఏళ్ల తర్వాత తొలిసారిగా కేసు నమోదు

న్యూఢిల్లీ, నవంబరు 28: దాదాపు 13 ఏళ్ల తర్వాత ఢిల్లీలో తొలిసారిగా మెదడువాపు (జపనీస్ ఎన్‌సెఫలైటిస్) కేసు నమోదైంది. ఈ మేరకు ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ) బుధవారం ఒక నోటీసు విడుదల చేసింది. ఢిల్లీ పశ్చిమప్రాంతంలోని బిందాపూర్‌లో కేసు నమోదైనట్లు తెలిపింది. మెదడువాపు మరింత వ్యాప్తి చెందకుండా పలు చర్యలను సిఫార్సు చేస్తూ.. జిల్లా ఆరోగ్య అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. వైరస్ లార్వా పెరుగుదలను అరికట్టటం, ప్రజల్లో అవగాహన పెంచటం వంటివి వీటిలో ఉన్నాయి. పక్షులు, జంతువుల నుంచి దోమల ద్వారా మెదడువాపు వైరస్ మనుషులకు సంక్రమిస్తుంది. కేంద్ర నాడీ వ్యవస్థ మీద ప్రభావం చూపి పలురకాల ఆరోగ్య సమస్యలకు కారణమవుతుంది. తీవ్రత పెరిగితే మరణం సంభవించే ప్రమాదం ఉంది. ముఖ్యంగా, ఐదేళ్ల లోపు పిల్లలకు వస్తే తీవ్ర ప్రమాదకరం. అందుకనే, పిల్లల టీకాల కార్యక్రమంలో భాగంగా మెదడువాపు నివారణ వ్యాక్సిన్ రెండు డోసులను వేస్తుంటారు. ఈ ఏడాది జూలైలో అసోంలో మెదడువాపుతో 10 మంది ప్రాణాలు కోల్పోయారు.

'ఆల్ట్ న్యూస్' వ్యవస్థాపకుడిపై మరో కేసు

ప్రయాగ్‌రాజ్, నవంబరు 28: ప్రముఖ స్వామీజీ నరసింగానంద్ చేసిన ప్రసంగానికి సంబంధించిన పాత వీడియోను పోస్టు చేసి విద్వేషాలు రెచ్చగొట్టారన్న కేసులో 'ఆల్ట్ న్యూస్' వెబ్ పోర్టల్ సహ వ్యవస్థాపకుడు మహమ్మద్ జుబేర్‌పై ఉత్తరప్రదేశ్ పోలీసులు మరో కేసు పెట్టారు. దేశ సార్వభౌమ అధికారం, సమైక్యత, సమగ్రతకు ముప్పు తెచ్చారంటూ ఐటీ చట్టంలోని 66 సెక్షన్, బీఎన్ఎస్‌లోని సెక్షన్ 152 కింద కేసు నమోదు చేసినట్టు ఘాజియాబాద్ పోలీసులు అలహాబాద్ హైకోర్టుకు తెలిపారు. సెక్షన్ 152 కింద కేసు పెడితే బెయిల్ రావడం కష్టమవుతుంది. యతి నరసింగానంద్ సరస్వతి ట్రస్టు ప్రధాన కార్యదర్శి ఉదిత త్యాగి చేసిన ఫిర్యాదు మేరకు ఘాజియాబాద్ పోలీసులు జుబేర్‌పై కేసు పెట్టారు. భారత న్యాయసంహితలోని అయిదు సెక్షన్ల కింద- తప్పుడు సమాచారంతో మత విభేదాలను రెచ్చగొట్టడం, పరువు నష్టం కలిగించడం తదితర ఆరోపణలు నమోదు చేశారు.

లోక్‌సభలో కొత్త కళ

సభ్యురాలిగా ప్రమాణం చేసిన ప్రియాంక.. పార్లమెంటులోకి వస్తుండగా ఫొటోలు తీసిన రాహుల్

» అనంతరం యథావిధిగా విపక్ష సభ్యుల నినాదాలు

» సభను వాయిదా వేసిన స్పీకర్



పార్లమెంటులోకి వస్తున్న ప్రియాంకను ఫొటోలు తీస్తున్న రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నేతలు ప్రియాంక, రవీంద్ర వసంత్ రావు చవాన్ గురువారం లోక్‌సభ సభ్యులుగా ప్రమాణం చేశారు. కేరళలోని వయనాడ్ నుంచి ప్రియాంక, మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి రవీంద్ర ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన విషయం తెలిసిందే. ప్రియాంక విజయంతో నెహ్రూ-గాంధీ కుటుంబానికి చెందిన ముగ్గురు సభ్యులు సోనియా, రాహుల్, ప్రియాంక పార్లమెంటులో ప్రవేశించినట్లయింది. కేరళ సంప్రదాయానికి చెందిన కసావు చీర ధరించిన ప్రియాంక పార్లమెంటులో ప్రవేశించినప్పటి నుంచీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఎంపీలతో పాటు మీడియా ప్రతినిధులు తన వెంట నడుస్తుండగా.. పార్లమెంటులోకి ప్రవేశిస్తున్న ప్రియాంకను సోదరుడు రాహుల్ గాంధీ తన మొబైల్‌లో ఫొటోలు తీశారు. ప్రియాంక రాజ్యాంగం చేతబూని, హిందీ లో ప్రమాణ స్వీకారం చేస్తుండగా ఆమె తల్లి, రాజ్యసభ సభ్యురాలు సోనియా, భర్త రాబర్ట్ వాద్రా గ్యాలరీ నుంచి తిలకించారు. భారత రాజ్యాంగం పట్ల నిజమైన విశ్వాసం, విధేయతను పాటిస్తానని ఆమె ప్రమాణం చేసినప్పుడు రాహుల్, ఇతర కాంగ్రెస్ సభ్యులు బల్లలు చరిచి హర్షధ్వానాలు చేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో వయనాడ్ నియోజకవర్గం నుంచి ప్రియాంక 4,10,931 ఓట్ల భారీ మెజారిటీతో గెలిచారు. దీంతో ఉత్తరాదిలోని రాయబరేలీకి రాహుల్ గాంధీ, దక్షిణాదిలోని వయనాడుకు ప్రియాంక ప్రాతినిధ్యం వహిస్తున్నట్లయింది. 1999 నుంచి రాజకీయాల్లో ఉన్న ప్రియాంక తొలుత తన తల్లి సోనియా నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారానికే పరిమితమయ్యారు. 2004లో సోనియాతో పాటు రాహుల్ నియోజకవర్గంలో కూడా ప్రచారం చేశారు. 2009లో ఆమెను అధికారికంగా తూర్పు ఉత్తరప్రదేశ్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా, 2020లో జాతీయ స్థాయిలో ప్రధాన కార్యదర్శిగా నియమించారు. దాదాపు పాతికేళ్లగా రాజకీయాల్లో ఉన్న ప్రియాంక(52) తొలిసారి ప్రత్యక్ష ఎన్నికల బరిలో నిలిచి, గెలిచారు. ప్రియాంక 1972 జనవరి 12న ఢిల్లీలో జన్మించారు. 1997లో ఆమె ఢిల్లీకి చెందిన వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రాను పెళ్లి చేసుకున్నారు. వారికి ఇద్దరు పిల్లలు రెహాన్, మిరయా ఉన్నారు.

గందరగోళం, వాయిదా

లోక్‌సభలో ఉదయం 11 గంటలకు ప్రియాంక, రవీంద్ర ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే అదానీ కుంభకోణం, సంభాల్ హింసాకాండపై యథాప్రకారం గందరగోళం చెలరేగింది. ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి ప్రవేశించడంతో తొలుత 12 గంటలకు వాయిదా వేసిన స్పీకర్ ఓం బిర్లా తర్వాత శుక్రవారానికి వాయిదా వేశారు. అదానీ సంస్థకు వ్యతిరేకంగా వచ్చిన ఆరోపణలపై చర్చించాలన్న కాంగ్రెస్ సభ్యుల డిమాండ్‌ను స్పీకర్ అంగీకరించలేదు. ప్రశ్నోత్తరాల తర్వాత ఈ అంశంపై చర్చించవచ్చని స్పీకర్ చెప్పగా.. సభ్యులు అంగీకరించలేదు.

కాంగ్రెస్‌కు రబ్బర్ స్టాంపుగా ఉండం: మమత

కోల్‌కతా/ముంబై, నవంబరు 28: మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు విపక్ష ఇండియా కూటమిలో లుకలుకలు రేపుతున్నాయి. కాంగ్రెస్ ఆధిపత్య ధోరణిపై పశ్చిమ బెంగాల్ సీఎం, టీఎంసీ అధినాయకురాలు మమతా బెనర్జీ గుర్రుగా ఉన్నారు. ముఖ్యంగా అదానీ వ్యవహారంలో ఏకపక్షంగా పార్లమెంటును స్తంభింపజేయడం ఆమె అసంతృప్తిగా ఉన్నారు. తమ రాష్ట్ర సమస్యలను ప్రస్తావించేందుకు సభలు సజావుగా నడవాలని ఆమె గట్టిగా కోరుకుంటున్నారు. ఇందుకోసం పార్లమెంటులో స్వతంత్రంగా వ్యవహరించాలని భావిస్తున్నారు. కాంగ్రెస్‌కు టీఎంసీ రబ్బర్ స్టాంపుగా ఉండదని తాజాగా తమ ఎంపీలకు తేల్చిచెప్పారు. ఇద్దరం కూటమిలో ఉన్నా.. కాంగ్రెస్‌తో తమకు ఎన్నికల పొత్తు లేదని.. ఆ పార్టీ తీసుకునే ఏకపక్ష నిర్ణయాలను అంగీకరించాల్సిన అవసరం లేదని స్పష్టంచేశారు. అటు మహా వికాస్ అఘాడీలో కీలక పక్షమైన ఉద్ధవ్ శివసేన కూడా కాంగ్రెస్ తీరుపై మండిపడింది. లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో 13 సీట్లు గెలుచుకున్న ధీమాతో అతి విశ్వాసంతో వ్యవహరించిందని.. కానీ పరాజయం పాలైందని శాసనమండలిలో విపక్ష నేత అంబాదాస్ దన్వే అన్నారు.

ఝార్ఖండ్ సీఎంగా హేమంత్ ప్రమాణం

» నాలుగోసారి బాధ్యతల స్వీకరణ

» హాజరైన ఇండియా కూటమి నేతలు



సీఎంగా ప్రమాణం చేస్తున్న హేమంత్ సోరెన్

రాంచీ, నవంబరు 28: ఝార్ఖండ్ రాష్ట్ర 14వ ముఖ్యమంత్రిగా హేమంత్ సోరెన్ ప్రమాణ స్వీకారం చేశారు. రాంచీలోని మొరబడి గ్రౌండ్‌లో 'ఇండియా' కూటమి నేతల సమక్షంలో గురువారం ఈ కార్యక్రమం జరిగింది. సోరెన్‌తో గవర్నర్ సంతోష్ కుమార్ గంగ్వార్ ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా రాంచీ పట్టణంలో పాఠశాలలకు గురువారం సెలవు ప్రకటించారు. ఝార్ఖండ్ సీఎంగా సోరెన్ బాధ్యతలు స్వీకరించడం ఇది నాలుగోసారి. ప్రమాణ స్వీకారోత్సవానికి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, పశ్చిమ బెంగాల్ సీఎం మమతాబెనర్జీ, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్, పంజాబ్ సీఎం భగవంత్ మాన్, సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్, బిహార్ ప్రతిపక్ష నేత తేజస్వీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఇటీవల జరిగిన ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో జేఎంఎం నేతృత్వంలో ఇండియా కూటమి ఘన విజయం(జేఎంఎం 34, కాంగ్రెస్ 16, ఆర్జేడీ 4, సీపీఐ(ఎంఎల్)ఎల్ 2 సీట్లు) సాధించిన సంగతి తెలిసిందే.

16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా నిషేధం

(మొదటి పేజీ తరువాయి)

నవంబరు నుంచి ఈ నిషేధం అమల్లోకి రానుంది. ఎక్స్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం, టిక్‌టాక్, స్నాప్‌చాట్, రెడిట్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫారంలకు ఇది వర్తిస్తుంది. ఈ జాబితాలో యూట్యూబ్‌ను మాత్రం చేర్చలేదు. వయసు నిబంధనను చాలా కఠినంగా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వయసును ఏ విధంగా నిర్ణయించాలన్న బాధ్యతను సామాజిక మాధ్యమాలకే విడిచి పెట్టింది. సామాజిక మాధ్యమాల్లో పిల్లలు ఖాతాలు ప్రారంభించకుండా నిరోధించలేకపోతే సంబంధిత వేదికలకు 50 మిలియన్ ఆస్ట్రేలియన్ డాలర్లు (సుమారు రూ.280 కోట్లు) జరిమానాగా విధించనుంది. ఇందుకు సంబంధించిన బిల్లును ఎగువ సభ సెనేట్ ఆమోదించింది. ఈ విషయంలో అధికార లేబర్ పార్టీకి ప్రతిపక్ష కన్జర్వేటివ్ పార్టీ సంపూర్ణంగా మద్దతు తెలిపింది. దిగువ సభ అయిన హౌస్ ఆఫ్ పీపుల్స్ రిప్రజెంటేటివ్స్ బుధవారమే ఆమోదించడం గమనార్హం. ఈ సందర్భంగా ప్రధాని ఆంటోనీ అల్బనీసే మాట్లాడుతూ విపరీతంగా సామాజిక మాధ్యమాలను వినియోగిస్తున్న కారణంగా పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యం ప్రభావితమవుతోందని, అందువల్లనే నిషేధాన్ని విధిస్తున్నట్టు చెప్పారు. ఇందుకు తల్లిదండ్రులు కూడా మద్దతు ఇవ్వాలని కోరారు. మే నెలలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆయన తీసుకున్న ఈ నిర్ణయం ప్రాధాన్యతను సంతరించుకొంది. పిల్లల వయసు నిర్ధారణకు బయోమెట్రిక్‌ను ఉపయోగిస్తారా, ప్రభుత్వం ఇచ్చే ధ్రువపత్రాలను వినియోగిస్తారా అన్నది తేలాల్సి ఉంది. ఈ విషయమై పలు సామాజిక మాధ్యమాలు పార్లమెంటుకు తమ అభిప్రాయాలు తెలిపాయి. వయసు నిర్ధారణ ప్రయోగాలు పూర్తయ్యే వరకు అమలును వాయిదా వేయాలని గూగుల్, మెటా సంస్థలు కోరాయి. మరింతగా సంప్రదింపులు జరపాల్సి ఉందని టిక్‌టాక్ కోరింది. ఈ బిల్లుకు ఈ వారంలోనే ఆమోదం తెలిపిన సెనేట్ కమిటీ పలు షరతులు పెట్టింది. వయసు ధ్రువీకరణకు పాసుపోర్టులు, డిజిటల్ ధ్రువీకరణ వంటి వ్యక్తిగత సమాచారాన్ని అడగకూడదని సూచించింది.



మోదీ సెక్యూరిటీలో మహిళా కమాండో

ప్రధాని మోదీ సెక్యూరిటీలో ఓ మహిళా కమాండో చేరారు. గురువారం పార్లమెంటు సమావేశాల్లో భాగంగా మోదీ భద్రతలో ప్రత్యేక భద్రతా దళానికి చెందిన మహిళా కమాండో ఉన్న ఫొటో సామాజిక మాధ్యమాల్లో వైరలైంది. ప్రధానికి రక్షణ కవచంగా యువతిని నియమించడం మహిళా సత్తాకు అద్దం పడుతోందని నెటిజన్లు కొనియాడుతున్నారు.

ఉక్రెయిన్ విద్యుత్తు వ్యవస్థపై రాకెట్ల దాడి

200 క్షిపణులు, డ్రోన్లు ప్రయోగించిన రష్యా

కీవ్, నవంబరు 28: ఉక్రెయిన్ విద్యుత్తు వ్యవస్థను లక్ష్యం చేసుకొని గురువారం రష్యా భారీ స్థాయిలో గగనతల యుద్ధం చేసింది. సుమారు 200 క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించి విద్యుత్తు వ్యవస్థను స్తంభింపజేసింది. దాని ప్రభావంగా పది లక్షలకుపైగా ఇళ్లల్లో అంధకారం నెలకొంది. రెండు వారాల వ్యవధిలో పవర్ గ్రిడ్‌పై దాడి చేయడం ఇది రెండోసారికాగా, ఏడాదిలో 11వసారి కావడంతో ఆందోళన నెలకొంది. శీతాకాలంలో విద్యుత్తు ఉత్పాదన సౌకర్యాలను నాశనం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న రష్యా ఈ దాడులు చేసింది. దేశంలోని అన్ని ఇంధన రంగ వనరులపై దాడులు కొనసాగుతున్నాయని ఉక్రెయిన్ ఇంధన శాఖ మంత్రి హెర్మాన్ హలుషెంకో చెప్పారు.

'ఒరేషింక్' మరో అణుబాంబు: పుతిన్

రష్యా నూతనంగా అభివృద్ధి చేసిన 'ఒరేషింక్' మధ్యశ్రేణి బాలిస్టిక్ క్షిపణి మరో అణు బాంబులాంటిదని పుతిన్ అన్నారు. ఇది అన్నింటినీ బూడిద చేస్తుందని చెప్పారు. కజికిస్థాన్‌లో జరిగిన కలెక్టివ్ సెక్యూరిటీ ట్రీటీ ఆర్గనైజేషన్ సమావేశంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. పూర్వపు సోవియట్ యూనియన్ నుంచి విడిపోయిన దేశాలతో ఈ కూటమి ఏర్పాటయింది.

మహా సీఎంపై కొనసాగుతున్న సస్పెన్స్

ముఖ్యమంత్రి ఎవరో తేల్చకుండానే ముగిసిన సమావేశం

» షాతో నడ్డా, ఫడణవీస్, శిందే, అజిత్ పవార్ భేటీ

» షా ఢిల్లీ నివాసంలో 2 గంటల పాటు చర్చలు

» వివరాలు వెల్లడించకుండానే వెళ్లిపోయిన నేతలు



ఢిల్లీలో అమిత్ షాతో భేటీ అయిన నడ్డా, అజిత్ పవార్, శిందే, దేవేంద్ర ఫడణవీస్

న్యూఢిల్లీ, నవంబరు28: మహారాష్ట్ర కొత్త సీఎం ఎవరనే సస్పెన్స్ ఇంకా కొనసాగుతోంది. ఢిల్లీలోని కేంద్ర హోం మంత్రి అమిత్ షా నివాసంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, మహారాష్ట్ర బీజేపీ నేత దేవేంద్ర ఫడణవీస్, శివసేన అధ్యక్షుడు ఏక్‌నాథ్ శిందే, ఎన్సీపీ అధ్యక్షుడు అజిత్ పవార్ దాదాపు రెండు గంటల పాటు చర్చించారు. చర్చల్లో తీసుకున్న నిర్ణయాలపై ఏ వివరాలు వెల్లడించకుండానే నేతలు వెళ్లిపోయారు. రెండు రోజుల్లో మహారాష్ట్ర బీజేపీ శాసనసభాపక్ష నేతను ఎన్నుకునేందుకు సమావేశం నిర్వహించనున్నారు. దేవేంద్ర ఫడణవీస్‌ను కొత్త సీఎంగా ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. అయితే పార్టీ నుంచి అధికారిక ప్రకటన మాత్రం వెలువడలేదు. మంత్రిపదవులపై కూడా చర్చించినట్లు సమాచారం. బీజేపీకి 20 నుంచి 22, శివసేనకు 10 నుంచి 12, ఎన్సీపీకి 8 నుంచి 10 మంత్రి పదవులు దక్కే అవకాశం ఉంది. శిందే, అజిత్ పవార్‌లు డిప్యూటీ సీఎంలుగా బాధ్యతలు స్వీకరిస్తారు. పట్టణాభివృద్ధి శాఖను శివసేన డిమాండ్ చేసింది. హోం మంత్రిత్వ శాఖ బీజేపీ వద్దే ఉంటుంది. ఆర్థిక శాఖను అజిత్ పవార్‌కు ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం.

బంగ్లాపై కేంద్రం జోక్యం చేసుకోవాలి

ప్రధానికి 68 మంది ప్రముఖుల లేఖ



బంగ్లాలో చిన్మయ్ కృష్ణదాస్ అరెస్టును నిరసిస్తూ పశ్చిమబెంగాల్‌లోని సిలిగురిలో ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ జాగరణ్ మంచ్ కార్యకర్తలు

న్యూఢిల్లీ, నవంబరు 28: బంగ్లాదేశ్‌లో ఇస్కాన్ నాయకుడు, ఆధ్యాత్మికవేత్త చిన్మయ్ కృష్ణదాస్ అరెస్టుతోపాటు హిందువులపై జరుగుతున్న దాడులు, హింస విషయంలో కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని కోరుతూ 68 మంది ప్రముఖులు ప్రధాని మోదీకి లేఖ రాశారు. వీరిలో ఓ హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి, పలువురు మాజీ ఐఏఎస్, ఏపీఎస్, ఐఎఫ్ఎస్, ఐఆర్ఎస్ అధికారులు, ఒక ఎంపీ తదితరులు ఉన్నారు. హిందువులు, వారి ఆస్తులు, ఆలయాలపై వ్యవస్థీకృత దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవలి కాలంలో ఇవి తీవ్రస్థాయికి చేరుకున్నాయని పేర్కొన్నారు. మహిళలపై హింస మరింత ఆందోళనకరమని, అపహరణలు, బలవంతపు మత మార్పిళ్లు, లైంగిక హింస, మానవ అక్రమ రవాణా వంటికి చోటుచేసుకుంటున్నట్లు నివేదికలు వస్తున్నాయని తెలిపారు. కాగా, బంగ్లాదేశ్‌లో జరుగుతున్న పరిణామాలపై పశ్చిమబెంగాల్ సీఎం, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ స్పందించారు. ఈ విషయంలో తమ ప్రభుత్వం కేంద్రానికి మద్దతుగా ఉంటుందని పేర్కొన్నారు. గురువారం అసెంబ్లీలో మాట్లాడుతూ 'ఏ మతానికైనా నష్టం జరగాలని మేం కోరుకోం. ఇక్కడి ఇస్కాన్ వాళ్లతో నేను మాట్లాడాను. బంగ్లాదేశ్‌లో జరుగుతున్న ఘటనలపై కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి. ఈ విషయంలో కేంద్రానికి మద్దతుగా ఉంటాం. బంగ్లాదేశ్ వేరే దేశం కావున, మా పరిధిలోకి రాదు. కేంద్ర ప్రభుత్వం జోక్యం తీసుకోవాల్సి ఉంటుంది' అని పేర్కొన్నారు.

ఆ బాధ్యత బంగ్లాదేశ్‌పైనే ఉంది: కేంద్రం

బంగ్లాదేశ్‌లో హిందూ దేవాలయాలను, దేవతామూర్తులను అపవిత్రం చేయడం, ధ్వంసం చేయడం వంటి ఘటనలపై విదేశాంగ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. హిందువులు, ఇతర మైనారిటీలు, వారి ప్రార్థనా మందిరాల భద్రతకు భరోసా ఇవ్వాలని అక్కడి ప్రభుత్వాన్ని కోరింది. విదేశాంగ శాఖ సహాయమంత్రి కీర్తివర్ధన్ సింగ్ గురువారం రాజ్యసభలో మాట్లాడుతూ, బంగ్లాదేశ్‌లో నెలకొన్న పరిస్థితులపై భారత్ ఆందోళన వ్యక్తం చేసిందని తెలిపారు. ఆ దేశంలో నివసించే మైనారిటీల ప్రాణాలను, స్వేచ్ఛను కాపాడాల్సిన బాధ్యత యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు.

ఇస్కాన్‌పై నిషేధం కుదరదు: బంగ్లా హైకోర్టు

ఢాకా, నవంబరు 28: దేశంలో ఇస్కాన్ కార్యకలాపాలను నిషేధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను బంగ్లాదేశ్ హైకోర్టు తోసిపుచ్చింది. ఆధ్యాత్మికవేత్త చిన్మయ్ కృష్ణదాస్ బ్రహ్మచారి అరెస్టును వ్యతిరేకిస్తూ ఢాకా సహా పలు ప్రాంతాల్లో హిందువులు చేపట్టిన ఆందోళనలు హింసకు దారితీసిన నేపథ్యంలో ఇస్కాన్‌పై నిషేధం విధించాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. గురువారం ఈ వ్యాజ్యాన్ని జస్టిస్ ఫరా మహబూబ్, జస్టిస్ దేబాశిశ్ రాయ్ చౌధురితో కూడిన ధర్మాసనం విచారించింది. వాదనల అనంతరం ఇస్కాన్ కార్యకలాపాలను నిషేధించడానికి బెంచ్ నిరాకరించిందని అటార్నీ జనరల్ కార్యాలయ ప్రతినిధి తెలిపారు. కాగా, బంగ్లాదేశ్‌లోని షిబ్పూర్ పట్టణంలో ఉన్న ఇస్కాన్ కేంద్రాన్ని ఇస్లామిక్ నాయకుడి నేతృత్వంలోని బృందం బలవంతంగా మూసివేయించింది. హిందూ సమాజంపై జరుగుతున్న దౌర్జన్యాలు, చిన్మయ్ అరెస్టును నిరసిస్తూ బంగియా హిందూ జాగరణ్ మంచ్ సభ్యులు గురువారం కోల్‌కతాలోని బంగ్లాదేశ్ డిప్యూటీ హైకమిషనర్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. కాగా, చిన్మయ్ కృష్ణదాస్ అరెస్టును బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా గురువారం ఖండించారు. సనాతన వర్గానికి చెందిన ఆధ్యాత్మికవేత్తను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీ

- వ్యాగన్ తయారీ పరిశ్రమను అప్‌గ్రేడ్ చేస్తూ రైల్వే శాఖ ఆదేశాలు
- ఆలస్యంగా వెలుగులోకి ఉత్తర్వులు
- విభజన హామీలపై సమీక్షలో కేంద్రం స్పష్టం
- త్వరలో ఎన్టీపీసీ విద్యుత్తు ప్లాంట్ రెండో దశ..
- 'బయ్యారం'పై లోతైన అధ్యయనం అవసరమని వెల్లడి



వరంగల్ (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/హైదరాబాద్/న్యూఢిల్లీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీకి రైల్వే శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రస్తుతం నిర్మిస్తున్న రైల్వే వ్యాగన్ తయారీ పరిశ్రమను అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గురువారం ఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని హామీలపై కేంద్ర హోంశాఖ అధికారులు తెలంగాణ అధికారులతో జరిపిన సమీక్షలో కోచ్ ఫ్యాక్టరీ ప్రస్తావన రాగా.. సెప్టెంబరు 9వ తేదీనే వ్యాగన్ తయారీ పరిశ్రమను కోచ్ ఫ్యాక్టరీగా అప్‌గ్రేడ్ చేసినట్లు కేంద్ర అధికారులు స్పష్టం చేశారు. జీవో కాపీని కూడా అందించారు. దీనిపై ఎల్‌హెచ్‌బీ, ఈఎంయూ కోచ్‌ల తయారీకి ప్రణాళిక సిద్ధం చేయాలంటూ దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్‌ను ఆదేశిస్తూ రైల్వే బోర్డు ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే కాజీపేట రైల్వే డివిజన్‌గా అభివృద్ధి చేయడానికి కార్యాచరణ ప్రారంభించినట్టు రైల్వే అధికారులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో రైల్వే డివిజన్ ప్రధాన కేంద్రానికి అనుబంధంగా రైల్వే కోచ్ తయారీ యూనిట్‌ను అభివృద్ధి చేయనున్నట్టు రైల్వే బోర్డు అధికారులు పేర్కొన్నారు. రాష్ట్రంలోనే అతిపెద్ద రెండో రైల్వే జంక్షన్‌గా ఉన్న కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలనే డిమాండ్ 55 ఏళ్లుగా ఉంది. 1969లోనే కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం ఆందోళనలు మొదలయ్యాయి. ఎట్టకేలకు కోచ్ ఫ్యాక్టరీ కల సాకారమవ్వడంతో.. ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి పైగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని అధికారులు చెబుతున్నారు. కాగా, సుమారు గంట పాటు జరిగిన ఈ సమావేశంలో విభజన చట్టంలోని ఇతర హామీలపైనా చర్చించారు. కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ నేతృత్వంలో జరిగిన ఈ భేటీలో తెలంగాణ సీఎస్ శాంతికుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ప్రత్యేక కార్యదర్శి వికాస్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు. షెడ్యూల్ 13లోని గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు, బయ్యారం ఉక్కు కర్మాగారం, ఎన్టీపీసీ విద్యుత్తు ప్లాంట్ వంటి అంశాలపై కీలకంగా చర్చించినట్టు తెలిసింది. ఎన్టీపీసీ 4 వేల మెగావాట్ల విద్యుత్తు ప్లాంట్ మొదటి దశ పూర్తి కాగా, రెండో దశను త్వరలో ప్రారంభించనున్నట్టు కేంద్రం వెల్లడించింది. బయ్యారం ఉక్కు కర్మాగారం సాధ్యాసాధ్యాలను పరిశీలించామని, అక్కడ నిర్మించే అవకాశాలపై మరింత లోతుగా అధ్యయనం చేయాల్సి ఉందని తెలిపినట్టు సమాచారం. ములుగులో సమ్మక్క-సారక్క గిరిజన యూనివర్సిటీకి శాశ్వత నియామకాలు చేపట్టాలని తెలంగాణ అధికారులు కోరారు. సుమారు 20 విభజన హామీలపై చర్చించగా.. అన్నింటిని పరిశీలించి, త్వరితగతిన పూర్తయ్యేలా చూస్తామని కేంద్ర హోంశాఖ కార్యదర్శి హామీ ఇచ్చినట్టు తెలిసింది.

కాంగ్రెస్‌లో చేరిన ఆ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వెళ్లకుండా అడ్డుకోలేం

- కేఏ పాల్ మధ్యంతర పిటిషన్ కొట్టివేసిన హైకోర్టు

హైదరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ పార్టీ టికెట్‌పై గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై స్పీకర్ తుది తీర్పు ఇచ్చే వరకు వారిని అసెంబ్లీకి వెళ్లకుండా తాము అడ్డుకోలేమని హైకోర్టు స్పష్టం చేసింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసేలా ఆదేశించాలని పేర్కొంటూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసిన సంగతి తెలిసిందే. అసెంబ్లీ సమావేశాలు త్వరలో ప్రారంభం కాబోతున్న నేపథ్యంలో అనర్హత పిటిషన్లపై స్పీకర్ నిర్ణయం తీసుకునే వరకు పార్టీ మారిన ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వెళ్లకుండా.. చర్చల్లో పాల్గొని ఓటు వేయకుండా అడ్డుకోవాలని కేఏ పాల్ మధ్యంతర పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె శ్రీనివాసరావు ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. కేఏ పాల్ వ్యక్తిగత హోదాలో వాదనలు వినిపిస్తూ ఒక పార్టీ నుంచి గెలిచి మరో పార్టీలో చేరడం ప్రజా విశ్వాసాన్ని ఉల్లఘించడమేనని, రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ఉద్దేశాలు ఓడిపోయినట్లేనని పేర్కొన్నారు. డిసెంబరులో జరిగే అసెంబ్లీ సమావేశాలకు వెళ్లకుండా అడ్డుకోవాలని కోరారు. ప్రతివాదులు దానం నాగేందర్, గూడెం మహిపాల్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది పీ శ్రీరఘురాం, న్యాయవాది నవీన్‌కుమార్ వాదించారు. ఇటీవల సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పులో అనర్హత పిటిషన్లను విచారించే అధికారం పదో షెడ్యూల్ ప్రకా రం స్పీకర్‌కే ఉంటుందని పేర్కొనడాన్ని గుర్తుచేశారు. ఎమ్మెల్యే కాని కేఏ పాల్ దాఖలు చేసిన పిటిషన్‌కు విచారణార్హత లేదన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. కొంతమంది ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్లను పరిష్కరించాలని ఇప్పటికే స్పీకర్‌కు ఆదేశాలు జారీ చేశామని, స్పీకర్ తుదితీర్పు ఇచ్చే వరకు ఆ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వెళ్లకుండా తాము అడ్డుకోలేమని స్పష్టంచేస్తూ కేఏపాల్ పిటిషన్‌ను కొట్టేసింది.

స్వావలంబన దిశగా భారత్

- రక్షణ పరికరాల తయారీ హబ్‌గా దేశం : రాష్ట్రపతి ముర్ము

చెన్నై, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రక్షణతో సహా వివిధ రంగాల్లో భారతదేశం ఎదుగుతోందని, దేశాభివృద్ధిని ప్రపంచం మొత్తం గుర్తిస్తోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. నాలుగు రోజుల పర్యటన నిమిత్తం బుధవారం నీలగిరి జిల్లా ఊటీ వచ్చిన రాష్ట్రపతి.. గురువారం వెల్లింగ్టన్‌లోని ప్రతిష్ఠాత్మక డిఫెన్స్ సర్వీసెస్ స్టాఫ్ కాలేజీలో శిక్షణ పొందుతున్న సాయుధ దళాల అధ్యాపకులు, విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భారత్ స్వదేశీకరణ, రక్షణలో స్వావలంబన దిశగా పయనిస్తోందని, భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనేందుకు సాయుధ బలగాలు సిద్ధంగా వున్నాయన్నారు. భారత్ ప్రధాన రక్షణ పరికరాల తయారీ హబ్‌గా అభివృద్ధి చెందుతోందని, విశ్వసనీయ రక్షణ భాగస్వామిగా, రక్షణ ఉత్పత్తుల ఎగుమతిదారుగా ఎదగాలని అభిలషించారు.

అజ్‌మేర్ దర్గా విషయంలో కేంద్రానికి కోర్టు నోటీసులు

జైపూర్, నవంబరు28: రాజస్థాన్‌లోని అజ్‌మేర్ షరీఫ్ దర్గా కింద శివాలయం ఉందంటూ దాఖలైన పిటిషన్‌ను సివిల్ కోర్టు విచారణకు స్వీకరించి కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖకు, పురాతత్వ విభాగానికి నోటీసులు పంపడంపై రాజకీయ పార్టీలు స్పందించాయి. అజ్‌మేర్ దర్గా 800 ఏళ్ల క్రితం నాటిదని, ఏటా స్వయంగా ప్రధాని మోదీ చాదర్ పంపుతారని మజ్లిస్ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ గుర్తు చేశారు. మసీదులు, దర్గాలకు వ్యతిరేకంగా బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. ప్రార్థనా స్థలాల ప్రత్యేక చట్టాన్ని కింది కోర్టులు ఎందుకు పట్టించుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. ప్రజాస్వామ్యం ఎక్కడికి పోతుందని ఒవైసీ ప్రశ్నించారు. దేశంలో శాంతిని భంగం చేయాలని చూసే ఇలాంటి విషయాలపై ప్రధాని మోదీ దృష్టి సారించాలని కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ సూచించారు. మొఘలుల కాలంలో అనేక హిందూ దేవాలయాలను ధ్వంసం చేసి మసీదులు కట్టారని, ఈ విషయంలో న్యాయస్థానాలను ఆశ్రయించేందుకు హిందువులకు హక్కు ఉందని కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్ చెప్పారు. కోర్టులు సర్వేలకు ఆదేశిస్తే తప్పేంటని ఆయన ప్రశ్నించారు. మరోవైపు ఈ పిటిషన్‌పై విచారణను అజ్‌మేర్ సివిల్ కోర్టు డిసెంబర్ 20కి వాయిదా వేసింది. అజ్‌మేర్ షరీఫ్ దర్గా కింద శివాలయం ఉందంటూ పిటిషన్ దాఖలు చేసిన హిందూసేన అధ్యక్షుడు విష్ణుగుప్త చారిత్రక ఆధారాలు చూపించడంతో న్యాయమూర్తి జస్టిస్ మన్మోహన్ చందేల్ నోటీసులు జారీ చేశారు.

వచ్చే ఆగస్టుకల్లా కోచ్ ఫ్యాక్టరీ పూర్తి

- సీఎం రేవంత్ వల్లే సాధ్యమైంది: కడియం కావ్య

న్యూఢిల్లీ, నవంబర్ 28 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ప్రజల చిరకాల స్వప్నమైన కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ సాకారమైందని, ఇది సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతోనే నెరవేరిందని వరంగల్ కాంగ్రెస్ ఎంపీ కడియం కావ్య అన్నారు. 2025 ఆగస్టు వరకు ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తవుతుందని రైల్వే ఉన్నతాధికారులు తెలిపారని చెప్పారు. గురువారం ఢిల్లీలోని తెలంగాణభవన్ పార్టీ ఎంపీలు మల్లు రవి, రామసహాయం రఘురామిరెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్‌లతో కలిసి కావ్య మీడియాతో మాట్లాడారు. 'పదేళ్లలో కేసీఆర్ ఏనాడూ ఢిల్లీ పెద్దలను కలవలేదు. కానీ సీఎం రేవంత్ గతేడాది జూలై, ఆగస్టు, ఈ ఏడాది మార్చిలో ఢిల్లీకి వచ్చి కేంద్ర మంత్రులను కలిశారు. విభజన హామీల ప్రకారం కోచ్ ఫ్యాక్టరీ కలను నెరవేర్చారు' అని స్పష్టం చేశారు. కోచ్ ఫ్యాక్టరీతోపాటు విమానాశ్రయం, వెల్‌నెస్ సెంటర్, గిరిజన యూనివర్సిటీ.. ఇలా రెండో రాజధానిగా వరంగల్ శరవేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. మల్లు రవి మాట్లాడుతూ.. సీఎం రేవంత్ ఢిల్లీ పర్యటనలపై బీఆర్‌ఎస్ వాళ్లు ఆరోపణలు చేస్తున్నారని, రేవంత్ ఢిల్లీకి రావడం వల్లే ఇవన్నీ సాకారమవుతున్నాయని చెప్పారు.



వాల్యూ జోన్ హైపర్ మార్ట్‌ను ప్రారంభిస్తున్న సినీహీరో నందమూరి బాలకృష్ణ, పాల్గొన్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

నాచారంలో వాల్యూ జోన్ హైపర్ మార్ట్

- ప్రారంభించిన నందమూరి బాలకృష్ణ

నాచారం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణం గా వినియోగదారుల అభిరుచి మేరకు ఉత్పత్తులను అందించి మన్ననలను పొందడం అభినందనీయమని హిందూపురం ఎమ్మెల్యే, సినీ హీరో నందమూరి బాలకృష్ణ అన్నారు. హైదరాబాద్‌లోని నాచారంలో నూతనంగా ఏర్పాటు చేసిన వాల్యూ జోన్ హైపర్ మార్ట్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కొంతకాలం క్రితం పటాన్‌చెరులో తన చేతుల మీదుగానే వాల్యూ జోన్ హైపర్ మార్ట్‌ను ప్రారంభించానని, ఇప్పుడు ఇక్కడ ఏర్పాటు చేసిన బ్రాంచ్ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. తాను బాల్యంలో రామకృష్ణ సినీ స్టూడియోకు తరచూ వచ్చే వాడినని, తనకు స్థానిక ప్రజలతో సత్సంబంధాలు ఉండేవని బాల్య స్మృతులను గుర్తు చేసుకుంటూ "నేను లోకల్" అని అనడం తో అభిమానులు కేరింతలు కొట్టారు. భౌగోళికంగా విడిపోయినా తెలుగువారం అందరం ఒక్కటేనని బాలకృష్ణ అన్నారు. ఈ సందర్భంగా ఎంబీబీఎస్ సీట్లు సాధించిన విద్యార్థులకు స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి ఆయన చెక్కులను అందజేశారు. బాలకృష్ణను చూసేందుకు పెద్ద సంఖ్యలో అభిమానులు తరలివచ్చి సెల్ఫీలు దిగేందుకు పోటీపడ్డారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పి. వెంకటేశ్వర్లు, ఎస్. రాజామౌళి, ప్రసాద్ రావు, కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ మద్యం కేసుపై విచారణ 6కు వాయిదా

- వర్చువల్‌గా హాజరైన కవిత, సహ నిందితులు
- పాత పత్రాలనే కోర్టుకు సమర్పించిన సీబీఐ అధికారులు

న్యూఢిల్లీ, నవంబర్ 28 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం విధానం కేసులో సీబీఐ దాఖలు చేసిన అనుబంధ చార్జిషీట్‌పై విచారణను గురువారం రౌస్ అవెన్యూ కోర్టు మరోసారి వాయిదా వేసింది. సరిచేసిన పత్రాలను సమర్పించాలంటూ గతంలో కోర్టు ఇచ్చిన ఆదేశాలను సీబీఐ అధికారులు అమలు చేయకపోవడంతో విచారణ వాయిదా పడింది. ఈ కేసులో ఈ ఏడాది జూన్ 7న కవితతో పాటు మరో నలుగురిపై సీబీఐ అనుబంధ ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఈ చార్జ్‌షీట్‌ను జూలై 22న కోర్టు పరిగణలోకి తీసుకుంది. అంతకుముందు నిందితులైన మనీష్ సిసోడియా, అమన్‌దీప్ దళ్, బుచ్చిబాబు, అభిషేక్ బోయినపల్లి, ముత్తా గౌతమ్, సమీర్ మహేంద్రులపై కూడా అదనపు ఛార్జ్ షీట్ సమర్పించింది. ఆ రెండు ఛార్జిషీట్లపై రౌస్ అవెన్యూ కోర్టు ప్రత్యేక జడ్జి కావేరి బవేజా విచారణ చేపట్టారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతోపాటు సహ నిందితులు వర్చువల్ విధానంలో విచారణకు హాజరయ్యారు. ఛార్జిషీట్‌లో పేజీలు స్పష్టంగా లేవని, సరిచేసి ఇవ్వాలని న్యాయస్థానం ఆదేశించినప్పటికీ దర్యాప్తు సంస్థలు మాత్రం పాతవాటినే మరోసారి ఇచ్చాయని న్యాయవాది మోహిత్ రావుతోపాటు మిగిలిన లాయర్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దాంతో ప్రతివాదులు కోరినట్టు స్పష్టతతో కూడిన ఛార్జిషీట్ కాపీలను అందజేయాలని ఆదేశిస్తూ, తదుపరి విచారణను డిసెంబర్ 6కు వాయిదా వేశారు.

సంక్రాంతికి పంచాయతీ భేరీ!

(మొదటి పేజీ తరువాయి)



సమాచారం. అలాంటి పరిస్థితిఉంటే.. పార్టీపరంగా బీసీలకు అధిక స్థానాలు కేటాయించి.. తామే అమలు చేశామని అధికార పార్టీ చెప్పే అవకాశాలు కనిపిస్తున్నాయి. పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లపై ప్రభుత్వానిదే తుది నిర్ణయమని.. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా రిజర్వేషన్లు ఉంటాయని.. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహిస్తామని ఎస్‌ఈసీ గతంలో తెలిపింది. కాగా స్థానిక సంస్థల ఎన్నికలు మొదలయ్యేలోపు యాసంగి సీజన్ కోసం పెట్టుబడి సాయం కింద ఇచ్చే రైతు భరోసా పథకాన్ని పూర్తిచేయాలని సర్కారు భావిస్తున్నట్లు సమాచారం.

సర్పంచ్ ఎన్నికల తర్వాతే..

రాష్ట్రవ్యాప్తంగా 12,867 గ్రామపంచాయతీలు, 538 జెడ్పీటీసీ, 5,817 ఎంపీటీసీలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఏడాది జూలై 2న జెడ్పీటీసీ, ఎంపీటీసీల పదవీకాలం ముగిసింది. సర్పంచ్ ఎన్నికల్లో పార్టీల గుర్తులుండవు! జెడ్పీటీసీ, ఎంపీటీసీలు మాత్రం పార్టీల గుర్తులతో ఎన్నికల్లో పోటీపడాల్సి ఉంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని పంచాయతీల పరిధిలో సర్పంచ్ ఎన్నికల తర్వాతే.. ఎంపీటీసీ జెడ్పీటీసీల ఎన్నికల నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. కొన్ని కొత్త మండలాల్లో ముగ్గురు ఎంపీటీసీలతోనే ఎంపీపీ పదవి కల్పించాల్సి వస్తోంది. నిబంధన ప్రకారం కనీసం ఐదుగురు ఎంపీటీసీలతో ఎంపీపీలు ఉండేలా ఆయా మండలాల్లో ఎంపీటీసీల సంఖ్య పెంచాల్సి ఉంది. దీనిపై అసెంబ్లీలో చర్చించి ఒక చట్టం తెచ్చేవిధంగా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

ఎన్నికల సిబ్బంది నియామకంపై..

పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అధికారుల నియామకానికి రాష్ట్రఎన్నికల సంఘం ఇప్పటికే మార్గదర్శకాలు జారీ చేసింది. వీటికి అనుగుణంగా రిటర్నింగ్ అధికారులు, ప్రిసైడింగ్, పోలింగ్ అధికారులు, సిబ్బంది నియామకాలను చేపట్టాల్సి ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా ఒక్కో పంచాయతీకి ఒకరు చొప్పున స్టేజ్-1 అధికారి ఉంటారు. వీరు నామినేషన్ల స్వీకరణ నుంచి గుర్తులు కేటాయించే వరకు పనులు చూసుకుంటారు. స్టేజ్-2 అధికారులు పోలింగ్ ప్రక్రియ నిర్వహిస్తారు. వీరితోపాటు పోలింగ్ సిబ్బంది కూడా ఉంటారు. పంచాయతీల వారీగా వీరిని గుర్తించేందుకు ప్రస్తుతం కసరత్తు జరుగుతోంది. ప్రతి పోలింగ్ కేంద్రంలో 200 మంది వరకు ఓటర్లు ఉంటే ప్రిసైడింగ్ అధికారితోపాటు పోలింగ్ అధికారి ఉంటారు. 201 నుంచి 400 మంది ఓటర్లు ఉంటే ఒక ప్రిసైడింగ్ అధికారితోపాటు ఇద్దరు పోలింగ్ అధికారులు ఉంటారు. అదేవిధంగా 401 నుంచి 650 మంది ఓటర్లు ఉంటే ప్రిసైడింగ్ అధికారితోపాటు ముగ్గురు పోలింగ్ అధికారులను నియమిస్తారు. 650 మందికంటే ఎక్కువ ఓటర్లు ఉంటే అదనపు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నుంచి మార్గదర్శకాలు రాగానే.. వీరికి ఎన్నికల విధులపై శిక్షణ ఇవ్వనున్నారు.

కొనసాగుతున్న పోలింగ్ స్టేషన్ల ఎంపిక

గ్రామ పంచాయతీ, వార్డుల వారీగా.. ఓటరుజాబితా ఇప్పటికే సిద్ధం చేసినప్పటికీ.. కొత్తగా నమోదైన ఓటర్ల వివరాలద్వారా ప్రస్తుతం సప్లిమెంటరీ ఓటరు జాబితా రూపకల్పన కొనసాగుతోంది. ఎన్నికలకోసం సదరు గ్రామంలోని ప్రతివార్డుకు ఒక పోలింగ్ కేంద్రం ఉండేలా చూడాలని ఎస్‌ఈసీ తన మార్గదర్శకాల్లో పేర్కొంది. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లను వివిధ వార్డుల్లో విభజించేటపుడు వారందరికీ ఒకేవార్డులో ఒకే పోలింగ్ స్టేషన్‌లో ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించే విధంగా అధికారులు దృష్టిపెట్టారు. 600 మంది ఓటర్లకు ఒక పోలింగ్ స్టేషన్ ఉండేలా.. 650కి మించితే సదరు వార్డులో రెండు పోలింగు కేంద్రాలు,, ఓటర్ల సంఖ్య 1300 దాటితే.. మూడో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటుచేసే విధంగా గ్రామాలవారీగా అధికారులు కసరత్తు చేపట్టారు.

ఏ తప్పూ చేయకపోతే విదేశాలకు ఎందుకు పారిపోయారు?

- ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడు శ్రవణ్‌కుమార్ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై ప్రభుత్వ వాదనలు
- తీర్పును రిజర్వు చేసిన హైకోర్టు

హైదరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏ-6గా ఉన్న జర్నలిస్టు శ్రవణ్ కుమార్ ఏ తప్పూ చేయకపోతే అర్ధరాత్రి విదేశాలకు ఎందుకు పారిపోయారని ప్రభుత్వం ప్రశ్నించింది. అరెస్ట్ చేస్తారనే భయంతోనే ఆయన అమెరికాలో దాక్కున్నారని ఆరోపించింది. ఫోన్ ట్యాపింగ్‌తో తనకు ఎలాంటి సంబంధం లేదని.. తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ శ్రవణ్ కుమార్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ రాధారాణి ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫున పీపీ పల్లె నాగేశ్వర్‌రావు వాదిస్తూ పిటిషనర్ శ్రవణ్ కుమార్ ఏ తప్పూ చేయకపోతే ఫోన్ ట్యాపింగ్ కేసు నమోదై ఏ-2 ప్రణీత్‌రావు అరెస్టైన వెంటనే అర్ధరాత్రి విదేశాలకు ఎందుకెళ్లారని ప్రశ్నించారు. శ్రవణ్ కుమార్ తరఫు న్యాయవాది వాదిస్తూ పిటిషనర్ అమెరికాలో అందుబాటులోనే ఉన్నారని, ఆయన ఈ-మెయిల్, వాట్సాప్, సెల్ నెంబర్, అమెరికాలో ప్రస్తుత చిరునామా సహా వివరాలు కోర్టులో చదివి వినిపించారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. 'పిటిషనర్‌ను లొంగిపోవాలని ఆదేశిస్తాం.. పిటిషనర్‌ను తన న్యాయవాది ఆధ్వర్యంలో విచారించడానికి మీకేమైనా అభ్యంతరమా?' అని పీపీని ప్రశ్నించింది. పోలీసుల నుంచి వివరణ తీసుకుని తెలియజేస్తానని పీపీ సమాధానం ఇచ్చారు. దీంతో ముందస్తు బెయిల్ పిటిషన్‌లో తీర్పు రిజర్వు చేస్తున్నట్లు ధర్మాసనం ప్రకటించింది. మరోవైపు ఇదే కేసులో భుజంగరావు మధ్యంతర బెయిల్‌ను డిసెంబరు 4 వరకు హైకోర్టు పొడిగించింది.

ఇద్దరు ఆర్టీసీ ఆర్‌ఎంలకు ఈడీలుగా పదోన్నతి

హైదరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): టీజీఎస్‌ఆర్టీసీలో ఇద్దరు రీజనల్ మేనేజర్ (ఆర్‌ఎం)లకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ)లుగా పదోన్నతి కల్పిస్తూ సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్ ఆర్‌ఎం బీ. వరప్రసాద్‌ను ప్రధాన కార్యాలయంలో ఈడీ-అడ్మిన్)గా, సికింద్రాబాద్ ఆర్‌ఎం ఖుస్రోషాఖాన్‌ను కరీంనగర్ జోన్ ఈడీగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. కాగా, నల్లగొండ ఆర్‌ఎం ఎం.రాజశేఖర్‌ను సికింద్రాబాద్ ఆర్‌ఎంగా బదిలీ చేశారు. అలాగే కరీంనగర్ ఆర్‌ఎం ఎస్.సుచరితను హైదరాబాద్ ఆర్‌ఎంగా, నిజామాబాద్ ఆర్‌ఎం జానిరెడ్డిని నల్లగొండ ఆర్‌ఎంగా, మహబూబ్‌నగర్ ఆర్‌ఎం వి.శ్రీదేవిని ప్రధాన కార్యాలయం సీఈ(ఐటీ)గా బదిలీ చేశారు.

యూజీసీ క్యాలెండర్ పాటించాలి: హైకోర్టు

హైదరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం వంటి లా కోర్సుల అడ్మిషన్లను యూజీసీ, బీసీఐ క్యాలెండర్ ప్రకారం పూర్తి చేయాలని హైకోర్టు స్పష్టం చేసింది. లా కోర్సులు క్యాలెండర్ ప్రకారం నిర్వహించడం లేదని ఏ భాస్కర్‌రెడ్డి అనే వ్యక్తి పిల్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన ధర్మాసనం.. ఈ ఏడాది అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో ఇక నుంచి క్యాలెండర్ ప్రకారం అడ్మిషన్ల ప్రక్రియ పూర్తిచేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

లగచర్ల రైతుల బెయిల్ పిటిషన్‌పై విచారణ నేటికి వాయిదా

వికారాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): లగచర్లలో అధికారులపై దాడి జరిగిన కేసులో రైతులు, ఇతర నిందితుల పెట్టుకున్న బెయిల్ పిటిషన్‌పై విచారణ శుక్రవారానికి వాయిదా పడింది. ఈ ఘటనలో అరెస్టయి సంగారెడ్డి జైలులో రిమాండ్‌లో ఉన్న నిందితులకు బెయిల్ ఇవ్వాలని కోరుతూ గురువారం వికారాబాద్ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టులో దాఖలైన పిటిషన్‌పై ఇరుపక్షాల మధ్య వాదోపవాదాలు జరిగాయి. నిందితుల తరఫున బీఆర్‌ఎస్ లీగల్ సెల్ న్యాయవాదులు వాదనలు వినిపించారు. గడువు కావాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోరడంతో విచారణను కోర్టు శుక్రవారానికి వాయిదా వేసింది.

పట్నం నరేందర్ రెడ్డి బెయిల్ పిటిషన్ సోమవారానికి వాయిదా

కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డికి బెయిల్ ఇవ్వాలని కోరుతూ బీఆర్‌ఎస్ లీగల్ సెల్ ఇదే కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సోమవారానికి వాయిదా పడింది. కౌంటర్ దాఖలు చేయడానికి గడువు కావాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోరడంతో కోర్టు విచారణను వాయిదా వేసింది.

హైడ్రాకు 'పైగా'!

- అమీర్‌పేటలోనే హెచ్ఎండీఏ కార్యాలయం

హైదరాబాద్ సిటీ, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) కార్యాలయంగా హైదరాబాద్ బేగంపేటలోని పైగా ప్యాలెస్‌ను ప్రభుత్వం కేటాయించింది. నిజానికి, హెచ్ఎండీఏ కార్యాలయాన్ని పైగా ప్యాలెస్‌కు తరలించాలని తొలుత భావించారు. కానీ, హెచ్ఎండీఏకు పైగా ప్యాలెస్ సరిపోదనే ఆలోచనతో ఆ ప్రక్రియను ఆపేశారు. దీంతో హైదరాబాద్, అమీర్‌పేటలోని స్వర్ణజయంతి కాంప్లెక్స్‌లోనే హెచ్ఎండీఏ కార్యాలయం కొనసాగనుంది. హెచ్ఎండీఏ అధికారులు కూడా పైగా ప్యాలెస్‌ను త్వరలోనే జీహెచ్ఎంసీకి అప్పగించనున్నారు. దీంతో ప్రస్తుతం బుద్ధభవన్ నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తోన్న హైడ్రా త్వరలోనే బేగంపేటకు మారే అవకాశముంది.



విద్యుత్ దీపాల కాంతుల్లో వైకుంఠద్వారం

గుట్టపై వైకుంఠ ద్వారానికి విద్యుత్ సొబగులు

భువనగిరి అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయం చెంత శుక్రవారం గిరిప్రదక్షిణ ప్రత్యేకంగా చేపట్టేందుకు ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్తీక మాసం వేళ కొండకింద వైకుంఠద్వారం విద్యుత్ సొబగులు అద్దుకుంది. గిరిప్రదక్షిణ ప్రారంభమయ్యే వైకుంఠద్వారానికి విద్యుత్ దీపాల అలంకరణతో ఆధ్యాత్మికత ఉట్టిపడేలా చూపరులను కనువిందు చేశాయి. వైకుంఠద్వారాన్ని విద్యుత్ కాంతులతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకోగా వాటి మధ్యలో చంద్రబింబాల్లా ఆకర్షణీయమైన లైట్లు ఆ కాంతుల వెనకాల స్వర్ణవర్ణంలో రాజగోపురం భక్తులను ఆకట్టుకుంది. వైకుంఠద్వారం చెంత స్వామిఅమ్మవారి విగ్రహాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి, ఇక్కడే ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 500మంది స్వామివారి భజన మండలి (డ్రెస్‌కోడ్) సభ్యుల కోసం ప్రత్యేక వేదికను ఏర్పాటు చేశారు. గిరిప్రదక్షిణలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటున్న నేపథ్యంలో అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

పాకిస్థాన్ ప్రశాంతంగా ఉండటం ఇటీవల చూడలేదు. కొద్దిరోజులుగా షియా–సున్నీ ముస్లింల మధ్య ఎడతెగని హింస కారణంగా వందమందివరకూ మరణించారు. ఆ యుద్ధం సాగుతూండగానే, మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌ను జైలునుంచి విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆయన పార్టీ భారీ నిరసన ప్రదర్శనలకు పిలుపునిచ్చి, తీవ్ర ఉద్రిక్త పరిస్థితులను సృష్టించింది. వేలాదిమంది భద్రతాబలగాలు అర్థరాత్రివేళ విరుచుకుపడి పీటీఐ మద్దతుదారులను, కార్యకర్తలను చావగొట్టాయి. కనిపిస్తే కాల్చివేత ఆదేశాలతో భయపెట్టాయి. ఇమ్రాన్ మద్దతుదారులు పెద్దసంఖ్యలో మరణించారని, వందలాదిమంది తీవ్రంగా గాయపడ్డారని అనధికారిక సమాచారం. విద్యాలయాలను మూసివేసి, ఇంటర్నెట్ నిలిపివేసి ఒకవిధంగా లాక్‌డౌన్ అమలైంది. ఈ మొత్తం వ్యవహారంలో పైచేయి ఇమ్రాన్ పార్టీది అయిందా, బలగాలు గెలిచాయా అన్నది అటుంచితే, ఇప్పటికీ కటకటాల వెనుకనుంచి ఆయన ఒక సవాలు విసిరినా, నిరసనలకు పిలుపు ఇచ్చినా ప్రభుత్వం అతలాకుతలమవుతోందనడానికి ఈ ఘటన నిదర్శనం.

ఎట్టిపరిస్థితుల్లోనూ ఈ నిరసనలను అనుమతించకూడదన్న లక్ష్యంతో పాకిస్థాన్ ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా వ్యవహరించింది, హద్దులుదాటిన కాఠిన్యాన్ని కనబరిచింది. ఇస్లామాబాద్, రావల్పిండికి వెళ్ళే ప్రధాన దారులను మూసివేసి, రైళ్ళు, బస్సులు నిలిపివేసి, దేశంలోని మిగతా ప్రాంతాలనుంచి ఎవరూ రాజధానికి రాకుండా ప్రభుత్వమే నిలువరించింది. ఒక్కముక్కలో చెప్పాలంటే, తానే రాజధానిని దిగ్బంధించింది. ఇమ్రాన్‌ను విడుదల చేసేవరకూ ఇస్లామాబాద్‌లోని డీచౌక్‌నుంచి కదిలేది లేదని, ఆయనతో కలిసే ఇంటికిపోతామని లక్షలాది కార్యకర్తలముందు భీకర ప్రతిజ్ఞలు చేసిన ఇమ్రాన్


ఎడతెగని హింస

భార్య బుష్రా బీబీ, పోలీసు హింస పతాకస్థాయికి చేరడంతో, కాల్పులు జరగడంతో అక్కడనుంచి పారిపోయారని వార్తలు వచ్చాయి. అయినప్పటికీ, ఆమె నాయకత్వంలో పీటీఐ సాగించిన ఈ పోరాటం ప్రభుత్వాన్ని బాగా భయపెట్టగలిగింది. మరోపక్క భద్రతాదళాలు కూడా వందలాదిమంది కాళ్ళూ చేతులూ విరగ్గొట్టి ఇమ్రాన్ పార్టీని నియంత్రించగలిగాయి.

ఈ భుట్టోలు, షరీఫ్‌లు దేశాన్ని ఇంకెంతకాలం ఏలుతారంటూ వారసత్వరాజకీయాలను తీవ్రంగా విమర్శించే ఇమ్రాన్ ఇప్పుడు తన మూడోభార్యను, సోదరిని యుద్ధక్షేత్రంలోకి దించడం విచిత్రం. రెండున్నరేళ్ళుగా జైల్లో ఉంటున్న ఆయన ఇప్పటికీ తన పార్టీని నియంత్రించగలుగుతున్నాడు, క్షేత్రస్థాయి పోరాటాలకు పురిగొల్పుతున్నాడు. కానీ, వందలాది కేసులు తన మెడకు చుట్టి జైల్లోకి నెట్టేసినవారిని ఢీకొట్టాలంటే, వారి మెడలు వంచి బయటకు రావాలంటే, కదనరంగంలో తానో, తనవారో ప్రత్యక్షంగా కనిపించడం ముఖ్యం. తన పక్షాన కార్యకర్తలకు స్ఫూర్తినిచ్చే శక్తి, తెలివితేటలు, వ్యూహరచనా సామర్థ్యం తన భార్యకు ఉందని ఆయన నమ్మకం.

సైన్యమే ఇమ్రాన్‌ను ఇంతశక్తిమంతుడిగా మార్చిందన్నమాట నిజం. దానికీ, షరీఫ్‌లకు మధ్య లోపాయికారీ అవగాహన కుదరడంతో ఘనంగా గెలిచిన ఇమ్రాన్ తన పదవిని కోల్పోయాడు. గతంలో సైన్యాన్ని విమర్శించి గద్దెదిగిన నవాజ్ షరీఫ్ దానికి ప్రీతిపాత్రుడయ్యాడు. సైన్యానికీ, అమెరికాకూ వ్యతిరేకంగా మాట్లాడిన ఇమ్రాన్ కటకటాలు లెక్కపెట్టవలసి వచ్చింది. అతడిని గద్దెదింపి, కేసులు పెట్టి, శిక్షలు వేసి, జైల్లోకి నెట్టడం వెనుక సైన్యం ఉన్నదని పాకిస్థాన్ ప్రజలకు తెలుసు. చివరకు సుప్రీంకోర్టు, ఎన్నికల సంఘం వంటి బలమైన వ్యవస్థలు కూడా ఆయనకు వ్యతిరేకంగా వ్యవహరించి, ఆయన పార్టీని ఛిన్నాభిన్నం చేసి, కనీసం ఎన్నికల్లో పాల్గొననివ్వని సంగతి తెలిసిందే. బద్ధశత్రువులైన భుట్టోలు, షరీఫ్‌లు చేతులు కలిపి, సైన్యం ఆశీస్సులతో పాలన చేసుకుంటున్నారు. ఇమ్రాన్ జైలునుంచి ప్రజాక్షేత్రంలో వస్తే తమకు ప్రమాదమన్న భయం సైన్యాన్నీ, షరీఫ్ సోదరులను పీడిస్తోంది. ఎన్నికలు నిర్వహించాలన్న ఇమ్రాన్ డిమాండ్‌కు వారు ఇప్పట్లో అంగీకరించరు. ఎంతమంది కార్యకర్తలనైనా బలిపెట్టి జైలునుంచి బయటకు రావాలన్నది ఇమ్రాన్ లక్ష్యం. పాకిస్థాన్ హింస సమీపకాలంలో

‘మహా’ సునామీ మిగిల్చిన సంశయాలు



మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని మహాయుతి కూటమి విజయానికి నేను ఆశ్చర్యపోలేదు అలాగే విజయావకాశాలు పుష్కలంగా ఉన్న ప్రతిపక్ష ఎమ్‌వీఏ కూటమి ఓడిపోవడం కూడా నన్ను విస్మయపరచలేదు అయినప్పటికీ సునామీ లాంటి మహాయుతి విజయాన్ని నేను అర్థం చేసుకోలేక పోతున్నాను. నా రాజకీయ ఇంగితజ్ఞానం గానీ, రాజనీతిశాస్త్ర పరిజ్ఞానం గానీ మహారాష్ట్ర ఎన్నికల అంతిమ ఫలితాలను అర్థం చేసుకోవడానికి తోడ్పడం లేదు! విజేతకు తోడ్పడిన విజయ బలవర్ధకాలు ఏమిటి అని నన్ను నేను ప్రశ్నించుకోక తప్పలేదు.

మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలపై సంశయాలు నెలకోవడమనేది చాలా తీవ్ర విషయం. అధికారిక ఎన్నికల ఫలితాలను ప్రశ్నించవచ్చు. అయితే అది కొన్ని ప్రాథమిక పరీక్షలలో నెగ్గవలసిన అవసరమున్నది; ఆ ఫలితాలకు దారితీసిన బలమైన కారణాలను వివరించాల్సిన అవసరమున్నదా? పలువురు ఇస్తున్న వివరణలు నమ్మదగినవి కావా? ఈ రెండింటినీ నిశితంగా పరిశీలిద్దాం.

మహారాష్ట్ర ఎన్నికలు అనేక విధాలుగా ఆశ్చర్యాన్ని గొలిపాయి. మహాయుతి విజయం విస్మయకరమైనదేగాక దిగ్భ్రాంతికరమైనది కూడా. నాలుగింట మూడు వంతుల సీట్లను ఆ కూటమి కైవసం చేసుకున్నది. దాని ఓట్ల వాటా 14 శాతం అధికంగా ఉన్నది. ఇటువంటి విజయాలు అరుదైనవి. అయితే అసాధ్యమైనవి కావు, ఇంతకుముందు విననివి కూడా కాదు. మహారాష్ట్ర రాజకీయాలను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేసే అంశాలు అన్నీ ఈ ఎన్నికలలో కానరాకుండా పోవడం ఆ ఆశ్చర్యాన్ని మరింత అధికం చేస్తోంది. రాష్ట్రంలోని విభిన్న ప్రాంతాల మధ్య అభివృద్ధిపరంగా అసమానతలు, భిన్న కూటములలోని పార్టీల మధ్య ఉన్న వివిధ అంతరాలు అన్నిటినీ అదృశ్య హస్తం ఏదో మటుమాయం చేసినట్టుగా కనిపిస్తోంది. మహాయుతి విజయంలోని నాటకీయ స్వభావమూ విస్మయం కలిగిస్తోంది. 2024 లోక్‌సభ ఎన్నికలలో ఓట్ల లోటును భర్తీ చేసుకోవడమే కాకుండా 14 శాతం అధిక్యతను మహాయుతి సాధించింది. అదీ ఐదు నెలల్లో ఎలా సాధ్యమయింది? ఏమైనా మహారాష్ట్ర పాలక కూటమి విజయం భారతదేశ ఎన్నికల చరిత్రలో అపూర్వమైనదేమీ కాదు. మహారాష్ట్రలో ఎన్నికల చరిత్రను నిశితంగా చూస్తే ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ గణనీయమైన సీట్లు సాధించుకోగలగడానికి ఆస్కారం లేదు. ఈ కారణంగానే మహాయుతి విజయాన్ని ఎవరూ పసిగట్టలేక పోయారు. ఎన్నికల పవనాలు వేగంగా, అనూహ్యంగా తప్పుడు దిశలో వీచాయి. మరింత స్పష్టంగా చెప్పాలంటే మహాయుతి విజయం నిజానికి ఒక ఎన్నికల గూగ్లీ.

మహారాష్ట్రలో సంభవించిన దానికి సబబైన వివరణ ఏమైనా ఉన్నదా? కొన్ని ప్రామాణిక వివరణలను పరిశీలిద్దాం. తమకు లభించిన మంచి అవకాశాన్ని ఎమ్‌వీఏ నాయకులు వ్యర్థం చేసుకున్నారనేది వాటిలో ప్రధానమైనది. లోక్‌సభ ఎన్నికలలో చేకూరిన విజయంతో అమిత సంతృప్తితో ఉండిపోయి, వ్యర్థ కలహాలతో కాలం గడుపుతూ దూరదృష్టి లేకుండా వ్యవహరించారనేది ఎమ్‌వీఏ నేతలపై ఒక ప్రధాన ఆక్షేపణ. ఇది చాలవరకు నిజం. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ఎమ్‌వీఏకు ఒక నైతిక సె[illegible]ర్యాన్నిచ్చాయి. సమష్టి మనుగడకు ఒక సుదృఢ ప్రాతిపదిక కల్పించాయి. అసెంబ్లీ ఎన్నికల సమరానికి సమాయత్తమయ్యేందుకు అనువైన పరిస్థితులను సృష్టించాయి. ప్రజలను సతమతం చేస్తున్న సమస్యలా? కొల్లలు. శిందే సేన, అజిత్ పవార్ ఎన్‌సీపీ, బీజేపీలతో కూడిన మహాయుతి ఒక రాజకీయ పాప ఫలం. సిగ్గు మాలిన ఎత్తుగడలతో శివసేన, ఎన్‌సీపీని బీజేపీ చీల్చింది.

పరిణత రాజకీయవేత్తగా ఉద్ధవ్ ఠాక్రేకు ప్రజల్లో మంచి పేరు ఉన్నది. కోవిడ్ ఉపద్రవంలో మహమ్మారి బాధితులను ఆదుకోవడంలో ఆయన పాలనా దక్షత రుజువయింది. ఈ అనుకూలతలను ఉపయోగించుకునేందుకు ఎమ్‌వీఏ నాయకులు లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల మధ్య ఐదు నెలల కాలంలో చేసిందేమీ లేదు. సీట్ల పంపిణీపై సత్వరమే ఒక నిర్ణయానికి రాలేకపోయారు. ఎన్నికల వాగ్దానాలను ప్రకటించడంలో జాప్యం చేశారు. మరీ ముఖ్యంగా ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరో తేల్చుకోలేక పోయారు. బీజేపీ ఎత్తుగడలకు పై ఎత్తుగడలు వేయలేకపోయారు.



■ యోగేంద్ర యాదవ్

లోక్‌సభ ఎన్నికలలో పరాజయం నుంచి బీజేపీ నేతృత్వంలోని మహాయుతి సరైన పాఠాలు నేర్చుకున్నది. ఒక పటిష్ఠ పథకాన్ని రూపొందించుకుని సమర్థంగా అమలుపరిచింది. తమ పట్ల వివిధ వర్గాలలో ఉన్న వ్యతిరేకతను తటస్థం చేసింది. ప్రభుత్వ కోశాగారాన్ని ప్రజలకు తెరిచింది. లడ్కీ బహిన్‌తో సహా పలు సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టింది. ఓబీసీలను తన వెనుక సమీకరించుకుంది దళితులలో అట్టడుగున ఉన్నవారిని తన వైపునకు తిప్పుకోగలిగింది. సంఘ్ పరివార్ అంతా మహాయుతి వెనుక మోహరించింది. నకిలీ అభ్యర్థులను నిలబెట్టింది. బీజేపీకి గల అపార ధనశక్తి, మీడియా పలుకుబడిని పూర్తిగా వినియోగించుకున్నది. మరి ఎమ్‌వీఏని మహాయుతి ఎందుకు ఓడించిందో మీకు ఇంకా వివరించాలా? అసెంబ్లీ ఎన్నికలకు మహాయుతి, ఎమ్‌వీఏ సంసిద్ధమైన రీతుల్లో చాలా తేడా ఉన్నది. లోక్‌సభ ఎన్నికలలో ఓట్ల లోటును భర్తీ చేసుకోవడంలోను, అదనంగా ఐదు శాతం ఓట్లను కోల్పోయే ప్రమాదాన్ని అధిగమించడంలోను మహాయుతి ఎందుకు సఫలమయిందో ఆ తేడా విశదం చేస్తుంది. ఈ కారణాలు అన్నీ ఓట్ల కైవశంలో మహాయుతి, ఎమ్‌వీఏపై ఆధిక్యత సాధించేందుకు తోడ్పడింది. అయితే ఎటువంటి ఆధిక్యత అది? నాలుగింట మూడు వంతుల సీట్లను స్వాధీనం చేసుకున్నది. ఓట్ల వాటాలో 14శాతం ఆధిక్యత! నేను హతాశుడిని అయ్యాను. ఇంత మహావిజయాన్ని మీడియా గానీ, ఓటర్ల సర్వేలు నిర్వహించినవారు గానీ, చివరకు విజేతలతో సహా రాజకీయ నాయకులుగానీ ముందుగా ఊహించలేకపోయారు. ఎవరూ సమగ్రంగా వివరించలేకపోతున్నారు.

సరే, ఎన్నికల ఫలితాలు ఇప్పుడు అందరినీ విస్మయపరచడం పరిపాటి అయిపోయింది. ఒక నిర్దిష్ట పార్టీ హవా ఉధృతంగా ఉన్న ఎన్నికలు నాయకులు, పరిశీలకులు, విలేఖర్లు, ఓటర్ల సర్వేల నిర్వాహకులతో సహా ప్రతి ఒక్కరినీ విస్మయపరుస్తాయి. 1977లో ఉత్తర భారతావనిలో జనతా పార్టీ, 1985లో రాజీవ్‌గాంధీ, 2019లో వాయవ్య భారతంలో మోదీ సానుకూల పవనాలు ఎలా వీచాయో నేను చూశాను. ఎవరు గెలవగలరో ప్రతి ఒక్కరూ సులభంగా చెప్పగలిగేవిగా సదరు ఎన్నికలు ఉండేవి. ఆయా పార్టీలకు లభించగల సీట్లపై అంచనాలు అటూ ఇటూగా ఉండేవి. విజేత ఎవరో కచ్చితంగా చెప్పగలిగి ఉండేవారు. అయితే మహారాష్ట్ర ఎన్నికలు ఇందుకు పూర్తిగా విరుద్ధమైనవి. వీటి గురించిన రాసినవారెవ్వరూ అంతిమ ఫలితాలను ఏ మాత్రం ఊహించలేకపోయారు.

సంబంధిత అన్ని విషయాలను పరిగణనలోకి తీసుకుని చూస్తే మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలకు ఏదో ఒక ప్రత్యేకత ఉన్నట్టు అనిపిస్తుంది. అయితే ఆ ప్రత్యేకత ఏమిటో సహేతుకంగా వివరించలేని పరిస్థితి! ఈవీఎమ్‌లను తప్పుపట్టడం తొందరపాటే అవుతుంది. అయితే ఈవీఎమ్‌లను ఉపయోగించిన తీరును ప్రశ్నించకుండా ఉండడమనేది అసాధ్యం.

నేను ఒక దశాబ్ద కాలంగా ఈవీఎమ్ కుట్ర సిద్ధాంతాలను విమర్శిస్తూ వస్తున్నాను. ఈ విషయంలో నా స్నేహితులు, రాజకీయ సహచరులు నాతో ఏకీభవించేవారు కాదు. పోలింగ్‌లో పాల్గొన్న ఓటర్ల శాతంపై తొలి అంచనాలకు, అంతిమ ఫలితాలకు మధ్య ఉన్న అంతరం రిగ్గింగ్‌ను సూచిస్తుందనే అభిప్రాయాన్ని నేను ఇప్పటికీ అంగీకరించలేకున్నాను. అదే విధంగా ఈవీఎమ్ ద్వారా పోల్ అయిన ఓట్ల సంఖ్య, ఈవీఎమ్ ద్వారా గణించిన ఓట్ల సంఖ్య మధ్య వ్యత్యాసం కూడా ఎన్నికలలో ఏదో మోసం జరిగిందనడానికి సరైన రుజువు కాదు. ఈవీఎమ్‌లను అధికార పక్షానికి అనుకూలంగా దుర్వినియోగపరిచారని ఆరోపించేవారు తమ ఆక్షేపణలకు మరింత సబబైన ఆధారాలు చూపించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను అర్థం చేసుకోవడం చాలా కష్టం. కనిపించే అంశాల కంటే కనిపించని అంశాలే వాటిని ప్రభావితం చేశాయని అనిపిస్తోంది. తాము వంచనకు గురయ్యామన్న భావనను వ్యక్తం చేస్తున్నందుకు ప్రతిపక్షాలను తప్పుపట్టకూడదు. అయితే అయితే ఇండియా కూటమి ఈవీఎమ్ కుట్ర విషయంపైనే దృష్టి కేంద్రీకరించి, తన సొంత రాజకీయ వైఫల్యాలను ఉపేక్షించడంలోనే అసలు ప్రమాదం ఉంది. ఇండియా కూటమి తన వైఫల్యాలను చిత్తశుద్ధితో పరీక్షించుకోవడమనేది మన దేశంలో ప్రజాస్వామ్య మనుగడకు చాలా చాలా ముఖ్యం.

గత ఒక ఏడాది వ్యవధిలో మూడు రాష్ట్రాల శాసనసభ ఎన్నికలు జరిగాయి. తొలుత మధ్యప్రదేశ్, ఆ తరువాత హర్యానా, ఇప్పుడు మహారాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరిగాయి. మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు పెద్ద ప్రశ్నలకు తావిస్తున్నాయి. వాటికి సరైన సమాధానాలు లభించడం లేదు. లోక్‌సభ ఎన్నికలలో పోలయిన ఓట్లకు సంబంధించిన సమాచారంలోని అంతరాలపై పలువురు లేవనెత్తిన సహేతుకమైన ప్రశ్నలకు ఎన్నికల సంఘం సరైన రీతిలో ప్రతిస్పందించలేదు. ఉత్తరప్రదేశ్‌లో ఇటీవలి ఉప ఎన్నికలలో జరిగింది ఎన్నికల మోసమో కాదో చాలా సులువుగా నిర్ధారించగల వ్యవహారం. ఈ ఎన్నికలు అన్నీ ప్రస్తుత సీఈసీ రాజీవ్ కుమార్ ఎన్నికల సంఘం బాధ్యతలు చేట్టిన తరువాతే సంభవించినవి కావడం గమనార్హం.

మన ఇరుగు పొరుగు దేశాలలో ఎన్నికలలో పోటీ కంటే ఎన్నికల ఫలితాలపై వాదోపవాదాలు చాలా తీవ్ర స్థాయిలో ఉండడం కద్దు. అటువంటి శోచనీయ పరిస్థితిలోకి మనం కూడా జారిపోతున్నామా? అలా జరగకుండా ఉండాలంటే మనం తక్షణమే అటువంటి పరిస్థితి మనకు దాపురించకుండా ఉండాలంటే మనం తక్షణమే క్రియాశీలంగా ప్రతిస్పందించాలి. మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు స్వతంత్ర, విశ్వసనీయ ఎలెక్షన్ ఫోరెన్సిక్స్ (ఎన్నికల ఫలితాల గణాంకాలు సహజంగా ఉన్నాయా లేక విపరీతంగా ఉన్నాయా అన్న విషయాన్ని నిర్ణయించి ఎన్నికలలో మోసం జరిగిందో లేదో స్పష్టంగా సూచించే పద్ధతులు)కు ఒక సరైన సందర్భం.

(వ్యాసకర్త ‘స్వరాజ్ ఇండియా’ అధ్యక్షుడు)

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను కనిపించే అంశాల కంటే కనిపించనివే ప్రభావితం చేశాయి. తాము వంచనకు గురయ్యామన్న భావనను వ్యక్తం చేస్తున్నందుకు ప్రతిపక్షాలను తప్పుపట్టకూడదు. ఇండియా కూటమి ఈవీఎమ్ కుట్ర విషయంపైనే దృష్టి కేంద్రీకరించి, తన సొంత రాజకీయ వైఫల్యాలను ఉపేక్షించడంలోనే అసలు ప్రమాదం ఉంది. భారత ప్రజాస్వామ్య మనుగడకు ప్రతిపక్ష కూటమి తన రాజకీయ వైఫల్యాలను చిత్తశుద్ధితో పరీక్షించుకోవడమనేది చాలా చాలా ముఖ్యం.

తెలంగాణ సాధనకు
బాటవేసిన కేసీఆర్ దీక్ష

మన కళ్ళతో మనం చూసిన ఉద్యమం స్వరాష్ట్ర ఉద్యమం. దీన్ని కనికట్టు చేసి కథలల్లి వక్రీకరించలేరు. ‘కేసీఆర్ సచ్చుడో ...తెలంగాణ వచ్చుడో’ అన్నది ఉద్యమ ట్యాగ్ లైన్. ముంబయ్, బొగ్గుబాయ్, దుబాయ్ వలస బతుకులు తెలంగాణ కన్నీటి గాధలు. నీళ్ళు లేని ఊళ్ళు, నెర్రలు బాసిన నేలలే తెలంగాణ చిత్రపటమైంది. నీళ్ళు, నిధులు, కొలువులు తెలంగాణ అస్తిత్వ జెండా. తీరొక్క తీరుగా ఉద్యమం మలుపులు తిరుగుతున్నా పట్టీ పట్టనట్లు నటించిన కుట్రాజకీయ పార్టీలను చరిత్ర మరిచిపోదు. తెలంగాణ బిడ్డల ఆకాంక్షలు గెలవాలంటే ఇక ఆమరణ నిరాహారదీక్ష తప్పదని గాంధేయ మార్గంలో చివరి పోరుకు శ్రీకారం చుట్టారు కల్వకుంట్ల చంద్రశేఖరరావు. నా మరణమైనా ఉద్యమ కదలికై ఉప్పొంగాలే, నా ఆమరణ దీక్ష ఉద్యమ ప్రాణం కావాలేనన్న దీక్షతో కదిలిన ఉద్యమకారుడు కేసీఆర్. ఆ బక్కమనిషి ఒంటి ప్రాణంతో ఎత్తిన పిడికిలితో ఆ 11 రోజులు తెలంగాణ ఉక్కిరి బిక్కిరైంది. స్వరాష్ట్ర ఉద్యమాన్ని మలుపు తిప్పింది. కేంద్రం తలకిందులైంది. 1956కు ముందు నుంచి 2014 జూన్ 2 తెలంగాణ అవతరణ వరకు తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమాలపై జరగని కుట్రలు లేవు. ఆధిపత్య రాజకీయాల కుట్ర పూరిత రాజకీయాలతో 1969 ఉద్యమం నెత్తుటిమయమైంది. పెద్దమనుషుల ఒప్పందాలు ఉల్లంఘనలు అయినాయి. ఉద్యమాన్ని నిర్దాక్షిణ్యంగా అణిచివేసి తెలంగాణ అస్తిత్వం గొంతు నులిమిన కుట్రపూరిత రాజకీయాలను తుత్తునియలు చేసే మహాశక్తి కేసీఆర్ రూపంలో రాజకీయ ప్రక్రియగా తెలంగాణ ఉద్యమ జెండాను ఎత్తింది. 1956 తర్వాత పెరిగిన అసమానతలు, నీళ్ళు లేక భూములు ఎండిపోవటాలు, తెలంగాణకు నిధులు కేటాయించని ఆధిపత్య పాలనలు, ఆర్థికంతో పాటు సామాజిక సాంస్కృతిక ఆధిపత్యాలు, పెద్దమనుష్యుల ఒప్పందాల ఉల్లంఘనలు కేసీఆర్ చేపట్టిన ఉద్యమానికి ప్రాణాలయ్యాయి. 1950 నుంచి 2001 వరకు ఆధిపత్యం కింద నలిగిపోయిన తెలంగాణను రాజకీయ ప్రక్రియ ద్వారా కేసీఆర్ తట్టి లేపారు. 1960 దశకం తర్వాత సినిమా రంగం, రియల్ ఎస్టేట్, హాస్పిటాలిటీ, ప్రైవేట్ విద్య, కార్పొరేట్ ఆసుపత్రులు, రవాణా రంగాలు తెలంగాణలో తీవ్ర ప్రాంతీయ అసమానతలకు దారితీశాయి. 1950లో నాన్ ముల్కీ గోబ్యాక్‌గా ఎగిసిన ఉద్యమం ఆత్మగౌరవ తెలంగాణ ఉద్యమమైంది. కాని దాన్ని అణిచివేశారు. 1969–71 సంవత్సరాల్లో నెత్తుటేర్లలో ముంచారు. 1990 దశకంలో తెలంగాణ ఆర్థిక రాజకీయ సామాజిక సాంస్కృతిక రంగాలు పూర్తిగా ఆధిపత్య రాజకీయాల చేతుల్లోకి పోయాయి. ఈ దశకంలోనే తెలంగాణ సమస్యలు ప్రధానాంశాలుగా ముందుకొచ్చాయి. ఈ చారిత్రక సందర్భంలోనే 2001 ఏప్రిల్ 27న కేసీఆర్ నేతృత్వంలో టీఆరఎస్ ఏర్పడింది. కేసీఆర్ ఉద్యమ వ్యాప్తి విస్తృతంగా చేశారు. ఉద్యోగుల సమ్మెలు, విద్యాలయాలు కదనరంగాలుగా మారాయి. ప్రజాసంఘాలు తమ పాత్ర పోషించాయి. కేసీఆర్ రాజకీయ ప్రక్రియ ద్వారా దేశంలో 36 రాజకీయ పార్టీల మద్దతు కూడగట్టారు. ఆధిపత్యవాద రాజకీయ పార్టీల చేత జై తెలంగాణ అనిపించారు. తెలంగాణ ప్రజల గుండెల్లో గూడుకట్టుకున్న ఆకాంక్షలను మలిదశ ఉద్యమంలో రగిలించిన మహాశక్తిగా కేసీఆర్ నిలిచారు. నీళ్ళు నిధులు ఉద్యోగాల్లో జరిగిన దగాను చెప్పటమే గాక, తెలంగాణ ఆటపాట మాటలను ఎంత నిర్లక్ష్యం చేశారో కేసీఆర్ విప్పి చెప్పారు. తన నేలపై భాషా సంస్కృతులపై జరుగుతున్నదాడిని తిప్పికొడుతూ ఉద్యమం కన్నెర్ర జేసింది.

టీఆర్ఎస్ రాజకీయ ప్రక్రియ నేతృత్వంలో ఈ నేల మీద ఉన్న అన్ని రాజకీయ పార్టీలను ఒక తాటిపైకి తీసుకురావటంలో కేసీఆర్ ఎత్తుగడలు, చొరవ, వ్యూహాలు, ప్రతివ్యూహాలు సామాన్యమైనవి కావు. ఉద్యమబలాన్నంతా రాజకీయ ప్రక్రియగా మలిచి కేంద్రంపై ఒత్తిడి తేవటానికి టీఆరఎస్ బలమైన సాధనంగా పనిచేసింది. తెలంగాణ ప్రజల్లో ఉన్న పౌరుషాన్ని మండించటంలో కేసీఆర్ అగ్గిమంటై నిలిచారు. తెలంగాణ మహోన్నత సంకల్పాన్ని గాంధేయ మార్గంలో రాజకీయ ప్రక్రియగా మలిచి దాన్ని లక్షలాది ప్రజల సింహగర్జనగా, జనఘోషగా కేసీఆర్ మార్చగలిగారు. ఇదే టీఆరఎస్ బలానికి నిదర్శనంగా నిలిచింది. కేసీఆర్ అన్నికోణాల నుంచి ఉద్యమాన్ని రగిలించి ఆమరణ నిరాహారదీక్షకు దిగారు. 2009 నవంబర్ 29 నుంచి డిసెంబర్ 9 వరకు 11 రోజులు కేసీఆర్ చేసిన ఆమరణ దీక్ష మొత్తం తెలంగాణ సమాజాన్ని కదిలించింది. 29న సిద్దిపేటలో ఆమరణ దీక్షను అడ్డుకుని అరెస్టు చేయటంతో తెలంగాణ అట్టుడికిపోయింది. కేంద్రం కదిలిపోయింది. కేసీఆర్ తన మాటల్ని తూటాలుగా మార్చాడు. ప్రజా ఉద్యమాన్ని రాజకీయ ఉద్యమ ప్రక్రియగా మలిచాడు. అమరుల త్యాగాలతో తెలంగాణ తల్లడిల్లుతుంటే కేసీఆర్ తన ఆమరణ నిరాహారదీక్షతో కేంద్రం కళ్ళు తెరిపించాడు. 2009 డిసెంబర్ 9న తెలంగాణ రాష్ట్ర ప్రక్రియ ప్రారంభం అన్న ప్రకటన తెప్పించగలిగిన



తెలంగాణ మహోన్నత సంకల్పాన్ని గాంధేయ మార్గంలో రాజకీయ ప్రక్రియగా మలిచి దాన్ని లక్షలాది ప్రజల సింహగర్జనగా, రణఘోషగా కేసీఆర్ మార్చగలిగారు. ఇదే టీఆరఎస్ బలానికి నిదర్శనంగా నిలిచింది. కేసీఆర్ అన్నికోణాల నుంచి ఉద్యమాన్ని రగిలించి ఆమరణ నిరాహారదీక్షకు దిగారు. 2009 నవంబర్ 29 నుంచి డిసెంబర్ 9 వరకు 11 రోజులు కేసీఆర్ చేసిన దీక్ష మొత్తం తెలంగాణ సమాజాన్ని కదిలించింది.
ఆ డిసెంబర్ 9నే తెలంగాణ రాష్ట్ర ప్రక్రియ ప్రారంభం అన్న ప్రకటన తెప్పించగలిగిన శక్తిమంతుడు కేసీఆర్.

ధీశాలి, శక్తిమంతుడు కేసీఆర్. తెలంగాణ ప్రజలంతా ఏదైతే కోరుతున్నారో దానికి టీఆరఎస్‌ను నాలుకగా మలిచిన మలిదశ తెలంగాణ ఉద్యమకారుడిగా కేసీఆర్ చరిత్రలో మిగిలిపోతారు.

తెలంగాణ చరిత్ర సామాజిక, భౌగోళిక, ఆర్థిక రాజకీయ పరిస్థితుల పట్ల ఆయనకు ఉన్న పరిజ్ఞానం అపారం. గొప్ప బుద్ధికుశలత, ఆలోచనలు, సైద్ధాంతిక అవగాహనతో పాటు ఆధునిక రాజకీయాలలో ఆయన అవగాహన లోతైనది. తెలంగాణపై గంటలు గంటలు మాట్లాడగల వాగ్ధాటి ఆయనకు పెట్టని ఆభరణం. ఉద్యమం కోసం ప్రాణాన్ని పణంగా పెట్టి ప్రత్యేక రాష్ట్రం రావాలన్న సత్యాగ్రహి కేసీఆర్. తెలంగాణ రాష్ట్ర సాధన అన్న నిబద్ధత నిమగ్నతలతో నిండిన మహోద్యమ స్వరూపం కేసీఆర్. చరిత్రలో కేసీఆర్ లాంటి నాయకులు అరుదుగా కన్పిస్తారు.

• జూలూరు గౌరీశంకర్
తెలంగాణ తొలి బీసీ కమిషన్ సభ్యులు

(2009 నవంబర్ 29: కేసీఆర్ ఆమరణదీక్ష చేపట్టిన రోజు)

టెట్‌లో నష్టపోతున్న భాషా పండితులు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. అందులో ఎస్జీటి వారి కోసం టెట్ పేపర్–1, స్కూల్ అసిస్టెంట్ వారికి టెట్ పేపర్–2 నిర్వహిస్తుంది. ఈ పరీక్ష విధానం వలన తెలుగు, హిందీ, ఉర్దూ భాషా పండిత అభ్యర్థులు నష్టపోతున్నారు. లాంగ్వేజ్ పండిట్‌ల కోసం ఆంధ్రప్రదేశ్ టెట్ పేపర్–3 నిర్వహిస్తున్నది. అదే విధానాన్ని మన తెలంగాణలో కూడా అవలంబించాలి. లాంగ్వేజ్ పండిట్‌లు పేపర్–2 రాయడం వలన ఇబ్బందులు ఉంటాయి. ఈ పేపర్‌లో పండిట్‌లకు సంబంధం లేని సోషల్ స్టడీస్, మ్యాథ్స్, సబ్జెక్టులకు సంబంధించి 60 మార్కులు ఉంటాయి. దీంతో టెట్‌లో అర్హత సాధించలేకపోతున్నామని భాషా పండితులు ఆందోళన చెందుతున్నారు. ప్రతిసారీ టెట్ విషయంలో భాషా పండితులకు నష్టం జరుగుతుంది. టెట్ అర్హత సాధించిన తర్వాత టీచర్ ఉద్యోగం వస్తే భాషా పండితులు, లాంగ్వేజ్ మాత్రమే బోధించాలి. అలాంటప్పుడు ఈ నియమాలు అభ్యర్థులను ఇబ్బందులు పెట్టడానికే అన్న విమర్శలున్నాయి. టెట్ ప్రారంభమైనప్పటి నుండి భాషా పండితులు, సోషల్ కంటెంట్ & మెథడాలజీ, రాయాల్సి వస్తుంది. దీనివలన తాము ఎక్కువ మార్కులు స్కోర్ చేయలేకపోతున్నామని ఆవేదన చెందుతున్నారు. అందువలన సంబంధిత లాంగ్వేజ్, సబ్జెక్టుకు 90 మార్కులు, పెడగజీకి 30 మార్కులు, ఇంగ్లీష్‌కి 30 మార్కులు కేటాయించాలి. టెట్ లోపాలను సవరించి భాషా పండితుల టెట్ పేపర్–3 నిర్వహించి వారికి న్యాయం చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి మనవి.

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ–మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

ఆ ధనరాశులు ఎక్కడివి?

‘సోలార్ కరెంటుని సప్[illegible]చేసే కాంట్రాక్టుల కోసం, అదానీ అనే ఒక పెద్ద పెట్టుబడిదారుడు, దేశంలోని కొన్ని రాష్ట్రాల ప్రభుత్వ పెద్దలకు దాదాపు రెండు వేల కోట్ల రూపాయల లంచాలిచ్చాడని, వారం కిందట పత్రికలూ, టీవీలూ సరికొత్త వార్తలిచ్చాయి! ‘అదానీ లంచాల కహానీ’ అనీ, ‘లంచాల అవదానీ’ అనీ, సరదా శీర్షికలు పెట్టి మరీ! లంచాల వార్తల వెనక ఒక పెద్ద కథ వుంది! అదేమిటంటే, సూర్యుడి వల్ల వచ్చే ఎండ వేడినించీ కరెంటుని(సోలార్ ఎనర్జీని) తయారు చేయించడం కోసం, అదానీ కంపెనీ, ప్రపంచ వ్యాప్తంగా, 6 వేల, 3 వందల కోట్ల పెట్టుబడులు సేకరించిందట! వాటిల్లో 15 వందల కోట్లని అమెరికాలోని బ్యాంకుల నించీ, అక్కడి ఇతర ఆర్థిక సంస్థల నించీ కూడా! అలా అమెరికా నించీ నిధులు సేకరించిన స్వదేశీ, విదేశీ కంపెనీలు ఏవైనా, తమ వ్యాపార ప్రయోజనాల కోసం, ఏ దేశంలో అయినా, ప్రభుత్వనేతలకు గానీ, అధికారులకు గానీ, లంచాలుగా ఇచ్చినా, ఇస్తానని ఆశజూపినా, అది అమెరికాలో ఒక చట్టం ప్రకారం పెద్ద నేరం అట! అందుకే, అదానీ కంపెనీ మీద అమెరికా కేసులు పెట్టింది. అదానీ నేరం కొన్ని సంవత్సరాల క్రితమే జరిగినా, అదానీ మీద వున్న అమెరికా కేసుల వివరాలు మొన్నీ మధ్యే బయటపడడంతో, భారతదేశంలో ప్రతిపక్షాలు, అదానీ మీద, కేంద్ర ప్రభుత్వం, అరెస్టుతో సహా, చర్యలు తీసుకోవాలని డిమాండు చేస్తున్నాయి. అదానీ, మోదీకి అత్యంత సన్నిహిత పెట్టుబడిదారీ మిత్రుడు కాబట్టి, అతని మీద ప్రభుత్వం చర్యలు తీసుకోదని ప్రతిపక్షాలకు గట్టి అనుమానాలు!

అదానీ ఇచ్చిన లంచాల వ్యవహారం, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా జగన్ వున్న కాలంలో జరిగిందట! ‘జగన్‌కి 1750 కోట్లు’ లంచంగా ముట్టిందట! ఏది ఏమైనా, ఆ లంచాలు ఎవరు ఎవరికి ఇచ్చారో, ఎంత ఇచ్చారో, నోట్ల రూపంలో ఇచ్చారా, బంగారు నాణాల రూపంలో ఇచ్చారా, బహుమతుల రూపంలోనా, ఏ రూపాల్లో ఇచ్చారో; ఆ లంచాలు తీసుకున్న వాళ్ళు వాటిని ఎక్కడ ఎలా దాచుకున్నారో- ఆ వివరాలన్నీ మనకి అనవసరం. ‘మనకి’ అంటే, ‘శ్రామిక ప్రజలకు’ అని. శ్రామిక ప్రజలు అంటే, రకరకాల స్థాయిల్లో, ఇటూ, అటూ, మేధా శ్రమలూ, శారీరక శ్రమలూ చేసేవారు అనే కదా? ఆ లంచాలు ఇవ్వడానికి, వేల కోట్ల ధనరాసులు, ఆ లంచాలిచ్చే వ్యక్తికి ఎలా వచ్చాయి, ఎక్కణ్ణించీ వచ్చాయీ అన్నదే మనకి ముఖ్యంగా రావలిసిన ప్రశ్న! అయితే, దీనికి సాధారణంగా మనలోనే కొందరు చెప్పుకునేది ఏమిటంటే: ‘ఏముందీ, అదానీకి, అతడి పెట్టుబడుల వల్ల లాభాలు వస్తాయి కాబట్టి, ఆ లాభాల నించే, కొంత ఇస్తాడు’ -అని! కానీ, మనకి అసలు తెలియవలిసింది, లంచాల డబ్బు గురించి కాదు,

లంచాలు ఇవ్వడానికి, వేల కోట్ల ధన రాసులు ఆ లంచాలిచ్చే వ్యక్తికి ఎలా వచ్చాయీ, ఎక్కణ్ణించీ వచ్చాయీ అన్నదే మనకి ముఖ్యంగా రావలిసిన ప్రశ్న! అయితే, దీనికి సాధారణంగా మనలోనే కొందరు చెప్పుకునేది ఏమిటంటే: ‘ఏముందీ, అదానీకి, అతడి పెట్టుబడుల వల్ల లాభాలు వస్తాయి కాబట్టి, ఆ లాభాల నించే, కొంత ఇస్తాడు’ అని! కానీ, మనకి అసలు తెలియవలిసింది, లంచాల డబ్బు గురించి కాదు, ‘లాభాల’ డబ్బు గురించే!

‘లాభాల’ డబ్బు గురించే! అయినా, లాభం రావడం చాలా సహజమైన విషయం అయినట్టే, పెట్టుబడికి వడ్డీ లాభాలు రావా, రావొద్దా- అని, ప్రపంచ జనం, ఆర్థికవేత్తలతో సహా అందరూ అనేస్తారు, భావిస్తారు! లాభానికి వున్న మూల కారణం గురించి, దాని రహస్యం గురించి 160 ఏళ్ళ క్రితం, మార్క్సు వచ్చి చెప్పేవరకూ ఎవరికీ సరిగా తెలీనే తెలీదు. ఈ సోలార్ కరెంటు పరిశ్రమనే ఉదాహరణగా తీసుకుని, ఆ రహస్యం ఏమిటో తెలుసుకో గలం, మార్క్సుని చదివి.

ఏ పరిశ్రమలో అయినా, అది ఒక్క నిమిషం నడవాలన్నా, దానికి 2 అంశాలు కావాలి! సోలార్ పరిశ్రమకీ అలాగే, 2 అంశాలే! (1) కరెంటుని తయారు చేయడానికి మొట్టమొదట కావలిసిన ‘సాధనాలు’. ఆ సాధనాలకి ఏవో పేర్లు వుంటాయి. సోలార్ పానల్సూ, మిరర్సూ, ఇన్వర్టర్లూ, వైర్లూ, గ్రిడ్లూ, మీటర్లూ, బ్యాటరీలూ, వగైరా వగైరాలు. ఆ సాంకేతిక వివరాలు దేనికైనా వుంటాయి. అవి అనవసరం. ‘ప్రారంభ పదార్థం’ ఇక్కడ సూర్యుడి నించీ వచ్చే ఎండే! ఎండ బాగాపడే అనేక ఎకరాల, విశాలమైన భూమి కూడా సహజ సాధనంగా కావల్సిందే ఇక్కడ. (2) ఆ



సాంకేతిక సాధనాలతో సోలార్ కరెంటుని తయారు చేసి, దాన్ని నిల్వచేసి, దాన్ని పంపిణీ కూడా చేయడానికి ఎంతోమంది ఇంజినీర్లూ, రకరకాల టెక్నీషియన్లూ, నైపుణ్యం గల కార్మికులూ, సాధారణ శ్రమల కార్మికులూ కూడా ఎందరో కావాలి. వాళ్ళకి జీతాలు ఇస్తేనే, వాళ్ళకి పోషణ కదా? కాబట్టి, మొదట సాధనాలకు అయ్యే ఖర్చూ, తర్వాత శ్రామికులకు ఇచ్చే జీతాల ఖర్చూ- ఈ 2 ఖర్చులే ‘పెట్టుబడి’ అవుతాయి. ఈ పెట్టుబడి, ఎంత వుండాలో, జరగవలిసిన పనినిబట్టే కదా? ఎంత భూమిలో, ఎన్ని సాధనాలతో, ఎంత మంది కార్మికులతో, ఎంత ‘సోలార్ కరెంటుని’ తయారు చేయించాలనుకుంటారో, దానిని బట్టి ఎంత డబ్బు కావాలో వుంటుంది.

ఉదాహరణకి, బాగా ఎండలు వుండే రాజస్థాన్‌లో, 14 వేల ఎకరాల్లో, సోలార్ పరిశ్రమ పెట్టాలంటే, 50 వేల కోట్లు అవుతుందని ఒక లెక్క-అట! ఆ లెక్కల వివరాల గందరగోళంలోకి మనం, ఇంతకన్నా వెళ్ళొద్దు. ఎందుకంటే, ఎవరు ఎంత పెట్టుబడిని పోగుచేసుకోగలిగితే, దాన్ని బట్టి పరిశ్రమని చిన్నదో, పెద్దదో పెట్టుకుంటారు.

ఇక్కడ మన ప్రశ్న: లంచాల్ని ఐదో, పదో కాకుండా, కోట్లలో ఇవ్వాలంటే, వాళ్ళు భారీ పరిశ్రమ పెట్టాలి. దానికి భారీ పెట్టుబడి డబ్బు కావాలి కదా? ఈ గోలంతా ఎందుకంటే, ఏ పరిశ్రమకి అయినా, చివరికి లాభం ఎలా వస్తుందో తెలియడానికి. లాభం గురించి తెలిస్తే, లంచం గురించి తెలుస్తుంది. కాబట్టి, అసలు తెలుసుకోవలిసిన రహస్యం, లాభం ఎలా వస్తుంది?- అనే గానీ, కోట్ల కోట్ల లంచాలు ఎలా ఇస్తారు- అని కాదు. సోలారు కరెంటు పరిశ్రమని ఒక ఉదాహరణగా చెప్పుకుందాం. ఈ పరిశ్రమలో, సోలార్ కరెంటుని తయారు చేయడానికి, సాధనాల కోసం ఖర్చుని 80 అనుకుందాం. ఆ సాధనాలను ఉపయోగిస్తూ, సోలార్ కరెంటు తయారవడానికి అవసరమైన ‘శ్రమలు’ చేసే కార్మికులందరి జీతాలూ కలిసి 20. ఇది రెండో ఖర్చు. 2 ఖర్చులూ కలిసి 80+20=100. ఇదే పెట్టుబడి. కరెంటు తయారైంది. ఇదే కొత్త సరుకు. దీన్ని అమ్మడానికి పెట్టుబడిదారుడే ధరని నిర్ణయిస్తాడు. ఇక్కడ ఈ సరుకు ధర 120. ఈ ధరతో అమ్మకం జరుగుతుంది. 100 ఖర్చుతో తయారు చేసిన కరెంటుకి, 120 ఎలా వచ్చింది? ఆ 20 అదనంగా ఎలా వచ్చిందో, క్లుప్తంగా చెప్పుకోవాలంటే: (1) సాధనాలు 80 విలువ గల శ్రమతో గతంలో తయారయ్యాయి. అవి నిర్జీవమైనవి కాబట్టి, అవి ఏ శ్రమా చెయ్యవు. అందుకే, అవి తమ విలువకంటే, ఎక్కువ విలువని ఇవ్వలేవు. వాటి విలువ 80గానే వుంటుంది గానీ పెరగదు. అయితే, తయారైన సరుకుని (కరెంటుని) 120కి అమ్మినప్పుడు, ఆ 120లో, సాధనాల 80 విలువని తీసివేస్తే, మిగిలిన 40 విలువ ఏమిటి? సాధనాలను ఉపయోగిస్తూ, కార్మికులు, పనిదినం అంతా, కొత్తగా చేసిన శ్రమల విలువ అది. కానీ, యజమాని కార్మికులకు జీతాల పేరుతో ఇచ్చేది 20 విలువ మాత్రమే! పనిదినం 10 గంటలనుకుంటే, మొదటి 5 గంటల్లోనే, కార్మికులు 20 విలువగల శ్రమ చేసేస్తారనుకుందాం. అంటే, వాళ్ళకి యజమాని ఇచ్చే జీతం విలువకి సమానమైన శ్రమ చేసేస్తారన్నమాట! మిగతా 5 గంటలలో కార్మికులు చేసే శ్రమ అంతా, పెట్టుబడిదారీ యజమానికి, డబ్బు తీసుకోకుండా, ఉచితంగా, కార్మికులు అదనంగా ‘శ్రమ’ చేసిపెడుతున్నారని అర్థం! అదే అదనపు విలువ. దాన్నే పెట్టుబడిదారీ ఆర్థికశాస్త్ర భాషలో నాజూగ్గా ‘లాభం’ అంటారు. జీతాల విలువని మించి, అదనంగా విలువ లాగేలా పనిచేయించడమే ‘శ్రమ దోపిడీ’! ఈ లాభం (మార్క్సు మాటల్లో ‘అదనపు విలువ’) మన ఉదాహరణలో, 20. (ఒక వేళ, 120 విలువ గల సరుకుకి ధరని పెంచి, 140కి అమ్మినా, పెరిగిన ధర కూడా, జరిగిన అదనపు శ్రమ విలువే. 20 అదనపు శ్రమ విలువగా వున్నది, ధరని పెంచినప్పుడు 40 అదనపు శ్రమ విలువగా కూడా విస్తరించిందని అర్థం. అంటే, ఇక్కడ ధర, శ్రమ విలువే!) అది, కొన్ని భాగాలుగా పంపిణీ అవుతుంది: (1) సోలార్ కరెంటు తయారీకి ఉపయోగించే సాధనాలు ఏ భూమిమీద అయితే అమర్చుతారో, ఆ భూమికి ‘కౌలు’ పేరుతో, లేదా ‘అద్దె’ పేరుతో కొంత వెళ్తుంది. (2) పెట్టుబడి కోసం డబ్బు ఇచ్చిన బ్యాంకులకి ‘వడ్డీ’గా కొంత వెళ్తుంది. (3) ప్రభుత్వానికి కట్టే పన్నులు. (4) కాంట్రాక్టులు ఇప్పించినందుకు ప్రభుత్వ పెద్దలకు ఇచ్చే లంచాలు. (6) చివరికి మిగిలేది, తన సంస్థకి లాభం. ఈ లాభం డబ్బుల్లో, కొంత తన కుటుంబ పోషణకీ, విలాసాలకీనూ! ఎక్కువ భాగం, తన శ్రమ దోపిడీని పెద్ద ఎత్తున సాగించడానికి అవసరమైన అదనపు పెట్టుబడిగా వాడతాడు.

చివరికి తేలింది ఏమిటీ అంటే, లంచాలు అనేవి, కార్మికుల శ్రమల్ని దోచి సంపాదించిన ‘లాభాల’ (అదనపు విలువల) నించే వస్తాయి- అని! కాబట్టి, మేధా శ్రామికులారా! శారీరక శ్రామికులారా! లంచాలు ఇచ్చే వాళ్ళ కుటుంబాలనూ, లంచాలు తీసుకునే వాళ్ళ కుటుంబాలనూ పోషించేది కార్మికవర్గమే! అంటే, మనమే అని గ్రహించండి! ఈ గ్రహింపుని కార్మిక వర్గానికి ఇవ్వకుండా, ఎన్ని పేపర్లలో, ఎన్ని టీవీల్లో, ఎన్ని యూట్యూబుల్లో, ఎంత రాసినా, మాట్లాడినా, అవన్నీ కాయితాల కబుర్లే! కాలక్షేపం కబుర్లే అవుతాయి. అవి, అసలు నిజం వేపు జనాల దృష్టిని తిప్పలేవు.



బాబోయ్.. బడి బువ్వ!

వేలేరు బాలుర గురుకులంలో విద్యార్థులకు వడ్డించిన దొడ్డు బియ్యం అన్నం

ఉడికీ ఉడకని అన్నం.. రుచీపచీ లేని కూరలు.. చారును తలపించే పప్పు.. ఉప్పు, పప్పు లేని చారు.. ప్రమాణాల మేరకు లేని గుడ్లు.. ఇదీ ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన తీరు. సర్కారు బడుల్లో చదువుకునే చిన్నారులకు ఇంటి నుంచి భోజనం తెచ్చుకునే అవసరం లేకుండా పాఠశాలల్లోనే వారికి ప్రభుత్వమే మధ్యాహ్న భోజన వసతి కల్పించింది. ఇందుకోసం ఏటా రూ.కోట్లు వెచ్చిస్తూ.. ఆ బాధ్యతలను ఏజెన్సీలకు అప్పగించింది. ఈ క్రమంలో మెజారిటీ పాఠశాలల్లో నాణ్యమైన భోజనం అందడం లేదని, మెనూ ప్రకారం కోడిగుడ్లు, ఇతర పౌష్టికాహారాలను అందించడం లేదని తెలుస్తోంది. అంతేకాదు.. సరైన వంట షెడ్లు, డైనింగ్‌హాళ్లు, నీటి కులాయిలు లేక చిన్నారులు అవస్థలు పడుతున్నారు. ఇటీవల మహబూబ్‌నగర్, కరీంనగర్ జిల్లాలోని రెండు పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తిన్న తర్వాత పదుల సంఖ్యలో విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రుల పాలయ్యారు. ఇక కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఓ విద్యార్థిని 20రోజుల పాటు చికిత్స పొంది కన్నుమూసింది. ఈ ఘటనల తర్వాత విద్యార్థులు, వారి తల్లిదండ్రులు 'బాబోయ్.. బడి బువ్వ' అంటూ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని సర్కారు బడుల్లో మిడ్‌డే మీల్స్ నిర్వహణ తీరుపై గురువారం నిర్వహించిన 'ఆంధ్రజ్యోతి' విజిట్‌లో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి.

- ఉమ్మడి వరంగల్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి



వేలేరు బాలుర గురుకులంలో సిబ్బంది లేక భోజనం వడ్డిస్తున్న విద్యార్థులు

- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సక్రమంగా అందని మధ్యాహ్న భోజనం
- ఉడికీ ఉడకని అన్నం, రుచీపచీలేని కూరలు వడ్డిస్తున్న నిర్వాహకులు
- మెనూ పాటించడంలోనూ నిర్లక్ష్యం.. పలుచోట్ల కానరాని గుడ్డు
- వంటషెడ్లు లేక ఆరుబయట వంట.. చెట్ల కిందనే భోజనాలు

పాటించాల్సిన మెనూ..

- సోమవారం: కిచిడీ, మిక్స్‌డ్ వెజిటేబుల్‌కర్రీ, గుడ్డు.
- మంగళవారం: రాగి జావ, అన్నం, సాంబారు, మిక్స్‌డ్ వెజిటేబుల్ కర్రీ.
- బుధవారం : అన్నం, ఆకుకూరలు, మిక్స్‌డ్ వెజిటేబుల్ కర్రీ, గుడ్డు.
- గురువారం: రాగి జావ, వెజిటేబుల్ బిర్యానీ, మిక్స్‌డ్ వెజిటేబుల్ కర్రీ.
- శుక్రవారం : అన్నం, సాంబార్, మిక్స్‌డ్ వెజిటేబుల్ కర్రీ, గుడ్డు.
- శనివారం : రాగి జావ, అన్నం, ఆకుకూర పప్పు, మిక్స్‌డ్ వెజిటేబుల్ కర్రీ.

వివరాలు 8లో..



జఫర్‌గఢ్ మోడల్ స్కూల్‌లో గుడిసెలో వంట..



మరిపెడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో...



కొడవటూరు పాఠశాలలో..



తాడ్వాయి మండలం ఇందిరానగర్ జడ్పీ హైస్కూల్‌లో..



కాటారంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో ఆరుబయట వంట..

కోచ్ ఫ్యాక్టరీకి గ్రీన్ సిగ్నల్

- కాజీపేట రైల్వే వ్యాగన్ పరిశ్రమను అప్‌గ్రేడ్ చేసిన రైల్వేశాఖ
- ఎల్‌హెచ్‌బీ, ఈఎంయూ కోచ్‌ల తయారీ
- సెప్టెంబరు 9నే ఉత్తర్వులు.. ఆలస్యంగా వెలుగులోకి..
- ఓరుగల్లు వాసులకు మరో విభజన హామీని నెరవేర్చిన కేంద్రం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీకి రైల్వే శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రస్తుతం నిర్మిస్తున్న రైల్వే వ్యాగన్ మ్యానుఫ్యాక్చర్ యూనిట్‌ను అప్‌గ్రేడ్ చేసి కోచ్ ఫ్యాక్టరీగా మారుస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో 55ఏళ్లుగా కోచ్ ఫ్యాక్టరీ కోసం ప్రజలు, రైల్వే ఉద్యోగులు చేస్తున్న పోరాటం ఫలించినట్టయ్యింది. కోచ్‌ఫ్యాక్టరీతో వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రానున్నాయి. 2014 ఏపీ విభజన హామీల్లో భాగంగా ఉమ్మడి ఓరుగల్లుకు సంబంధించి మరో హామీని కేంద్రం నేరవేర్చినట్లైంది. ఇప్పటికే గిరిజన వర్సిటీ ఏర్పాటు చేసిన కేంద్రం తాజాగా కోచ్ ఫ్యాక్టరీని కూడా మంజూరు చేయటం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

వ్యాగన్‌ను కోచ్ ఫ్యాక్టరీగా అప్‌గ్రేడ్..

కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీ వచ్చింది. 1969 నుంచి కోచ్ ఫ్యాక్టరీ కోసం చేస్తున్న పోరాటం ఫలించింది. గతేడాది

మిగతా 6వ పేజీలో...



దీక్షా దివస్‌తో.. ప్రజాక్షేత్రంలోకి..

- అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఓటమితో స్తబ్దుగా గులాబీ దళం
- కేడర్‌లోని నైరాశ్యాన్ని చెరిపేలా బీఆర్‌ఎస్ కార్యాచరణ
- నేడు జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు, దీక్షా శిబిరాలు
- వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలపైన గులాబీ పార్టీ నజర్
- నాటి కేసీఆర్ దీక్షతో పోరెత్తిన ఓరుగల్లు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)



గులాబీ పార్టీని వరుస ఓటములు నైరాశ్యంలోకి నెట్టాయి. అసెంబ్లీ, పార్లమెంట్‌తో పాటు ఎమ్మెల్సీ ఉపఎన్నికల్లో ఎదురైన పరాభవాలతో బీఆర్‌ఎస్‌లో స్తబ్ధత నెలకొంది. గ్రామస్థాయి కార్యకర్తల నుంచి రాష్ట్ర స్థాయి నేతల వరకు నిరాసక్తతో తమదైన రోజు కోసం ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో క్యాడర్‌లో జోష్ నింపడంతో పాటు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పాగా వేయడమే లక్ష్యంగా బీఆర్‌ఎస్ అధినాయకత్వం భారీ కసరత్తు చేస్తోంది. 2009 నవంబరు 29న కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో అంటూ చేసిన ఆమరణ దీక్షకు 15ఏళ్లు కావటంతో దీక్షా దివస్‌ను భారీ స్థాయిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ దీక్షాదివస్ వేదికగా ప్రజాక్షేత్రంలోకి వెళ్లి.. కేసీఆర్ దీక్షతోనే రాష్ట్రం సిద్ధించిందని ప్రజల కు మళ్లీ గుర్తుచేసే ప్రయత్నం చేస్తోంది. ఇప్పటికే ఉమ్మడి వరంగల్ జిల్లాలకు పార్టీ ఇన్‌చార్జ్‌లను నియమించిన బీఆర్‌ఎస్ శుక్రవారం అన్ని జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు, దీక్షలతో దీక్షా దివస్‌ను సక్సెస్ చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంది.

పరాజయాలతో గులాబీ దళంలో నైరాశ్యం

తెలంగాణ ఉద్యమానికి అండగా నిలిచింది ఓరుగల్లు. 2014, 2018లో గులాబీ దళానికి జైకొట్టి.. భారీగా ఎమ్మెల్యే, ఎంపీ సీట్లను ఇచ్చిన వరంగల్ ప్రజలు 2023లో మాత్రం భారీ షాక్ ఇచ్చారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12 అసెంబ్లీ స్థానాలు ఉంటే కేవలం రెండు చోట్లనే బీఆర్‌ఎస్‌వైపు మొగ్గు చూపారు. తెలంగాణ ఉద్యమకారులు వినయ్‌భాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డిలతో పాటు నాడు మంత్రిగా ఉన్న ఎర్రబెల్లి దయాకర్‌రావు సైతం ఓటమిపాలయ్యారు. ఆ తరువాత ఆరు నెలలకే జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లోనూ గులాబీ పార్టీకి పరాజయమే మిగిలింది. వరంగల్, మహబూబా బాద్ పార్లమెంట్ స్థానాల్లో కాంగ్రెస్ పాగా వేసింది. వరంగల్ ఎంపీ స్థానంలో దారుణంగా మూడో స్థానానికి గులాబీ పార్టీ పరిమితమైంది. వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి జరిగిన ఉపఎన్నికల్లోనూ ఓడిపోయింది. మూడు పర్యాయాలు వరుసగా గెలిచిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానంలో కూడా ఓటమి చెందడం గులాబీ శ్రేణులను మరింతగా కుంగదీసింది. దీంతో కొంతకాలంగా బీఆర్ ఎస్ శ్రేణులు అంటీముట్టనట్టుగా ఉంటున్నారు. మాజీ ఎమ్మెల్యేలు కూడా నియోజకవర్గాలకు చుట్టపు చూపులా వచ్చిపోతున్నారు. దీంతో కార్యకర్తల్లోనూ నైరాశ్యం ఏర్పడింది. ఈ క్రమంలో క్యాడర్‌లో జోష్ నింపేందుకు ప్రజాక్షేత్రం లోకి వెళ్లాలని బీఆర్‌ఎస్ కసరత్తు చేస్తోంది.

దీక్షాదివస్‌తో కార్యాచరణ

కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో అంటూ 2009 నవంబరు 29న గులాబీ దళపతి ఆమరణ దీక్షకు దిగి 15ఏళ్లవుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి కూడా ఏడాది కాలం కావస్తుంది. దీంతో ఇన్నాళ్లు స్తబ్ధుగా ఉన్న గులాబీ దళం దీక్షా దివస్ వేదికగా ప్రజ ల్లోకి వెళ్లేందుకు కార్యాచరణ చేపట్టింది. నాటి కేసీఆర్ ఆమరణ దీక్షతోనే తెలంగాణ ఉద్యమం ఊపందు కుందని ప్రచారం చేస్తోంది. ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా ప్రతీ గ్రామంలోనూ ఉద్యమ జ్ఞాపకాలున్న నేపథ్యంలో ఆ సెంటిమెంట్‌గా రగిలిస్తూనే కాంగ్రెస్ ఏడాది పాలన వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తోంది. ప్రధానంగా రైతు భరోసా, రుణమాఫీ, మహిళలకు రూ.2,500 సాయం, రూ.4వేలకు పెరగని పింఛన్లు తదితర వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని భావిస్తోంది. ఇందుకోసం ఉమ్మడి వరంగల్‌లోని అన్ని జిల్లాలకు పార్టీ



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

సీఎం కప్‌ను విజయవంతం చేయాలి

- ప్రతిభావంతులైన క్రీడాకారులను ఎంపిక చేయాలి..
- క్రీడాకారులకు సౌకర్యాలు కల్పించాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య

6



మాస్టర్ ప్లాన్ -2041 మ్యాప్ ఆవిష్కరణ

- వరంగల్, హనుమకొండ కలెక్టరేట్‌లలో ఏర్పాటు ● ఆసక్తిగా వీక్షిస్తున్న విలీన గ్రామాల ప్రజలు

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఆమోదించిన కుడా మాస్టర్ ప్లాన్ - 2041ను ఆమోదిస్తూ జీవోను విడుదల చేసిన విషయం తెలిసిందే. అయితే ఇందుకు సంబంధించిన ప్లాన్ ఆమోదాన్ని హనుమకొండలో ఇటీవల జరిగిన మహిళాశక్తి విజయోత్సవ సభలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వర్చువల్‌గా వెల్లడించారు. కాగా మాస్టర్‌ప్లాన్ మ్యాప్‌ను గురువారం కుడా (కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) కార్యాలయంతోపాటు వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాలలోని కలెక్టరెట్ కార్యాలయాలలో ఆవిష్కరించారు. కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి, కుడా సీపీవో అజీత్‌రెడ్డి ఆదేశాల మేరకు అతిపెద్ద మాస్టర్‌ప్లాన్ మాప్‌ను ఆయా కార్యాలయాల ముందు ప్రదర్శించారు. అంతే కాకుండా మాస్టర్‌ప్లాన్‌పై అందరికీ అవగాహన కలిగించే విధంగా వెబ్‌సైట్‌లో కుడా అప్‌లోడ్ చేసినట్టు కుడా అధికారులు తెలిపారు. అయితే ఇటీవల కుడా పరిధి విస్తరించడంతో పాటు కొత్తగా 81 గ్రామాలను విలీనం చేస్తూ 2041 మాస్టర్‌ప్లాన్‌ను విడుదల చేయగా, చాలామంది కుడా కార్యాలయానికి వచ్చి చూస్తున్నారు.

బిల్లుల మంజూరు కోసం కక్కుర్తి

- మాజీ సర్పంచ్‌ను లంచం అడిగిన పీఆర్ ఏఈ
- రూ.5వేలు ఇస్తుండగా వల పన్ని పట్టుకున్న ఏసీబీ

కాళోజీ జంక్షన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): లంచం తీసుకుంటూ ఓ పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజనీర్ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య, కాంట్రాక్టర్ సతీష్‌లు తెలిపిన ప్రకారం సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి..

వర్ధన్నపేట మండలం కడారిగూడెం గ్రామానికి చెందిన మంద సతీష్.. 2023 ఫిబ్రవరిలో సర్పంచ్‌గా ఉన్న సమయంలో గ్రామంలో సీసీ రోడ్లు నిర్మించారు. రోడ్డు నిర్మాణానికి అయిన వ్యయం రూ.9 లక్షల 72 వేలుగా అధికారులు బిల్లు చేశారు. బిల్లు కోసం సతీష్ పని పూర్తి చేసినప్పటి నుంచి సంబంధిత అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. పంచాయతీ రాజ్ శాఖలో అసిస్టెంట్ ఏఈగా పనిచేస్తున్న కార్తీక్ వద్దకు వెళ్లగా.. ఆయన బిల్లు చెల్లింపు కోసం డబ్బులు డిమాండ్ చేశాడు. తాను అప్పులు తెచ్చి పని పూర్తి చేశానని, తన ఆర్థిక పరిస్థితి బాగా లేదని ఏఈని ఎంతగా బతిమాలినా ఒప్పుకోలేదు. చివరికి చేసేది లేక సతీష్ ఏసీబీ కార్యాలయానికి వెళ్లి తన బాధను అధికారులకు మొరపెట్టుకున్నాడు.



ఏసీబీ అధికారులకు పట్టుబడిన ఏఈ కార్తీక్

ఏసీబీ అధికారుల సూచన మేరకు సతీష్ రూ.5వేలు వారి నుంచి తీసుకొని గురువారం ఉదయం జడ్పీ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ ఏఈ లేకపోవడంతో ఫోన్ చేశాడు. తాను హరిత హోటల్‌లో ఉన్నానని అక్కడికి ఏఈ రమ్మన్నాడు. బాధి తుడు సతీష్ హరిత హోటల్‌కు వెళ్లి రూ.5వేలు ఏఈకి ఇస్తుం డగా ఏసీబీ అధికారులు వల పన్ని పట్టుకున్నారు. వెంటనే ఏఈ నుంచి డబ్బులు స్వాధీనం చేసుకున్నారు. తర్వాత ఏఈని, అతడు పనిచేస్తున్న జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయానికి తీసుకెళ్లి విచారణ చేపట్టారు. ఏఈని అరెస్టు చేసి మూడో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఎదుట హాజరుపర్చనున్నట్లు ఏసీబీ ఏసీపీ సాంబయ్య తెలిపారు.

సీసీఐ పత్తి విత్తనాల వేలం

వరంగల్ వ్యవసాయం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పత్తి విత్తనాలను విక్రయించేందుకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ప్రతీరోజు సోమవారం నుంచి శుక్రవారం పత్తి విత్తనాల ఈ-వేలం నిర్వహిస్తుందని, ఇందులో ఆసక్తి ఉన్నవారు పాల్గొనవచ్చని సీసీఐ బ్రాంచ్ జనరల్ మేనేజర్ అర్జున్ దవే గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సీసీఐ నుంచి పత్తి విత్తనాలు కొనుగోలు చేయడానికి ఆసక్తి ఉన్న కొనుగోలుదారులందరూ హెచ్‌పీటీటీ.కాటన్ సీడ్స్. ఇన్ విద కామ్., హెచ్‌పీటీటీ. కాట్‌బిజ్. కాటన్ కార్పొరేషన్. ఓఆర్‌జీ. ఇన్‌లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. పత్తి విత్తనాల కొనుగోలుకు సంబంధించి నిబంధనలు, షరతులు కాటన్ కార్పొరేషన్.ఓఆర్‌జీ.ఇన్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రిజిస్ట్రేషన్‌లో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే.. ఈ-వేలంలో బిడ్డింగ్ లేదా పత్తి విత్తనాల డెలివరీ చేస్తున్నప్పుడు కొనుగోలుదారులు వీ.ఎల్.చిట్టిమల్ల కాంప్లెక్స్, లక్ష్మీపురం, వరంగల్ వద్ద ఉన్న తమ శాఖ కార్యాలయంలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు. ఇంకా ఏమైనా సమస్యలుంటే వాట్సాప్ నంబర్ 7718955728 కు వివరాలతో సందేశాలను పంపవచ్చని అర్జున్ దవే ఆ ప్రకటనలో తెలిపారు.

సీఎం కప్-2024ను విజయవంతం చేయాలి

▸▸ హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే సీఎం కప్-2024ను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం సాయంత్రం సీఎం కప్ నిర్వహణపై సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. వచ్చే నెల 7వ తేదీ నుంచి సీఎం కప్ జరుగుతుందని, తొలుత గ్రామ, మండల, జిల్లాస్థాయిలో వివిధ కమిటీల ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించనున్నారని తెలిపారు. అన్ని స్థాయిలలో ప్రజాప్రతినిధులను భాగస్వాములు చేయాలన్నారు. పోటీల నిర్వహణ తేదీలు, వేదికల వివరాలను ముందస్తుగా వెల్లడిస్తూ అధికసంఖ్యలో క్రీడాకారులు పాల్గొనేలా చొరవ తీసుకోవాలన్నారు. ఈ పోటీలలో పాల్గొనే క్రీడాకారులు ఎలాంటి అసౌకర్యాలకు గురికాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జిల్లా క్రీడల యువజన శాఖ అధికారి అశోక్ కుమార్ మాట్లాడుతూ.. వచ్చే నెల 7,8 తేదీలలో గ్రామస్థాయిలో, 10 నుంచి 12 వరకు మండల స్థాయిలో, 16 నుంచి 21వ తేదీ వరకు జిల్లా స్థాయిలో ఎంపిక చేసిన క్రీడా పోటీల్లో క్రీడలు జరుగుతాయన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా అడిషినల్ కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా వివిధ శాఖల అధికారులు, జిల్లాలోని వివిధ క్రీడా సంఘాల బాధ్యులు, క్రీడా కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హనుమకొండ జిల్లాను ముందంజలో ఉంచాలి

జిల్లాలో నిర్వహించే అన్ని స్థాయిల పోటీలకు ఎలాంటి పక్షపాతం లేకుండా ప్రతిభావంతులైన క్రీడాకారులను ఎంపిక చేయాలని కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. ఎంపిక చేసిన ప్రతిభ కలిగిన క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో జిల్లాను ముందంజలో నిలిపి జిల్లాకు మంచి గౌరవాన్ని తీసుకురావాలన్నారు. జిల్లా, రాష్ట్రస్థాయి వేదికయ్యే హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలోని మైదానాలను పూర్తి స్థాయిలో సిద్ధం చేయడంతో పాటు వసతికి సంబంధించిన మరమ్మతులు సత్వరమే పూర్తి చేయాలన్నారు. అసంపూర్తిగా ఉన్న రెజ్లింగ్, కబడ్డీ హాల్ నిర్మాణంతో పాటు మిగతా క్రీడా సదుపాయాలను సమకూర్చాలన్నారు.

ధాన్యం రైతులకు డబ్బులు చెల్లించాలి

ధాన్యం విక్రయించిన రైతులకు వెంటనే ఆన్‌లైన్ చేసి డబ్బులు త్వరగా చెల్లించాలని అధికారులను జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లోని విసీ కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం రాత్రి ధాన్యం కొనుగోలుకు సంబంధించి చెల్లింపుల అంశంపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. జిల్లాలో ఇప్పటివరకు చేపట్టిన ధాన్యం కొనుగోలు, మిల్లులకు తరలింపు, ఆన్‌లైన్ చేయడం, రైతుల పేమెంట్ గురించి అధికారులను ఈ సందర్భంగా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. ధాన్యం విక్రయించిన రైతులకు పేమెంట్ చెల్లింపుల్లో ఎలాంటి జాప్యం లేకుండా చూసుకోవాలన్నారు. అదేవిధంగా సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన బోనస్ డబ్బులు కూడా వెంటనే చెల్లించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, వ్యవసాయ, పౌరసరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

మనుషుల్లో దిగజారిపోతున్న విలువలు

▸▸ వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

▸▸ కేయూ సోషియాలజీ విభాగంలో జాతీయ సదస్సు ప్రారంభం

కేయూ క్యాంపస్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రపంచీకరణతో సమాజంలో మనుషుల్లో విలువలు దిగజారి పోతున్నాయని, కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నం అవుతోందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. గురువారం కాకతీయ యూనివర్సిటీ సోషియాలజీ, సోషల్ వర్క్స్ విభాగం నేతృత్వంలో రెండు రోజుల జాతీయ సదస్సు జరిగింది. కేయూ సెనెట్ హాల్‌లో సోషియాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ తౌటం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన 'గ్లోబలైజేషన్ డెవలప్‌మెంట్ అండ్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ - మ్యాపింగ్ ది ట్రాజెక్టోరియస్ ఆఫ్ సోషల్ ఇన్స్టిట్యూషన్స్ అండ్ ప్రాసెస్ ఇన్ కాంటెంపరరీ ఇండియా' అనే సదస్సు ప్రారంభ సమావేశంలో కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఓయూ సోషల్ సైన్స్ విభాగాల రిటైర్డు డీన్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసులు, రిటైర్డు ప్రొఫెసర్లు ఎస్.రాములు, కె.వెంకట్‌నారాయణ, డీన్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సదస్సు సావనీర్‌ను అతిథులు ఆవిష్కరించారు.

అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. సమాజంపై ప్రపంచీకరణ అత్యంత దుష్ఫలితాలను చూపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచీకరణ నేపథ్యంలో మృగ్యమవుతున్న మానవ సంబంధాలపై సోషియాలజీ విభాగంలో విస్తృతమైన పరిశోధనలు రావాల్సిన ఆవశ్యకత ఉందని చెప్పారు. వర్సిటీ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తానని స్పష్టం చేశారు. కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచీకరణ నేపథ్యంలో దేశ జనాభా పెరుగుదల ప్రభావం చూపుతోందని అన్నారు. జనాభా వృద్ధిని తగ్గించాలని చెప్పారు. ప్రతీది భౌతికంగా చూడటం సరికాదన్నారు. వర్సిటీకి పూర్వ వైభవం తేవాలని అన్నారు. ఓయూ రిటైర్డు సోషల్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కె.శ్రీనివాసులు కీలక ప్రసంగం చేశారు. ఈ సమావేశం ప్రారంభంలో జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సదస్సులో కేయూ సోషియాలజీ రిటైర్డు ప్రొఫెసర్ ఎన్.రాములు, కె.వెంకట్‌నారాయణ, తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ ప్రొఫెసర్ డి.వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ హన్మంతరావు, ఓయూ రిటైర్డు ప్రొఫెసర్ సి.గణేశ్, అడపా సత్యనారాయణ, కేయూ సోషల్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, యూజీసీ కేయూ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, డాక్టర్ కె.అయిలయ్య, డాక్టర్ ఎం.స్వర్ణలత, సోషియాలజీ విభాగం అధ్యాపకులు, స్కాలర్లు పాల్గొన్నారు.



సదస్సు సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వీసీ ప్రతాప్‌రెడ్డి, తౌటం శ్రీనివాస్‌లు

చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

▸▸ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌గౌడ్

వడ్డెపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పులి శ్రీనివాస్‌గౌడ్, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు బుట్టి శ్యామ్ యాదవ్‌లు డిమాండ్ చేశారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత కల్పించాలని అన్నారు. బీసీలకు 50 శాతం నామినేటెడ్ పదవులు ఇవ్వకుంటే కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీలకు తమ ఓటు బ్యాంకు ద్వారా తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. అనంతరం జాతీయ బీసీ సంక్షేమ సంఘం హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శిగా హనుమకొండ పట్టణానికి చెందిన ఐదులాపురం సనత్‌కుమార్‌ను నియమించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు బగ్గి రాజు ముదిరాజ్, యూత్ అధ్యక్షుడు చిరంజీవి, స్పోక్స్ పర్సన్ రాకీ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న పులి శ్రీనివాస్‌గౌడ్, బుట్టి శ్యామ్‌యాదవ్

ఓపెన్ స్కూల్ ప్రవేశాల గడువు పొడిగింపు

మట్టెవాడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్ ఎస్ఎస్‌సీ విద్యార్థులకు ఈ విద్యాసంవత్సరం మరోసారి అడ్మిషన్ల స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నారు. డిసెంబరు 2 నుంచి 12వ తేదీ వరకు అడ్మిషన్ల స్వీకరణకు తెలంగాణ ప్రభుత్వం గడువు పొడిగించినట్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్టడీ సెంటర్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ వాడపల్లి అజయ్ బాబు తెలిపారు. ఓపెన్ స్కూల్‌లో ప్రవేశం, మరిన్ని వివరాల కోసం సెల్ నెంబర్లు 8919260509, 9951624126లలో సంప్రదించాలని సూచించారు.

చిప్ప వెంకటేశ్వర్లుకు అంబేద్కర్ నేషనల్ ఫెల్లోషిప్ అవార్డు



ఆటోనగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ 23వ డివిజన్ కొత్తవాడకు చెందిన సామాజికవేత్త, బీసీ ఉద్యమ నాయకుడు, టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లును 2024వ సంవత్సరానికి గాను బాబాసాహెబ్ డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ ఫెల్లోషిప్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు భారతీయ దళిత సాహిత్య అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ ఏస్.సుమనాక్షర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్.సుమనాక్షర్ మాట్లాడుతూ.. చిప్ప వెంకటేశ్వర్లు దళిత బహుజనుల పక్షాన ఉద్యమాలు చేస్తూ సమాజంలో అంతరాలను తొలగించేందుకు ఎంతో కృషి చేసినందుకు ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ అవార్డును డిసెంబరు 9న న్యూఢిల్లీలో జరిగే అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో అందజేస్తామన్నారు. అంతేకాకుండా 2017లో మహాత్మా జ్యోతిరావుపూలే జాతీయ అవార్డును కూడా చిప్ప వెంకటేశ్వర్లు పొందినట్లు ఆయన తెలిపారు. అవార్డు గ్రహీత చిప్ప వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఈ అవార్డుకు ఎంపిక కావడానికి సహకరించిన భారతీయ దళిత సాహిత్య అకాడమీ దక్షిణ రాష్ట్రాల ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ జితేందర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

కోచ్ ఫ్యాక్టరీకి గ్రీన్ సిగ్నల్!

(5వ పేజీ తరువాయి)

జూలై 5వ తేదీన రైల్వే బోర్డు దక్షిణ మధ్య రైల్వే జీఎంకు కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని లేఖ రాసింది. అదే ఏడాది జూలై 8వ తేదీన 160 ఎకరాల్లో రూ.521కోట్లతో రైల్వేవ్యాగన్ తయారీ పరిశ్రమ ఏర్పాటుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ కాజీపేటలో భూమి పూజ నిర్వహించారు. 2025లోగా పూర్తి చేయాలని లక్ష్యం నిర్దేశించారు. వ్యాగన్ పరిశ్రమపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది సెప్టెంబరు 9వ తేదీన రైల్వే బోర్డు వ్యాగన్ పరిశ్రమను కోచ్ ఫ్యాక్టరీగా అప్‌గ్రేడ్ చేస్తు ఆదేశాలు జారీ చేసింది. అప్‌గ్రేడ్ చేసిన కోచ్ ఫ్యాక్టరీలో ఎల్‌హెచ్‌బీ, ఈఎంయూ కోచ్‌లను తయారు చేసే విధంగా యూనిట్‌ను అభివృద్ధి చేయాలని రైల్వే బోర్డు ఆదేశాలు ఇచ్చింది. అయితే ఈ ఆదేశాలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. గురువారం కేంద్ర హోంశాఖ అధికారులు దేశంలోని సీఎస్‌లు, డీజీపీలతో సమీక్ష జరుపుతున్న క్రమంలో తెలంగాణ అధికారులతో విభజన హామీలపై జరిగిన సమీక్షలో కోచ్ ఫ్యాక్టరీ ప్రస్తావన వచ్చినట్టు సమాచారం. దీంతో సెప్టెంబరు 9వ తేదీనే కాజీపేటలో వ్యాగన్ తయారీ పరిశ్రమను కోచ్ ఫ్యాక్టరీగా అప్‌గ్రేడ్ చేసినట్టుగా కేంద్ర హోంశాఖ అధికారులు చెప్పటంతో పాటు అందుకు సంబంధించిన జీవో కాపీని కూడా అందించడంతో కోచ్ ఫ్యాక్టరీ విషయం అధికారికంగా వెలుగులోకి వచ్చింది. దీంతో కేంద్ర ప్రభుత్వం ఏపీ విభజన చట్టం హామీల్లో గిరిజన యూనివర్సిటీకి ఇప్పటికే నిధులు మంజూరు చేసింది. ఇక 13వ షెడ్యూల్, ఐటమ్ 10గా పేర్కొన్న కోచ్‌ఫ్యాక్టరీ హామీ కూడా అమలు కావటంతో ఓరుగల్లు ప్రజలు సంతోషం చేస్తున్నారు.

1969 నుంచి కోచ్ ఫ్యాక్టరీ కోసం పోరాటం..

తెలంగాణలోనే అతిపెద్ద రెండో రైల్వేజంక్షన్‌గా ఉన్న కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలనే డిమాండ్ 55ఏళ్లుగా ఉంది. కాశీ నుంచి కన్యా కుమారి, చెన్నై నుంచి కోల్‌కతా, హైదరాబాద్ నుంచి ఢిల్లీ వరకు.. ఎక్కడికి వెళ్లాలన్నా కాజీపేట రైల్వేస్టేషన్ మీదుగానే వెళ్లాలి. దక్షిణ మధ్య రైల్వేలో అత్యధిక ఆదాయం వచ్చే ప్రాంతం కావటంతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉపాధి అవకాశాలు తక్కువగా ఉండటంతో 1969లోనే కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు మొదలయ్యాయి. అప్పటి కమ్యూనిస్టు నేతలు బీఆర్ భగవాన్‌దాసు, కాళీదాసు నేతృత్వంలో మొదలైన కోచ్ ఫ్యాక్టరీ ఉద్యమం ఇప్పటికి కొనసాగుతూనే ఉంది. 1978-80లో అన్ని పార్టీలు తమ జెండాలను పక్కన పెట్టి అఖిల పక్షంగా ఏర్పడి కోచ్ ఫ్యాక్టరీ కోసం ఉద్యమాలకు శ్రీకారం చుట్టారు. నాడు హనుమకొండ ఎంపీగా ఉన్న పీవీ.నర్సింహరావు కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ కోసం చొరవ తీసుకుని అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ వద్దకు అఖిల పక్ష నేతలను తీసుకెళ్లారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీపై అఖిల పక్ష నేతల డిమాండ్‌ను పరిగణంలోకి తీసుకున్న ఇందిరాగాంధీ 1982లో పార్లమెంట్‌లో కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీని మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అయితే 1984లో ఇందిరాగాంధీ హత్యకు గురవడంతో.. ఖలిస్థాన్ ఉద్యమాన్ని చల్లార్చడానికి కాజీపేటకు మంజూరైన కోచ్ ఫ్యాక్టరీని పంజాబ్‌లోని కబుర్తాలకు తరలించారు. ఇక 2004లో యూపీఏ ప్రభుత్వంలో ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ మరోసారి కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. కానీ రాజకీయ కారణాలతో యూపీలోని రాయబరేలికి తరలిపోవటంతో రెండోసారి కూడా కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీ దక్కకుండా పోయింది. ఆ తరువాత 2010-11 బడ్జెట్‌లో అప్పటి రైల్వే మంత్రి మమతా బెనర్జీ ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో కాజీపేటలో వ్యాగన్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు రూ.15కోట్లు మంజూరు చేశారు. దీనికి అప్పటి రాష్ట్ర ప్రభుత్వం 54ఎకరాల భూమిని కూడా కేటాయించినా, ఆ భూమిపై వివాదాలు రావటంతో ఆ ప్రాజెక్టు వెనక్కి వెళ్లింది. అయితే తెలంగాణ ఏర్పడిన తరువాత విభజన చట్టంలో కాజీపేట కోచ్ ఫ్యాక్టరీపై కేంద్రం హామీ ఇచ్చిన అమలుకు నోచుకోలేదు. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తామని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇందు కోసం గత ప్రభుత్వం 150 ఎకరాల స్థలాన్ని కూడా కేటాయించింది. అయితే కేంద్ర ప్రభుత్వం 2017లో దేశంలో ఎక్కడ కూడా కోచ్ ఫ్యాక్టరీల అవసరం లేదని స్పష్టం చేసింది. దీంతో ఆశలు వదులుకున్న క్రమంలో కేంద్ర ప్రభుత్వం కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

ఇది సింగిల్ ఇంజన్ ప్రభుత్వ ఘనతే..

కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ సీఎం రేవంత్‌రెడ్డి వల్లే సాధ్యమైందని, సింగిల్ ఇంజన్ ప్రభుత్వ ఘనతేనని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఢిల్లీకి వెళ్లిన ప్రతిసారి సీఎం రేవంత్ కేంద్ర మంత్రులను కలిసి విభజన చట్టంలో పేర్కొన్న హామీలను నెరవేర్చాలని ఒత్తిడి తీసుకొచ్చారని ఎంపీ తెలిపారు. మామునూరు ఎయిర్‌పోర్టుతో పాటు కాజీపేట కోచ్ ఫ్యాక్టరీని తీసుకవచ్చిన ఘనత సీఎంకే దక్కుతుందన్నారు. డబుల్ ఇంజన్లుగా పని చేసిన బీఆర్ఎస్, బీజేపీలు చేయలేని పనులను సింగిల్ ఇంజన్‌తో రేవంత్‌రెడ్డి చేసి చూపుతున్నారని ఎమ్మెల్యే నాయిని పేర్కొన్నారు.

పార్టీ విస్తరణకు ప్రజా సంఘాలు కీలకం

▸▸ మాజీ ఎమ్మెల్యే సీహెచ్.రాజారెడ్డి

బాలసముద్రం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా సంఘాలు కీలకమని. ఆ దిశగా ఉద్యమించాలని జనగామ మాజీ ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సీహెచ్.రాజారెడ్డి అన్నారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి అధ్యక్షతన సీపీఐ అనుబంధ సంఘాల స్టడీ సర్కిల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ స్టడీ సర్కిల్ సీపీఐ పార్టీ, ప్రజా సంఘాలు అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమానికి రాజారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో సీపీఐ, ఏఐటీయూసీ, ఏఐఎస్ఎఫ్, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాలు కీలక పాత్ర పోషించాయన్నారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఇరవై వేల మంది కార్మికులు, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థిలోకం మొత్తం ఉద్యమించారని గుర్తుచేశారు. తెలంగాణ సాయుధ పోరాటం నడిపిన చరిత్ర సీపీఐ పార్టీదని, ఆ పోరాటంలో అనేక గ్రామాలు విముక్తిపొంది భూములు పంచపడ్డాయన్నారు. స్వాతంత్ర్యం అనంతరం దేశంలో ప్రజాసమస్యల పరిష్కారం కోసం పార్టీ, ప్రజా సంఘాలు పోరాటాలు చేస్తున్నాయన్నారు. పోరాటాల ద్వారానే ప్రజా సమస్యలు పరిష్కారం నోచుకుంటాయని, ఆ ప్రజా పోరాటాలను నిర్మించేందుకు ప్రజాసంఘాలు కీలకమని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా.. పేదలు పోరాడుతూనే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కమ్యూనిస్టు పార్టీ విస్తరణకు ప్రజా సంఘాలు కీలకమని, దానితో పాటు ప్రజా ఉద్యమాలు నిర్మించడంలో ప్రజా సంఘాలు కీలక పాత్ర పోషించాలని సూచించారు.

సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, రాష్ట్రసమితి సభ్యులు ఎన్‌ఏ స్టాలిన్, ప్రజా సంఘాల నాయకులు ఉట్కూర్ రాములు, మునిగాల భిక్షపతి, బాషబోయిన సంతోష్, మంచాల రమాదేవి, బత్తిని సదానందం, కొట్టెపాక రవి, జక్కు రాజుగౌడ్, శంకర్‌నాయక్, మంచాల తిరుపతి, రాజేందర్, కుమార్, భూక్య స్వరూపపాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సీహెచ్.రాజారెడ్డి

ఎఫ్ఎస్‌వో ఉద్యోగాన్ని సాధించిన రతన్ ప్రసాద్‌రెడ్డి



వడ్డెపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): టీజీపీఎస్‌సీ బుధవారం ప్రకటించిన ఫలితాల్లో హనుమకొండ కేయూ వంద పీట్ల రోడ్డులోని టీఎన్జీవోస్ కాలనీ ప్రాంతానికి చెందిన డాక్టర్ నల్లాల రతన్‌ప్రసాద్‌రెడ్డి ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ (ఎఫ్ఎస్‌వో) ఉద్యోగాన్ని సాధించారు. రతన్ ప్రసాద్‌రెడ్డి ఇప్పటికే ఖమ్మం జిల్లాలోని వైరా ఎక్సైజ్, ప్రొహిబిషన్ స్టేషన్‌లో ఎస్సైగా పనిచేస్తున్నారు. పదేళ్ల క్రితం వెటర్నరీ సైన్స్ కోర్సులో డిగ్రీ పూర్తి చేసిన ఆయన వెటర్నరీ డాక్టర్‌గా కూడా పనిచేశారు. తాజాగా వెలువడిన టీజీపీఎస్‌సీ ఫలితాల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించి ఫుడ్ సేఫ్టీ అధికారిగా ఎంపికైన రతన్‌ప్రసాద్‌రెడ్డి చార్మినార్ జోన్‌లో ఉద్యోగాన్ని సాధించారు.

దీక్షా దివస్‌తో.. ప్రజాక్షేత్రంలోకి..

(5వ పేజీ తరువాయి)

ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు దీక్షా దివస్‌ను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ఏర్పాట్లు చేస్తున్నారు.

స్థానిక సంస్థలపై గురి...

ఏడాది కాలంగా ఎన్నిక ఏదైనా గులాబీ పార్టీకి ఓటమే మిగులుతుంది. దీంతో క్యాడర్‌ను కాపాడుకునేందుకు ప్రతిపక్ష పార్టీగా పోరాటమే శరణ్యంగా దీక్షాదివస్‌తో ప్రజాక్షేత్రంలోకి వెళుతోంది. డిసెంబరు 9వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్న గులాబీ నేతలు.. వచ్చే గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మునిసిపల్ ఎన్నికల్లో సత్తా చాటుకోవాలని ఆరాట పడుతున్నారు. స్థానికంలో ఉనికి చాటుకోకుంటే.. భవిష్యత్తులో మరింత గడ్డు కాలం తప్పదన్న ఆందోళన వారిలో వ్యక్తమవు తోంది. దీంతో గ్రామాల్లో క్రియాశీలకంగా వ్యవహరించే నేతలకు స్థానిక సంస్థల్లో పోటికి మద్దతు ఇస్తామని హామీ ఇస్తున్నారు. గత పదేళ్లలో జడ్పీ చైర్మన్లతో పాటు మెజారిటీ సర్పంచులు, ఎంపీపీలు, జడ్పీటీసీలు బీఆర్ఎస్ వారే ఉన్నారు. ఈసారి కూడా ఉమ్మడి జిల్లాలో మెజార్టీ స్థానాల్లో గెలవటంతో పాటు కనీసం మూడు జడ్పీలను ఖాతాలో వేసుకోవాలని ఆ పార్టీ నేతలు కృషి చేస్తున్నారు.

కుట్రలను భగ్నం చేసిన కేసీఆర్ దీక్ష


పెద్ది సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నర్సంపేట



రాజకీయంగా తెలంగాణను సాధించాలని కేసీఆర్ చేసిన ప్రయత్నాలను కాంగ్రెస్, టీడీపీలు విఫలం చేశాయి. 2004లో కాంగ్రెస్‌తో, 2009లో టీడీపీతో టీఆర్ఎస్ పొత్తు పెట్టుకున్నా వారి అవసరాల కోసం ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేశారు. దీంతోనే వరంగల్ జిల్లా గురిజాల గ్రామానికి పల్లెనిద్రకు వచ్చిన కేసీఆర్ ఆమరణ నిరహర దీక్షకు ప్రణాళిక రూపొందించారు. 'కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో' అనే నినాదంతో ఆయన చేసిన ఆమరణ దీక్ష యావత్ తెలంగాణ లోకాన్ని ఉద్యమం వైపు నడిపించింది. నాటి కేసీఆర్ దీక్షతోనే స్వరాష్ట్ర కల సాకారమైంది.

కేసీఆర్ లేకుంటే రాష్ట్రం వచ్చేదే కాదు..

గండ్ర వెంకటరమణారెడ్డి, మాజీ ప్రభుత్వ చీఫ్ విప్



కేసీఆర్ ఉద్యమాన్ని ప్రారంభించకుంటే తెలంగాణ వచ్చేదే కాదు. 2009 నవంబరు 29న కేసీఆర్ చేసిన ఆమరణదీక్షతోనే కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమాన్ని గుర్తించింది. తన ప్రాణాలను సైతం లెక్క చేయకుండా కేసీఆర్ చేపట్టిన ఆమరణ దీక్షను ప్రజలు ఇంకా మరిచిపోలేదు. కేసీఆర్ ఉద్యమ స్ఫూర్తితోనే వరంగల్‌లో ఉద్యమం ఉప్పెనై లేచింది. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో చీఫ్‌విప్‌గా ఉండి తెలంగాణ కోసం అధిష్ఠానంపై ఒత్తిడి తెచ్చాం. అమరవీరుల ప్రాణత్యాగాలు, కేసీఆర్ ఉద్యమం ఫలితంగా తెలంగాణ ఏర్పడింది.

ఆనాటి దీక్షలో పోరెత్తిన ఓరుగల్లు

తెలంగాణ ఉద్యమంలో ఓరుగల్లు పోరెత్తింది. టీజేఏసీ, బీఆర్ఎస్ ఇచ్చిన ప్రతీ పోరాటంలో వరంగల్ ప్రజలు పాల్గొన్నారు. కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో అంటూ కేసీఆర్ చేసిన ఆమరణ నిరాహార దీక్ష వరంగల్‌లో ఉద్రిక్తతలకు దారితీసింది. 15ఏళ్ల క్రితం జరిగిన ఈ ఘటన ఇంకా ఉద్యమకారుల జ్ఞాపకాలను దాటిపోలేదు. 2009 నవంబరు 29వ తేదీన కేసీఆర్ కరీంనగర్ నుంచి సిద్ధిపేటకు బయలుదేరారు. ఆయన వెంట తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్, కన్నబోయిన రాజయ్యయాదవ్ ఉన్నారు. కరీంనగర్ జిల్లా అల్గనూరు వద్ద కేసీఆర్‌తో పాటు రాజయ్యయాదవ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. దీంతో వరంగల్ నగరం ఉద్రిక్తంగా మారింది. కాకతీయ యూనివర్సిటీ విద్యార్థులు, బీఆర్ఎస్ శ్రేణులు, టీజేఏసీ నేతలు నిరసనలు ఆందోళనకు దిగారు. కేయూ గేటు మూసి విద్యార్థులు బయటకు రాకుండా అప్పట్లో పోలీసులు అడ్డుకున్నారు. నిరసన తెలియజేసేందుకు వచ్చిన అప్పటి ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కరీంనగర్ నుంచి వచ్చిన ప్రొఫెసర్ జయశంకర్‌తో పాటు అప్పటి సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ కేయూ సమీపంలో ధర్నాకు దిగారు. వీరిని పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేయటంతో కేయూ విద్యార్థులు భగ్గుమన్నారు. వరంగల్‌లో ఉద్రిక్తతగా మారటంతో పోలీసులు కేసీఆర్‌ను వరంగల్ సెంట్రల్ జైలుకు కాకుండా వ్యూహాత్మకంగా ఖమ్మం జైలుకు తరలించారు. నాటి నుంచే ఓరుగల్లులో తెలంగాణ ఉద్యమం పతాక స్థాయికి చేరింది.

జ్యోతిరావు పూలే సేవలు చిరస్మరణీయం



జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న బీసీ ఇంటెలెక్చువల్ ఫోరం నాయకులు

హనుమకొండ సిటీ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిరావు పూలే సేవలు చిరస్మరణీయమని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కొనియాడారు. గురువారం హనుమకొండలోని ప్రజాభవన్ కార్యాలయంలో పూలే 134వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను స్మరించారు. ఈ కార్యక్రమంలో కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, టీపీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్, జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న, కమలాపూర్ ఏఎంసీ చైర్మన్ తౌటం ఝాన్సీరాణి రవీందర్, కార్పొరేటర్ మావి ండ్ల రాజు, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు పల్లకొండ సతీశ్, కాంగ్రెస్ జిల్లా ఓబీసీ సెల్ చైర్మన్ బొమ్మత విక్రమ్, వైస్ చైర్మన్ సాగర్ పాల్గొన్నారు.

● హనుమకొండ కలెక్టరేట్: అంటరానితనం నిర్మూలనకు, మహిళాభివృద్ధికి కృషి చేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిబాపూలే అని బీసీ ఇంటలెక్చువల్ ఫోరం జిల్లా కన్వీనర్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్ అన్నారు జ్యోతిబాపూలే 134వ వర్ధంతి సందర్భంగా హనుమకొండలోని బీసీ ఇంటలెక్చువల్ ఫోరం కార్యాలయంలో గురువారం ఘనంగా జ్యోతిబా పూలే వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతిబాపూలే చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ గడ్డం భాస్కర్, బండా వివేకానంద, డాక్టర్ కూరపాటి రమేష్, వైద్యం రాజగోపాల్, బుట్టి శ్యాంయాదవ్, డాక్టర్ కొణతం కృష్ణ పాల్గొన్నారు.

● వరంగల్ ఎడ్యుకేషన్: మహాత్మ జ్యోతిరావు పూలే లాంటి మహానుభావుల ఆశయాలను నేటి యువత మరువద్దని జానపద గిరిజన విజ్ఞాన పీఠం పీఠాధిపతి ప్రొఫెసర్ భూక్య బాబురావు అన్నారు. పూలే జయంతిని పురస్కరించుకొని గురువారం హంటర్‌రోడ్‌లోని విజ్ఞానపీఠంలో పూలే చిత్రపటానికి పూలమాలవేసి సిబ్బందితో కలిసి బాబురావు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు దామోదర్, రవికుమార్, సురేష్, గోపాల్‌రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ సతీష్ పాల్గొన్నారు.

● కేయూ క్యాంపస్: మహాత్మాజ్యోతి పూలే 134వ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం కేయూ దూరవిద్య కేంద్రంలోని పూలే దంపతుల విగ్రహాలకు కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, కేయూ బీసీ సెల్ డైరెక్టర్ డాక్టర్ ఆకుతోట శ్రీనివాస్‌లు, కేయూ ఎస్డీఎల్‌సీఈ ఎస్సీఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొట్టే భాస్కర్, రాష్ట్ర వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్ తదితరులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అరెగంటి నాగరాజు నేతృత్వంలో ఇంజనీరింగ్ విద్యార్థులతో పూలే వర్ధంతిని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కాలర్లు విష్ణు, సోమరాజు, శ్రీకాంత్, ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్, బీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొట్ల మనోహర్, ఎన్ఎస్‌యూఐ అధికార ప్రతినిధి రాకేశ్ బండిగ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్, బీఎస్ఎఫ్ కేయూ అధ్యక్షుడు శివ, బీసీ సంఘం కేయూ అధ్యక్షుడు సుదగాని మధుగౌడ్, ప్రశాంత్, రాజ్‌కుమార్ యాదవ్ తదితరులుపాల్గొన్నారు.

● వడ్డెపల్లి: మహాత్మా జ్యోతిరావుపూలే వర్ధంతిని వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్, విముక్త చిరుతల కక్షి పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. మహాత్మా జ్యోతిరావు వర్ధంతిని పురస్కరించుకొని కేయూ ఎస్డీఎల్‌సీఈ ప్రాంతంలోని పూలే విగ్రహానికి బీసీ కుల సంఘాల ఐక్య వేదిక ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు బింగి శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వలబోజు శ్రీనివాస్, ఐక్య వేదిక నాయకులు పాశికంటి రాజేంద్రప్రసాద్, పెరుగు సురేష్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

● న్యూశాయంపేట: హనుమకొండ హంటర్‌రోడ్‌ని న్యూశాయంపేటలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో గురువారం మహాత్మా జ్యోతిబాపూలే వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.చుక్కయ్య, నాయకులు జంపాల రమేష్, ఉపేందర్ ఉన్నారు.

● కాజీపేట: కాజీపేటలో తెలంగాణ రైల్వే ఎంప్లాయీస్ జేఏసీ ఆధ్వర్యంలో గురువారం మహాత్మాజ్యోతిరావు పూలే వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రైల్వే జేఏసీ వైస్ చైర్మన్ మూర్తి, జేఏసీ చైర్మన్ కోండ్ర నర్సింగరావు, కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్, వైస్ చైర్మన్ గుర్రపు సుధాకర్‌రావు పాల్గొన్నారు. మడికొండలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో కుల వివక్ష పోరాట సంఘం(కెవిపీఎస్) జిల్లా సహాయ కార్యదర్శి గడ్డం అశోక్ ఆధ్వర్యంలో గురువారం మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కెవిపీఎస్ జిల్లా అధ్యక్షులు ఓరుగంటి సాంబయ్య వస్కుల సంజీవ పాల్గొన్నారు.

● శంభునిపేట: మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతిని గురువారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శంభునిపేట జంక్షన్‌లో నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మహాత్మా జ్యోతిరావు పూలే సామాజిక న్యాయవేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేడల ప్రసాద్, ట్రేడ్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్డీ సలీం తెలంగాణ అంబేద్కర్ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గద్దల కుమారస్వామి, లింగాల ఇమ్మానియల్, సీపీయూఎస్ఐ కార్యదర్శి గడ్డం. శరత్, దామెర. మొగిళి, పిట్టల. రాజమౌళి, ధర్మ సమాజ్ పార్టీ నాయకులు మేకల సుమన్, మంద రమేష్, కలకోట్ల కుమారస్వామి, వల్లందాసు ఏలియా, గద్దల దయాకర్, కంజర్ల ఏసోబు, బాస నరహరి, తదితరులు పాల్గొన్నారు. తిమ్మాపూర్‌లో ఏకశిలా యూత్, లైబ్రరీ కమిటీ సలహాదారు మేకల సూరయ్య ఆధ్వర్యంలో జ్యోతిబా పూలే వర్ధంతి నిర్వహించారు. చంద్రం, చెక్క యాదగిరి, మందల. జీవన్‌రెడ్డి, రాయల. ఉమ, డాక్టర్ రమేష్, ఇల్లందుల శ్రీకాంత్ పాల్గొన్నారు.

● వరంగల్ కార్పొరేషన్: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో మహాత్మాజోతిరావు పూలే 134వ వర్ధంతి గురువారం బల్దియా జాక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జాక్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజారపు భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జాక్ అధ్యక్షుడు బొట్ల రమేష్, కోశాధికారి సర్వన్‌రాజు, డీఎస్‌వో ఇనోక్, సూపరింటెండెంట్లు రావుల ఆనంద్, రామకృష్ణ, నాయకులు మోరె రమేష్, శ్యాం, ఎలుకపెల్లి సందీప్, క్రాంతి, నవనీత్, బొక్క ఏలియా,నాయకులు పాల్గొన్నారు.



పూలే దంపతుల విగ్రహాలకు నివాళులర్పిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ మల్లారెడ్డి తదితరులు

బాల్య వివాహ నిర్మూలనపై అవగాహన కల్పించాలి : కలెక్టర్

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు28(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతీ ఒక్కరికి అవగాహన కల్పించాలని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. 'బాల్ వివాహ్ ముక్త్ భారత్' పోస్టర్స్‌ను కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్‌లో గురువారం కలెక్టర్, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, షేర్ ఎన్జీవో నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ చిన్న వయసులోనే బాల బాలికలకు వివాహం చేయడం వల్ల వారి భవిష్యత్‌కు ఆటంకం ఏర్పడుతుందని, బాల్య వివాహాలపై ఫిర్యాదు చేయడానికి చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098 లేదా 100కి కాల్ చేయాలన్నారు.

● వడ్డెపల్లి : (ఆంధ్రజ్యోతి): సమాజానికి గుది బండగా మారిన బాల్య వివాహాలను సమూలంగా నిర్మూలించాలని సొసైటీ ఫర్ హెల్త్ అవేర్‌నెస్ అండ్ రూరల్ ఎన్‌లైట్‌మెంట్ (షేర్) ఎన్జీవో సంస్థ కోఆర్డినేటర్ తోట శిరీష అన్నారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమెతో పాటు కన్స్యూమర్ జి.రాజేష్ మాట్లాడారు. బాలికల అక్రమ రవాణాను అరికట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో షేర్ ఎన్జీవో సంస్థ ప్రతినిధులు బి.జ్ఞానేశ్వరి, బి. ప్రశాంతి పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 12 మందికి జరిమానా

మట్టెవాడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపిన కేసులో 12 మంది వాహనదారులకు జరిమానా, ఒకరికి సామాజిక సేవా శిక్షను గురువారం వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ అబ్బోజు వెంకటేష్ విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపి ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడ్డ 12 మంది వాహనదారులకు రూ.13,700 జరిమానా విధిం చారు. మద్యం తాగి వాహనం నడిపిన కేసులో నాందేడ్, మహారాష్ట్ర ప్రాంతానికి చెందిన లారీడ్రైవర్ రాహుల్‌కు రెండురోజుల సామాజిక సేవా శిక్షను విధించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపి న ఇద్దరు వాహనదారులకు రూ. 1500 జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ తెలిపారు.

నూతన విద్యుత్ స్తంభం ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హసన్‌పర్తి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): హసన్‌పర్తి - జయగిరి రైల్వే గేటు మూలమలుపు వద్ద రెండు రోజుల కిందట జరిగిన రోడ్డు ప్రమాదంలో విద్యుత్ స్తంభం విరిగి పోయింది. దీంతో గురువారం 'ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం' అనే శీర్షికన వార్త ప్రచురితమైంది. దీంతో విద్యుత్ ఏడీ అశోక్, మండల విద్యుత్ అధికారి రాంశెట్టి మౌనిక స్పందించారు. ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాన్ని తొలగించి దాని స్థానంలో కొత్త సిమెంట్ విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేశారు. దీంతో స్థానిక రైతులు హర్షం వ్యక్తం చేశారు.

సీపీఎం పార్టీకి ఎలాంటి సంబంధం లేదు

ఖిలావరంగల్, నవంబర్ 28.(ఆంధ్రజ్యోతి)వరంగల్ నగరంలో సీపీఎం పార్టీ నిర్ణయాలకు వ్యతిరేకంగా కొనసాగుతున్న 15 మందితో తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని సీపీఎం వరంగల్ జిల్లా కార్యదర్శి సీహెచ్.రంగయ్య ఒక ప్రకనటలో తెలిపారు. లెనిన్‌నగర్‌లో 41, 42, 43, 44 డివిజన్లకు చెందిన కొంతమంది సీపీఎం పార్టీ సిద్ధాంతాలను వ్యతిరేకిస్తూ ఖిలావరంగల్, రంగశాయిపేట, శివనగర్ తదితర ఏరియాలలో వారికి వారే మహాసభలను నిర్వహిస్తున్నారన్నారు. ఈనెల 29, 30 తేదీలలో నర్సంపేటలో జరుగు మహాసభకు 15 మందిని డెలిగేట్స్‌గా వారికి వారే ఎంపిక చేసుకున్నామని ప్రకటించుకున్నారన్నారు. వీరు కొన్నిరోజులుగా సీపీఎం పార్టీకి వ్యతిరేకంగా మహాసభ విచ్ఛిన్నానికి పాల్పడుతున్నారన్నారు. వీరితో సీపీఎంకు ఎలాంటి సంబంధం లేదని జిల్లా కార్యదర్శి రంగయ్య తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ టౌన్, నవంబర్ 28 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం న్యూశాయంపేట సబ్‌స్టేషన్ పరిధిలోని మోక్ష విల్లాస్, విశాల్ మార్ట్, త్రివీ స్కూల్, శ్రీ చైతన్య స్కూల్, శ్రీనగర్ కాలనీ ఏరియాలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

మడికొండ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి) : మహిళలు చట్టాలపై అవగాహన ఏర్పరచుకోవాలని సఖీ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.హైమావతి అన్నారు. ప్రపంచ మహిళలపై హింస వ్యతిరేక దినం సందర్భంగా గ్రేటర్ వరంగల్ 46వ డివిజన్ కుమ్మరిగూడెంలో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళా శిశు దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో గురువారం సఖీ వన్‌స్టాప్ సెంటర్, మహిళలకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళలు తక్షణ సహాయం కోసం 181 టోల్‌ఫ్రీ నెంబర్‌కు లేదా 0872452112, 7382983088 నెంబర్లకు కాల్ చేయాలని సూచించారు. సదస్సులో కేస్ వర్కర్ వినీల, టైలరింగ్ టీచర్ రేఖ, మహిళలు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన పెంపొందించాలి

పోచమ్మమైదాన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కుష్ఠువ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని, కేసులు నిర్ధారణ చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సాంబశివరావు అన్నారు. వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం లెప్రసీ అవగాహన, కేసుల నిర్ధారణపై జిల్లాలోని నోడల్ సూపర్‌వైజర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ మోహన్‌సింగ్, ఫిజియో థెరపిస్టు డాక్టర్ నర్సింహరెడ్డి, డీపీఎంవోలు వెంకన్న, అనుపమారెడ్డి, డిప్యూటీ డెమో అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ను కలిసిన టీఎన్‌జీఓలు

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్‌ను హనుమకొండలోని జిల్లా గ్రంథాలయంలో గురువారం జిల్లా టీఎన్‌జీఓస్ యూనియన్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రియాజ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. రియాజ్‌ను కలిసిన వారిలో టీఎన్‌జీఓస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్, జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షులు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి పనికెల రాజేష్, నాయకులు శ్యాంసుందర్, కత్తి రమేష్, ప్రణయ్, పృధ్వీ, పురుషోత్తం తదితరులు ఉన్నారు.

ఘనంగా ఆచార్య చందా కాంతయ్య జయంతి

పోచమ్మమైదాన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వరంగల్ దేశాయిపేటలోని సీకేఎం కళాశాలలో దివంగత ఆచార్య చందాకాంతయ్య 120వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీకేఎం కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో చందా కాంతయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పండ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ జి. శ్రీనివాస్, చందా శ్రీకాంత్, చందా శ్రీధర్, అధ్యాపకులు డాక్టర్ ధర్మారెడ్డి, అనిల్, కెప్టెన్ డాక్టర్ పి. సతీష్‌కుమార్, గంగుల మోహన్, రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● మట్టెవాడ: ఏవీవీ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు ఆచార్య చందా కాంతయ్య గొప్ప మహనీయుడని రిటైర్డ్ ఐఏఎస్ చక్రపాణి అన్నారు. గురువారం వరంగల్‌లోని ఏవీవీ విద్యాసంస్థల వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ఏవీవీ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా చందా కాంతయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పూర్వ విద్యార్థి, రిటైర్డ్ ఐఏఎస్ చక్రపాణి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఏవీవీ సంఘ అధ్యక్షుడు డాక్టర్ నరసింహారావు, విద్యాసంస్థల కార్యదర్శి, కరస్పాండెంట్ డాక్టర్ చందా విజయ్ కుమార్, డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ వి.వెంకటేశ్వర్‌రావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భుజేందర్‌రెడ్డి, ఎస్.సంజీవ, ఎస్ఎస్‌వీఎస్.శర్మ, ఏవీ సంఘం శాశ్వత సభ్యులు చందా శ్రీకాంత్, చకిలం మదన్‌మోహన్‌రావు, డాక్టర్ ఎస్.అనిత, మురళీమోహన్, గోపి తదితరులు పాల్గొన్నారు. అనంతరం జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాలలో గత సంవత్సరం పరీక్షలలో గ్రూపుల వారిగా ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు అతిథులతో గోల్డ్ మెడల్స్ ప్రదానం చేశారు.

పోలీసు కిష్టయ్య వర్ధంతిని నిర్వహించాలి

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మలిదశ ఉద్యమ తొలి అమరుడు పోలీసు కిష్టయ్య ముదిరాజ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించాలని శాసన మండలి డిప్యూటీ చైర్మన్, తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బండా ప్రకాశ్ అన్నారు. ముదిరాజ్ మహాసభ గ్రేటర్ వరంగల్ నగర అధ్యక్షుడు బయ్య స్వామి ఆధ్వర్యంలో హంటర్ రోడ్‌లోని బండా ప్రకాశ్ నివాసంలో గురువారం వర్ధంతికి సంబంధించిన వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరించారు. ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్ ముదిరాజ్, మత్స్యపారిశ్రామిక సహకార సంఘం వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ చొప్పరి సోమయ్య, తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఎన్ఆర్ఐ విభా గం రాష్ట్ర కోఆర్డినేటర్ శానబోయిన రాజ్‌కు మా ర్, భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు జోరుకు సద య్య, నగర యువత అధ్యక్షులు సంగరబో యిన ఉమేష్, తదితర ముదిరాజ్ నాయకులు ఉన్నారు.



వాల్ పోస్టరు ఆవిష్కరిస్తున్న బండా ప్రకాష్

గోపాల్‌పూర్‌లో అర్బన్ కో - ఆపరేటీవ్ బ్యాంకు శాఖ ప్రారంభం

వడ్డెపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్ జంక్షన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన వరంగల్ అర్బన్ కో- ఆపరేటీవ్ 7వ శాఖను గురువారం మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతారావు, జిల్లా సహకార అధికారి (డీసీవో) ఎం.నీరజ, వరంగల్ అర్బన్ కో ఆపరేటీవ్ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌కుమార్‌రావు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాంకు చైర్మన్ ప్రదీప్‌కుమార్‌రావు మాట్లాడుతూ.. వరంగల్ అర్బన్ కో- ఆపరేటీవ్ బ్యాంకు ప్రజల భాగస్వామ్యంతో బ్యాంకింగ్ రంగంలో అగ్రగామిగా నిలుస్తుందని అన్నారు. 1994లో ఆవిర్భవించిన బ్యాంకు ఇప్పటి వరకు రూ.4కోట్ల టర్నోవర్ పూర్తి చేసుకొని త్వరలో మహబూబాబాద్, జనగామ, వడ్డెపల్లి నూతన శాఖలను ప్రారంభించనున్నామని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్ కుమార్, కో-ఆపరేటీవ్ అధికారి జగన్మోహన్‌రావు, బ్యాంకు వైస్ చైర్మన్ తోట జగన్నాథం, బ్యాంకు ఫౌండర్ అండ్ డైరెక్టర్ బూర ముత్తిలింగం, బ్యాంకు డైరెక్టర్లు డాక్టర్ వి. పవన్‌కుమార్, పొన్న హరినాథ్, ఎం.డి. గౌసొద్దీన్, మంద స్వప్న శ్రీనివాస్, కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి, సత్యనారాయణరావు పాల్గొన్నారు.



గోపాల్‌పూర్‌లో బ్యాంకు శాఖను ప్రారంభిస్తున్న మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతారావు, డీసీవో నీరజ

రంగనాయక దేవాలయంలో అభివృద్ధి పనులు ప్రారంభం

కాశిబుగ్గ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాశి బుగ్గలో ని ప్రసిద్ధిగాంచిన రంగ నాయక స్వామి దేవాలయంలో అభివృద్ధి పనులు గురువారం ప్రారంభించా రు. గుడి చుట్టూ గ్రానైట్ నిర్మాణం కోసం పూజ చేశా రు. కార్యక్రమంలో గ్రానైట్ దాత గోషికొండ సుధాకర్, ఈవో వెంకట్రావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అంబి సాంబరాజు, ఆలయ కమిటీ మాజీ అధ్యక్షుడు వంగరి రవి, కమిటీ మాజీ సభ్యులు సురేష్, ప్రకాష్ రెడ్డి, శ్రీనివాస్, సమ్మయ్య, ప్రసాద్, ఆలయ అర్చకుడు ఆరట్ల కృష్ణమాచార్యులు, సమ్మక్క, కవిత, సృజన, రోజా, భాస్కర్ పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న ఆలయ కమిటీ మాజీ సభ్యులు

మహాసమ్మేళనానికి గవర్నర్‌కు ఆహ్వానం

హనుమకొండ టౌన్, నవంబర్ 28 (ఆంధ్రజ్యోతి): బంజారాల ధార్మిక వ్యాప్తి మహా సమ్మేళనానికి హాజరుకావాలంటూ మాజీ ఎంపీ సీతారాం నాయక్ ఆధ్వర్యంలో బంజారా నాయకులు గురువారం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిసి ఆహ్వానించారు. బంజారాల అధ్యాత్మిక గురువులైన హతిరామ్ బావాజీ, సంతు సేవాలాల్ వంటి మహనీయుల అధ్యాత్మికతను సమాజంలో పూర్తి స్థాయిలో వ్యాపింపచేయడమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని గవర్నర్‌కు వివరించినట్లు సీతారాంనాయక్ తెలిపారు. గవర్నర్‌ను ఆహ్వానించిన వారిలో బంజారా నాయకులు డీటీ నాయక్, అమర్‌సింగ్, ఉద్యోగ సంఘాల నాయకులు రామ్ చందర్‌నాయక్ ఉన్నారు.

వెలమ కార్తీక వనభోజనం

హనుమకొండ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వెలమ సంక్షేమ సంఘం ఉమ్మ డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో డిసెంబరు 1వ తేదీన ఉదయం 10 గంటలకు హను మకొండ హంటర్ రోడ్డులోని వెలమ సంక్షేమ సంఘ ప్రాంగణంలో కార్తీక వన భోజన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు సంఘం అధ్యక్షుడు పేరాల మధుసూదన్ రావు, ప్రధాన కార్యదర్శి కాకులమర్రి ప్రవీణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉసిరిచెట్టు పూజ, లక్ష్మీపూజ, గోపూజ, సాంస్కృతిక, వినోద కార్య క్రమాలను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. కార్తీ వనభోజనానికి వెలమ బంధువులందరూ కుటుంబ సమేతంగా హాజరుకావలసిందిగా వారు కోరారు.

గంథ్రాలయాలు మేధావులకు కేంద్ర బిందువులు

● వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి




అజీజ్‌ఖాన్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే, కుడా చైర్మన్

బాలసముద్రం, నవంబరు 28.(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో మేధోశక్తిని పెంపొందించాలన్నా.. మేధావులను తయారు చేయాలన్నా.. గ్రంథాలయాలు కేంద్ర బిందువులుగా దోహదపడతాయని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. గురువారం బాలసముద్రంలోని జిల్లా గ్రంథాలయం సమీపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హనుమకొండ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా మహ్మద్ అజీజ్‌ఖాన్ ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హాజరై ముందుగా జిల్లా గ్రంథాలయంలోని సరస్వతి చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్‌తో కలిసి అజీజ్‌ఖాన్‌తో ప్రమాణ స్వీకారం చేయించి శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు దొమ్మటి సాంబయ్య పాల్గొన్నారు.

పట్టణ ఆరోగ్య కేంద్రం తనిఖీ

వరంగల్ మెడికల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వడ్డెపల్లిలోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని గురువారం హనుమకొండ డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. యూపీహెచ్‌సీ ఓపీ, ఫార్మసీ, ల్యాబ్‌లను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఇఫ్తాకర్ అహ్మద్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మాలిక, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య

ఎన్నికల హామీలు అమలు చేయాలి

వరంగల్ సిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు నైనాల శెట్టిమూర్తి డిమాండ్ చేశారు. గురువారం అక్కనపెల్లి యాదగిరి ఆధ్వర్యంలో డిసెంబరు 6న నగరంలోని ఆజాంజాహి మిల్లు ఆవరణలో జరిగే సభను విజయవంతం చేయాలని కోరుతూ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు నైనాల శెట్టి మూర్తి ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం శెట్టిమూర్తి మాట్లాడుతూ.. దేశంలో రోజు రోజుకూ పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. దేశంలో నిరుద్యోగులు, పేదరికం పెరిగిపోతుందని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. డిసెంబరు 6న తలపెట్టిన మహాసభకు సీపీఐఎంఎల్ లిబరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య పాల్గొంటారని, ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రావిరాకుల ప్రసంగి, జన్ను ప్రవీణ్, ఎస్‌కె.పాషా, కంది రవి, శ్రీనివాస్, రాజలింగం, మొగిలి, సదయ్య, ఇస్తారి తదితరులు పాల్గొన్నారు.

కందుల బండ భూ సమస్యను పరిష్కరిస్తా..

- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

న్యూశాయంపేట, నవంబరు28(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ మహానగరపాలక సంస్థ పరిధిలోని 31వ డివిజన్ న్యూశాయంపేటలో ఉన్న కందుల బండకు సంబంధించిన భూ సమస్యను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హామీ ఇచ్చారు. గురువారం సాయంత్రం ఎమ్మెల్యే కందుల బండ పరిసర ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం కందుల బండలో బండ కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తాతల, తండ్రుల నుంచి బండ కొట్టి జీవనోపాధి పొందుతూ గృహాల కోసం చేస్తున్న పోరాటంలో ప్రభుత్వ పరమైన అన్ని సహాయ సహకారాలను అందిస్తానన్నారు. నిజమైన అర్హులకు ప్రభుత్వ నియమాలకు లోబడి పట్టాలను అందిస్తామని, అందు కోసం స్థానికులు సహకరించాలన్నారు. త్వరలో పంపిణీ చేసే రెండు పడకల ఇళ్లలో ఇల్లులేని అర్హులకు తప్పకుండా ఇళ్లు ఇస్తానన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మామిండ్ల రాజు, మాజీ కార్పొరేటర్ వేల్పుల మోహన్‌రావు, ఎమ్మెస్పీ నాయకుడు మంద కుమార్ మాదిగ, స్థానిక కాంగ్రెస్ నాయకులు, ఎంఆర్‌పీఎస్ నాయకులు, బండ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యంపై సమగ్రంగా అధ్యయనం చేయాలి

గిర్మాజీపేట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): భారత సనాతన వైద్యమైన ఆయుర్వేదానికి ప్రపంచంలో రోజురోజుకూ ప్రాముఖ్యత పెరుగు తున్నదన్న విషయాన్ని విద్యార్థులు గుర్తించి ఆయుర్వేద వైద్యంపై సమగ్ర అధ్యయనం చేయాలని ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి, ఆయుర్వేద వైద్య కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ బి.సాంబమూర్తి విద్యార్థులకు ఉద్బోధించారు. వరంగల్ నగరంలోని అనంత లక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలో బీఏఎంఎస్ మొదటి సంవత్సరం (2024-25) విద్యార్థులకు ఆయుర్వేద పాఠ్య ప్రణాళిక పరివర్తన కార్యక్రమం గురువారం ముగిసింది. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అనసూయ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ సాంబమూర్తి మా ట్లాడుతూ.. ఒకపుడు భారత్‌కే పరిమితమైన ఆయుర్వేద వైద్యం ఇపుడు పలు దేశాల్లో రోగులకు వైద్య సేవలు అందిస్తున్నదని అన్నారు. అలాగే ఆయుర్వేదంలో విస్తృతమైన పరిశోధనలు జరుగుతున్నాయని తెలిపారు. వీటిని విద్యార్థులు తెలుసుకుంటూ ఆయుర్వేద పితామహుడు ధన్వంతరి స్ఫూర్తిగా సేవలు అందించాలని ఈ సందర్భంగా తెలిపారు. ఆయుర్వేద వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనసూయ విద్యార్థుల కు బోధన, క్యాంపస్ వాతా వరణంపై సవివరంగా వివరించారు. 15 రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యం 5 ఏళ్ల పాఠ్య ప్రణాళికపై అధ్యాపకులు వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అశోక్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బీఏఎంఎస్ నూతన విద్యార్థులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

జర్నలిస్టు సాగర్‌కు ఘన నివాళులు

వరంగల్‌సిటీ/కాశిబుగ్గ, నవంబరు 28.(ఆంధ్రజ్యోతి): వరంగల్ తూర్పు నియోజకవర్గానికి చెందిన ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు ఆడెపు సాగర్ (36) అనారోగ్యంతో ఎంజీఎంలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందారు. విషయం తెలుసుకున్న జర్నలిస్టు యూనియన్ నాయకులు ఎస్ఆర్‌నగర్‌లోని సాగర్ నివాసానికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్.లెనిన్, గాడిపెల్లి మధు, దయాసాగర్, తుమ్మ శ్రీధర్‌రెడ్డి, కోరుకొప్పుల నరేందర్, జక్కు విజయ్, పెరుమాండ్ల మధు, బండి రవి, మట్ట దుర్గాప్రసాద్, వేణుగోపాల్, రాజేష్ వర్మ తదితరులు పాల్గొన్నారు. అలాగే జర్నలిస్టు ఆడెపు సాగర్ మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ సాగర్ సందర్శించారు. పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యుల ను ఓదార్చి అన్ని విధాలుగా ఆదుకుంటామని మనోధైర్యం కల్పించారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేశారు. ఆయనతో పాటు వేముల నాగరాజు, చిలువేరు పవన్, ముడుసు నర్సింహ తదితరులు పాల్గొన్నారు.





అడెపు సాగర్ మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న జర్నలిస్టులు
నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే నరేందర్

నివాళులు

వరంగల్ కార్పొరేషన్: వరంగల్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ ఆడెపు సాగర్‌కు బల్దియా జాక్ నాయకులు నివాళులర్పించారు. గురువారం బల్దియా కార్యాలయంలో సాగర్ చిత్రపటానికి నివాళులు అర్పించి సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బల్దియా జాక్ అధ్యక్షుడు బొట్ల రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజారపు భాస్కర్, నాయకులు బొక్కల ఏలియా, సీపీఎం నాయకుడు సింగారంపు బాబురావుతో పాటు నాయకులు పాల్గొన్నారు.


నర్సంపేటలోని బాలుర హైస్కూల్‌లో అసంపూర్తిగా ఉన్న వంట షెడ్డు

అమలు సరే.. నాణ్యతేదీ ?

- ప్రమాణాలకు అనుగుణం లేని మధ్యాహ్న భోజనం
- దొడ్డు అన్నం తినేందుకు ఆసక్తి చూపని విద్యార్థులు

వరంగల్ సిటీ, నవంబరు 28 : (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నా.. నాణ్యత విషయంలో మాత్రం పట్టింపులేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వంట ఏజెన్సీలకు మూడు నెలలుగా బిల్లులు రాకపోవడంతో వారు తక్కువ ధరలకు వచ్చే కూరగాయలు, సరుకులతో వంట వండుతున్నారనన్న విమర్శలున్నాయి. వారి సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వరంగల్ జిల్లాలో 540 ప్రభుత్వ పాఠశాలలుండగా 32, 843 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజన సదుపాయాన్ని పొందుతున్నారు. వారికి మెనూ ప్రకారం భోజనం అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సన్న బియ్యం పంపిణీ చేస్తున్నప్పటికీ వండిన తర్వాత దొడ్డు అన్నంగా అవుతుండటం, మెత్తగా, ముద్దలుగా అవుతుండటం, కూరలు చారులా పలుచగా తయారు చేయడంతో విద్యార్థులు తినేందుకు ఆసక్తి చూపించడం లేదు. కొన్ని పాఠశాలలో తాగు నీటి సౌకర్యం సరిగ్గా లేక విద్యార్థులు ఇంటి నుంచే నీళ్లు తెచ్చుకుంటున్నారు. పప్పులు, ఉప్పులు, నూనెల పంపిణీలో నాణ్యాతా ప్రమాణాలు పాటించడం లేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. కూరగాయల ధరలు పెరిగి పోవడంతో తమకు గిట్టుబాటు కావడం లేదని, మూడు నెలల నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని వంట ఏజెన్సీ నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంట చేసే వాళ్లు నెలా నెలా మారుతుండడంతో రుచి, శుచి, నాణ్యాతా ప్రమాణాలు పడిపోతున్నాయి. కొన్ని పాఠశాలల్లో వంటశాలలు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా కలెక్టర్, డీఈవో, ప్రజా ప్రతినిధులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి నాణ్యాతా ప్రమాణాలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే ఏజెన్సీలకు వెంటనే పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నర్సంపేట మండలంలో 57 ప్రభుత్వ పాఠశాలల్లో 1378 మంది విద్యార్థులు చదువుతుండగా.. 50వంట ఏజెన్సీలు వారికి వండిపెడుతున్నాయి. వీరికి చెల్లించే బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. కొన్ని చోట్ల మెనూకు విరుద్ధంగా విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్నారు. అదే విధంగా పట్టణంలోని బాలుర హైస్కూల్‌లో కిచెన్ షెడ్డు లేకపోవడంతో వాటర్ ట్యాంక్ కిందనే వంటలు చేస్తున్నారు. కెచెన్ షెడ్డు నిర్మాణం తలపెట్టినా అది మధ్యలోనే నిలిచిపోయింది. ఖానాపూర్ మండలంలో 35 పాఠశాలల్లో 1875 మంది చిన్నారులకు వంట చేసేందుకు 35 వంట ఏజెన్సీలు పని చేస్తున్నాయి. సన్నబియ్యం పంపిణీ చేసినా వండితే దొడ్డ అన్నమవుతోంది. పర్వతగిరి మండలంలో 35 పాఠశాలలో 2150 మంది విద్యార్థులు చదువుతున్నారు. కొన్ని పాఠశాలలో తాగునీటికి ఇబ్బందులు ఏర్పాడుతున్నాయి. దీంతో విద్యార్థులు ఇళ్ల నుంచి వాటర్ బాటిళ్లను తెచ్చుకుంటున్నారు. వర్ధన్నపేట మండలంలో చాల వరకు పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో నాణ్యత కరువైంది. ఇలా జిల్లాలోని మిగిలిన పాఠశాల్లో ఉప్పులు, పప్పులు, నూనెలు, కూరగాయలు పంపిణీ చేసే నిర్వాహకులు నాణ్యతను పాటించడం లేదని తెలుస్తోంది. కూరలు సాంబారులా పలుచగా ఉంటున్నాయని, మహిళా సంఘాలవారు నెలనెలా మారుతుండడంతో వంటల్లో నాణ్యత కరువవుతోందని తెలుస్తోంది.

ఏజెన్సీల ఇష్టారాజ్యం

- మెనూ, నాణ్యత పాటించడంలో నిర్లక్ష్యం
- తినలేక ఇళ్ల నుంచి తెచ్చుకుంటున్న విద్యార్థులు


గూడూరు బాలికల పాఠశాలలో ఆరుబయట భోజనం చేస్తున్న విద్యార్థినులు

మహబూబాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో మెనూ కరువైంది. కొన్ని పాఠశాలల్లో వంట నిర్వాహకుల ఇష్టారీతిన వండి పెడుతుండటంతో తినలేక విద్యార్థులు ఇళ్ల నుంచే తెచ్చుకుంటున్నారు. కొన్నిచోట్ల కుళ్లిన కూరగాయలు కనిపించాయి. ప్రభుత్వం సన్నబియ్యం ఇస్తున్నా నాణ్యమైన కూరగాయలు, సరుకులు కొనుగోలు చేయకపోవడంతో వంటల్లో నాణ్యత లోపిస్తోంది. మెనూ పాటించకపోవ డంతో పౌష్టికాహారం అందడం లేదు. కేసముద్రం మండలం కల్వల మోడల్ స్కూల్ హాస్టల్‌లో పురుగులు పట్టిన కిరాణ సామాను, కుళ్లిపోయిన కూరగాయలు దర్శనమిచ్చాయి. జిల్లాలోని 18 మండలాల పరిధిలో మొత్తంగా 863 ప్రభుత్వ పాఠశాలలుండగా, అందులో 45,135 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు 627 ఉండగా, వాటిల్లో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు ఇంగ్లిష్ మీడియంలో 20,449 మంది చదువుతు న్నారు. 119 ప్రాథమికోన్నత పాఠశాలలుండగా వాటిల్లో 7,570 మంది తెలుగు, ఇంగ్లీష్ మీడియం చదువుతున్నారు. 109 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలుండగా.. 13,665 మంది, ఎనిమిది మోడల్ స్కూళ్లు ఉండగా, వాటిల్లో 3,450 మంది చదువుతున్నారు. అయితే మధ్యాహ్నభోజన వంట నిర్వాహకులకు సకాలంలో బిల్లులు రాకపోవడంతో విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంలేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి. అప్పులు చేసి, వంటలు చేయాల్సిన పరిస్థితి రావడంతో నాణ్యతలేని తక్కువ ధరలకు వచ్చే కూరగాయలను కొనుగోలు చేసి తమకు ఇష్టమొచ్చినవి పెడుతున్నారని తెలుస్తోంది. సోమవారం కిచిడి (పబ్బియ్యం)తో మిక్స్‌డ్ విజిటెబుల్ కర్రి, కోడిగుడ్డు మంగళవారం అన్నం, సాంబారు, కూర, బుధవారం అన్నం, పప్పులో ఆకుకూర, కోడిగుడ్డు, గురువారం విజిటెబుల్ బిర్యానీ, ఏదేని ఒకకూర, శుక్రవారం అన్నం, సాంబారు, కోడిగుడ్డు, కూర, శనివారం అన్నం, పప్పులో ఆకుకూర, కూర పెట్టాల్సి ఉంటుందని, ఈ రకంగా మెనూ ప్రకారం వంట చేయడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

ఆంధ్రజ్యోతి విజిట్ Visit


వేలేరు బాలుర గురుకుల పాఠశాలలో సిబ్బంది లేక మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న విద్యార్థులు

రుచీ పచీ లేని వంటలు.. విద్యార్థుల తంటాలు

- విద్యార్థులకు నాణ్యత లేని ఆహారం
- మిడ్‌డే మీల్స్‌లో మెనూ పాటించని నిర్వాహకులు

హనుమకొండ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వహణ సక్రమంగా లేదు. నాసిరకం పదార్థాలతో వండుతుండటంతో రుచీ పచీ లేక విద్యార్థులు తినలేకపోతున్నారు. పలు చోట్ల సన్నబియ్యం స్థానంలో దొడ్డు బియ్యంతో ఉడికీ ఉడకని అన్నం, కుళ్లిన, పుచ్చులున్న కూరగాయలతో వండిన కూరలు పెడుతుండటంతో చిన్నారులు అనారోగ్యం పాలవుతున్నారు. జిల్లాలోని మెజారిటీ ప్రభుత్వ పాఠశాలల్లో ఇదే పరిస్థితి. ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని ఆదేశించినా, భోజనంలో ఏమి ఉండాలో మెనూ ఇచ్చినా పాటించడం లేదు. భోజనం వండడానికి చాలా పాఠశాలల్లో వంటషెడ్లు లేవు. తాగునీటి సరఫరా లేదు. బియ్యం, కూరగాయలు, వంట సరుకులను నిల్వ చేసేందుకు స్టోర్ రూంలు లేవు. కొన్ని చోట్ల పురుగులు పట్టిన బియ్యం ఉంటున్నాయి.

పలు మండలాల్లో ఇలా..

వేలేరు మండల కేంద్రంలోని బాలుర గురుకుల పాఠశాలలో మధ్యాహ్నం భోజనం దొడ్డు బియ్యంతో వండుతున్నారు. బియ్యంలో రాళ్లు, పురుగులుంటున్నాయని విద్యార్థులు వాపోయారు. సరిపడా మధ్యాహ్నం భోజనం సిబ్బంది లేక పోవడంతో విద్యార్థులే భోజనాన్ని వడ్డించుకోవడం కనిపించింది. నడికూడ మండలంలోని పలు స్కూళ్లలో కొత్త బియ్యంతో అన్నం వండుతుండడంతో మెత్తగా ఉండి విద్యార్థులు తినలేకపోవడం కనిపించింది. ఇదేంటని అడిగితే పౌరసరఫరా అధికా రులు పంపిన బియ్యమే వండుతున్నామని నిర్వాహకులు సమాధా నమిచ్చారు. వంటశాల లేకపోవడంతో ఆరుబయటే వండుతున్నారు. గాలి వచ్చినప్పుడు దుమ్ము, ధూళి ఎగిసి వంటల్లో పడుతోంది. భీమ దేవరపల్లి మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో మెనూ సరిగా పాటిం చడం లేదని విద్యార్థులు ఫిర్యాదు చేశారు.

గురువారం రుచీపచీ లేని వెజిటబుల్ రైస్ వడ్డించగా.. అందులో ఒక్క రకం కూరగాయ మాత్రమే వాడారు. ఎల్కతుర్తి మండలంలోని పాఠశాలల్లో వంట ఏజెన్సీ వారికి బిల్లులు సకాలంలో రావడం లేదన్న కారణంతో మధ్యాహ్నం వంట విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నట్టు తెలిసింది. పరకాల పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో వేతనాలు సరిగా రావడం లేదని పని మానేసారు. దీనితో ఆ మధ్యాహ్నం భోజనం వండేవారు లేక నాలుగైదు రోజులుగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రైవేటు వ్యక్తులతో వండిస్తూ మమ అనిపిస్తున్నారు. ఇక్కడ మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదన్న ఫిర్యాదులున్నాయి. ఐనవోలు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో డైనింగ్ హాళ్లు లేక విద్యార్థులు నేల మీదే కూర్చొని తింటున్నారు. ఆరు బయట భోజనం వడ్డిస్తున్నారు. హనుమకొండ పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలలో మధ్యాహ్న భోజనం బాగానే ఉంటోందని, ప్రభుత్వం సన్న బియ్యం సరఫరా చేస్తున్నట్టు చెబుతున్నా చాలా చోట్ల దొడ్డు బియ్యమే కనిపించాయి.

బియ్యం నిలువ చేసేందుకు స్టోర్ రూంలు లేకపోడంతో ఎండకు ఎండి, వానకు తడిసి పురుగులు పడు తున్నాయి. ఆత్మకూరు మండలంలోని ఎంజేఎం పెద్దాపూర్ బాలికల పాఠశాలను గురువారం నోడల్ ఆఫీసర్ ఎంపీ డీవో సందర్శించి మధ్యాహ్నం భోజనాన్ని తనఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. భోజనం నాణ్యంగా ఉండటం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.


గుర్రేవుల పాఠశాల ప్రాంగణంలో అపరిశుభ్రంగా ఉన్న చేతి పంపు వద్ద ప్లేట్లు కడుక్కుంటున్న విద్యార్థులు

ముక్కిన బియ్యం.. ముద్దలవుతున్న అన్నం

- కానరాని వంట గదులు, ఆరు బయటే పొయ్యిలు
- బిల్లుల పెండింగ్‌తో బడి బువ్వలో అమలు కాని మెనూ


నెక్కొండ ఉన్నత పాఠశాలలో అపరిశుభ్రమైన స్థలంలో నిల్వ చేసిన కూరగాయలు

జనగామ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు కడుపు నింపే మధ్యాహ్న భోజనంపై అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. జిల్లాలో మధ్యాహ్న భోజనం వండుతున్న తీరు, వండే ప్రదేశాలు, సరుకుల నాణ్యతపై పర్యవేక్షణ చేసే వారు లేక నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఫుడ్ పాయిజన్ లాంటి ఘటనలు జరిగినప్పుడు తప్ప మిగతా సమయాల్లో అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదన్న విమర్శలున్నాయి. జిల్లాలోని 12మండలాల్లోని కొన్ని స్కూళ్లలో మాత్రమే మధ్యాహ్న భోజన నిర్వహణ తీరు సక్రమంగా ఉందని తెలుస్తోంది. ముక్కిన, తుట్టెలు కట్టిన బియ్యం.. అది కూడా దొడ్డు బియ్యంతో అన్నం వండుతుండటంతో మెత్తగా.. ముద్దలుగా ఉంటుండటంతో విద్యార్థులు తినలేకపోతున్నారు.

దేవరుప్పల మండలం కామారెడ్డిగూడెం హైస్కూల్‌లో ముక్కిన, తుట్టెలు కట్టిన, పురుగులు పట్టిన బియ్యంతోనే వంట చేస్తున్నారు. దీంతో పిల్లలు తృప్తిగా భోజనం చేయలేకపోయారు. అయితే సరఫరా అయినప్పుడే బియ్యం ఇలా ఉంటున్నాయని, తాము పురుగులు లేకుండా శుభ్రం చేసిన తర్వాతే వంట చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఇక పలు పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండే పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. పాఠశాలల్లో ఏదో ఒక మూలన వంట చేస్తున్నారు. స్కూళ్లలో శాశ్వత వంట గదుల నిర్మాణం చేయాలన్న డిమాండ్ ఉంది. జఫర్‌ఘడ్ మోడల్ స్కూల్‌లో వంట గది లేకపోవడంతో ఓ గుడిసె వేసుకొని దాని కింద వంట చేస్తున్నారు. కూరగాయలను ఎక్కడపడితే అక్కడ కింద పోసి ఉంచుతున్నారు. కొన్ని చోట్ల కూరగాయలు కోసిన తర్వాత గాలికి వదిలేయడంతో ఈగలు ముసురుతున్నాయి.

వాటిపై దుమ్ముధూళి పడుతోంది. చాలా వరకు స్కూళ్లలో గ్యాస్ సదుపాయం లేకపోవడంతో కట్టెల పొయ్యి మీదనే నిర్వాహకులు వంట చేస్తున్నారు. ఇక స్కూళ్లలో మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించడం లేదు. మెనూ ప్రకారం గురువారం వెజ్ బిర్యానీ, మిక్స్‌డ్ వెజిటేబుల్ కర్రీ పెట్టాల్సి ఉంది. కానీ.. చాలా స్కూళ్లలో ఆ మెనూ కనిపించలేదు.

మార్కెట్ ధరలకు అను గుణంగా మధ్యాహ్న భోజన నిర్వాహకులకు బిల్లులు ఇవ్వకపోవడం వల్ల గిట్టుబాటు కాక వారు తమకు ఇష్టమొచ్చినవి వండిపెడుతున్నారని తెలుస్తోంది. అప్పులు తెచ్చి భోజనం పెడుతున్నామని కొందరు నిర్వాహకులు చెబుతున్నారు. మార్కెట్‌లో గుడ్డు ధర రూ.6.50 పైగా ఉండగా ప్రభుత్వం రూ.5 చొప్పున ఇస్తోంది. దీనికి నెలల తరబడి బిల్లులు పెండింగ్ ఉండటంతో పరిమాణం లేని గుడ్లు అందిస్తున్నారని తెలుస్తోంది.

పచ్చి పులుసుతో సరి పెడుతున్నారు..

- ములుగు జిల్లాలోనూ మెనూ విషయంలో నిర్లక్ష్యం
- సౌకర్యాల్లేక వంట తయారీలో ఇబ్బందులు

ములుగు, నవంబరు 28 (ఆంధ్ర జ్యోతి): సర్కా రు బడికి వెళ్తున్న నిరుపేద, మధ్యతరగతి విద్యార్థులకు ఒక పూట పౌష్టికాహారం అందించి ఆకలి తీర్చాలనే ఉద్దేశంతో అమలవుతున్న మధ్యాహ్న భోజనం పథకం ములుగు జిల్లాలో గాడి తప్పుతోంది. బిల్లుల చెల్లింపుల్లో జాప్యంతో మెనూ అమలు కావడంలేదు. మౌలిక సౌకర్యాలు లేక పోవడంతో భోజనంలో నాణ్యత కొరవడుతోంది. మెనూను అనుసరిస్తూ కూరగాయలు, పప్పుతో భోజనం పెట్టాల్సి ఉండగా ప్రభుత్వం సక్రమంగా బిల్లులు ఇవ్వకపోవడంతో నష్టాన్ని పూడ్చుకునేందుకు కొన్ని భోజన ఏజెన్సీలు రెగ్యులర్ మెనూలో పచ్చి పులుసుతో సరిపెడుతున్నారు. దీంతో రోజూ ఆ నీళ్ల చారు తినలేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఒక్కోసారి తమకు కడుపునొప్పి వస్తోందని పలువురు చిన్నారులు ఆవేదన వ్యక్తం చేయడం గమనార్హం. జిల్లా వ్యాప్తంగా 353పాఠశాలలు ఉన్నాయి. మన ఊరు- మనబడి కార్యక్రమంలో అన్ని పాఠశాలలకు వంట గదులను మంజూరు చేసినప్పటికీ 195 పాఠశాలల్లో మాత్రమే అందుబాటులోకి వచ్చాయి. వీటి లో కొన్ని ఇరుకుగా ఉండటంతో దాదాపు 70శాతం పాఠశాలల్లో ఆరుబయటే వంటలు వండుతున్నారు. ఏమరుపాటుగా ఉన్నా వండే భోజనంలో ఏం పడుతుందో తెలియని పరిస్థితి. రాష్ట్రవ్యాప్తంగా పలు పాఠశాలల్లో ఆహారం కలుషితమై విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్న ఘటనలు వరుసగా చోటుచేసుకుంటున్న క్రమంలో ములుగు జిల్లాలో నెలకొన్న పరిస్థితిపై ఒకింత ఆందోళన వ్యక్తమవుతోంది.

మంగపేట మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో వంట గది ఇరుకుగా ఉండటంతో ఆరుబయట కట్టెల పొయ్యిపైనే వంటల చేసున్నారు. కోడిగుడ్ల బిల్లులు తొమ్మిది నెలలుగా పెండింగ్‌లో ఉండటంతో నవంబరు మొదటి నుంచి విద్యార్థులుకు ఉడకపెట్టిన గుడ్డును వడ్డించడం లేదు. కన్నాయిగూడెం మండలం గుర్రేవులలో ఒకే ప్రాంగణంలో ఉన్న జడ్పీ హైస్కూల్, ప్రైమరీ స్కూల్‌లో తాగునీటి వసతి లేదు. నల్లాలు ఏర్పాటు చేసినా కనెక్షన్ ఇవ్వలేదు. చేతిపంపు ఉన్నా ఆ నీరు ఉప్పగా ఉన్నాయి. ఒక్కోరోజు ఆఖరున ఉన్న వారికి భోజనం అందడంలేదని విద్యార్థులు చెబుతున్నారు. డైనింగ్‌హాల్ అపరిశుభ్రంగా ఉంది. చిన్నబోయినపల్లి ఆర్‌వో ప్లాంటు పనిచేయడం లేదు. 400 మంది విద్యార్థుల దాహార్తిని తీర్చేందుకు మినరల్ వాటర్ క్యాన్లు తెప్పిస్తున్నారు. వెంకటాపూర్ మోడల్ స్కూల్‌లో రోజూ నీళ్ల చారు పెడుతున్నారని విద్యార్థులు చెప్పారు. ఇక్కడ ఆర్‌వో ప్లాంటు పనిచేయడం లేదు. వాజేడు మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల గురుకులంలో రెండు రోజులకోసారి మాడిపోయిన అన్నం పెడుతున్నారని విద్యార్థులు చెప్పారు.

మధ్యాహ్న భోజనంపై పాఠశాల స్థాయి కమిటీలు

- కలుషిత ఆహార సంఘటనలపై విచారణకు టాస్క్‌ఫోర్స్ కమిటీ
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

హనుమకొండ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో కలుషితమైన మధ్యాహ్న భోజనం తిని విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్న సంఘటనల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం దిద్దుబాటు చర్యలను చేపట్టింది. మధ్యాహ్న భోజనం కలుషితంపై హైకోర్టు సైతం మొట్టి కాయలు వేయడంతో అప్రమత్తమైన ప్రభుత్వం.. ఈ సంఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లకు పూనుకున్నది. ఇందులో భాగంగా అన్ని పాఠశాలలు, హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలలు, కేజీబీవీలు, ఏడబ్ల్యూసీలలో ఆహార భద్రతా కమిటీలను, అలాగే కలుషిత ఆహారం తిని విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనలపై విచారణకు జిల్లా స్థాయిలో టాస్క్‌ఫోర్సు కమిటీని వేయాలని ప్రభుత్వ నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వ చీఫ్ సెక్రెటరీ శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు.

ఆహార భద్రతా కమిటీలు

ఆహార భద్రతా కమిటీలో హెచ్ఎంలు లేదా ప్రిన్సిపాల్‌తో పాటు ఇద్దరు ఉపాధ్యాయులు సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ పాఠశాలలోని వంట, స్టోర్ రూమ్‌లను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తారు. మధ్యాహ్న భోజనం పరిశుభ్రంగా, నాణ్యతగా, నిర్ధేశిత పౌష్టిక ప్రమాణాలతో మెనూ ప్రకారం తయారు చేసేలా చూస్తుంది. విద్యార్థులకు వడ్డించే ముందు రుచిచూస్తారు. ప్రతీ రోజు కమిటీలోని సభ్యులు వంట గదిని, స్టోర్ రూమ్ తనిఖీ చేసిన, ఆహారాన్ని రుచి చూసిన ఫొటోలను తీసి ఇందు కోసం ప్రత్యేకంగా రూపొందించే యాప్‌లో భోజనం వడ్డించే ముందు అప్‌లోడ్ చేస్తారు, మండల, డివిజినల్, జిల్లా స్థాయి అధికారులు ఈ పాఠశాల స్థాయి ఆహార భద్రతా కమిటీల పని తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించేలా కలెక్టర్ చూస్తారు. ఈ అధికారులు సాధ్యమైనంత మేరకు విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం వడ్డించే ముందు పాఠశాలలకు వెళ్లి భోజనాన్ని తనిఖీ చేస్తారు. వారు కూడా ఫొటోలు తీసి కలెక్టర్‌కు పంపుతారు.

టాస్క్‌ఫోర్సు కమిటీ

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమం, విద్య, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నడిచే వివిధ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలు, ఆస్పత్రులు, అంగన్వాడీ కేంద్రాలలో విద్యార్థులు, బాలింతలు, శిశువులకు అందజేసే ఆహారం నాణ్యంగా ఉందా లేదా పరిశీలించడానికి, ఈ సంస్థలు సరిగా పని చేస్తున్నాయా లేవా తనిఖీ చేయడానికి టాస్క్‌ఫోర్సు కమిటీని వేయాలని ప్రభుత్వం నిర్ణయించుకున్నది. సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ టాస్క్‌ఫోర్సు కమిటీలో ఆహార భద్రతా కమిషనర్ లేదా ఆహార భద్ర తా అధికారి, సంబంధిత సంస్థ హెచవోడీలు, లేదా అదనపు డైరెక్టర్లు, జిల్లా స్థాయిలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ, జిల్లా బీసీ సంక్షేమ శాఖ, జిల్లా విద్యాశాఖ అధికారులు సభ్యులుగా ఉంటారు. ఆహారం కలుషితమైనప్పుడు టాస్క్‌ఫోర్సు కమిటీ అందుకు గల కారణాలు, బాధ్యులను గుర్తించి ప్రభుత్వ చీఫ్ సెక్రెటరీకి సమర్పిస్తుంది. నివేదికను పరిశీలించిన అనంతరం ఆ మేరకు ప్రభుత్వం బాధ్యులపై చర్యలు తీసుకుంటుంది.

నీళ్ల పప్పు.. నాణ్యత లేని కూరలు

మొక్కుబడిగా మధ్యాహ్న భోజనం


భూపాలపల్లిలోని యూపీఎస్‌లో వరండాలో భోజనం వండుతున్న సిబ్బంది

భూపాలపల్లి టౌన్, నవంబరు 28 ((ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలన్న లక్ష్యంతో పాఠశాలల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనం అమలు అధ్వానంగా ఉంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని విద్యాలయాల్లో ఇది గాడి తప్పింది. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదు. జిల్లాలో మొత్తం 457 పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ పథకం ద్వారా మొత్తం 16,659 మంది విద్యార్థులకు ఒక పూట భోజనం పెడుతున్నారు. అయితే ఇక్కడ మెనూను గాలికి వదిలేశారనే ఆరోపణలున్నాయి. ముఖ్యంగా రోజువారీగా ఇచ్చే ఆహార పదార్థాల్లో నాణ్యత ఉండటం లేదని, అరకొర పరిమాణంతో వడిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. కూరల సాంద్రతను తగ్గుతోందని విద్యార్థులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో మెజారిటీ పాఠశాలలకు వంట శాలలు లేవు. ఉన్నచోట కూడా తరగతి గదులను సామగ్రి నిల్వ కేంద్రాలుగా, వరండాలను భోజన శాలలుగా మార్చారు. చాలాచోట్లా ఆ పరిస్థితి కూడా లేకపోవడంతో నిర్వాహకులు ఆరుబయటే చెట్ల కింద వంటలు వండి వడ్డిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో పాఠశాలల భోజన సమయాల్లో ఆహార పదార్థాలపై రక్షణ ఏర్పాట్లు లేక చెత్తాచెదారం కూడా పడుతున్న దుస్థితి ఉందని చెబుతున్నారు. అంతేకాకుండా వంటశాలల్లో అపరిశుభ్రత వాతావరణం కూడా అధికంగా ఉందని చెబుతున్నారు.

ఈ పరిస్థితుల్లో ఆహారం విషతుల్యంగా మారే ప్రమాదం ఉందని తెలుస్తోంది. రేగొండ మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో పుప్పుకూర, సాంబారు వండి వడ్డించారు. ఎక్కువ సార్లు పప్పు, సాంబారు మాత్రమే పెడుతున్నారని, అదికూడా నీళ్లలా చేస్తున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఒకసారి వండిన ఆలుగడ్డ కూరలు మళ్లీ మళ్లీ పెడుతున్నారని చెప్పారు. గణపురం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు తక్కువగా ఉండడం వల్ల సంబంధిత కాంట్రాక్టర్ మధ్యాహ్న భోజనాన్ని ఇంటివద్దే వండుకుని తీసుకొస్తున్నారని, వంటలో నాణ్యతా ప్రమాణాలు ఉండడం లేదని విద్యార్థులు అంటున్నారు.

కాటారం మండలంలోని దేవరాంపల్లి ఉన్నత పాఠశాలలో పప్పు చారు నీళ్లలా వండుతున్నారని, కూరగాయలు సరిగా వండటం లేదని తెలిపారు. అలాగే ఏ పాఠశాలల్లో పరిశీలించినా భోజన శాలలు లేక ఆరుబయట, వరండాల్లో తింటూ విద్యార్థులు కనిపించారు.

రాష్ట్ర స్థాయికి ఎంపికైన 14 ఇన్‌స్పైర్ ప్రాజెక్టులు

ముగిసిన వరంగల్ జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్

నర్సంపేట టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నర్సంపేట మండలంలోని మహేశ్వరం గ్రామంలోని శివాని పబ్లిక్ స్కూల్‌లో మూడు రోజుల పాటు జరిగిన వరంగల్ జిల్లా స్థాయి ఇన్‌స్పైర్, విద్యా, వైజ్ఞాన ప్రదర్శన గురువారంతో ముగిసింది. ప్రదర్శనలో పాల్గొన్న 148 ఇన్‌స్పైర్ ప్రాజెక్టుల్లో 14 ప్రాజెక్టులు, 352 రాష్ట్రీయ బాలల వైజ్ఞానిక ప్రదర్శనల నుంచి సీనియర్ విభాగంలో ఏడు, జూనియర్ విభాగంలో ఏడు ఎగ్జిబిట్స్ రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికైనట్లు డీఈవో జ్ఞానేశ్వర్, జిల్లా సైన్స్ అధికారి కట్ల శ్రీనివాస్ తెలిపారు. ఇన్‌స్పైర్, ఆర్‌బీవీపీ ఎగ్జిబిట్లను వరంగల్ జిల్లాలోని డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, లెక్చరర్లు వివిధ అంశాల ఆధారంగా విజేతలను ఎంపిక చేశారన్నారు. ఈ సైన్స్ ఫెయిర్‌లో 185 పాఠశాలల నుంచి 6వేల మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారన్నారు.

ఎంపికైన ఇన్‌స్పైర్ ప్రాజెక్టులివే..

'ఫోల్డబుల్ లాడర్ ఫర్ క్లైయింబింగ్ అప్పర్ బెర్త్ ఇన్ ట్రెయిన్' అనే అంశంపై తయారు చేసిన కేశవాపూర్ జడ్పీకి చెందిన విద్యార్థి పి.శివ కుమార్ ప్రాజెక్టు, టీఎస్ఎంఎస్, నెక్కొండ విద్యార్థులు ఆర్.సాయి హృతిక్, హర్షవర్ధన్‌ల ప్రాజెక్టు షై బ్రైడ్ డ్రోన్ కెమెరా ద సీక్రెట్ సోల్జర్, కేవీ స్కూల్, ఎన్ఆర్ఆర్ తోట వరంగల్‌కు చెందిన విద్యార్థి ఎస్.వినూత్న ప్రాజెక్టు లైట్ పైపు, ఎంయూపీఎస్ రోల్లకల్ విద్యార్థి ఎం.శివాని ప్రాజెక్టు ప్యాకెట్ సైజ్ ఫోల్డబుల్ జాకెట్ ఫర్ ఫీడింగ్ మదర్స్ ప్రాజెక్టు, విద్యాభవన్ హైస్కూల్, సంగెం విద్యార్థి ఇ.సాయితేజ ప్రాజెక్టు పంటల నుంచి మట్టిని తొలగించే వ్యవసాయ యంత్రం, ఎస్ఎస్ఆర్ హైస్కూల్ విద్యార్థి బి.రుత్విక ప్రాజెక్టు ఆటోమెటిక్ డైరెక్షనల్ సోలార్ ప్యానెల్స్, జడ్పీహెచ్ఎస్ సూరిపల్లి విద్యార్థి వి.సహస్ర ప్రాజెక్టు పోర్టబుల్ ప్యాడీ డ్రైయర్, టీజీహెచ్ఎస్ (బాలురు)విద్యార్థి జశ్వంత్‌నాయక్ ప్రాజెక్టు అగ్రి రోబోట్ ఆర్డినో, జడ్పీహెచ్ఎస్ బుధరావుపేట విద్యార్థి జె.శివభారతి ప్రాజెక్టు ట్రాన్స్‌పోర్ట్ పెట్రోల్ డెలివరి గన్ విత్ ఆక్యురేట్ మెసర్‌మెంట్, సెయింట్ జాన్స్ హైస్కూల్, గీసుగొండ విద్యార్థి ఎ.తేజవర్ధన్ ప్రాజెక్టు మల్టీపర్పస్ అగ్రికల్చర్ మెషిన్, అల్ఫోర్స్ హైస్కూల్, వర్ధన్నపేట విద్యార్థి వి.రిష్మిత ప్రాజెక్టు గార్బెల్ కలెక్షన్‌త్రో సైక్లింగ్, ఉర్సు ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థి మీర్జా అబ్రార్ అలీబేగ్ ప్రాజెక్టు ట్రిపుల్ రైడింగ్ ఈస్ ప్రొహిబిటెడ్, జడ్పీ మాధన్నపేట విద్యార్థి ఎస్.శ్రావణి ప్రాజెక్టు డివైస్ టు డ్రై మోర్ క్లాత్స్ ఇన్ షార్ట్ టైమ్, డఫోడిల్స్ హైస్కూల్, నర్సంపేట విద్యార్థి ఎస్.కె. సుఫియాన్ ప్రాజెక్టు హైడ్రాలిక్ ఫ్లడ్ ప్రొటెక్షన్ ఫర్ హోమ్స్ ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయి. అలాగే, సీనియర్, జూనియర్ విభాగంలో ఆర్‌బీవీపీ ఎగ్జిబిట్స్‌లో రాష్ట్ర స్థాయికి పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. దహైదరాబాద్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు పి. శ్రీమేథ, పి. అక్షర, ప్లాటినమ్ హైస్కూల్ విద్యార్థ జి. అనిరుధ్, గీతాంజలి డీజీ స్కూల్ విద్యార్థి బి.అలోక్‌చంద్ర, జడ్పీహెచ్ఎస్ బుధరావుపేట విద్యార్థి హసన్, సిద్ధార్థ టీచర్స్ ఎగ్జిబిట్స్‌లో జీపీఎస్, కరీమాబాద్, ఖిలావరంగల్ టీచర్ పి. రేఖ ఎంపికయ్యారు.


విజేతలకు బహుమతులను అందజేస్తున్న డీఈవో, జిల్లా సైన్స్ అధికారులు

నేడు జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ షురూ

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌ను శుక్రవారం ప్రారంభించనున్నట్లు డీఈవో దౌలాగర్ వాసంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కాజీపేట ప్రశాంత్‌నగర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో రెండురోజుల పాటు ఈ కార్యక్రమంలో నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. కాగా, గురువారం నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభం అయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని యాజమాన్య పాఠశాలల నుంచి సుమారు 800 మంది విద్యార్థులు వారి ఎగ్జిబిట్లు ప్రదర్శించనున్నారు.

ప్రైవేట్ పాఠశాలలో నిర్వహణపై అభ్యంతరం

ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించాల్సిన సైన్స్‌ఫెయిర్‌ను ఓ కార్పొరేట్ పాఠశాలలో నిర్వహించడంపై పలువురు ప్రభుత్వ ఉపాధ్యాయులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వైజ్ఞానిక ప్రదర్శనలకు నిధులు కేటాయిస్తున్నా ప్రైవేటు పాఠశాలలకు పేరు వచ్చేలా ఆయా పాఠశాలల్లో వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించడాన్ని వారు తప్పుబడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుంటే అధికారులు మాత్రం ప్రభుత్వ పాఠశాలలను చిన్నచూపుచూస్తూ ప్రైవేటు పాఠశాలలు కల్పిస్తున్న సౌకర్యాలకు అర్రులు చాస్తూ వాటికి గుర్తింపు తీసుకువచ్చేలా కార్యక్రమాలు రూపొందిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఆంధ్రజ్యోతి
నవ్య
నివేదన
శుక్రవారం • 29 నవంబరు 2024



ధర్మపథం


మరణం తరువాత ఏమౌతుంది?

బౌద్ధం నాస్తికతకు వ్యతిరేకి. బౌద్ధులు భౌతిక జీవన విధానాన్ని, నాస్తికతను ఎన్నడూ సమర్థించలేదు. దీనికి ఉదాహరణలు కోకొల్లలు. త్రిపిటకాలలో ఒక ఘట్టాన్ని చూద్దాం. పాయాసి రాజు ఆనాటి మేటి తత్వాన్వేషి. అతను సేతవ్యా అనే ధన, ధాన్య పరిపూర్ణమైన నగరానికి ప్రభువు. ఆ నగరాన్ని అతనికి బుద్ధ భగవానుడి సమకాలీకుడైన ప్రసేనజిత్తు ఇచ్చాడు. ప్రసేనజిత్తు కోసల రాజ్యానికి రాజు. పాయాసి పూర్ణ భౌతికవాది. కనిపించేవాటిని తప్ప మరి వేటినీ ఒప్పుకొనేవాడు కాదు. పరలోకం, పాపపుణ్యాలు కనిపించవు కాబట్టి వాటిని అంగీకరించేవాడు కాదు. ఆత్మనైతే ససేమిరా ఒప్పుకొనేవాడు కాదు. జీవుడు మరణానంతరం మళ్ళీ పుడతాడన్న సిద్ధాంతాన్ని కూడా అతను అంగీకరించలేదు. మంచి, చెడు కర్మల మీద కూడా అతనికి విశ్వాసం ఉండేది కాదు. పాయాసి రాజు సిద్ధాంతాన్ని బుద్ధుడి శిష్యుడైన కుమార కాశ్యపుడు ఒప్పుకోలేదు. ఒక రోజు పాయాసి పరిపాలించే సేతవ్యా నగరానికి కుమార కాశ్యపుడు వెళ్ళాడు. అతణ్ణి పాయాసి ఆదరాభిమానాలతో ఆహ్వానించాడు. తన సిద్ధాంతాన్ని అతనికి వినిపించాడు.

అయితే బౌద్ధం పునర్జన్మను అంగీకరిస్తుంది. మరణించిన ప్రాణి మళ్ళీ జన్మిస్తాడని బౌద్ధ ధర్మ గ్రంథాలు పేర్కొన్నాయి. హిందూ ధర్మ గ్రంథాల్లో కూడా ఇదే విషయం ఉంది. ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలంటే... శబ్ద ప్రమాణాన్ని నమ్మడం... అంటే పూర్వాచార్యులు, ఆప్తులు చెప్పే మాటలను విశ్వసించడం ఎంతో అవసరం. ఎందుకంటే... చనిపోయిన వ్యక్తి నుంచి వేరయిన ఆత్మ మళ్ళీ కొత్త శరీరంలోకి ప్రవేశించే సంఘటనను ఇంతవరకూ ఎవ్వరూ కళ్ళతో చూడలేదు. ఇలాంటి ఆధ్యాత్మిక విషయాలు యోగ సాధనద్వారా అవగతం అవుతాయేమో కానీ... మామూలు కళ్ళకు కనిపించవు. ఆ సంఘటనను చూద్దామంటే వీలు పడదు.

కానీ పాయాసి చాలా పట్టుదల కలిగిన వ్యక్తి. 'జీవుడు మరణానంతరం వేరొక శరీరంలోకి ప్రవేశిస్తాడా?' అనేది తెలుసుకోవడానికి అతను చాలా ప్రయత్నం చేశాడు. దుష్కర్మలను ఆచరించి, మరణానికి సిద్ధంగా ఉన్న కొంతమంది మిత్రులతో 'నరకానికి వెళ్ళి మళ్ళీ భూలోకానికి తిరిగి వచ్చాక, మరణానంతరం ఎక్కడ ఎలా జన్మిస్తారు?' అనే విషయాన్ని తనతో చెప్పమన్నాడు. కానీ పాయాసి మిత్రులెవరూ తిరిగి వచ్చి ఆ విశేషాలను అతనికి చెప్పలేదు. అలాగే సత్కర్మలను ఆచరించే తన మిత్రులతో 'త్రాయస్త్రింశలోకం' నుంచి, అంటే స్వర్గం నుంచి మళ్ళీ భూలోకానికి వచ్చాక... ఆ విశేషాలు తనతో చెప్పమన్నాడు. కానీ ఎవ్వరూ తిరిగి రాలేదు, ఆ విషయాలను చెప్పనూ లేదు. దాంతో అతను పరలోకం ఒకటి ఉందని ఒప్పుకోవడం మానేశాడు. అయితే పాయాసి సిద్ధాంతాన్ని కుమార కాశ్యపుడు అంగీకరించలేదు.

> బౌద్ధం పునర్జన్మను అంగీకరిస్తుంది. మరణించిన ప్రాణి మళ్ళీ జన్మిస్తాడని బౌద్ధ ధర్మ గ్రంథాలు పేర్కొన్నాయి. హిందూ ధర్మ గ్రంథాల్లో కూడా ఇదే విషయం ఉంది.





ఆచార్య చౌడూరి ఉపేంద్ర రావు,
జేఎన్‌యు,
న్యూఢిల్లీ.
91 98189 69756



విశేషం

భక్త జన కల్పవల్లి

తెలుగు నెలల్లో తొమ్మిదోదైన మార్గశిర మాసంతో హేమంత ఋతువు ఆరంభం అవుతుంది. భగవద్గీతలో 'మాసానాం మార్గశీర్షోహం' అన్నాడు శ్రీకృష్ణుడు. అందుకే ఈ నెలను సాక్షాత్తూ విష్ణుస్వరూపంగా పరిగణిస్తారు. ఇది లక్ష్మీప్రదమైన మాసం కూడా. మార్గశిర మాసం, అందునా గురు(లక్ష్మి)వారం శ్రీమహాలక్ష్మీదేవికి ఎంతో ఇష్టమైనవి. మార్గశిర లక్ష్మివారాల్లో ఆమెను పూజిస్తే సకల శుభాలు కలుగుతాయనే విశ్వాసం ఉంది. అందుకే ఆ రోజుల్లో ఆ తల్లి అనుగ్రహాన్ని పొందడానికి నోములు చేసుకుంటారు. మహాలక్ష్మి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహిస్తారు. అటువంటి ఆలయాల్లో మహారాష్ట్రలోని కొల్హాపూర్ ఆలయం ప్రసిద్ధమైనది కాగా... విశాఖపట్నంలోని శ్రీ కనకమహాలక్ష్మి సన్నిధి కూడా ఎంతో ప్రాచుర్యాన్ని సంతరించుకుంది.

నగరానికి రక్షగా...

విశాఖపట్నం ఒకప్పుడు కళింగ గజపతుల పాలనలో ఉండేదని, రాజ్య రక్షణ కోసం సాగరతీరంలోని ఒక కొండ మీద బురుజు నిర్మాణం చేపట్టారని, తవ్వకాలు జరుపుతుండగా శ్రీమహాలక్ష్మి విగ్రహం బయటపడిందని, దాన్ని కొండకు సమీపంలో ప్రతిష్ఠించారనీ ఒక కథ ఉంది. అమ్మవారు కొలువైన ప్రాంతాన్ని ఇప్పటికీ బురుజుపేటగానే వ్యవహరిస్తారు. కాగా కనకమహాలక్ష్మి ఆవిర్భావం గురించి మరో కథనం కూడా వినిపిస్తుంది. తమోగుణంతో నిండిన ఒక శక్తికి శివభక్తుడైన వ్యక్తి మీద ఆగ్రహం కలిగింది. అతణ్ణి తన వజ్రాయుధంతో చంపడానికి సిద్ధమయింది. అప్పుడు శివుడు సాక్షాత్కరించి, అదే వజ్రాయుధంతో ఆ శక్తి చేతులు నరికి, ఆమెలోని తమోగుణాన్ని నిష్ఫలం చేసి, కనకమహాలక్ష్మిగా నామకరణం చేశాడట. అప్పుడు ఆ శక్తి శాంతించింది, కరుణతో నిండిపోయింది. పరమ శివుడి ఆజ్ఞ మేరకు ప్రజల ఆలనా, పాలనా చూడడమే సంకల్పంగా అక్కడ కొలువయింది. ప్రజలకు రక్షణ శక్తిగా ఉండడానికి వీలుగా తనకు ప్రత్యేకంగా ఆలయం నిర్మించవద్దని ఆదేశించిందనీ. కుల, మతాలకు అతీతంగా అందరూ స్వయంగా తనను ఆరాధించుకోవచ్చనీ, ఎటువంటి ప్రతిబంధకాలు కల్పించవద్దని శాసించిందనీ చెబుతారు. ఆ ప్రకారం అమ్మవారి విగ్రహానికి పైన పైకప్పు లాంటిది ఏదీ ఉండదు. ఇప్పటికీ భక్తులు తమ స్వహస్తాలతోనే అమ్మవారికి పూజలు చేస్తారు.

నెల రోజుల వేడుక...

విశాఖపట్టణం ఒకప్పుడు చిన్న ఊరు. ఆంగ్లేయుల కాలంలో బాగా అభివృద్ధి చెందింది. ఆ సమయంలో... బురుజుపేటలో రోడ్డు విస్తరణ కోసం... రోడ్డుకు అడ్డంగా ఉన్న కనకమహాలక్ష్మి అమ్మవారి విగ్రహాన్ని ఒక పక్కకు జరిపారు. వెంటనే ఆ ప్రాంతంలో ప్లేగు వ్యాధి ప్రబలింది. అనేకమంది మృత్యువాత పడ్డారు. అమ్మవారిని కదిలించిన కారణంగానే ఈ విపత్తు వాటిల్లిందన్న ప్రజల ఆందోళనకు అధికారులు స్పందించి, అమ్మవారిని యథాస్థితికి చేర్చారు. వెంటనే వ్యాధి తగ్గడంతో ప్రజల్లో విశ్వాసం మరింత గాఢమయింది. ఆనాటి నుంచి అమ్మవారిని కొలిచే భక్తుల సంఖ్య పెరిగింది. శ్రీ కనకమహాలక్ష్మి ఖ్యాతి దశదిశలా పాకింది. అమ్మవారికి ప్రియమైన మార్గశిరంలో మాసోత్సవాలను ప్రతి సంవత్సరం నిర్వహిస్తారు. ముఖ్యంగా లక్ష్మివారాల్లో రోజంతా ఆలయం భక్తులతో కిటకిటలాడుతుంది. ఈ నెలరోజుల్లో లక్షలాదిమంది అమ్మవారిని దర్శించుకుంటారు. మహిళలు కుంకుమ పూజలు, అభిషేకాలు చేస్తారు. భక్తులపాలిట కల్పవల్లిగా... సిరులు అందించే సౌభాగ్యప్రదాయినిగా కనకమహాలక్ష్మి ఆరాధిస్తారు.

> డిసెంబర్ 2నుంచి శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాలు

• ఆయపిళ్ళ రాజపాప

చింతన


మానవుల స్వేచ్ఛ కోసం...

తెలుగు గడ్డ మీద పుట్టిన జిడ్డు కృష్ణమూర్తి 20వ శతాబ్దపు తత్త్వవేత్తలందరిలో మకుటాయమానమైనవాడు. కృష్ణమూర్తిని హ్యూమ్, లోక్, కాంట్, హుసర్ల్, సార్త్రే లాంటి ప్రసిద్ధమైన పాశ్చాత్య తత్త్వవేత్తలతో ఒకవైపు, పతంజలి, కపిలుడు, బుద్ధుడు, శంకరాచార్యుడు లాంటి భారతీయ తత్త్వవేత్తలతో ఇంకొకవైపు పోలిస్తే... ఆయన గొప్పతనం అర్థమవుతుంది. ఆయన ఆలోచనల్లో, ప్రతిపాదనల్లో ఉన్న పటిష్ఠత ప్రాక్పశ్చిమ తత్త్వవేత్తలు ఎవరిలోనూ కనిపించదు. కృష్ణమూర్తి 'సృష్టికర్త ఉన్నాడా? ఆత్మ ఆద్యంతరహితమైనదా? మనిషి మేధస్సు పరిమితులు, కార్య కారణాల మధ్య సంబంధం, కాలం, మంచి-చెడు' లాంటి సైద్ధాంతికమైన తాత్త్విక అంశాలను మాత్రమే చర్చించలేదు. 'మనిషి మనుగడతో ముడిపడిన ప్రేమ, అహంకారం, అసూయ, కామం, క్రోధం, హింస, భయం, అధికారం, బానిసత్వం' తదితర విషయాలను కూడా ఆయన విశ్లేషించారు. 'చైతన్యం అంటే ఏమిటి? కాలం ఎలా ఉద్భవిస్తుంది? దాన్ని ఎలా అధిగమించవచ్చు? చావు పుట్టుకల అర్థం ఏమిటి? కుండలినీ శక్తి నిజంగానే ఉందా?' అనే ప్రశ్నల విశ్లేషణలో... కృష్ణమూర్తి తాత్త్వికత పరాకాష్ఠను చేరుకుంది. ఆయన వినియోగించే పద్ధతి.. ఫిలసాఫికల్ మెథడ్. ఆయన చూపిన మార్గం వినూత్నమైనది. తత్త్వవేత్తలందరూ తమ పూర్వకాలం వారి సిద్ధాంతాల మీద, వారి అభిప్రాయాల మీద, ఆప్త వచనాల మీద ఆధారపడతారు. కృష్ణమూర్తి అలా కాదు... వేటిని పాటిస్తే మనిషికి ఆ సమస్యలు స్పష్టంగా అర్థమవుతాయో, తార్కికవాదం, ఊహ సైతం అందుకోలేని సత్యం దర్శనమిస్తుందో... ఆ అంశాలను ఆయన శ్రోతలకు విశదంగా వివరిస్తారు. 'మనిషి తన ప్రశ్నలకు జవాబుల కోసం ఇతరుల మీద ఆధారపడకూడదు, తనకు తానే మార్గదర్శి కావాలి' అనేది ఆయన అభ్యర్థన. సత్యాన్వేషణలో స్వేచ్ఛ అతి ప్రధానమైనది. దాంట్లో గురువులకు, మతాలకు తావు లేదు. ఊత కర్రలాంటి ఇతరుల సిద్ధాంతాలను దూరంగా ఉంచాలి... ఇదీ కృష్ణమూర్తి సందేశం. తాత్త్విక ప్రపంచంలో ఇదొక విప్లవం. సంప్రదాయాలమీద, గురువులమీద ఒక తిరుగుబాటు.

స్వేచ్ఛకు, సత్యానికి ఇంత విలువ ఇచ్చిన జిడ్డు కృష్ణమూర్తి 1895 మే 12న... మదనపల్లిలో నారాయణయ్య, సంజీవమ్మ దంపతులకు ఎనిమిదవ బిడ్డగా జన్మించారు. ఆయన జాతకాన్ని పరిశీలించిన దైవజ్ఞుడు కుమారశ్రౌతులు "ఈ పిల్లవాడు భావికాలంలో జగద్గురువు అవుతాడు" అని జోస్యం చెప్పాడు. కానీ బాల్యంలో కృష్ణమూర్తి చదువుల పట్ల ఎలాటి ఆసక్తి చూపలేదు. గంటల తరబడి చీమల బారులను, ఆకాశంలో మబ్బులను చూస్తూ కూర్చొనేవారు. ఆయన చేష్టలను అందరూ పిచ్చిగా పరిగణించారు. పదేళ్ళ వయసులో ఆయన తల్లి మరణించడంతో... తండ్రి నారాయణయ్య బతుకుతెరువు కోసం కుటుంబాన్ని మద్రాసుకు (చెన్నైకి) మార్చారు. మద్రాసు అడయార్‌లో ఉన్న దివ్యజ్ఞాన సమాజం (థియోసోఫికల్ సొసైటీ)లో చిన్న ఉద్యోగిగా చేరారు. అక్కడ సముద్ర తీరంలో తన తమ్ముడు నిత్యానందుతో ఆడుకుంటున్న కృష్ణమూర్తి వర్చస్సును దివ్యజ్ఞాన సమాజం సభ్యుడైన లెడ్ బీటర్ గమనించారు. 'ఇతను గౌతమ బుద్ధుడి అవతారం. పెద్దవాడయ్యాక జగద్గురువు అవుతాడు' అని నిర్ధారణ చేసుకున్నారు. ఆ విషయాన్ని ప్రపంచానికి చాటి చెప్పారు. సమాజం అధ్యక్షురాలైన అనిబిసెంట్ మన దేశ స్వాతంత్ర్యం కోసం చాలా పాటుపడ్డారు. ఆమె కృష్ణమూర్తిని, అతని తమ్ముణ్ణి దత్తత తీసుకున్నారు. వారిద్దరినీ పై చదువుల కోసం ఇంగ్లండ్‌కు పంపించారు. కృష్ణమూర్తి అక్కడ ఎంత శ్రమపడినా మెట్రిక్యులేషన్‌లోనైనా ఉత్తీర్ణత సాధించలేకపోయారు. కానీ మాతృభాష అయిన తెలుగును మరచిపోయారు. ఒక బ్రిటిష్ పెద్దమనిషిగా మారారు. దివ్యజ్ఞాన సమాజంలో అమెరికా, యూరప్, ఆస్ట్రేలియాలకు చెందిన చాలా మంది సంపన్నులు సభ్యులుగా ఉండేవారు. వారు తమ ఆస్తులను, కోటలను, తోటలను భావి జగద్గురువు కృష్ణమూర్తికి విరాళంగా ఇచ్చారు.

ఆ సమాజం సిద్ధాంతం ప్రకారం... 1929 ఆగస్టు మూడో తేదీన మైత్రేయ బుద్ధుడి ఆత్మ... కృష్ణమూర్తి ఆత్మను ఆవహిస్తుంది. ఆ క్షణం నుంచి కృష్ణమూర్తి జగద్గురువు అవుతారు. అదే నమ్మకంతో అందరూ ఆ క్షణం కోసం ఎదురుచూశారు. ఆ కార్యక్రమంలో పాల్గొనడానికి దేశదేశాల నుంచి ఎంతోమంది హాలెండ్‌కు వచ్చి, ఆ రోజు కృష్ణమూర్తి నిలబడిన వేదిక ముందు భయభక్తులతో కూర్చున్నారు. జగద్గురువుగా కృష్ణమూర్తి ప్రపంచానికి ఇవ్వబోయే సందేశాన్ని ప్రసారం చేసేందుకు రేడియో బృందాలు తయారుగా ఉన్నాయి. కానీ ఆ చారిత్రక సందర్భంలో కృష్ణమూర్తి ఇచ్చిన సందేశం సొసైటీ సభ్యుల మీద పిడుగుపాటులా పడింది, కల్లోలం సృష్టించింది. "మతాలు, సంస్థలు, సమాజాలు సత్యాన్ని అణగదొక్కి, వ్యక్తిని అవిటివాణ్ణి చేస్తాయి. సత్యానికి సంస్థలకు పొత్తు కుదరదు. నేను ఒక కొత్త సిద్ధాంతాన్ని, మతాన్ని స్థాపించడం లేదు. మనిషిని బేషరతుగా ఒక సంపూర్ణ స్వేచ్ఛాజీవిని చేయడం ఒక్కటే నా జీవిత ధ్యేయం" అని ఆయన ప్రకటించారు. ఆ కారణంగా ఆయన దివ్యజ్ఞాన సమాజం నుంచి, ఇతర సంస్థల నుంచి విడిపోయారు. ఆస్తులను వాటి పూర్వ యజమానులకు వాపసు ఇచ్చేశారు. మానవుల మనుగడ మీద తాత్త్విక ఉపన్యాసాలు ఇస్తూ, పుస్తకాలు రాస్తూ, మేధావులతో, శాస్త్రవేత్తలతో, కళాకారులతో, రచయితలతో చర్చలు జరుపుతూ జీవితాన్ని గడిపిన కృష్ణమూర్తి 1986లో మరణించారు.

> మతాలు, సంస్థలు, సమాజాలు సత్యాన్ని అణగదొక్కి వ్యక్తిని అవిటివాణ్ణి చేస్తాయి. సత్యానికి సంస్థలకు పొత్తు కుదరదు. నేను ఒక కొత్త సిద్ధాంతాన్ని, మతాన్ని స్థాపించడం లేదు. మనిషిని సంపూర్ణ స్వేచ్ఛాజీవిని చేయడం ఒక్కటే నా జీవిత ధ్యేయం



• గుంటూరు వనమాలి
(మ్యూనిక్ విశ్వవిద్యాలయంలో జిడ్డు కృష్ణమూర్తిపై డాక్టరేట్ చేశారు, ఇక్కడే కృష్ణమూర్తి ఫిలాసఫీని బోధించారు)

గీతాసారం

మనం ఎప్పుడూ ఉంటాం...


న త్వేవాహం జాతు నాసం, నత్వం నేమే జనాధిపాః
న చైవ న భవిష్యామః సర్వే వయ మతః పరమ్

"నేను ఇదివరకు ఎప్పుడూ లేని వాణ్ణి కాదు. నువ్వు కూడా ఇంతకుముందు లేనివాడివి కావు. నీవు కాని, నేను కాని, ఈ పాలకులు కాని ఉండని కాలమే లేదు. ఇక ముందు, అంటే భవిష్యత్తులో 'మనం ఉండేది లేదు' అని అనుకోవద్దు. మనం ఎప్పుడూ ఉంటాం" అని భగవద్గీతలోని రెండో అధ్యాయమైన సాంఖ్యయోగంలో అర్జునుడికి శ్రీకృష్ణుడు బోధించాడు. నాశనంలేనిదీ, శాశ్వతమైనదీ అయిన జీవన అస్తిత్వానికి సంబంధించిన ప్రస్తుత 'లౌకిక భాగం' నశించడం ఖాయమనీ, కాబట్టి ముందున్న యుద్ధాన్ని కొనసాగించాలనీ సూచించాడు. శాశ్వతమైన జీవన అస్తిత్వాన్ని 'ఆత్మ', 'చైతన్యం', 'అవగాహన' అనే పేర్లతో పిలుస్తాం. దాన్నే శ్రీకృష్ణుడు 'దేహి' అన్నాడు. ఈ సృష్టి తాలూకు సారంతో మొదలుపెట్టి... శాశ్వతమైన, అపరివర్తితమైన జీవన అస్తిత్వం గురించి ఆయన వివరించాడు. శాశ్వతమైన ఆ అస్తిత్వానికి ఒక భౌతిక భాగం ఉందనీ, అది తప్పనిసరిగా నాశనం అవుతుందని చెప్పాడు. పాలకుల గురించి ఆయన ప్రస్తావిస్తూ... వారిలో ఉన్న శాశ్వతమైన, నాశనం లేని జీవన అస్తిత్వం గురించి చెప్పాడు. ఈ శ్లోకంలో గమనించవలసిన విషయం ఏమిటంటే... మన సృష్టి రెండు భాగాలుగా జరిగింది. మొదటి భాగం దేహం, మనస్సు. ఈ రెండూ తప్పనిసరిగా నాశనం అవుతాయి. ఇవి సుఖదుఃఖాల్లాంటి ద్వంద్వాలకు లోనవుతున్నాయి. కురుక్షేత్రంలో అర్జునుడు అటువంటి భావనకే లోనవుతున్నాడు. రెండవ భాగం శాశ్వతమైన 'దేహి'. దీన్ని గ్రహించాలనీ, మనల్ని శరీరంతో, మనస్సుతో (అసత్)తో గుర్తించుకోవడం మానేసి... దేహి (సత్)తో గుర్తించుకోవడం ప్రారంభించాలనీ ఆయన స్పష్టం చేశాడు. బుద్ధత్వం (ఆత్మజ్ఞానం) అనేది ఈ గుర్తింపులను అధిగమించినప్పుడే కలుగుతుంది. దాన్ని అనుభూతి చెందాల్సిందే తప్ప మాటలలో వర్ణించలేం.

యుద్ధం చెయ్యాలని అర్జునుడికి చెప్పే భాగమే 'భగవద్గీత'లో మన అవగాహనకు లొంగని అత్యంత క్లిష్టమైన భాగం. కొంతమంది అసలు కురుక్షేత్ర యుద్ధమే జరగలేదనీ, అది మన దైనందిన పోరాటాలను ప్రదర్శించే రూపకం మాత్రమేననీ అంటారు. అయితే అర్జునుడు విరమించినంత మాత్రాన... యుద్ధం ముగిసే అవకాశం లేదనేది కూడా నిజం. అవగాహన, బోధన అనే ఆయుధాలతో యుద్ధాలను ఎదుర్కోవాలని శ్రీకృష్ణుడు బోధించాడు. 'అహంకారం' (నేను కర్తను అనే భావన)తో అర్జునుడు యుద్ధం నుంచి ఒకవేళ వైదొలగినా... విషాదానికి శాశ్వతంగా బానిస అవుతాడని శ్రీకృష్ణుడికి తెలుసు. అందుకే 'సత్'ను గ్రహించి యుద్ధం చేయాలని సలహా ఇచ్చాడు.

> అవగాహన, బోధన అనే ఆయుధాలతో యుద్ధాలను ఎదుర్కోవాలని శ్రీకృష్ణుడు బోధించాడు. 'అహంకారం' (నేను కర్తను అనే భావన)తో అర్జునుడు యుద్ధం నుంచి ఒకవేళ వైదొలగినా... విషాదానికి శాశ్వతంగా బానిస అవుతాడని శ్రీకృష్ణుడికి తెలుసు. అందుకే 'సత్'ను గ్రహించి యుద్ధం చేయాలని సలహా ఇచ్చాడు.







కె. శివప్రసాద్
ఐఏఎస్

సద్బోధ

మోక్షానికి అర్హత

ఒక అరణ్యంలో ఇద్దరు యోగులు ఆశ్రమం ఏర్పాటు చేసుకొని, ఆధ్యాత్మిక సాధన చేస్తున్నారు. భగవంతుడి అనుగ్రహం పొంది, మోక్షాన్ని సాధించాలనేది వారి ఆశయం. ఒక రోజు నారద మహర్షి అటువైపుగా వచ్చి, ఆ ఆశ్రమం దగ్గర ఆగాడు. యోగులు ఇద్దరూ ఆయనకు నమస్కరించారు. ఆశ్రమంలోకి ఆహ్వానించారు. అతిథి సత్కారాలు చేశారు. "స్వామీ! ఎక్కడినుంచి వస్తున్నారు?" అని అడిగారు.

"నాయనలారా! నేను దివ్యలోకాలలో ఉన్న ఆ పరంధాముణ్ణి దర్శించుకొని వస్తున్నాను" అని బదులిచ్చాడు నారదుడు.

"మీరు దర్శించినప్పుడు ఆ భగవంతుడు ఏం చేస్తున్నారు?" అని ప్రశ్నించారు యోగులు.

"నేను వెళ్ళేసరికి భగవానుడు తీరికగానే ఉన్నారు. ఒక సూది బెజ్జంలోనుంచి ఏనుగులను, ఒంటెలను ఒకవైపు నుంచి మరో వైపు తీస్తూ ఆడుకుంటున్నారు. ఇది విచిత్రంగా అనిపిస్తోందా?" అన్నాడు నారదుడు.

"అందులో గొప్ప విచిత్రం ఏముంది స్వామీ! ఆయన చేయలేనిది ఏముంటుంది? ఈ సృష్టి అంతా ఆయన లీలే కదా!" అన్నాడు ఒక యోగి.

ఆ మాటలను రెండో యోగి ఖండిస్తూ "మీరు చెబుతున్నదంతా అభూతకల్పన! సూది బెజ్జంలోకి ఏనుగులు, ఒంటెలు ఎలా వెళ్తాయి? అది అసాధ్యం. మీ మాటలను బట్టి... అసలు మీరు భగవంతుణ్ణి కలుసుకోలేదని అర్థమైపోతోంది" అన్నాడు.

అప్పుడు నారదుడు "ఒక చిన్న పిల్లవాడు తనకు తల్లితండ్రులు చెప్పే ప్రతి విషయాన్నీ నమ్ముతాడు. భక్తుడికి కూడా భగవంతుడికి పట్ల అలాంటి నమ్మకమే ఉండాలి. భగవంతుడికి అసాధ్యం అనేది ఏదీ ఉండదు. ఆయన శక్తిని పూర్తిగా గ్రహించగలిగేవారు ఎవరూ లేరు. ఆయన ఎవరి ఊహలకూ అందనివాడు. ఈ భౌతిక ప్రపంచంలోని కొలమానాలతో ఆయనను లెక్క వెయ్యడం అవివేకం. మీలో ఎవరు మోక్షానికి అర్హులో నిర్ణయించాలని ఆ భగవంతుడు నన్ను అడిగారు. భగవంతుడి మీద నిస్సందేహమైన విశ్వాసమే మోక్షానికి అర్హత. ఆ అర్హత ఎవరికి ఉన్నదో మీకు అర్థమయిందనుకుంటాను" అన్నాడు చిరునవ్వుతో.

"మోక్షం పొందాలంటే ఏం చెయ్యాలి? అది ఎవరికి లభిస్తుంది?" అని శిష్యులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా శ్రీ రామకృష్ణ పరమహంస చెప్పిన కథ ఇది.



సుభాషితం

దైవ బలం లేనప్పుడు...

దురదృష్టవంతులను ఆపదలు ఎలా వెంటాడతాయో...

ఖర్వాటో దివసేశ్వరస్య కిరణైః సంతాడితో మస్తకే
వాంఛన్దేశమనాతపం విధి వశాత్తాలస్య మూలం గతః
తత్రాప్యస్య మహాఫలేన పతతా భగ్నం సశబ్దం శిరః
ప్రాయో గచ్ఛతి యత్ర దైవహతక స్తత్రైవ యాంత్యాపదః ... అనే ఈ శ్లోకంలో భర్తృహరి వర్ణించాడు.



ఆ శ్లోకాన్ని...

ధర ఖర్వాటుడొకండు సూర్య కర సంతప్త ప్రధానాంగుడై
త్వర తోడన్ బరువెత్తి చేరి నిలచెన్ తాళ ద్రుమచ్ఛాయ త
చ్ఛిరమున్ తత్ఫల పాత వేగమున విచ్చెన్ శబ్ద యోగంబుగా
బొరి దైవోపహతుండు వోవు కడకుం పోవుంగదా యాపదల్ ... అంటూ ఏనుగు లక్ష్మణకవి తెలుగువారికి అందించాడు.

భావం: మండు వేసవి కాలంలో ఒక వ్యక్తి ప్రయాణం చేస్తున్నాడు. మధ్యాహ్న సూర్యుడు నడినెత్తిన ఉన్నాడు. పైగా ఆ వ్యక్తికి బట్టతల. ఎండ కారణంగా తలమాడిపోతూ ఉంటే తట్టుకోలేక.. సొమ్మసిల్లిపోతున్నాడు. ఎండ బారి నుంచి తప్పించుకోవడానికి నీడ కోసం వెతికాడు. కొంతసేపటికి ఒక తాటి చెట్టు కనిపించింది. దాని కింద నీడ ఎక్కువగా లేకపోయినా... గత్యంతరం లేక ఆ చెట్టు కింద నిలబడ్డాడు. ఇంతలో ఆ చెట్టు నుంచి ఒక తాటి పండు రాలి... సరిగ్గా అతని తలమీద పడింది. పెద్ద శబ్దంతో ఆ బాటసారి తల బద్దలై... అతను అక్కడికక్కడే మరణించాడు. 'దైవ బలం లేని దురదృష్టవంతులకు ఎక్కడికి వెళ్ళినా ఆపదలు తప్పవు' అంటున్నాడు ఆ శ్లోకంలో భర్తృహరి.


రెజ్యూమ్ వాటర్ వేపర్ థెరపీ వివరాలు వెల్లడించిన ఏఐఎన్‌యూ వైద్య బృందం

ప్రోస్టేట్ సమస్యకు నీటి ఆవిరి చికిత్స

- అంగస్తంభన, వీర్యస్ఖలన ఇబ్బందులకు చెక్
- ఏఐఎన్‌యూ ఎండీ డాక్టర్ సి.మల్లికార్జున

హైదరాబాద్ సిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రోస్టేట్ గ్రంధి ఉబ్బే (ప్రోస్టేట్ ఎన్‌లార్జ్‌మెంట్) సమస్యతో బాధపడేవారికి రెజ్యూమ్ వాటర్ వేపర్ థెరపీ' అనే చికిత్స ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ (ఏఐఎన్‌యూ)లో అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం ఈ సమస్యకు కొంతకాలం మందులు వాడి, ఆ తర్వాత శస్త్రచికిత్స చేస్తున్నారు. కానీ, దానివల్ల కొంతమందిలో అంగస్తంభన, వీర్యస్ఖలన సమస్యలు వస్తున్నాయని.. ఆ ఇబ్బందులు లేకుండా, ప్రోస్టేట్ సమస్యను రెజ్యూమ్ వాటర్ వేపర్ థెరపీ'తో నివారించవచ్చని ఏఐఎన్‌యూ ఆస్పత్రి ఎండీ, చీఫ్ యూరాలజిస్ట్ డాక్టర్ సి.మల్లికార్జున గురువారం ఇక్కడ నిర్వహించిన విలేఖరుల సమావేశంలో వెల్లడించారు. ఈ చికిత్స చేసిన 15 రోజుల నుంచి నెల రోజుల్లోపు పూర్తి ఫలితాలు కనిపిస్తాయని ఆయన వివరించారు. అయితే.. యుక్తవయసులో ఉండి, ప్రోస్టేట్ సమస్య మధ్యస్థాయిలో ఉన్న రోగులకు ఈ చికిత్స బాగా ఉపయోగపడుతుందని.. వృద్ధుల్లో ఇది అంతగా ప్రభావం చూపించకపోవచ్చునని, అలాగే ప్రోస్టేట్ సమస్య తీవ్రంగా ఉన్నవారికి, లేదా సంక్లిష్ట సమస్యలు ఉన్నవారికి ఇది పనికిరాదని ఆయన స్పష్టం చేశారు.

నీటి ఆవిరిని ఇంజెక్షన్ రూపంలో..

రెజ్యూమ్ వాటర్ వేపర్ థెరపీ చేయడానికి పూర్తిస్థాయిలో మత్తు ఇవ్వాల్సిన పనిలేదని.. లోకల్ ఎనస్థీషియాతోనే ఈ చికిత్స చెయ్యొచ్చని డాక్టర్ మల్లికార్జున తెలిపారు. చికిత్సలో భాగంగా నీటి ఆవిరిని ఇంజెక్షన్ రూపంలో ప్రోస్టేట్ గ్రంధిలోకి పంపుతామని.. ఇలా పంపిన ఆవిరి.. మూత్రనాళాన్ని నొక్కుతూ ఉన్న అదనపు ప్రోస్టేట్ కణజాలాన్ని క్రమంగా ముడుచుకుపోయేలా చేస్తుందని ఆయన వివరించారు. ఇది చాలా సులభమైన చికిత్స అని, 1-2 సిటింగుల్లో అయిపోతుందని వెల్లడించారు. ఈ చికిత్స వల్ల అంగస్తంభన సమస్య, వీర్య స్ఖలనం సరిగా లేకపోవడం వంటి దుష్ప్రభావాలేవీ ఉండవని పేర్కొన్నారు. అయితే.. ఈ చికిత్స తీసుకున్న తర్వాత కొన్ని రోజుల పాటు కాఫీ, చాక్లెట్లు, మద్యం తీసుకోకూడదని తెలిపారు. కాగా.. ఈ ప్రెస్‌మీట్‌లో ఏఐఎన్‌యూకు చెందిన సీనియర్ యూరాలజిస్ట్ డాక్టర్ సయ్యద్ మహ్మద్ గౌస్, యూరాలజిస్ట్ డాక్టర్ విజయ్ కుమార్ శర్మ, యూరాలజీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సందీప్ గూడూరు తదితరులు పాల్గొన్నారు.

ప్రోస్టేట్ గ్రంధి ఉబ్బితే..

వయసు మీదపడే కొద్దీ పురుషుల్లో ప్రోస్టేట్ గ్రంధి ఉబ్బడం సహజం. అయితే, చాలా మందిలో దీని లక్షణాలేవీ కనపడవు. 40 శాతం మందిలో మాత్రం.. మూత్రవిసర్జన ఆపుకోలేకపోవడం, తెలియకుండానే మూత్రం కారిపోవడం, రాత్రిళ్ల తరచు మూత్రానికి లేవాల్సి రావడం, మూత్రం నెమ్మదిగా పడడం, మూత్రం పోయాలంటే పొట్ట బాగా ఒత్తాల్సి రావడం, మూత్రం పోసినా బ్లాడర్ ఖాళీ అయినట్లు అనిపించకపోవడం లాంటివి ఇబ్బందులు ఎదుర్కొంటారు.

సెకీతో ఒప్పందంపై జగన్ అడ్డగోలు వాదన



(మొదటిపేజీ తరువాయి)

అనేక అబద్ధాలు, అర్ధసత్యాలతో మాయ చేసేందుకు ప్రయత్నించారు. 48 గంటల్లో క్షమాపణలు చెప్పకుంటే వందకోట్లకు పరువునష్టం దావా వేస్తానని 'ఆంధ్రజ్యోతి'ని బెదిరించారు కూడా!

హవ్వ... అంత అబద్ధమా?

'దేశంలోనే అత్యంత చౌకగా... రూ.2.49కే యూనిట్ విద్యుత్ సరఫరా చేసేలా ఒప్పందం చేసుకున్నాం. దీనికి ఇంటర్‌స్టేట్ ట్రాన్స్‌మిషన్ చార్జీలను మినహాయించేందుకు సెకీ అంగీకరించింది' అని జగన్ గురువారం గొప్పగా చెప్పారు. ఇదో పెద్ద.. శుద్ధ అబద్ధం! ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి గ్రిడ్ ద్వారా విద్యుత్తు సరఫరా చేస్తే వసూలు చార్జీలనే ఇంటర్‌స్టేట్ ట్రాన్స్‌మిషన్ చార్జీలు అంటారు. సెకీ దీనిని మినహాయించలేదని, ఆ మొత్తం యూనిట్‌కు రూ.1.70 వరకు ఉంటుందని అప్పటి ఇంధన శాఖ కార్యదర్శి నాగులాపల్లి శ్రీకాంత్ అప్పట్లో ప్రకటించారు. గత ఏడాది కేంద్ర ప్రభుత్వం దీని పేరును 'జనరల్ పవర్ యాక్సిస్' (జీపీఏ)గా మార్చింది. దీని ప్రకారం... యూనిట్‌కు 80 పైసల నుంచి రూ.1.70 దాకా జీపీఏ చెల్లించాల్సి ఉంటుంది. కనిష్ఠంగా 80 పైసలు లెక్కలోకి తీసుకున్నా, ఒప్పందకాలం పాతికేళ్లకు రూ.62వేల కోట్ల భారం పడుతుంది. ఇదీ అసలు నిజం!

మాటి మాటికీ మారే మాట...

జగన్ ప్రతిపక్ష నేత హోదాలో ఉండగా.. దీర్ఘకాలిక విద్యుత్తు ఒప్పందాలను బలంగా వ్యతిరేకించారు. 2014-19 కాలంలో సౌర విద్యుత్తు సంస్థలతో చంద్రబాబు ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలన్నీ లంచాల కోసమేనని జగన్ ఆరోపించారు. విద్యుత్తు రంగంలో వేగంగా మార్పులు ఉంటాయని .. దీర్ఘకాలిక ఒప్పందాలు చేసుకోవడం తప్పని వాదించారు. అధికారపగ్గాలు చేపట్టిన వెంటనే.. వాస్తవాలను పరిశీలించకుండా, పర్యవసానాలను ఆలోచించకుండా సౌర, పవన విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలను (పీపీఏ) రద్దు చేశారు. దీంతో ఒక్క యూనిట్ కరెంటు వాడుకోకున్నా ఆయా సంస్థలకు రూ.4500 కోట్ల మేర చెల్లింపులు జరపాల్సి వచ్చింది ఆ తర్వాత అదే జగన్.. 'సెకీ'తో ఏకంగా పాతికేళ్ల కాలానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. గడచిన పదేళ్లుగా సౌర విద్యుత్తు ధరలు తగ్గుతూ వస్తున్నాయి. 2014లో ఇదే 'సెకీ' యూనిట్ సౌర విద్యుత్తు రూ.5.50కి సరఫరా చేసింది. ఆ తర్వాత ఈ ధర క్రమంగా తగ్గుతూ వచ్చింది. 2021లో కనిష్ఠంగా రూ.2.14కు చేరింది. కానీ... అదే సంవత్సరం జగన్ పాతికేళ్లపాటు యూనిట్‌కు రూ.2.49 చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకోవడం గమనార్హం! ప్రస్తుతం యూనిట్ ధర రూ.2.51 వరకు పలుకుతోంది. అది స్థిరంగా ఉండదని... భవిష్యత్తులో బాగా తగ్గుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. మరి... రాష్ట్ర ప్రజలకు చేసింది మేలా? కీడా?

ఆ టెండర్లు ఎందుకు రద్దు చేయలేదు?

'2021 సెప్టెంబరులో సెకీ నుంచి తియ్యటి కబురు వచ్చింది. మా విద్యుత్తు విధానాలను ప్రశంసిస్తూ... రూ.2.49కే యూనిట్ సౌర విద్యుత్తు సరఫరా చేసేందుకు ముందుకొచ్చింది" అని జగన్ ముద్దుముద్దు మాటలు చెప్పారు. నిజానికి... 2020లో రాష్ట్ర ప్రభుత్వ గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్ లిమిటెడ్ పిలిచిన టెండర్లకే రూ.2.49కే సౌర విద్యుత్తు సరఫరా చేసేందుకు పలు సంస్థలు ముందుకొచ్చాయి. 'సెకీ' కూడా అదే రేటు నిర్ణయించింది. అయినా సరే... గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్ పిలిచిన టెండర్లను జగన్ సర్కారు రద్దు చేసింది. 'సెకీ' పవర్‌కు జై కొట్టింది. అందులోనూ... తాను గొప్పగా ప్రవేశపెట్టినట్లు చెప్పుకొనే 'రివర్స్ టెండర్'కు కూడా పోకుండా వేలకోట్ల ఒప్పందాన్ని ఏకపక్షంగా కుదుర్చుకున్నారు. ఇదంతా ఎవరి కోసం?

'అదానీ' కోసం కాదా?

'కేంద్ర ప్రభుత్వ సంస్థ సెకీతో రాష్ట్ర ప్రభుత్వం, డిస్కమ్‌లు ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఇందులో థర్డ్ పార్టీ (అదానీ) ప్రస్తావన ఎక్కడుంది?' అని జగన్ చాలా తెలివిగా ప్రశ్నించారు. ఒప్పందం 'సెకీ'తో కుదిరినప్పటికీ.. కరెంటు సరఫరా చేసేది అదానీయే! 'సెకీ' ఒక మధ్యవర్తి మాత్రమే! కమీషన్ తీసుకోవడానికే దీని పాత్ర పరిమితం! 'సెకీ' ద్వారా రాష్ట్రాలకు 12వేల మెగావాట్ల విద్యుత్ సరఫరా చేసేందుకు అదానీ, అజూర్ సంస్థలు ఒప్పందం చేసుకున్నాయి. కానీ... ఆ ధరకు, దీర్ఘకాలం కరెంటు కొనుగోళ్లకు రాష్ట్రాలు ముందుకు రాలేదు. 'పవర్ డీల్' అనిశ్చితిలో పడటం... పెట్టుబడిదారుల నుంచి ఒత్తిడి రావడంతో రాష్ట్రాలకు 'లంచాలు ఎరవేసి' ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు అమెరికా 'సెక్', దర్యాప్తు సంస్థలు నిర్ధారించాయి. 12వేల మెగావాట్లలో ఏపీ ఒక్కటే ఏడువేల మెగావాట్ల కొనుగోలుకు సిద్ధపడటం గమనార్హం. అందుకే... ఈ కేసు నివేదికలో 'ఆంధ్రప్రదేశ్ చీఫ్ మినిస్టర్' అని జగన్ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు.

కిరాయి మూకలపై చర్యలు తప్పవు!

- అసభ్య భాషతో తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారు: ఏపీ హైకోర్టు
- విజయ్‌బాబు పిల్ వెనుక రాజకీయ దురుద్దేశం
- ధర్మాసనం ఆగ్రహం.. వ్యాజ్యం కొట్టివేత
- రూ.50 వేల ఖర్చులు విధింపు

అమరావతి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): డబ్బులు తీసుకుని అవతలివారిపై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టే కిరాయి మూకలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవలసిందేనని ఏపీ హైకోర్టు తేల్చిచెప్పింది. చట్టరీత్యా నేరమైన అంశాలను సోషల్ మీడియాలో ప్రచురించిన వ్యక్తులు.. చర్యల నుంచి మినహాయింపు కోరలేరని స్పష్టం చేసింది. అసభ్యకరమైన భాష వాడుతూ తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసే వ్యక్తులను సోషల్ మీడియా ఉద్యమకారులుగా చెప్పలేమని తెలిపింది. సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నవారిపై కేసులు నమోదు చేయకుండా పోలీసులను ఆదేశించాలని కోరుతూ పాత్రికేయుడు, వైసీపీ ప్రభుత్వంలో అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా పనిచేసిన పోలా విజయ్‌బాబు దాఖలు చేసిన ప్రజాప్రయోజనం వ్యాజ్యం (పిల్) వెనుక రాజకీయ దురుద్దేశం ఉందని స్పష్టం చేసింది. దానిని కొట్టివేసింది. ఆయనకు రూ.50 వేల ఖర్చులు విధించింది. ఈ సొమ్మును నెలరోజుల్లోగా రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థకు జమచేయాలని ఆదేశించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం తీర్పు ఇచ్చింది. ఈ నెల 13న ఇచ్చిన ఈ తీర్పు ప్రతి తాజాగా అందుబాటులోకి వచ్చింది. సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నవారిపై సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధంగా కేసులు పెడుతూ పోలీసులు చట్టనిబంధనలు ఉల్లంఘిస్తున్నారని, వారి చర్యలపై విచారణకు ఆదేశించాలని కోరుతూ విజయ్‌బాబు పిల్ వేశారు. దీనిపై ఈ నెల 13న విచారణ జరిపిన ధర్మాసనం.. పోలీసులు నమోదు చేస్తున్న కేసుల విషయంలో జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది.

ఆ కేసులో నా పేరెక్కడుంది?

- అదానీ నాకు లంచం ఇచ్చినట్లు ఎక్కడ రాశారు?
- అతి తక్కువ ధరకు విద్యుత్ కొన్నాం
- మంచి చేసినందుకు నన్ను సన్మానించాలి
- 'ఆంధ్రజ్యోతి' క్షమాపణలు చెప్పాలి
- లేదంటే... రూ.వంద కోట్లకు దావా వేస్తా
- ఏపీ మాజీ సీఎం జగన్ బెదిరింపులు

అమరావతి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): "దేశంలోనే అతితక్కువ ధరకు సౌర విద్యుత్ యూనిట్ రూ.2.49కే సెకీ నుంచి సౌరవిద్యుత్తు కొనుగోలు చేసి, రాష్ట్రానికి మంచి చేస్తే శాలువా కప్పి సన్మానం చేయాలి కదా! అలా చేయకుండా నా వ్యక్తిత్వం మీద బురద జల్లడమేమిటి?'... అని ఏపీ మాజీ సీఎం జగన్ విస్మయం, ఆక్రోశం వ్యక్తం చేశారు. అదానీపై అమెరికాలో పెట్టిన కేసులో తన పేరెక్కడుందని ప్రశ్నించారు. తాను సంపదను సృష్టిస్తే.. ఇప్పటి సీఎం చంద్రబాబు దానిని ఆవిరి చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. గురువారం ఆయన మొదటిసారిగా 'అదానీ సోలార్ పవర్ డీల్'పై స్పందించారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. మంచి చేసినోడిపై రాళ్లేస్తున్నారని ఆరోపించారు. "ఒప్పందంపై కేంద్ర ప్రభుత్వ సంస్థ సెకీ, ఏపీ ప్రభుత్వం, డిస్కమ్‌లు సంతకాలు చేశాయి. ఇందులో థర్డ్ పార్టీ ఎక్కడుంది?" అంటూ అదానీ గ్రీన్ ఎనర్జీతో సంబంధమే లేదన్నట్లుగా జగన్ మాట్లాడారు. అంతేకాదు... ఇంటర్‌స్టేట్ ట్రాన్స్‌మిషన్ చార్జీలను మినహాయిస్తున్నట్లు ఒప్పందంలో స్పష్టంగా ఉందన్నారు. ఇంటర్‌స్టేట్ ట్రాన్స్‌మిషన్ చార్జీలు యూనిట్ రూ.1.98 దాకా పడతాయని.. కానీ, అదేమీ లేకుండానే కేవలం యూనిట్ రూ.2.49కే విద్యుత్తును అందిస్తామని సెకీ వెల్లడించిందని తెలిపారు. రాష్ట్ర చరిత్రలోనే అతి తక్కువ ధరకు విద్యుత్తు కొనుగోలు ఒప్పందం చేశామని జగన్ తనను తాను ప్రశంసించుకున్నారు. గుజరాత్, రాజస్థాన్‌లో ఉన్న ధరల గురించి మాట్లాడుతున్న వాళ్లు... ట్రాన్స్‌మిషన్ కాస్ట్ మినహాయింపు గురించి ఎందుకు మాట్లాడటంలేదని ప్రశ్నించారు. మంచి చేసిన తనపై బండలు వేయడమే పనిగా పెట్టుకుని 'ఆంధ్రజ్యోతి', 'ఈనాడు' కథనాలు రాస్తున్నాయంటూ ఆరోపించారు. ఈ ఒప్పందం వల్ల రాష్ట్రానికి లక్షల కోట్ల రూపాయలు ఆదా అయ్యాయని అన్నారు. ఈ ఒప్పందంలో తప్పుంటే అప్పుడే చంద్రబాబు, 'ఆంధ్రజ్యోతి', 'ఈనాడు' ఊరుకునేవా అని జగన్ ప్రశ్నించారు. వ్యాపారవేత్త గౌతమ్ అదానీపై అమెరికాలో ఎఫ్‌బీఐ నమోదు చేసిన కేసులో తన పేరు లేదని జగన్ పేర్కొన్నారు. అదానీ తనకు లంచం ఇస్తానంటూ బేరాలాడినట్లు ఎక్కడైనా ఉందా అని ప్రశ్నించారు. 'ఈనాడు', 'ఆంధ్రజ్యోతి'కి డెడ్‌లైన్ విధిస్తున్నానని, 48 గంటల్లో క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రూ.100 కోట్లకు పరువునష్టం దావా వేస్తానని ప్రకటించారు. రిపోర్టులో 'ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి' అని చాలాస్పష్టంగా ఉందికదా అని మీడియా ప్రతినిధి ప్రశ్నించగా... "అమెరికా అధ్యక్షుడు బైడెన్‌కు లంచాలు ఇచ్చినట్లుగా మన రాష్ట్రానికి చెందిన సీఐడీ కేసు నమోదు చేస్తే చెల్లుబాటు అవుతుందా?' అని జగన్ ఎదురు ప్రశ్నించారు.

అదానీతో భేటీ ఎందుకంటే...

సెకీతో ఒప్పందానికి ముందు గౌతమ్ అదానీతో జరిగిన భేటీలు సాధారణమైనవే అని జగన్ తెలిపారు. పారిశ్రామికవేత్తలు ముఖ్యమంత్రిని కలవడం సహజమేనన్నారు. సెకీతో ఒప్పందానికి ముందు చాలాసార్లు.. ఒప్పందం జరిగాక కూడా ఆయన చాలా సార్లు తనను కలిశారని జగన్ తెలిపారు.

నవ్య | చిత్రజ్యోతి

ఎంతో సంతోషంగా ఉంది




అక్కినేని వారి ఇంట పెళ్లి సందడి మొదలైన సంగతి తెలిసిందే. నాగచైతన్య, శోభిత పెళ్లి డిసెంబరు 4న జరగనుండగా.. అఖిల్‌కు ఇటీవలే తన ప్రేయసి జైనబ్‌తో నిశ్చితార్థం జరిగింది. తన కుటుంబంలో జరుగుతోన్న వరుస శుభకార్యాల పట్ల నాగార్జున సంతోషం వ్యక్తం చేశారు. ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ "ఈ ఏడాది మాకెంతో ప్రత్యేకమైనది. ఓ వైపు నాన్న శతజయంతి ఉత్సవాలు జరుగుతున్నాయి. మరోవైపు మా ఇద్దరబ్బాయిలు కొత్త జీవితాన్ని ప్రారంభించబోతున్నారు. నాగచైతన్య, శోభిత పెళ్లికి ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. ఏఎన్నార్ స్థాపించిన అన్నపూర్ణ స్టూడియోస్‌లో ఈ పెళ్లి జరగబోతున్నందుకు, అఖిల్ కూడా వైవాహిక బంధంలోకి అడుగుపెడుతున్నందుకు ఆనందంగా ఉంది. జైనబ్ చాలా మంచి అమ్మాయి. ఇతరులపై ఎంతో ప్రేమ, అభిమానం చూపిస్తారు. వారిద్దరూ కలిసి జీవితాన్ని పంచుకోవాలని నిర్ణయించుకున్నందుకు సంతోషంగా ఉంది. అఖిల్ జీవితాన్ని ఆమె పరిపూర్ణం చేయగలరు. ఆమెను సంతోషంగా మా కుటుంబంలోకి ఆహ్వానిస్తున్నాం. వచ్చే ఏడాదిలో వీరి పెళ్లి జరగనుంది" అని నాగార్జున తెలిపారు.

మీ అభిమానాన్ని మర్చిపోలేను




అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన పాన్ ఇండియా సినిమా 'పుష్ప 2'. నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం డిసెంబరు 5న విడుదలవుతోంది. ఇప్పటికే ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా పట్నా.. చెన్నైలో ఈవెంట్స్ నిర్వహించింది చిత్ర బృందం. తాజాగా, కేరళలో జరిగిన ఈవెంట్‌లో అల్లు అర్జున్ మాట్లాడుతూ 'థ్యాంక్యూ కేరళ. మీ దత్త పుత్రుడు మల్లు అర్జున్‌కు మీరిచ్చిన ఈ ఘనస్వాగతాన్ని జీవితాంతం మరిచిపోలేను. 20 సంవత్సరాలుగా మీరు నాపై ఎంతో ప్రేమ చూపిస్తున్నారు. ఈ సినిమా నా కెరీర్‌లో ఎంతో ప్రత్యేకం. ఫహాద్ ఫాజిల్‌తో నటించినందుకు ఆనందంగా వుంది. ఈ సినిమా కోసం మీరు మూడేళ్లుగా వెయిట్ చేస్తున్నందుకు కృతజ్ఞతలు. తప్పకుండా ఇక నుంచి తొందరగా సినిమాలు చేస్తాను. సుకుమార్ తీసిన 'ఆర్య' చిత్రంతోనే నాకు కేరళలో గుర్తింపు దక్కింది. ఆయన వల్లే నేను మీకు దగ్గరయ్యాను. సినిమాలో మలయాళ లిరిక్స్‌తో ఓ సాంగ్‌ను చేశాం" అని చెప్పారు. "నాకు కుదిరితే కొచ్చి వచ్చి మీ అందరితో కలిసి సినిమా చూస్తాను. కేరళతో నా అనుబంధం ప్రత్యేకమైనది" అని రష్మిక మందన్నా అన్నారు. "మీ అందరి ఆదరాభిమానాలు చూస్తుంటే ఇది మాకు కేరళలా లేదు. హైదరాబాద్‌లో ఉన్నట్లు ఉంది. 'పుష్ప 2' అందరి అంచనాలకు మించి ఉంటుంది" అని నిర్మాతలు నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ అన్నారు.

గగనాలన్నీ పూలడుగులు భువనాలన్నీ పాలమడుగులు



శంకర్ దర్శకత్వంలో రామ్ చరణ్ హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'గేమ్ చేంజర్'. దిల్ రాజు, శిరీష్ భారీ బడ్జెట్‌తో తెలుగు, తమిళ, హిందీ భాషల్లో నిర్మిస్తున్నారు. సంక్రాంతి కానుకగా జనవరి 10న విడుదలవుతోంది. ఈ చిత్రం నుంచి రొమాంటిక్ సాంగ్ విడుదలైంది. ఈ పాటను తెలుగులో రామజోగయ్య శాస్త్రి, తమిళంలో వివేక్, హిందీలో కౌశర్ మునీర్ రాశారు. భారతీయ సినిమాల్లో తొలిసారిగా రెడ్ ఇన్‌ఫ్రా కెమెరాతో ఈ పాటను న్యూజిలాండ్‌లో చిత్రీకరించారు. సంగీత దర్శకుడు తమన్ ఈ పాటను ఫ్యూజన్ మెలోడీ(వెస్ట్రన్, కర్ణాటక కాంబో)గా ట్యూన్ చేశారు. శ్రేయా ఘోషల్, కార్తీక్ పాడారు.

తుది దశలో హరి హర వీరమల్లు



పవన్ కళ్యాణ్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'హరి హర వీరమల్లు పార్ట్-1 - స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' నిర్మాణం తుది దశకు చేరుకుంది. ఈ వారాంతంలో విజయవాడలో తుది షెడ్యూల్ ప్రారంభం కానుంది. ప్రేక్షకులకు ప్రత్యేకమైన, మరపురాని థియేట్రికల్ అనుభవాన్ని అందించాలనే లక్ష్యంతో నిర్మాత ఏ.ఎం.రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్స్ బేనర్‌పై ఎ.దయాకర్ రావు భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి 28న ప్రపంచ వ్యాప్తంగా తెలుగు, తమిళం, మలయాళం, హిందీ, కన్నడ భాషల్లో విడుదలవుతోంది. పవన్ కళ్యాణ్ ఇటీవల మహారాష్ట్రలో పర్యటించారు. ఆయన సభలకు అక్కడి ప్రజల నుంచి విశేష జనాదరణ లభించింది. ఈ సందర్భంగా 'హరి హర వీరమల్లు' చిత్రం గురించి తెలుసుకునేందుకు ఆసక్తిని చూపించారు. సినిమా విడుదల కోసం ఎదరు చూస్తున్నామని వారు చెప్పారు. ఈ చిత్రంపై దేశవ్యాప్తంగా అంచనాలు పెరిగాయి. ఈ నేపథ్యంలో పవన్ కళ్యాణ్ అభిమానుల అంచనాలను దృష్టిలో ఉంచుకొని దర్శకుడు జ్యోతి కృష్ణ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తున్నారు.

విజయవాడలో ప్రారంభం కానున్న షెడ్యూల్‌లో కీలకమైన భారీ సన్నివేశాలను చిత్రీకరించబోతున్నట్లు చిత్ర నిర్మాతలు తెలిపారు. ఈ చిత్రీకరణలో పవన్ కళ్యాణ్‌తో పాటు 200 మంది ఆర్టిస్టులు పాల్గొనబోతున్నారు. ఈ షెడ్యూల్‌తో 'హరి హర వీరమల్లు' చిత్రీకరణ మొత్తం పూర్తవుతుందని మేకర్స్ తెలిపారు. ప్రముఖ బాలీవుడ్ నటుడు, యానిమల్ ఫేమ్ బాబీ డియోల్ ఈ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తుండగా, నిధి అగర్వాల్ కథానాయికగా నటిస్తున్నారు. అనుపమ్ ఖేర్, నాజర్, రఘుబాబు తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఎం.ఎం. కీరవాణి ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.

గుర్తింపు కోసం నగ్నంగా నటించాల్సిన అవసరం లేదు



మలయాళ నటి దివ్యప్రభ నటించిన చిత్రం 'ఆల్ వియ్ ఇమాజిన్ ఆజ్ లైట్'. ఈ సినిమా ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఇందులో ఆమె నటించిన ఓ న్యూడ్ సీన్ క్లిప్‌ను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ నెటిజన్లు రకరకాల కామెంట్స్ చేస్తున్నారు. వీటిపై స్పందించారు దివ్య ప్రభ. "ఈ సినిమాని అంగీకరించినప్పుడే ఇలాంటి పరిస్థితి వస్తుందని ఊహించాను. నేను ఆ సన్నివేశంలో నటించడాన్ని కొందరు విమర్శిస్తున్నారు. సినిమా మొత్తం చూడకుండా కేవలం ఈ సన్నివేశాన్ని మాత్రమే షేర్ చేస్తోన్న వారి మైండ్ సెట్ ఏంటో నాకు అర్థం కావట్లేదు. నేను గుర్తింపు కోసం ఇటువంటి పని చేశా అంటున్నారు. ఒక నటిగా మంచి ప్రాధాన్యం ఉన్న పాత్రలనే నేను అంగీకరిస్తా. ఈ సినిమాలో నా పాత్ర నచ్చి.. అవసరం మేరకే ఆ సన్నివేశంలో నటించాను. కేవలం గుర్తింపు కోసం నగ్నంగా నటించాల్సిన అవసరం నాకు లేదు. ఒక నటిగా ఇప్పటికే నేను నటించిన చిత్రాలకు పలు పురస్కారాలు.. ప్రశంసలు దక్కాయి" అని పేర్కొన్నారు. కాగా, మేలో జరిగిన కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ 77వ ఎడిషన్‌లో గ్రాండ్ ప్రిక్స్ అవార్డును గెలుచుకున్న ఈ చిత్రాన్ని పాయల్ కపాడియా తెరకెక్కించారు. ఎంతో మంది విమర్శకుల ప్రశంసలు అందుకున్న ఈ చిత్రం ఇటీవలే థియేటర్లలో విడుదలైంది. దగ్గుబాటి రానా ఈ సినిమాను దేశ వ్యాప్తంగా డిస్ట్రిబ్యూట్ చేశారు.

మనసులో నిలిచిపోయే సినిమా



అల్లరి నరేశ్ నటిస్తున్న తాజా చిత్రం 'బచ్చలమల్లి'. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాలో పూర్తిస్థాయి మాస్ పాత్రను చేస్తున్నారు నరేశ్. సుబ్బు మంగదేవి దర్శకత్వంలో రాజేశ్ దండా, బాలాజీ గుత్తా నిర్మిస్తున్న ఈ చిత్రం టీజర్‌ను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా నరేశ్ మాట్లాడుతూ 'దర్శకుడు సుబ్బు కథ ఎంత బాగా చెప్పారో అంత బాగా తీశారు. 'గమ్యం', 'నాంది' చిత్రాల్లా 'బచ్చలమల్లి' కూడా ప్రేక్షకుల మనసులో నిలిచిపోతుంది. సినిమాలో పాటలు కూడా స్పెషల్‌గా ఉండబోతున్నాయి. డిసెంబర్ 20న చిత్రం విడుదలవుతుంది. చూసి ఆదరించండి' అని కోరారు.

'ఇందులో నరేశ్ ఎగ్రెసివ్ క్యారెక్టర్ చేశారు. టీజర్‌కు వచ్చిన రెస్పాన్స్ చూడగానే సినిమా బిగ్ హిట్ అనే కాన్ఫిడెన్స్ వచ్చింది' అని చెప్పారు హీరోయిన్ అమృత.

దర్శకుడు సుబ్బు మాట్లాడుతూ 'కరోనా సమయంలో మా అమ్మగారిని చూడడానికి సరైన సమయంలో వెళ్లలేకపోయా. నేను వెళ్లేటప్పటికే అదే చివరి చూపు అయింది. అప్పుడే అనిపించింది.. లైఫ్‌లో వెనక్కి వెళ్లి సరిదిద్దుకోలేని తప్పు చేయకూడదు.. అని. ఇలాంటి పాయింట్ మీదే కథ తయారు చేయాలనిపించింది. నరేశ్‌గారు కూడా ఎంకరేజ్ చేశారు. చాలా మంచి సినిమా అవుతుంది' అన్నారు.

అప్‌డేట్స్

యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరణ



హీరో నాగశౌర్య తన నూతన చిత్రాన్ని రామ్ దేశిన దర్శకత్వంలో చేస్తున్నారు. శ్రీ వైష్ణవి ఫిల్మ్స్ బేనర్‌పై శ్రీనివాసరావు చింతలపూడి నిర్మిస్తున్నారు. తాజాగా హైదరాబాద్‌లో ప్రారంభమైన ఈ షూటింగ్‌లో యాక్షన్ సీక్వెన్స్‌ని చిత్రీకరిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం 60 శాతం షూటింగ్ పూర్తి చేసుకుంది. త్వరలో టైటిల్, ఫస్ట్ లుక్‌ని రిలీజ్ చేయడానికి చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది. ఈ చిత్రానికి హారీస్ జైరాజ్ సంగీతం సమకూరుస్తున్నారు. సముద్రఖని, రాజేంద్ర ప్రసాద్, సాయికుమార్, షైమ్ గోపి, శ్రీదేవి విజయ్‌కుమార్, వెన్నెల కిశోర్, బ్రహ్మాజీ, పృథ్వీ, అజయ్, ప్రియ, నెల్లూరు సుదర్శన్, కృష్ణుడు, చమక్ చంద్ర, శివన్నారాయణ నటిస్తున్నారు.

అన్ని వర్గాలను అలరించే చిత్రం



అల్లు ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్‌పై అల్లు శ్రీరాములు నాయుడు నిర్మాణంలో కిరణ్ వారియర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మెగాస్టార్ ఫ్యాన్'. పింగ్ పాంగ్ సూర్య, డార్లింగ్ ఫేమ్ నర్సింహా కీలక పాత్రల్లో నటించారు. నేడు విడుదలవుతోంది. ఇటీవలే ఈ చిత్రం ట్రైలర్‌ని దర్శకుడు ఏ.కోదండరామి రెడ్డి విడుదల చేశారు. కిరణ్ వారియర్ మాట్లాడుతూ 'ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డాం. ఒక మెగా అభిమానిగా ఈ సినిమా తీయడం చాలా గర్వంగా ఉంది. అన్ని వర్గాల ప్రేక్షకులని అలరిస్తుంది' అని అన్నారు.

పొరపొచ్చాలతోనే పేరు తొలగింపా?



ఐశ్వర్యారాయ్ బచ్చన్, అభిషేక్ బచ్చన్ దంపతులు విడిపోతున్నారంటూ కొన్నాళ్లుగా జరుగుతున్న ఊహాగానాలకు మరోసారి రెక్కలొచ్చాయి. ఈ మధ్య ఐశ్వర్యారాయ్, అభిషేక్ బచ్చన్ కలసి కనిపించడం లేదు అని అంతా చర్చించుకుంటున్న తరుణంలో ఇప్పుడు ఐశ్వర్యారాయ్ పేరులో 'బచ్చన్' అనే వారి ఇంటిపేరు కనిపించడం లేదు. ఇటీవలే దుబాయ్‌లో జరిగిన గ్లోబల్ విమెన్స్ ఫోరమ్‌లో ఐశ్వర్యారాయ్ పాల్గొన్నారు. అక్కడ మహిళా సాధికారతపై ఆమె చేసిన ప్రసంగానికి మంచి స్పందన వచ్చింది. అయితే ఆమె వేదికపై మాట్లాడుతున్న సమయంలో వెనుక తెరపై ప్రదర్శించిన స్లైడ్‌లో నిర్వాహకులు 'ఐశ్వర్యారాయ్ - అంతర్జాతీయ నటి' అని ఆమె పరిచయాన్ని క్లుప్తంగా పేర్కొన్నారు. ఐశ్వర్య పేరు చివర బచ్చన్ అనే ఇంటిపేరు లేకపోవడం నెటిజన్ల దృష్టిని ఆకర్షించింది. దాంతో నెటిజన్లు ఆ వీడియోను వైరల్ చేస్తున్నారు. ఐశ్వర్య, అభిషేక్ మధ్య పొరపొచ్చాలు ఉన్నాయి, వారు విడిపోతున్నారు కాబట్టే ఆమె తన పేరులోని బచ్చన్‌ను తొలగించారనే అభిప్రాయాన్ని వారు వ్యక్తం చేస్తున్నారు. అయితే బచ్చన్ పదాన్ని తొలగించడానికి నిర్వాహకుల పొరపాటు కారణమా, లేదా ఐశ్వర్య సూచన మేరకే అలా చేశారా అనేది తెలియదు. తన కొడుకు అభిషేక్‌బచ్చన్, కోడలు ఐశ్వర్యారాయ్ విడిపోతున్నారంటూ మీడియాలో పదేపదే జరుగుతున్న ప్రచారంపై ఇటీవలే అమితాబ్ బచ్చన్ అసహనం వ్యక్తం చేశారు. అందులో నిజం లేదని తెలిపారు.



42 పరుగులకే ఢమాల్

శ్రీలంక చెత్త రికార్డు

- జాన్సెన్‌కు 7 వికెట్లు
- దక్షిణాఫ్రికాతో తొలి టెస్ట్

డర్బన్: దక్షిణాఫ్రికాతో తొలి టెస్ట్ మొదటి ఇన్నింగ్స్‌లో శ్రీలంక 42 పరుగులకే కుప్పకూలింది. ఈ క్రమంలో పర్యాటక జట్టు ఎన్నో చెత్త రికార్డుల్ని మూటగట్టుకుంది. సుదీర్ఘ ఫార్మాట్‌లో లంకేయులకిది అత్యల్ప స్కోరు. ఆ జట్టు గత అత్యల్ప స్కోరు 71. రెండు దశాబ్దాల కిందట క్యాండీలో పాకిస్థాన్‌పై ఆ స్కోరు సాధించింది. పేసర్ మార్కో జాన్సెన్ కెరీర్‌లో ఉత్తమ బౌలింగ్‌తో (6.5-1-13-7) చెలరేగడంతో శ్రీలంక 13.5 ఓవర్లలోనే కుప్పకూలింది. దాంతో గత వందేళ్లలో టెస్ట్ క్రికెట్‌లో అతి తక్కువ బంతుల్లో (78) ఆలౌట్ అయిన జట్టుగా కూడా లంకేయులు మరో రికార్డు సొంతం చేసుకున్నారు. కాగా..తన స్పెల్‌లో ఏడు ఓవర్లలోపే ఏడు వికెట్లు పడగొట్టిన రెండో బౌలర్‌గా జాన్సెన్ రికార్డు సృష్టించాడు. 1924లో ఇంగ్లండ్‌పై ఆస్ట్రేలియా స్పిన్నర్ హగ్ టంబెల్ (6.5-0-28-7) తొలిసారి ఈ ఫీట్ నమోదు చేశాడు. అంతకుముందు ఓవర్‌నైట్ 80/4 స్కోరుతో గురువారం మొదటి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆతిథ్య జట్టు 191 పరుగులకు ఆలౌటైంది. శ్రీలంకను స్వల్ప స్కోరుకే కట్టడి చేసిన సఫారీలు..రెండో ఇన్నింగ్స్‌లో రెండోరోజు ఆఖరికి 132/3 స్కోరు చేశారు. ఓవరాల్‌గా 281 పరుగుల ఆధిక్యంలో నిలిచారు.

క్వార్టర్స్‌లో లక్ష్యసేన్



చెమటోడ్చిన సింధు

లఖ్‌నవూ: సయ్యద్ మోదీ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నీ ప్రీక్వార్టర్స్ విజయానికి స్టార్ షట్లర్ పీవీ సింధు చెమటోడ్చింది. మరోవైపు లక్ష్యసేన్, గాయత్రీ గోపీచంద్ జోడీ సునాయాస విజయాలతో క్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టారు. టాప్ సీడ్ లక్ష్యసేన్ 21-14, 21-13తో డానిల్ దుబొవెంకో (ఇజ్రాయెల్)ను చిత్తు చేసి క్వార్టర్స్‌కు చేరాడు. మూడో సీడ్ కిరణ్ జార్జ్ 21-19, 20-22, 11-21తో ఒగావా చేతిలో ఓడాడు. గురువారం జరిగిన రౌండ్-16 మ్యాచ్‌లో అంతగా పేరులేని ఇరా శర్మ..ప్రపంచ 18వ ర్యాంకర్ సింధుకు గట్టి పోటీ ఇచ్చింది. మొత్తంగా సింధు 21-10, 12-21, 21-15 ప్రపంచ 147వ ర్యాంకర్ ఇరా శర్మపై నెగ్గి ఊపిరి పీల్చుకుంది. రెండో సీడ్ మాళవిక బన్సోడ్ 12-21, 15-21తో సహచరి శ్రీయాన్షీ చేతిలో కంగుతిన్నది. డబుల్స్ ప్రీక్వార్టర్ ఫైనల్లో గాయత్రి/ట్రీసా జాలీ జోడీ 21-13, 21-10తో అశ్వినీ భట్/శిఖా గౌతమ్ జంటపై విజయం సాధించింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో గద్దె రుత్విక శివానీ/రోహన్ జోడీ ఓటమితో టోర్నీ నుంచి నిష్క్రమించింది.

డబ్ల్యూటీసీ.. అంతా గందరగోళం: స్టోక్స్



క్రైస్ట్‌చర్చ్: వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)పై ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. అసలు ఈఆలోచనే ఎంతో గందరగోళంగా ఉందన్నాడు. మ్యాచ్ తర్వాత మ్యాచ్.. సిరీస్ తర్వాత సిరీస్‌పై దృష్టిసారించడమే తమ తీరని చెప్పాడు. అంతేకానీ రానున్న రెండేళ్లను దృష్టిలో పెట్టుకొని ఆడడం తమ విధానం కాదన్నాడు. అర్థం కాకపోవడంతో డబ్ల్యూటీసీ గురించిన ఆలోచనే నిజంగా చేయలేదని తెలిపాడు.

డబ్ల్యూపీఎల్ మినీ వేలం 15న

న్యూఢిల్లీ: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) 2025 సీజన్ మినీ వేలం వచ్చే నెల 15న బెంగళూరులో జరగనుంది. ఐదు ఫ్రాంచైజీలు ఒక్కోటి రూ. 15 కోట్ల మొత్తంతో వేలంలోకి అడుగుపెట్టనున్నాయి. వచ్చే సీజన్ డబ్ల్యూపీఎల్ ఫిబ్రవరి-మార్చిలో జరిగే అవకాశముంది.



దౌత్య సంబంధాల్లో క్రికెట్ అంతర్భాగం

ఆస్ట్రేలియా పార్లమెంట్‌లో రోహిత్

ప్రధాని అల్బనీస్‌తో భారత జట్టు భేటీ

కాన్‌బెర్రా: ఆస్ట్రేలియా టూర్‌లో ఉన్న భారత జట్టు.. ఆ దేశ ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌ను మర్యాద పూర్వకంగా కలుసుకుంది. శనివారం నుంచి రెండు రోజులపాటు ఆసీస్ ప్రైమ్ మినిస్టర్స్ లెవెన్‌తో టీమిండియా పింక్ బాల్ ప్రాక్టీస్ మ్యాచ్ ఆడనుంది. దీన్ని పురస్కరించుకొని భారత జట్టుకు అల్బనీస్ గురువారం విందు ఏర్పాటు చేశారు. ప్రొటోకాల్ ప్రకారం కెప్టెన్ రోహిత్ శర్మ.. భారత జట్టు ఆటగాళ్లను అల్బనీస్‌కు పరిచయం చేశాడు. ఈ సందర్భంగా పెర్త్ టెస్ట్‌లో అద్భుత ప్రదర్శన కనబరచిన బుమ్రా, కోహ్లీ సహా ఇతర ఆటగాళ్లను ఆయన ప్రశంసించారు. ఆస్ట్రేలియా పార్లమెంట్‌లో రోహిత్ అతిథిగా ప్రసంగించాడు. ఇరుదేశాల దౌత్య సంబంధాల్లో క్రికెట్ అంతర్భాగమని అన్నాడు. 'క్రీడలు, వాణిజ్యంలో ఇరు దేశాల మధ్య బలమైన సంబంధాలున్నాయి. ఆటగాళ్ల పోరాటతత్వం, అభిమానుల మద్దతు కారణంగా ఆసీస్‌తో తలపడడం సవాళ్లతో కూడుకున్నది. అలాంటి టీమ్‌పై పైచేయి సాధించడం సంతోషంగా ఉంది'ని రోహిత్ చెప్పాడు. తమను ఆహ్వానించినందుకు అల్బనీస్‌కు కృతజ్ఞతలు తెలిపాడు. జాక్ ఎడ్వర్డ్స్ సారథ్యంలోని ప్రైమ్ మినిస్టర్స్ లెవెన్ కూడా ఈ కార్యక్రమానికి హాజరైంది. భేటీ ముగిసిన తర్వాత 'భారత్‌తో ఆడడం ప్రైమ్ మినిస్టర్స్ లెవన్‌కు పెను సవాలే. కానీ, మా ఆటగాళ్లకే నా మద్దతు అని మోదీకి కూడా చెప్పా' అని అల్బనీస్ ఎక్స్‌లో పోస్టు చేశారు. దీనికి 'భారత్, ప్రైమ్ మినిస్టర్స్ లెవెన్ జట్లను నా మిత్రుడు కలవడం ఎంతో ఆనందదాయకం. సిరీస్‌ను టీమిండియా అద్భుతంగా ఆరంభించింది. కోట్లాది మంది భారతీయులు తమ జట్టుకు మద్దతుగా ఉన్నారు. రానున్న రోజుల్లో హోరాహోరీ పోరు చూస్తామని ఆశిస్తున్నా'నని ప్రధాని నరేంద్ర మోదీ సమాధానమిచ్చారు. కాగా, నెట్ ప్రాక్టీస్‌కు టీమిండియా ఒక్క రోజు విరామం ప్రకటించింది. శుక్రవారం మళ్లీ సాధన చేయనుంది.

ఎంతోకొంత మసాలా కావాలిగా!



ఆటగాళ్లతో పరిచయం సందర్భంగా అల్బనీస్-కోహ్లీ మధ్య సంభాషణ హైలైట్‌గా నిలిచింది. తొలి టెస్ట్‌లో విరాట్ శతకంతో ఆకట్టుకున్నాడు. దాని గురించి ప్రస్తావిస్తూ.. 'పెర్త్‌లో అద్భుత సెంచరీ కొట్టావు. అప్పటికింకా మాజట్టు పెద్దగా కష్టాల్లో పడలేదు' అని కోహ్లీతో అల్బనీస్ అన్నారు. దానికి విరాట్ ఏమాత్రం తడుముకోకుండా.. 'ప్రతిసారీ ఎంతో కొంత మసాలా దట్టిస్తూ ఉండాలి కదా' అని నవ్వుతూ సమాధానమిచ్చాడు. వీరి సంభాషణ నెట్‌లో వైరల్‌గా మారింది.

న్యూజిలాండ్ 319/8



కేన్ విలియమ్సన్ (93)

- ఇంగ్లండ్‌తో తొలి టెస్ట్

క్రైస్ట్‌చర్చ్: గాయం నుంచి కోలుకొని జట్టులోకి రీఎంట్రీ ఇచ్చిన కేన్ విలియమ్సన్ (93) రాణించడంతో.. ఇంగ్లండ్‌తో గురువారం ఆరంభమైన తొలి టెస్ట్‌లో ఆతిథ్య న్యూజిలాండ్ మెరుగైన స్కోరు సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన కివీస్ మొదటి రోజు ఆటముగిసే సమయానికి 319/8 స్కోరు చేసింది. గ్లెన్ ఫిలిప్స్ (41), సౌథీ (10) క్రీజులో ఉన్నారు. కెప్టెన్ లాథమ్ (47), రచిన్ రవీంద్ర (34) ఓ మాదిరి స్కోర్లు చేశారు. బషీర్ 4 వికెట్లు పడగొట్టగా.. అట్కిన్సన్, బ్రైడన్ కార్సీ చెరో 2 వికెట్లు దక్కించుకొన్నారు.

ఆఖరి వన్డే పాక్‌దే!



బులవాయో: జింబాబ్వేతో వన్డే సిరీస్‌ను పాకిస్థాన్ 2-1తో సొంతం చేసుకుంది. గురువారం జరిగిన ఆఖరి మ్యాచ్‌లో పర్యాటక జట్టు 99 పరుగులతో నెగ్గింది. తొలుత పాకిస్థాన్ 50 ఓవర్లలో 303/6 స్కోరు చేసింది. కమ్రాన్ గులామ్ (103) తొలి వన్డే శతకంతో, అబ్దుల్లా (50) హాఫ్ సెంచరీతో సత్తా చాటారు. సికిందర్ రజా, ఎన్ గవారా చెరో రెండు వికెట్లు పడగొట్టారు. భారీ ఛేదనలో జింబాబ్వే 40.1 ఓవర్లలో 204 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ ఇర్విన్ (51), బెన్నెట్ (37) మాత్రమే రాణించారు. జమాల్, అయూబ్, రౌఫ్, అబ్రార్ తలా రెండేసి వికెట్లు సాధించారు.

గుకేష్‌కు రూ. 1.68 కోట్లు



సింగపూర్: డిఫెండింగ్ చాంపియన్ డింగ్ లిరెన్‌పై వరల్డ్ చెస్ చాంపియన్‌షిప్ ఫైనల్ మూడో గేమ్ గెలుపొందిన భారత గ్రాండ్‌మాస్టర్ గుకేష్ రూ. 1.68 కోట్లు అందుకున్నాడు. ఫిడే నిబంధనల ప్రకారం 14 గేమ్‌ల ఈ టోర్నమెంట్‌లో ఒక్కో గేమ్ గెలిచిన ఆటగాడికి రూ. 1.68 కోట్లు లభిస్తాయి. ఈనేపథ్యంలో మొదటి గేమ్‌లో విజయం సాధించిన చైనా గ్రాండ్‌మాస్టర్ లిరెన్ సైతం రూ. 1.68 కోట్లు దక్కించుకున్నాడు.



శివాని, శ్రీ నిత్య

శివాని, నిత్యకు స్వర్ణాలు

రాజ్‌కోట్: ఎస్‌జీఎఫ్‌ఐ జాతీయ స్విమ్మింగ్ చాంపియన్ షిప్స్‌లో తెలంగాణ బాలికలు కర్రా శివాని, సాగి శ్రీనిత్య స్వర్ణాలు సాధించారు. అండర్-14 కేటగిరీ 200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో శివాని 2 నిమిషాల 33.36 సెకన్ల టైమింగ్‌తో టాప్‌లో నిలిచింది. అండర్-17 విభాగం 200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో నిత్య 2 నిమిషాల 27.95 సెకన్ల టైమింగ్‌తో అగ్రస్థానం చేజిక్కించుకుంది.

దాదా ముందే చెప్పాడు!



పెర్త్ విజయంపై వాన్

న్యూఢిల్లీ: పెర్త్ టెస్ట్ ఫలితం గురించి భారత మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ ముందుగానే చెప్పాడని ఇంగ్లండ్ మాజీ ఆటగాడు మైకేల్ వాన్ బయటపెట్టాడు. మ్యాచ్ రెండో రోజే ఫలితాన్ని తనకు మెసేజ్ చేశాడన్నాడు. 'నా అంచనాకు తగ్గట్టుగానే మ్యాచ్ జరుగుతున్న'దని రాశాడన్నాడు. తీరా అదే నిజం కావడం తనను ఎంతో ఆశ్చర్యానికి గురిచేసిందని చెప్పాడు.

'హైబ్రిడ్' చాంపియన్స్ ట్రోఫీకి

పాకిస్థాన్ ససేమిరా!

కరాచీ: చాంపియన్స్ ట్రోఫీ హైబ్రిడ్ విధానానికి తాము అంగీకరించబోమని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) స్పష్టంజేసింది. ఈ పద్ధతిపై శుక్రవారం జరిగే ఐసీసీ బోర్డు సమావేశంలో చర్చించకూడదని కోరింది. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే ఈ ట్రోఫీ నిర్వహణలో ఇతర ప్రత్యామ్నాయాలను పరిశీలించాలని ఐసీసీకి పీసీబీ సూచించినట్టు సమాచారం. చాంపియన్స్ ట్రోఫీ వన్డే టోర్నీ షెడ్యూల్ ఖరారుకు వర్చువల్‌గా భేటీ కావాలని ఐసీసీ నిర్ణయించిన సంగతి తెలిసిందే.

రెండో స్థానానికి టైటాన్స్

నోయిడా: తెలుగు టైటాన్స్ జట్టు ప్రొ. కబడ్డీ తాజా సీజన్ పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి దూసుకొచ్చింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 41-35తో యు ముంబాను చిత్తు చేసింది. విజయ్ మాలిక్, రైడర్ ఆశిష్ నర్వాల్ చెరో 10 పాయింట్లు సాధించారు. హోరాహోరీగా సాగిన మరో మ్యాచ్‌లో యూపీ యోధాస్ 33-29తో జైపూర్ పింక్ పాంథర్స్‌ని ఓడించింది.

మణిపాల్‌సిగ్నాపై ఎల్ఐసీ ఆసక్తి!?



సంస్థలో 50% వాటా కొనుగోలు ద్వారా 'ఆరోగ్య బీమా'లోకి ప్రవేశం

న్యూఢిల్లీ: ఆరోగ్య బీమా సంస్థ మణిపాల్‌సిగ్నా హెల్త్ ఇన్సూరెన్స్‌లో 50 శాతం వాటా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వ రంగ జీవిత బీమా దిగ్గజం ఎల్ఐసీ సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఈ సంస్థలో వాటా కొనుగోలు ద్వారా ఎల్ఐసీ కూడా హెల్త్ ఇన్సూరెన్స్ విభాగంలోకి ప్రవేశించినట్లవుతుంది. త్వరలో ఆరోగ్య బీమాలో సేవల్లోకీ అడుగు పెడతామని, ఈ విభాగానికి చెందిన ఏదైనా కంపెనీలో వాటా కొనుగోలు చేయాలనుకుంటున్నట్లు ఎల్ఐసీ సీఈఓ, ఎండీ సిద్ధార్థ మొహంతీ ఈ మధ్య వెల్లడించారు. మణిపాల్‌సిగ్నా యాజమాన్యంతో ఎల్ఐసీ చర్చలింకా ప్రాథమిక దశలోనే ఉన్నాయని, ఇరు వర్గాలు నాన్ డిస్‌క్లోజర్ ఒప్పందం చేసుకొని చర్చలను ప్రారంభించాయని తెలిసింది. దేశీయ సాధారణ బీమా మార్కెట్ పరిమాణం రూ.3 లక్షల కోట్ల స్థాయికి చేరుకోగా.. అందులో హెల్త్ ఇన్సూరెన్స్ విభాగ వాటా 37 శాతంగా ఉంది.

బెంగళూరుకు చెందిన మణిపాల్ ఎడ్యుకేషన్ అండ్ మెడికల్ గ్రూప్, అమెరికన్ ఇన్సూరెన్స్ కంపెనీ సిగ్నా కార్పొరేషన్ ఉమ్మడి భాగస్వామ్యంలో ఏర్పాటు చేసిన సంస్థే మణిపాల్‌సిగ్నా హెల్త్ ఇన్సూరెన్స్. ఇందులో మణిపాల్ గ్రూప్ 51 శాతం, సిగ్నా కార్పొరేషన్ 49 శాతం వాటా కలిగి ఉన్నాయి. ఎల్ఐసీకి వాటా విక్రయంలో భాగంగా ఈ భాగస్వామ్య సంస్థలో మణిపాల్ గ్రూప్‌తోపాటు సిగ్నా కార్ప్ కూడా వాటాను తగ్గించుకోనున్నట్లు సమాచారం. ఈ ఒప్పందంలో భాగంగా మణిపాల్‌సిగ్నా విలువను రూ. 4,000 కోట్లుగా లెక్కగట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

బీమా రంగంలో 100% ఎఫ్‌డీఐ !

న్యూఢిల్లీ: బీమా రంగంలో వంద శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)ను అనుమతించాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనికి సంబంధించి కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నిర్వహణలోని ఆర్థిక సేవల విభాగం (డీఎఫ్ఎస్) ఒక చర్చా పత్రం విడుదల చేసింది. పరిశ్రమ వర్గాలు దీనిపై తమ అభిప్రాయాలని వచ్చే నెల 10లోగా తెలపాలని కోరింది. ప్రస్తుతం మన దేశ బీమా కంపెనీల ఈక్విటీలో 74 శాతానికి మించి ఎఫ్‌డీఐని అనుమతించడం లేదు. నూరు శాతం ఎఫ్‌డీఐను అనుమతించడం ద్వారా బీమా కవరేజీని చౌకగా మరింత మందికి చేరువ చేయవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. ఎఫ్‌డీఐ పరిమితి పెంచడంతో పాటు రీఇన్సూరెన్స్ కంపెనీల కనీస మూలధన నిబంధనను ప్రస్తుత రూ.5,000 కోట్ల నుంచి రూ.1,000 కోట్లకు కుదించాలని కూడా ప్రభుత్వం యోచిస్తోంది.

అదానీ గ్రూప్ రుణాలపై బ్యాంకుల సమీక్ష!

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ కంపెనీలకు ఇచ్చిన రుణాలపై బ్యాంకులు మల్లగుల్లాలు పడుతున్నాయి. ప్రస్తుతానికి ఈ రుణాలను వెనక్కి తీసుకునే ప్రమాదం లేకపోయినా, రుణాల వినియోగం నిబంధనల మేరకు జరుగుతోందా? లేదా? అనే విషయాన్ని బ్యాంకులు ఎప్పటికపుడు సమీక్షించాలని నిర్ణయించినట్టు సమాచారం. సౌర విద్యుత్ ప్రాజెక్టుల కాంట్రాక్టుల కోసం అదానీ గ్రూప్ కంపెనీ అదానీ గ్రీన్ ఎనర్జీ, వివిధ రాష్ట్రాల విద్యుత్ పంపిణీ సంస్థల అధికారులు, రాజకీయ నేతలకు పెద్ద మొత్తంలో ముడుపులు చెల్లించినట్టు అమెరికాలో కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో దేశీయ బ్యాంకులు ఈ చర్య తీసుకుంటున్నాయి.

ఎస్‌బీఐదే పెద్ద వాటా: ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్, ఆర్‌బీఎల్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఐడీబీఐ బ్యాంక్.. అదానీ గ్రూప్ కంపెనీలకు పెద్దమొత్తంలో రుణాలు ఇచ్చాయి. ఇందులో ఎస్‌బీఐ వాటానే అత్యధికంగా రూ.33,800 కోట్ల వరకు ఉంది. అయితే ఈ రుణాలన్నీ ఈ బ్యాంకులు తమ పరిధికి లోబడే ఇచ్చినట్టు సమాచారం.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



29వ తేదీ			
హైదరాబాద్	595	విజయవాడ	600
వరంగల్	597	గోదావరి	595
చిత్తూరు	603	విశాఖపట్నం	585
		డజను గుడ్లు రూ. 84	

ఎయిరిండియా పునరుజ్జీవం 'టీ-20 మ్యాచ్' కాదు

న్యూఢిల్లీ: "ఎయిరిండియా పునరుజ్జీవం నాలుగు గంటల్లో ఫలితం తేలిపోయే టీ-20 మ్యాచ్ కాదు. ఐదు రోజుల పాటు సాగే టెస్ట్ మ్యాచ్. ప్రస్తుతం మేం మూడో రోజు లంచ్ సమయం వద్ద ఉన్నాం" అని కంపెనీ సీఈఓ కాంప్‌బెల్ విల్సన్ అన్నారు. ఎయిరిండియా ప్రయాణాన్ని క్రికెట్ మ్యాచ్‌తో పోల్చుతూ ఆయన చేసిన వ్యాఖ్యలివి. ఎయిరిండియా పగ్గాలు చేపట్టిన తర్వాత టాటా గ్రూప్ "విహాన్ ఏఐ" పేరిట ఐదేళ్ల పునరుజ్జీవ ప్రణాళిక ప్రారంభించింది. అందులో రెండేళ్లకు పైగా సమయం గడిచిపోగా తాము నిర్దేశించుకున్న గమ్యం చేరడానికి మరికొంత కృషి చేయాల్సి ఉందన్నారు.

బిజినెస్

మార్కెట్లోకి డాక్టర్ రెడ్డీస్ క్యాన్సర్ ఔషధం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీస్ నాసోఫరింజియల్ కార్సినోమా (గొంతు పై భాగంలో ప్రారంభమై తల, మెడ ప్రాంతానికి వ్యాపించే అత్యంత అరుదైన క్యాన్సర్) చికిత్సలో ఉపయోగించే టోరిపాలిమాబ్ టాబ్లెట్లను భారత మార్కెట్లో విడుదల చేసింది. ఈ తరహా క్యాన్సర్ చికిత్సకు అమెరికా ఆహార, ఔషధ సంస్థ (యూఎస్ ఎఫ్‌డీఏ), యూరోపియన్ మెడిసిన్స్ ఏజెన్సీ (ఈఎంఏ), మెడిసిన్స్ అండ్ హెల్త్ కేర్ ప్రోడక్ట్స్ రెగ్యులేటరీ ఏజెన్సీ (ఎంహెచ్ఆర్ఏ) సహా పలు ప్రపంచ శ్రేణి ఔషధ నియంత్రణ సంస్థలు ఆమోదించిన ఏకైక ఇమ్యునో అంకాలజీ ఔషధం ఇదేనని డాక్టర్ రెడ్డీస్ తెలిపింది. దేశంలో జీటోర్వి పేరుతో ఈ ఔషధాన్ని మార్కెట్ చేయనున్నట్టు తెలియచేసింది. టోరిపాలిమాబ్ టాబ్లెట్ల తయారీకి 2023లో షాంఘై జున్షీ బయోసైన్సెస్ లిమిటెడ్‌తో లైసెన్స్, వాణిజ్యపరంగా తయారీ ఒప్పందంపై డాక్టర్ రెడ్డీస్ సంతకాలు చేసింది.

మళ్లీ పతనబాటలోకి..



- సెన్సెక్స్ 1,200 పాయింట్ల నష్టం
- మళ్లీ 80,000 దిగువకు సూచీ
- నిఫ్టీ 360 పాయింట్లు డౌన్

ముంబై: భారత ప్రామాణిక ఈక్విటీ సూచీలు గురువారం భారీ నష్టాలు చవిచూశాయి. మార్కెట్ దిగ్గజాలైన రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సహా ప్రధాన కంపెనీల షేర్లలో ఇన్వెస్టర్లు భారీగా అమ్మకాలకు పాల్పడటంతో సెన్సెక్స్ 80,000, నిఫ్టీ 24,000 స్థాయిలను కోల్పోయాయి. సెన్సెక్స్ ఒక దశలో 1,315.16 పాయింట్లు (1.63 శాతం) క్షీణించి 78,918.92 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి 1,190.34 పాయింట్ల (1.48 శాతం) నష్టంతో 79,043.74 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 360.75 పాయింట్లు (1.49 శాతం) పతనమై 23,914.15 వద్ద ముగిసింది. మార్కెట్ వర్గాల సంపదగా భావించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.1.50 లక్షల కోట్లకు పైగా తగ్గి రూ.442.98 లక్షల కోట్లకు (5.24 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో ఎస్‌బీఐ మినహా అన్నీ నేలచూపు చూశాయి. మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు 3.48 శాతం, ఇన్ఫోసిస్ 3.46 శాతం నష్టంతో సూచీ టాప్ లూజర్లుగా మిగిలాయి. బజాజ్ ఫైనాన్స్, అదానీ పోర్ట్స్, హెచ్‌సీఎల్ టెక్, టైటాన్, టెక్ మహీంద్రా షేర్లు 2 శాతానికి పైగా క్షీణించగా.. ఇండెక్స్‌లో అత్యధిక వెయిటేజీ కలిగిన రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.67 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఒక శాతం తగ్గాయి.

- అదానీ స్టాక్స్ విషయానికొస్తే, గ్రూప్‌లోని 11 లిస్టెడ్ కంపెనీల్లో 5 లాభపడ్డాయి. అదానీ టోటల్ గ్యాస్ 16 శాతం ఎగబాకగా.. అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ 10 శాతం, అదానీ గ్రీన్ ఎనర్జీ 10 శాతం, అదానీ పవర్ 6.95 శాతం, అదానీ ఎంటర్‌ప్రైజెస్ 1.63 శాతం పుంజుకున్నాయి. అదానీ పోర్ట్స్ మాత్రం 2.73 శాతం నష్టపోగా.. ఎన్‌డీటీవీ 2.03 శాతం, ఏసీసీ 0.75 శాతం, అంబుజా సిమెంట్స్ 0.48 శాతం, అదానీ విల్మార్ 0.44 శాతం, సంఘీ ఇండస్ట్రీస్ 0.17 శాతం తగ్గాయి.

ఆపదలో నీకు నేను.. నాకు నువ్వు

పరస్పర ప్రత్యామ్నాయ ట్రేడింగ్ వేదికలుగా బీఎస్ఈ, ఎన్ఎస్ఈ

స్టాక్ మార్కెట్లో నిరంతరాయ ట్రేడింగ్ కోసం సెబీ కొత్త ఫ్రేమ్‌వర్క్

న్యూఢిల్లీ: సాంకేతిక వైఫల్యం లేదా విపత్తు సమయంలోనూ స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నిరంతరాయంగా ట్రేడింగ్ జరిగేలా చూసేందుకు క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ కొత్త ముసాయిదాను ప్రవేశపెట్టింది. స్టాక్ ఎక్స్ఛేంజీల్లో కార్యకలాపాల కొనసాగింపుతో పాటు డిజాస్టర్ రికవరీ మెకానిజాన్ని బలోపేతం చేయడమే ఈ చర్యల ప్రధానోద్దేశమని సెబీ పేర్కొంది. ఇందులో భాగంగా బీఎస్ఈ, ఎన్ఎస్ఈ... ఈక్విటీ, డెరివేటివ్స్, కరెన్సీ మార్కెట్ విభాగాల్లో పరస్పరం సహకరించుకోనున్నాయి. ఉదాహరణకు, సాంకేతిక వైఫల్యాల సమయంలో బీఎస్ఈకి ఎన్ఎస్ఈ, ఎన్ఎస్ఈకి బీఎస్ఈ పరస్పర ప్రత్యామ్నాయ ట్రేడింగ్ వేదికగా పనిచేయనున్నాయి. వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఇది అమలులోకి రానుంది. సాంకేతిక వైఫల్యం లేదా విపత్తు గురించి ప్రభావిత స్టాక్ ఎక్స్ఛేంజీ సెబీతోపాటు ప్రత్యామ్నాయ ఎక్స్ఛేంజీకి 75 నిమిషాల్లో సమాచారం అందించాల్సి ఉంటుంది. ఆ తర్వాత 15 నిమిషాల్లోగా ప్రత్యామ్నాయ ఎక్స్ఛేంజీ ట్రేడింగ్ కొనసాగింపు ప్రణాళికను అమలు చేయాల్సి ఉంటుంది. ఇలాంటి సమయంలో పరస్పర సహకారం కోసం స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ)ను రెండు నెలల్లో ఏర్పాటు చేసుకోవాలని కోరింది.

సిల్వర్.. ఢమాల్

ఒక్కరోజే రూ.4,900 తగ్గిన ధర

న్యూఢిల్లీ: వెండి ధర ఎంత వేగంగా పెరిగిందో.. మళ్లీ అంతే వేగంగా కిందికి జారింది. ఢిల్లీ మార్కెట్లో కిలో వెండి ధర గురువారం రూ.4,900 తగ్గుదలతో మూడు నెలల కనిష్ఠ స్థాయి రూ.90,900 స్థాయికి పడిపోయింది. వెండికిదే అతిపెద్ద ఒక్కరోజు నష్టం. బుధవారం సిల్వర్ రేటు రూ.5,200 పెరిగింది. కానీ, స్టాకిస్టులు, రిటైలర్లు భారీగా అమ్మకాలకు పాల్పడటం ధర పతనానికి ప్రధాన కారణమని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. కాగా, 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.100 తగ్గి రూ.78,700కు పరిమితమైంది. అంతర్జాతీయ మార్కెట్ విషయానికొస్తే, ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం 2,673 డాలర్లకు పెరగగా.. సిల్వర్ 30.51 డాలర్లకు పడిపోయింది.

ఏపీ, తెలంగాణలో రూ.3,330 కోట్ల క్లెయిమ్స్ సెటిల్‌మెంట్

స్టార్‌హెల్త్ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ సనత్ కుమార్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు తమకు అత్యంత కీలక మార్కెట్లని స్టార్‌హెల్త్ ఇన్సూరెన్స్ ప్రకటించింది. గత ఐదేళ్లలో ఈ రెండు రాష్ట్రాల నుంచి వచ్చిన రూ.3,330 కోట్ల విలువైన క్లెయిమ్‌లను సెటిల్ చేసినట్టు కంపెనీ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ సనత్ కుమార్ తెలిపారు. ఇందులో రూ.920 కోట్ల విలువైన క్లెయిమ్‌లను గత ఆర్థిక సంవత్సరం సెటిల్ చేసినట్టు చెప్పారు. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఏపీ, తెలంగాణల్లో రూ.1,380 కోట్లుగా ఉన్న ప్రీమియం వసూళ్లు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) రూ.1,650 కోట్లకు చేరే అవకాశం ఉందని సనత్ కుమార్ తెలిపారు. వచ్చే నాలుగేళ్లలో రెండు తెలుగు రాష్ట్రాల్లో తమ వ్యాపారం రెట్టింపవుతుందన్నారు. దేశవ్యాప్తంగా తమకు 40,000 నెట్‌వర్క్ ఆస్పత్రులు ఉంటే, అందులో 1,840 ఆస్పత్రులు రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్నట్టు చెప్పారు. అందరికీ వైద్యం అందుబాటులోకి రావాలంటే, అన్ని రకాల ఆరోగ్య బీమా పాలసీలపై ప్రభుత్వం జీఎస్‌టీ ఎత్తివేయాలన్నారు. అది సాధ్యం కాని పక్షంలో ప్రస్తుతం 18 శాతంగా ఉన్న జీఎస్‌టీని కనీసం ఐదు శాతానికైనా కుదించాలని కోరారు.

- జిందాల్ వరల్డ్‌వైడ్ లిమిటెడ్.. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.570.80 కోట్ల కార్యకలాపాల రెవెన్యూపై రూ.17.30 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే లాభం 35.2 శాతం, ఆదాయం 45.70 శాతం వృద్ధి చెందాయి.
- సుమధుర గ్రూప్... హైదరాబాద్‌లో పాలెస్ రాయల్ పేరుతో లగ్జరీ ప్రాజెక్ట్‌ను అభివృద్ధి చేస్తోంది. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో 7.35 ఎకరాల్లో 52 అంతస్తులతో ఈ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తోంది. ఇందులో మొత్తం నాలుగు, ఐదు బెడ్‌రూమ్స్‌తో కూడిన 523 ఫ్లాట్స్ ఉండనున్నాయి. 2029లో పూర్తి కానున్న ఈ ప్రాజెక్ట్ ద్వారా రూ.2,500 కోట్ల రెవెన్యూ వస్తుందని సుమధుర గ్రూప్ అంచనా వేస్తోంది.
- వంటనూనెల తయారీ సంస్థ బంగీ ఇండియా లిమిటెడ్.. తన ఉత్పత్తుల ప్రచారానికి టాలీవుడ్ నటి కీర్తి సురేశ్‌ను ప్రచారకర్తగా నియమించుకుంది. కంపెనీ రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ బ్రాండ్ ఫియోనాకు కీర్తి సురేశ్ ప్రచారం నిర్వహించనున్నారు.
- షాంగర్ డెకార్ లిమిటెడ్ రైట్స్ ఇష్యూ ద్వారా రూ.49.35 కోట్లను సమీకరించనుంది. ఇష్యూ ద్వారా సమీకరించిన నిధులను వర్కింగ్ క్యాపిటల్, ఇతర మూలధన అవసరాల నిమిత్తం ఉపయోగించనుంది. ఈ రైట్స్ ఇష్యూ వచ్చే నెల 6న ముగియనుంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,350 ▼	70,090 ▼	98,000 ▲
ముంబై	76,287 ▲	69,879 ▲	87,904 ▼

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	105	విజయవాడ	109
వరంగల్	105	గుంటూరు	109
కరీంనగర్	105	ఒంగోలు	109
మహబూబ్‌నగర్	105	చిత్తూరు	99
కర్నూలు	105	నెల్లూరు	99
విశాఖపట్నం	115	అనంతపురం	99
గోదావరి	109		

హరీశ్, కేటీఆర్‌లది నా స్థాయి కాదు

» కేసీఆర్ వస్తే మాట్లాడతా: మంత్రి కోమటిరెడ్డి

నల్లగొండ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నేతలు హరీశ్‌రావు, కేటీఆర్ గురుకులాల గురించి మాట్లాడితే తాను జవాబు ఇవ్వనని, వాళ్లది తన స్థాయి కాదని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. గురుకులాలపై కేసీఆర్ వచ్చి మాట్లాడితే తాను సమాధానం చెబుతానన్నారు. మహాత్మా జ్యోతిబాఫూలే వర్ధంతి సందర్భంగా గురువారం నల్లగొండలోని క్లాక్‌టవర్ కూడలిలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..కేసీఆర్ రాష్ట్రాన్ని బంగారు తెలంగాణ చేస్తానని రూ.7లక్షల కోట్లు అప్పుచేసి ఫామ్‌హౌస్‌లో పడుకున్నారని విమర్శించారు. రూ.30వేల కోట్లతో నిర్మించనున్న రీజనల్ రింగ్ రోడ్డు శంకుస్థాపనకు ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని ఆహ్వానిస్తామని చెప్పారు. డిసెంబరు 7న నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టు, నల్లగొండలోని వైద్య కళాశాలను సీఎం రేవంత్‌రెడ్డితో ప్రారంభోత్సవం చేయించనున్నట్లు ఆయన చెప్పారు.

ఈఎన్‌సీ నాగేంద్రరావు పదవీ కాలం పెంచొద్దు

» ఉద్యోగ సంఘాల డిమాండ్

హైదరాబాద్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): నీటి పారుదల శాఖ ఈఎన్‌సీ(ఓ అండ్ ఎం) బి.నాగేంద్రరావు పదవీ కాలాన్ని మళ్లీ పొడిగించే ప్రయత్నాలను విరమించుకోవాలని శాఖలోని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేశాయి. గత ప్రభుత్వం ఇచ్చిన పొడిగింపులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రద్దు చేయడంతో ఏఈఈల నుంచి సీఈల దాకా అందరికీ మేలు జరిగిందని, మళ్లీ గత ప్రభుత్వ నిర్ణయాలనే అమలు చేస్తే ఉద్యోగులకు అన్యాయం జరుగుతుందని పేర్కొన్నాయి. సర్వీసులను పొడిగించకుండా పదోన్నతులు కల్పించాలని ఏఎస్ఎన్ రెడ్డి, చక్రధర్(హైదరాబాద్ ఇంజనీర్ల సంఘం), నూనె శ్రీధర్, గోపాల కృష్ణ(తెలంగాణ ఇరిగేషన్ గ్రాడ్యుయేట్ ఇంజనీర్ల సంఘం), శ్రీనివాస్, నాగరాజు(తెలంగాణ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల సంఘం), రవీందర్‌రెడ్డి, అనిల్‌కుమార్(ఇరిగేషన్ డిప్లొమా ఇంజనీర్ల సంఘం) సంయుక్త ప్రకటనలో కోరాయి.

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా జీవన్‌రెడ్డి!

» నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్, కరీంనగర్ కాంగ్రెస్ ముఖ్య నాయకుల భేటీలో తీర్మానం

హైదరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్, కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి సభ్యుడి ఎన్నికల్లో సిటింగ్ ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయాలని టీపీసీసీ సూత్రప్రాయంగా నిర్ణయించింది. వచ్చే మార్చితో గడువు ముగియనున్నందున ఎన్నికల్లో అవలంబించాల్సిన వ్యూహాన్ని ఖరారు చేయడానికి గురువారం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీతో పాటు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, సీతక్క, కొండా సురేఖ, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్, కరీంనగర్ జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు పాల్గొన్నారు. సమావేశంలో పార్టీ నాయకులందరూ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా తిరిగి జీవన్‌రెడ్డిని నిలబెట్టాలని తీర్మానం చేశారు.

సైబర్ క్రైమ్ పోలీసుల అదుపులో బీఆర్ఎస్ నేత..!

మిర్యాలగూడ అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల్లో ప్రమేయం ఉన్నట్లుగా అనుమానిస్తూ నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, న్యాయవాది అన్నభీమోజు నాగార్జునచారిని సైబర్ క్రైం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ నెల 25న మిర్యాలగూడలోని ఆయన నివాసంలో సీసీఎస్ పోలీసులు అదుపులోకి తీసున్నట్లు తెలుస్తోంది. మహారాష్ట్రలోని ముంబై కేంద్రంగా జరిగిన ఓ సైబర్ నేరంలో నాగార్జునచారి, అతడి మేనల్లుడు నాగేంద్రచారికి సంబంధం ఉన్నట్లుగా గుర్తించి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లుగా సమాచారం. వీరిద్దరూ శాంతినగర్‌కు చెందిన కొందరు వ్యక్తుల పేర బ్యాంకు ఖాతాలు తెరిచి హవాలా మార్గంలో వచ్చిన బ్లాక్‌మనీని వైట్‌గా మార్చేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. వీరితో పాటు మరికొందరు వ్యక్తులు కూడా సీసీఎస్ పోలీసుల అదుపులో ఉన్నట్లుగా తెలుస్తోంది. ఈ విషయంపై స్థానిక పోలీసులను వివరణ కోరగా సమాచారం లేదని చెప్పారు.

హైదరాబాద్ మెట్రోకు ఏడేళ్లు

» కేంద్ర అనుమతి రాగానే రెండో దశ షురూ
» ఒకే సారి ఐదు కారిడార్ల నిర్మాణ పనులు
» హైదరాబాద్ మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి
» ఏడాదిలోగా ఏడు కొత్త రైళ్లు : ఎల్ అండ్ టీ ఎండీ కేవీబీ రెడ్డి
» ఘనంగా మెట్రో వార్షికోత్సవం

హైదరాబాద్ సిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మెట్రో రైలు ప్రాజెక్టు రెండో దశ విస్తరణ పనులకు నిధుల కొరత లేదని హైదరాబాద్ మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి అన్నారు. నిధుల విషయంలో ముఖ్యమంత్రి తమకు భరోసా ఇచ్చారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిన వెంటనే రెండో దశ పనులను ఐదు కారిడార్లలో ఒకేసారి నిర్వహిస్తామని వెల్లడించారు. హైదరాబాద్ మెట్రో రైలును ప్రారంభించి ఏడేళ్లు పూర్తయిన సందర్భంగా అమీర్‌పేట మెట్రో స్టేషన్‌లో గురువారం వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ మెట్రో ప్రపంచంలోనే అతి పెద్ద మెట్రో రైలు సర్వీసుగా నిలుస్తోందని, ప్రాజెక్టు మొదటి దశ నిర్మాణానికి ప్రభుత్వం, ప్రజలు ఎంతో సహకరించారని గుర్తు చేశారు. రెండో దశ మెట్రో ప్రాజెక్టులో కిలోమీటరు నిర్మాణానికి రూ.318 కోట్లు మాత్రమే ఖర్చు చేయనున్నామని తెలిపారు. భూగర్భ మార్గం నిర్మాణానికి కిలోమీటరుకు రూ.600 కోట్ల నుంచి రూ.1000 కోట్లు వెచ్చిస్తున్నామన్నారు. ముంబై లాంటి నగరాల్లో ఈ ఖర్చు రూ.1500 కోట్లు దాకా ఉంటుందని, దానితో పోలిస్తే తాము తక్కువ ఖర్చుతోనే పనులు చేస్తున్నామని తెలిపారు. ఒక మెట్రో లైన్.7 బస్సు లైన్లు, 24 కారు లైన్లకు సమానమన్నారు. 20 ఏళ్లుగా ప్రతీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి మెట్రో నిర్వహణకు సహకరిస్తూ వస్తున్నారని ఎన్వీఎస్ రెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు.



వార్షికోత్సవం సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అధికారులు

ఏడాదిలోగా 7 కొత్త రైళ్లు

ప్రయాణికుల సంఖ్య దృష్ట్యా ఏడాది లోపు 4 నుంచి 7 కొత్త రైళ్లను (మూడు కోచ్‌లతో) తీసుకొస్తామని ఎల్ అండ్ టీ ఎండీ కేవీబీ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. ఏడేళ్ల ప్రయాణంలో హైదరాబాద్ మెట్రో ఎన్నో మైలురాళ్లను చేరుకుందన్నారు. ఇప్పటిదాకా 44.2 మిలియన్ కిమీలు ప్రయాణించిన హైదరాబాద్ మెట్రో రైళ్లు 63.50 లక్షల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చాయని తెలిపారు. హంకాంగ్, సింగపూర్, తర్వాత 99.9 శాతం విశ్వసనీయత కలిగిన అత్యుతమ మెట్రో హైదరాబాద్‌దే అని చెప్పారు. మెట్రో వల్ల ఇప్పటివరకు 184 మిలియన్ లీటర్ల ఇంధనం ఆదా అయిందని, నగరంలో 42.4 మిలియన్ల కిలోల కర్బన ఉద్గారాలు తగ్గాయని కేవీబీ రెడ్డి వివరించారు. కాగా, వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా సంస్థ డిజిటల్ లోగోను ఆవిష్కరించారు. క్వాలిటీ రేటింగ్ సంస్థ ద్వారా మెట్రోకు వచ్చిన ఫైవ్ స్టార్ క్వాలిటీ సర్టిఫికెట్‌ను ఎన్వీఎస్ రెడ్డి, కేవీబీ రెడ్డి అందుకున్నారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

ఆరోగ్యశ్రీ చికిత్సల వ్యయ పరిమితి రెండింతలు.. వైద్య ఆరోగ్య శాఖలో 7,750 పోస్టుల భర్తీ

» మరో 6,494 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు
» 8 వైద్య కాలేజీలు అందుబాటులోకి
» ప్రతి 30 కిలోమీటర్లకు ఒకటి చొప్పున 74 ట్రామాకేర్ సెంటర్ల ఏర్పాటు: సీఎంవో

హైదరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ముఖ్యంగా.. రేవంత్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత.. ముందెన్నడూ లేని విధంగా ప్రజారోగ్యానికి నిధుల కేటాయింపు, ఆస్పత్రుల్లో నియామకాలపైనా దృష్టి సారించారని ముఖ్యమంత్రి కార్యాలయం(సీఎంవో) గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. అధికారం చేపట్టిన 48 గంటల్లోనే రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రెండింతలు చేసినట్లు గుర్తుచేసింది. తొలి ఏడాదిలోనే వైద్య ఆరోగ్య శాఖలో నియామకాలు చేపట్టామని, నూతన వైద్య, నర్సింగ్, పారామెడికల్ కళాశాలలను మంజూరు చేశామని వివరించింది. మెడికల్ కాలేజీల్లో సీట్లు, ఆస్పత్రుల్లో పడకల సంఖ్యను పెంచామని, దేశంలో ఎక్కడా లేని విధంగా ఫ్యామిలీ డిజిటల్ హెల్త్ కార్డుల జారీ పైలెట్ ప్రాజెక్టును చేపట్టామని పేర్కొంది.

ఆరోగ్యశ్రీ కింద నెలకు 73 కోట్ల వ్యయం

రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద 2014 నుంచి 2023 అక్టోబరు వరకు గత ప్రభుత్వం నెలకు సగటున రూ.52 కోట్లు ఖర్చు చేస్తే.. 2023 డిసెంబరు నుంచి ఇప్పటి వరకు తమ ప్రభుత్వం నెలకు సగటున రూ.76 కోట్లను వ్యయం చేసిందని సీఎంవో తెలిపింది. ఆరోగ్యశ్రీ కింద ఉచిత వైద్య వ్యయ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని గుర్తుచేసింది. ఆరోగ్యశ్రీ పరిధిలోకి వచ్చే 1,375 వైద్య చికిత్సల ధరలను సుమారు 20% వరకు పెంచామని, కొత్తగా 163 రకాల చికిత్సలను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకొచ్చామని, దీంతో ఆరోగ్యశ్రీ చికిత్సల సంఖ్య 1,835కి పెరిగిందని వివరించింది. పెరిగిన ధరలు, కొత్తగా అందుబాటులోకి వచ్చిన చికిత్సల కోసం అదనంగా రూ.487.29 కోట్లను కేటాయించామని పేర్కొంది.

ఉద్యోగ నియామకాలు...

ప్రభుత్వ దవాఖానాల్లో ఖాళీల భర్తీ విషయంలో గత సర్కారు నిర్లక్ష్యం చేసిందని సీఎంవో ఆక్షేపించింది. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన అనతి కాలంలోనే వైద్య ఆరోగ్య శాఖలో 7,750 పోస్టులను భర్తీ చేశామని తెలిపింది. మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు(ఎంహెచ్ఎస్ఆర్‌బీ) ద్వారా మరో 6,494 పోస్టులకు నోటిఫికేషన్లను జారీ చేశామని, ప్రస్తుతం ఈ పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని వివరించింది. 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు, 1,690 సివిల్ అసిస్టెంట్ సర్జన్(స్పెషలిస్టు) పోస్టులు, 308 ఫార్మాసిస్ట్(ఆయుష్) పోస్టుల భర్తీకి త్వరలోనే ఎంహెచ్ఎస్ఆర్‌బీ నోటిఫికేషన్లు ఇవ్వనున్నదని తెలిపింది. జూనియర్ డాక్టర్ల స్టైపెండ్ చెల్లింపులు, ఇతర పెండింగ్ సమస్యలన్నింటినీ పరిష్కరించామని పేర్కొంది.

కొత్తగా 8 వైద్య కళాశాలలు

8 నెలల కాలంలోనే కొత్తగా 8 ప్రభుత్వ వైద్య కళాశాలలను అందుబాటులోకి తీసుకొచ్చామని సీఎంవో విడుదల చేసిన ప్రకటన స్పష్టం చేసింది. మొత్తం 400 ఎంబీబీఎస్ సీట్లు రాష్ట్ర విద్యార్థులకు అందుబాటులోకి వచ్చాయని తెలిపింది. దీంతో రాష్ట్రంలోని ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య 4,090కి పెరిగిందని పేర్కొంది. వికారాబాద్ జిల్లాలోని కొడంగల్‌లో 50 ఎంబీబీఎస్ సీట్లతో మెడికల్ కాలేజీ, 50 సీట్లతో ఫిజియోథెరపీ కాలేజీ, 30 సీట్లతో పారామెడికల్ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు జారీ చేసిందని వివరించింది. ఉస్మానియా, గాంధీ, కాకతీయ మెడికల్ కాలేజీలకు కొత్త భవన సదుపాయాల కోసం రూ.204.85 కోట్లను మంజూరు చేశామని తెలిపింది. ఏడాది కాలంలోనే 16 నర్సింగ్ కళాశాలలు, 28 పారామెడికల్ కాలేజీలను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొచ్చామని పేర్కొంది. కొత్తగా 16 డయాలసిస్ సెంటర్లను మంజూరు చేశామని, 20 డయాలసిస్ సెంటర్లలో అదనంగా 89 డయాలసిస్ మిషన్లను అందుబాటులోకి తెచ్చామని వివరించింది. ఇన్ఫెర్టిలిటీ సమస్యలున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు రూ.లక్షల ఖరీదైన ఐవీఎఫ్ సేవలను ఉచితంగా అందజేయాలని నిర్ణయించామని, ఈ మేరకు గాంధీ ఆస్పత్రిలో ఐవీఎఫ్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపింది. రోడ్డు ప్రమాదాలు, ఇతర ఎమర్జెన్సీ కేసులకు సంబంధించి రాష్ట్ర, జాతీయ రహదారులపై ప్రతి 30 కిలోమీటర్లకు ఒకటి చొప్పున 74 ట్రామా కేర్ సెంటర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించామని తెలిపింది. రూ.వెయ్యి కోట్లతో రెండు సంవత్సరాల్లో ఈ ట్రామాకేర్ సెంటర్లను అందుబాటులోకి తీసుకురానున్నామని వివరించింది. ఇంతకు ముందు సేవలు అందని మండలాల్లో రూ.30 కోట్లతో 222 నూతన 108 అంబులెన్సులను అందించనున్నామని తెలిపింది.

ఎల్లుండి నుంచి ప్రజాపాలన విజయోత్సవాలు

» రాష్ట్రవ్యాప్తంగా 9 రోజుల పాటు నిర్వహణ

హైదరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై డిసెంబరు 7 నాటికి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన విజయోత్సవాల షెడ్యూల్‌ను సర్కారు విడుదల చేసింది. డిసెంబరు 1 నుంచి 9 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే కార్యక్రమాల వివరాలను సీఎం కార్యాలయం వెల్లడించింది.

రోజువారీ కార్యక్రమాలిలా..

డిసెంబర్ 1: 26 సమీకృత గురుకుల భవనాలకు శంకుస్థాపనలు.. ప్రభుత్వ విద్యా సంస్థల్లోని విద్యార్థులకు వ్యాస రచన పోటీలు.. సీఎం కప్ పోటీల ప్రారంభం

డిసెంబర్ 2: 16 నర్సింగ్, 28 పారా మెడికల్ కాలేజీల ప్రారంభోత్సవం.. 213 కొత్త అంబులెన్స్‌లు, 33 ట్రాన్స్‌జెండర్ల క్లినిక్‌ల ప్రారంభం.. ట్రాఫిక్ వాలంటీర్లుగా ట్రాన్స్‌జెండర్ల పైలట్ ప్రాజెక్టు.

డిసెంబర్ 3: హైదరాబాద్ రైజింగ్ కార్యక్రమాలు.. ఆరాంఘర్ నుంచి జూపార్క్ వరకు ఫ్లైఓవర్ ప్రారంభం.. రూ.150 కోట్ల విలువైన సుందరీకరణ పనులకు శ్రీకారం.

డిసెంబర్ 4: తెలంగాణ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ భవనానికి శంకుస్థాపన.. వర్చువల్ సఫారీ, వృక్ష పరిచయ కేంద్రం ప్రారంభం.. 9,007 మందికి ఉద్యోగ నియామక పత్రాల అందజేత

డిసెంబర్ 5: ఇందిరా మహిళా శక్తి బజార్ ప్రారంభం.. స్వయం సహాయక గ్రూపుల్లో చర్చలు.. మేడ్చల్, మల్లేపల్లి, నల్లగొండల్లో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ల ప్రారంభం.. ఘట్‌కేసర్‌లో నిర్మించిన బాలికల ఐటీఐ కాలేజీ ప్రారంభం..

డిసెంబర్ 6: యాదాద్రి పవర్ ప్లాంట్‌లో విద్యుదుత్పత్తి ప్రారంభం.. 244 విద్యుత్తు ఉపకేంద్రాలకు శంకుస్థాపనలు.

డిసెంబర్ 7: రాష్ట్ర విపత్తు ప్రతిస్పందనదళం ప్రారంభం.. తెలంగాణ కళా ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు.

డిసెంబర్ 8: 7 కృత్రిమ మేధ (ఏఐ) ప్రాజెక్టులు, 130 కొత్త మీ-సేవ కేంద్రాలు ప్రారంభం.. యంగ్ ఇండియా వర్సిటీకి శంకుస్థాపన.. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ.

డిసెంబర్ 9: లక్ష మంది మహిళా శక్తి సభ్యుల సమక్షంలో సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ.. ట్యాంక్‌బండ్‌పై ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాల ముగింపు వేడుకలు. డ్రోన్ షో, కళాకృతుల ప్రదర్శన,

పైసలిస్తేనే పదోన్నతులు..?

» ఏళ్లుగా కదలని ప్రమోషన్ల ఫైళ్లు
» జోన్-6లో గ్రేడ్ 2 ఫార్మసిస్టులకు చుక్కలు
» డీహెచ్ ఆఫీసులో ఇష్టానుసార పాలన


హైదరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వైద్య శాఖ పరిధిలోని ప్రజారోగ్య సంచాలకుల కార్యాలయం అక్రమాలకు అడ్డాగా మారుతోంది. అక్కడ పైసలిస్తేనే పదోన్నతుల ఫైళ్లు కదులుతాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతీ పనికి ఒక రేటు పెట్టి డబ్బులు వసూలు చేస్తున్నారని డీహెచ్ పరిధిలోని ఉద్యోగులు చెబుతున్నారు. తాజాగా డీహెచ్ పరిధిలో ఫార్మసిస్టు గ్రేడ్-2 ఉద్యోగులు పది నెలలుగా పదోన్నతుల కోసం ఆ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. 1990వ సంవత్సరంలో ప్రజారోగ్య సంచాలకుల పరిధిలో సుమారు 300 మందికి ఫార్మసిస్టు గ్రేడ్-2 ఉద్యోగాలు వచ్చాయి. అందులో ఆరో జోన్‌లో మాత్రం ఇంత వరకు పదోన్నతులు కల్పించలేదు. మిగిలిన అన్ని జోన్లలోని గ్రేడ్-2 ఫార్మసిస్టులకు గ్రేడ్-1గా పదోన్నతులు కల్పించారు. పదోన్నతుల విషయంపై డీహెచ్‌తో పాటు కార్యాలయంలోని డీడీ, సెక్షన్ అధికారులను కలిస్తే నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారని ఆరో జోన్‌లోని గ్రేడ్-2 ఫార్మసిస్టులు వాపోతున్నారు. ప్రస్తుతం జోన్-6 పరిధిలో 12 గ్రేడ్-1 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని పదోన్నతుల ద్వారా భర్తీ చేయాల్సి ఉన్నా.. డీహెచ్ కార్యాలయ సిబ్బంది పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. కార్యాలయ సిబ్బంది డబ్బులు ఆశిస్తున్నారని, అందుకే తమ పదోన్నతుల ఫైలు పెట్టకుండా నెలల తరబడి తిప్పించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొద్ది రోజుల క్రితం ఓ డాక్టర్‌కు డీహెచ్ కార్యాలయం పోస్టింగ్ ఇచ్చారు. సదరు డాక్టర్ పదేళ్లుగా అసలు డ్యూటీనే చేయడం లేదు. రూ.లక్షల్లో డబ్బులు తీసుకుని ఆ డాక్టర్‌కు పోస్టింగ్ ఇచ్చారు. దీనిపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వరకు ఫిర్యాదులు వెళ్లాయి. దాంతో ఆయన అంతర్గత విచారణకు ఆదేశించారు. రూ.పది లక్షలకు పైగా డబ్బులు తీసుకొని పోస్టింగ్ ఇచ్చినట్లు విచారణలో తేలింది. దాంతో ఆ కార్యాలయంలో ముగ్గురు ఉన్నతాధికారులకు గత వారమే చార్జ్ మెమోలు జారీ అయ్యాయి.

పదోన్నతుల్లోనూ అంతే..

వైద్య ఆరోగ్య శాఖలో డీహెచ్ పరిధిలో 2011లో ఓ అభ్యర్థి నర్స్ పోస్టుకు ఎంపికయ్యారు. ఆమెకు ఈ ఏడాది పదోన్నతి రావాలి. కానీ 2018లో ఎంపికైన మరో జూనియర్ నర్స్‌కు డీహెచ్ కార్యాలయ సిబ్బంది పదోన్నతి కల్పించారు. తనకు జరిగిన అన్యాయంపై ఆ నర్స్ కొద్ది నెలలుగా డీహెచ్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఎక్కడో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పనిచేస్తున్న ఆమె.. ప్రతీసారి సెలవు పెట్టుకొని వచ్చి వెళుతున్నారు. అయితే, ఎన్నిసార్లు విజ్ఞాపన పత్రం ఇచ్చినా ఆమెకు న్యాయం జరగలేదు. ఇటువంటి ఘటనలు డీహెచ్ కార్యాలయంలో కోకొల్లలు. పాలనానుభవం లేకపోవడం, కార్యాలయంపై పట్టు లేకపోవడం, వేగంగా నిర్ణయాలు తీసుకోలేకపోవడం వంటి లోపాల వల్ల డీహెచ్ కార్యాలయం అనేక అక్రమాలకు నిలయంగా మారుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మూసీపై బహిరంగ చర్చకు సిద్ధం

» ఎక్కడకు రావాలో రేవంత్ చెప్పాలి
» బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ సవాల్
» గుంట భూమి కూడా ఆక్రమించలేదు
» సీఎంవి నిరాధార ఆరోపణలని విమర్శ



హైదరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజలతోపాటు పార్లమెంటును సైతం సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేశారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. మూసీ నది అభివృద్ధి ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వం వాస్తవాలను దాచిపెడుతోందన్నారు. కేంద్రాన్ని, పార్లమెంటును తప్పుదోవ పట్టించిందని మండిపడ్డారు. మూసీపై బహిరంగ చర్చకు తాను సిద్ధమని.. ఎక్కడకు రావాలో రేవంత్‌రెడ్డి చెప్పాలని సవాల్ విసిరారు. మూసీపై అఖిలపక్షాన్ని చర్చలకు పిలుస్తానన్న సీఎం తోక ముడిచారని ఎద్దేవా చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమే మూసీ ప్రాజెక్టు చేపట్టారని ఆరోపించారు. సీఎంపై పార్లమెంట్‌లో హక్కుల ఉల్లంఘన తీర్మానాన్ని ప్రవేశపెడతామని, మూసీపై బాధితుల పక్షాన శాసనసభలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో మరింత మెరుగ్గా 2014లో భూసేకరణ చట్టం తెచ్చామని, అదే రాష్ట్రంలో అమల్లో ఉందని చెప్పారు. దానిప్రకారం ఎన్యుమరేషన్ జరగలేదని, పీడీ నోటిఫికేషన్ ఇవ్వలేదని, డీపీఆర్ సిద్ధం చేయలేదని, లబ్ధిదారులను గుర్తించలేదని హరీశ్ ఆరోపించారు. రంగనాయకసాగర్ దగ్గర ఇరిగేషన్ భూములు ఆక్రమించానంటూ తనపై సీఎం నిరాధార ఆరోపణలు చేయడం తగదని హరీశ్ అన్నారు. ఒక గుంట భూమిని కూడా తాను ఆక్రమించలేదని..నిబంధనలకు లోబడి భూమిని కొనుగోలు చేశానని చెప్పారు. భూఆక్రమణల చరిత్ర రేవంత్‌రెడ్డికే ఉందని, ఆక్రమణల్లో మునిగి తేలే ఆయనకు అందరూ దొంగల్లానే కనిపిస్తారని ఎద్దేవా చేశారు. తనపై ఆరోపణలు చేసిన సీఎం.. ఎప్పుడు వస్తారో చెబితే ఆ భూమి దగ్గరే బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు.

6,213 పాఠశాలలు మూసేందుకు కుట్ర

ఏడాది పాలనలోనే రాష్ట్రంలో 6213 పాఠశాలలను మూసివేసేందుకు కాంగ్రెస్ సర్కారు కుట్ర చేస్తోందని హరీశ్ ఎక్స్ వేదికగా ఆరోపించారు. ప్రతి చిన్న గ్రామానికి ప్రాథమిక, ప్రతి రెవెన్యూ గ్రామానికి ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల ఏర్పాటు చేస్తామన్న కాంగ్రెస్ హామీ ఏమైందని నిలదీశారు. ఏడాది కాకముందే జీరో స్కూల్ పేరిట 1,899 బడులు, 10 మంది లోపు విద్యార్థులున్న 4,314 స్కూళ్లను మూసివేసే ప్రణాళికలో భాగంగానే 5,741 మంది టీచర్లను బదిలీ చేస్తున్నారని హరీశ్ ఆరోపించారు.

చైల్డ్ పోర్నోగ్రఫీ..
పోలీసులు గమనిస్తున్నారు జాగ్రత్త..!

» విస్తృతంగా సైబర్ పెట్రోలింగ్
» వెబ్ ఇంటెలిజెన్స్‌తో ఆన్‌లైన్‌లో నిఘా

హైదరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): చైల్డ్ పోర్నోగ్రఫీ చూడడం మన దేశంలో నేరం. ఎవరూ గమనించడం లేదని ఎన్‌క్రిప్టెడ్ పద్ధతుల్లో చిన్నారుల అశ్లీల వీడియోలు, ఫొటోలు చూసినా.. గుర్తించే వ్యవస్థ పోలీసు శాఖకు అందుబాటులోకి వచ్చింది. అంటే.. అదేపనిగా చిన్నారుల అశ్లీల (చైల్డ్ సెక్సువల్ అబ్యూజ్ మెటీరియల్-సీసామ్) చూసేవారు, వాటిని షేర్ చేసేవారిని సైబర్ పెట్రోలింగ్‌లో గుర్తిస్తున్నారు. తెలంగాణ పోలీసులకు అందుబాటులోకి వచ్చిన ఈ టెక్నాలజీతో.. ఇతర రాష్ట్రాల పైనా చైల్డ్ పోర్నోగ్రఫీపై నిఘా పెడుతున్నారు. నాలుగు రోజుల క్రితం పశ్చిమబెంగాల్‌లో చైల్డ్ పోర్నోగ్రఫీ చూస్తున్న వ్యక్తిని సైబర్ పోలీసులు అక్కడి పోలీసులకు పట్టించారు.

భారత్‌లో పెరుగుతున్న జాఢ్యం

ప్రపంచవ్యాప్తంగా దాదాపు అన్ని దేశాలు చైల్డ్ పోర్నోగ్రఫీని నిషేధించాయి. యునిసెఫ్ అంచనా ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా నెట్‌కెక్కుతున్న చిన్నారుల అశ్లీల వీడియోలు, ఫొటోల్లో 12% భారత్ నుంచే అప్‌లోడ్ అవుతున్నాయి. ప్రతిరోజు సగటున చిన్నారులకు సంబంధించిన 25 వేల అశ్లీల ఫొటోలు, వీడియోలు నెట్‌లో అప్‌లోడ్ అవుతున్నాయి. బాధితుల్లో 80% మంది బాలికలు ఉంటున్నారు.

సైబర్ పెట్రోలింగ్ నిఘా ఇలా..

ఆన్‌లైన్‌లో చిన్నారుల అశ్లీల సాహిత్యాన్ని వీక్షించేవారు, షేర్ చేసేవారు, విక్రయించే వారిని గుర్తించడం, మహిళల్ని వేధించేవారిని(సైబర్ స్టేకర్స్) గుర్తించేందుకు పోలీసులు మూడు విధానాలను అనుసరిస్తూ.. సైబర్ పెట్రోలింగ్‌ను కొనసాగిస్తున్నారు. అవి-- వెబింట్, ఓసింట్, డీపింట్. వెబింట్‌లో వెబ్‌సైట్ నుంచి సేకరించిన డేటాను విశ్లేషించి, దాని ఆధారంగా అవతలి వారిని గుర్తిస్తున్నారు. ఓపెన్ సోర్స్ ఇంటెలిజెన్స్(ఓసింట్)తో ఆన్‌లైన్‌లో ఉచితంగా అందుబాటులో ఉన్న సైబర్ టూల్స్‌ను ఉపయోగిస్తున్నారు. మూడోది అత్యంత కీలకమైన డీపింట్. దీన్నే డార్క్-ఇంట్ అంటారు. ఈ పద్ధతిలో డార్క్‌వెబ్‌తోపాటు ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరిగే వెబ్‌సైట్‌లు, ఇతర గ్రూపుల్లో సైబర్ పెట్రోలింగ్ పోలీసులు సభ్యులుగా చేరుతారు.

300 ప్రొఫైల్స్ గుర్తింపు

మహిళా భద్రత విభాగం ఆధ్వర్యంలో కొనసాగుతున్న షీ సైబర్ ల్యాబ్ నిర్వహించిన సైబర్ పెట్రోలింగ్‌లో.. తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాల్లో వివిధ విభాగాల్లో 300 మంది ప్రొఫైల్స్‌ను పోలీసులు గుర్తించారు. అందులో సీసామ్ కేసులకు సంబంధించినవి అత్యధికంగా(180) ఉన్నాయి. ఆ తర్వాతి స్థానంలో మానవ అక్రమ రవాణాకు సంబంధించి 115, సైబర్ నేరాలకు సంబంధించి3, గృహ హింసకు సంబంధించి2 ప్రొఫైల్స్ ఉన్నాయి.

ఇతర రాష్ట్రాలకు సమాచారం

సైబర్ పెట్రోలింగ్‌లో తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాల్లోని వారిపైనా నిఘా కొనసాగిస్తున్నారు. తమకు లభించిన సమాచారాన్ని ఆయా రాష్ట్రాల పోలీసులకు అందించి, కేసులు నమోదు చేసేలా చర్యలు తీసుకున్నారు. ఇప్పటి వరకు మొత్తం 180 చైల్డ్ సెక్సువల్ అబ్యూజ్ మెటీరియల్‌కు సంబంధించిన కీలక సమాచారాన్ని గుర్తించామని మహిళా భద్రత విభాగం చీఫ్ శిఖాగోయల్ తెలిపారు. ఈ సమాచారం ఆధారంగా 65 ఇంటెలిజెన్స్ నివేదికలను రూపొందించి, 13 రాష్ట్రాల పోలీసులకు సమాచారాన్ని చేరవేశామన్నారు. తాము ఇచ్చిన సమాచారం ఆధారంగా ఆయా రాష్ట్రాల్లో 20 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని, 21 మంది అరెస్టయ్యారని వివరించారు.

రాష్ట్రం	ఎఫ్ఐఆర్‌ల నమోదు	అరెస్టైన వారు
ఆంధ్రప్రదేశ్	2	2
బిహార్	1	1
ఢిల్లీ	1	1
మహారాష్ట్ర	1	1
రాజస్థాన్	2	2
పశ్చిమ బెంగాల్	01	--
తెలంగాణ	12	14

కేటీఆర్ క్షమాపణ చెప్పాలి

» ఐఏఎస్ అధికారుల సంఘం
» కేటీఆర్ తీరు ప్రజాస్వామ్యానికి విఘాతం: ఐపీఎస్‌ల సంఘం
» కేటీఆర్‌ది బెదిరింపు ధోరణి.. పోలీసు అధికారుల సంఘం

హైదరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌పై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఐఏఎస్ అధికారుల సంఘం నిరసించింది. ఇలాంటి ఆధారరహిత ఆరోపణలను ఖండిస్తున్నామని గురువారం ఓ ప్రకటనలో పేర్కొంది. ఒక సివిల్ సర్వీసు అధికారిని లక్ష్యంగా చేసుకుని అవమానించినట్లుగా, గౌరవాన్ని దెబ్బతీసినట్లుగా కేటీఆర్ వ్యాఖ్యలు ఉన్నాయని పేర్కొంది. కేటీఆర్ కలెక్టర్‌పై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని, వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌పై కేటీఆర్ చేసిన వ్యాఖ్యల్ని తెలంగాణ ఐపీఎస్ అధికారుల సంఘం తీవ్రంగా ఖండించింది. రాజ్యాంగ నిబద్ధత ఆధారంగా సివిల్ సర్వెంట్స్ నిర్వహించే బాధ్యతలకు విరుద్ధంగా కేటీఆర్ వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. ప్రజాసేవలో అధికారి విధులు నిష్పక్షపాతంగా, న్యాయబద్ధంగా, ఎలాంటి భయాందోళనలు లేకుండా నిర్వహించాల్సి ఉంటుందని, కానీ ఇలాంటి నిరాధార ఆరోపణలు బాధ్యతారహితమైనవని, ఇవి ప్రజాస్వామ్య వ్యవస్థలపై చెడు ప్రభావం చూపిస్తాయని పేర్కొంది. అలాగే కేటీఆర్ పోలీసు శాఖపై చేసిన వ్యాఖ్యల్ని పోలీసు అధికారుల సంఘం తీవ్రంగా ఖండించింది. కేటీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యల్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపిరెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. కేటీఆర్ బెదిరింపు ధోరణిలో మాట్లాడటం వాంఛనీయం కాదన్నారు. పోలీసులను చులకన చేస్తూ, బెదిరిస్తూ మాట్లాడటం ఎమ్మెల్యేగా ఉన్న కేటీఆర్‌కు సముచితం కాదన్నారు. తక్షణం కేటీఆర్ తన వ్యాఖ్యల్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

నిలదీస్తే నిర్బంధం.. ప్రశ్నిస్తే కేసులు

(మొదటిపేజీ తరువాయి)

రావణకాష్ఠం చేసి.. లగచర్ల రైతులను జైలుపాలు చేసి.. అల్లుడి కళ్లలో ఆనందం చూసినందుకా రైతు పండుగలు?" అని కేటీఆర్ రేవంత్ సర్కారుపై మండిపడ్డారు. పండుగలు మీకు.. పస్తులు రైతులకా? అని నిలదీశారు. చెప్పింది బారణా.. చేసింది చారణా అని ఎద్దేవా చేశారు. కల్లాల్లో ధాన్యం పోసి, కళ్లల్లో వత్తులు వేసుకొని, కొనుగోళ్ల కోసం ఎదురుచూస్తున్న రైతులు.. నిబంధనల పేరిట కొర్రీలు పెట్టి కొనుగోళ్లు చేయకపోవడంతో అడ్డికి పావుశేరు లెక్కన దళారులకు అమ్ముకుంటున్నారని చెప్పారు. అబద్ధానికి అంగీ, లాగు తొడిగితే అది కాంగ్రెస్ సర్కారని దుయ్యబట్టారు. "దేనికి విజయోత్సవాలు? రైతును నిండా ముంచినందుకా? వ్యవసాయాన్ని ఆగం చేసినందుకా? నీ గుడ్డిగుర్తులు, కాకి లెక్కలు, కల్లబొల్లి కబుర్లతో ఎల్లకాలం కాలం వెళ్లదీయలేవు" అని సీఎం రేవంత్‌పై కేటీఆర్ ఎక్స్‌లో ఆగ్రహం వ్యక్తం చేశారు. బడి పిల్లలకు బాసటగా నిలిచిన బీఆర్ఎస్వీ నాయకుల అరెస్ట్ అప్రజాస్వామికమన్నారు. పురుగుల అన్నం పెడుతున్నారని ప్రశ్నిస్తే కేసులు పెడతారా? అని నిలదీశారు. బీఆర్ఎస్వీ నాయకులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కమలం-హస్తం నేతలు కలిసికట్టుగా..

"మోదీ గారూ.. కమలం, కాంగ్రెస్ నేతలు కలిసికట్టుగానే పనిచేస్తున్నారు. చోటే భాయ్‌కు వ్యూహకర్తగా.. కాంగ్రెస్ కట్టర్ కార్యకర్తలుగా.. విశ్రమించకుండా పని చేస్తున్నారు! ఎన్ని అరాచకాలు జరిగినా ఒక్కరూ నోరుమెదపరు! రేవంత్ మీద ఈగ వాలకుండా కాపాడుకుంటారు! హైడ్రా మంచిదంటారు, మూసీ కావాలంటారు! ఏమన్నా అంటే నిద్ర నటిస్తారు! పిల్లలు చనిపోయినా, రైతు గుండె పగిలినా, గిరిజనులను చెరపట్టినా, చప్పట్లు కొడతారు! తెలంగాణలో వారి చేతిలోనే కమలం ఉంది! జాగ్రత్తగా! భద్రంగా!" అని కేటీఆర్ బీజేపీ నేతలపై విమర్శలు గుప్పించారు.

నేడు దీక్షా దివస్

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణ త్యాగానికి సిద్ధపడ్డ గొప్ప నాయకుడు కేసీఆర్ అని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం దీక్షా దివస్ సందర్భంగా తెలంగాణ భవన్‌లో నిర్వహించే కార్యక్రమ ఏర్పాట్లను కేటీఆర్, మధుసూదనాచారి తదితరులు పరిశీలించారు.

తెరచాటు ఒప్పందం

(మొదటిపేజీ తరువాయి)

ఈపాటికే అర్థమైపోయిందని పేర్కొన్నారు. కాగా బీఆర్ఎస్ పార్టీ మాదిరిగా బీజేపీ డ్రామాలు చేయదని, అబద్ధాలు చెప్పదంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కేంద్రమంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. 'బీజేపీ, కాంగ్రెస్ ఎప్పటికీ కలువబోవని చిన్న పిల్లాడిని అడిగినా చెబుతాడు. ఆ మాత్రం పరిజ్ఞానం కూడా ట్విట్టర్ టిల్లుకు లేకుండాపోయింది' అని ఎద్దేవా చేశారు. 'కారు' షెడ్డులో ఉన్నా, దాని తాళాలు ఎవరి 'చేతి'లో ఉన్నాయో అందరికీ తెలుసని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ట్విటర్ వేదికగా వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన కుంభకోణాలపై దర్యాప్తు మందగించడం బీఆర్ఎస్, కాంగ్రెస్ రహస్య ఒప్పందంలో భాగమేనని ఆరోపించారు. ధరణి, గొర్రెల పంపిణీ, కాళేశ్వరం, విద్యుత్తు కొనుగోలు కుంభకోణాలు సహా ఫోన్ ట్యాపింగ్, డ్రగ్స్, జన్వాడ ఫాంహౌజ్ కేసులపై దర్యాప్తు ఎందుకు నిలిచిపోయిందో అందరికీ అర్థమైపోయిందని సంజయ్ పేర్కొన్నారు.

తెలంగాణ రైజింగ్!

» అన్ని ప్రభుత్వ శాఖల వెబ్ పోర్టళ్లపై నూతన లోగో

» ప్రజా విజయోత్సవాలకు చిహ్నంగా ఏర్పాటు

హైదరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు కొలువుదీరి ఏడాద వుతున్న సందర్భంగా ప్రభుత్వం కొత్త లోగోను తీసుకువచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై సంవత్సరం కావడంతో పాటు, దేశంలో తెలంగాణ నెంబర్ వన్‌గా ఎదుగుతున్నదనే విషయాన్ని తెలిపేలా 'తెలంగాణ రైజింగ్' అనే పేరుతో లోగోను రూపొందించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ అధికారిక వెబ్ పోర్టల్‌తో పాటు, అన్ని ప్రభుత్వ శాఖల వెబ్ పోర్టళ్లపై ఇక నుంచి ఈ లోగో దర్శనమివ్వనుంది. డిసెంబరు 1 నుంచి 9 వరకు ప్రభుత్వం నిర్వహించే ప్రజాపాలన- ప్రజా విజయోత్సవాల కార్యక్రమాల్లోనూ ఈ లోగో ప్రధానంగా కనిపించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఒకటో నెంబర్ అంకెపై ఒక గుండ్రటి చక్రంలో తెలంగాణ మ్యాప్‌ను ఉంచి, అందులో కాషాయం, తెలుపు, ఆకుపచ్చ రంగులు కనబడేలా అశోకచక్రం లాంటిదానిని ఉంచారు. ఒకటో నెంబర్ అంకె కిందిభాగంలో 'తెలంగాణ రైజింగ్' అని రాశారు.

ఐపీఎస్‌లు ప్రజలకు అందుబాటులో ఉండాలి

» అదే సమర్థ పనితీరుకు మూలస్తంభం: గవర్నర్

హైదరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సాధారణ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండటమే సమర్థవంతమైన పనితీరుకు మూలస్తంభమని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ట్రైనీ ఐపీఎస్‌లకు సూచించారు. తెలంగాణకు కేటాయించిన 2023, 2024 బ్యాచ్ ట్రైనీ ఐపీఎస్‌లు రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా గవర్నర్ పలు అంశాలపై వారికి కీలక సూచనలు, దిశానిర్దేశం చేశారు. విధి నిర్వహణలో భాగంగా ప్రజలతో బలమైన అనుబంధాన్ని ఏర్పరుచుకోవాల్సిన అవశ్యకతను చెప్పారు. ప్రజలతో మమేకమై వారి సమస్యల్ని అర్థం చేసుకోవాలన్నారు. విధినిర్వహణలో నిజాయితీ, అంకితభావం, ముక్కుసూటితనం ప్రాధాన్యతను వివరించారు. విధి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొని, సమాజానికి మంచి చేసేందుకు కట్టుబడి ఉండటం ఎంతో కీలకమని సూచించారు. తెలంగాణ ఎంతో చైతన్యవంతమైందని, ఈ రాష్ట్రానికి కేటాయించబడటం ఎంతో అదృష్టమని గవర్నర్ వారికి చెప్పారు. అనంతరం తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ నేతృత్వంలో ట్రైనీ ఐపీఎస్‌లు గవర్నర్‌తో సమావేశమయ్యారు.

సోయాబీన్ కొనుగోళ్లలో తెలంగాణ అగ్రస్థానం!

» 43,755 టన్నుల సేకరణ.. మార్క్‌ఫెడ్ ఎండీ శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సోయాబీన్ కొనుగోళ్లలో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ అగ్రస్థానంలో ఉన్నట్లు మార్క్‌ఫెడ్ ఎండీ శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యంలో మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాలు ఒకటి నుంచి రెండు శాతం మాత్రమే సోయాబీన్ కొనుగోళ్లు చేశాయని తెలిపారు. తెలంగాణకు ఇచ్చిన నిర్ణీత లక్ష్యంలో 74 శాతం కొనుగోళ్లు చేశామన్నారు. కనీస మద్దతు ధరకు 59,708 టన్నులు కొనుగోలు చేయాలని లక్ష్యం విధించగా 43,755 టన్నులు సేకరించామని చెప్పారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు.

పరికిబండలో లాజిస్టిక్ పార్క్

» 315 ఎకరాల గుర్తింపు.. రాజ్యసభలో కేంద్రం వెల్లడి

న్యూఢిల్లీ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో మల్టీమోడల్ లాజిస్టిక్ పార్క్ ఏర్పాటుకు మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం పరికిబండ గ్రామంలో 315 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిందని కేంద్రం వెల్లడించింది. రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ అడిగిన ప్రశ్నకు కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రి నితిన్‌గడ్కరీ ఈ మేరకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఇందుకు సంబంధించిన సాధ్యాసాధ్యాల అధ్యయన నివేదికను రూపొందిస్తున్నట్టు చెప్పారు. నివేదిక ఆధారంగా నిధుల కేటాయింపుపై చర్యలు తీసుకుంటామన్నారు.

రైతుల ముంగిట్లోకి బయోపాలిమర్ విత్తనాలు!

» జాతీయ నూనె గింజల పరిశోధన సంస్థ ఆవిష్కరణ

» విత్తన సంస్థలతో పరస్పర అవగాహన ఒప్పందం



హైదరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విత్తనాల శుద్ధి ద్వారా సూక్ష్మజీవులు, మేలు చేసే రసాయనాలను భూమిలోకి పంపించే కొత్త విధానాన్ని జాతీయ నూనెగింజల పరిశోధన సంస్థ(ఐఐఓఆర్) హైదరాబాద్ శాస్త్రవేత్తలు ఆవిష్కరించారు. రైతులు విత్తనాలు నాటడానికి ముందు శుద్ధి చేయకపోవడంతో పంటకు రక్షణ లేకుండా పోయి దిగుబడి తగ్గుతోంది. ఈ సమస్యలను అధిగమించడానికి బయోపాలిమర్ ఆధారిత సీడ్ కోటింగ్ విధానం ద్వారా మొక్కలకు అవసరమయ్యే పోషకాలను విత్తనానికి మూడు పొరలుగా పూత పూసి అందిస్తామని శాస్త్రవేత్తలు తెలిపారు. నయాపైసా ఖర్చు లేకుండా రైతులకు బయోపాలిమర్ పూత పూసిన విత్తనాలను అందుబాటులోకి తీసుకరావటానికి జాతీయస్థాయి వ్యవసాయాధారిత పరిశ్రమలు, విత్తన సంస్థలతో పరస్పర అవగాహన ఒప్పందం కార్యక్రమాన్ని గురువారం ఆచార్య జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయంలో నిర్వహించారు. ఐఐఓఆర్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఆర్‌డీ ప్రసాద్, శాస్త్రవేత్త డాక్టర్ కేఎస్‌వీ పూర్ణ చంద్రిక ఆవిష్కరించిన సీడ్ కోటింగ్ విధానానికి పేటెంట్ లభించిందని ఈ సందర్భంగా తెలిపారు. భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి(ఐసీఏఆర్) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ టీఆర్ శర్మ, ఐఐఓఆర్ డైరెక్టర్ డాక్టర్ ఆర్కే. మాథూర్ అగ్రి ఇన్నోవేటివ్ ఇండియా సీఈవో ప్రవీణ్ మాలిక్ తదితరులు ఒప్పందపత్రాలను మార్చుకున్నారు.

పాలిటెక్నికల్ లెక్చరర్ల పోస్టులకు అభ్యర్థుల ఎంపిక!


హైదరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నికల్ లెక్చరర్ల పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను పబ్లిక్ సర్వీసు కమిషన్ విడుదల చేసింది. ఈ మేరకు గురువారం జాబితాను వైబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు అధికారులు వెల్లడించారు. పాలిటెక్నికల్ కాలేజీల్లోని ఈసీఈ, ప్రింటింగ్ టెక్నాలజీ, జియాలజీ, ఆర్కిటెక్చర్, కెమిస్ట్రీ, ఫిజిక్స్ వంటి విభాగాల్లో లెక్చరర్ పోస్టులకు నోటిఫికేషన్‌ను జారీ చేసిన విషయం తెలిసిందే.

నా కొడుకును బతికించండి

» చిన్న వయసులోనే మధుమేహం, కాలేయ వ్యాధి

» వైద్యానికి ఇప్పటికే ఉన్న ఇంటిని అమ్ముకున్నాం

» సీఎం రేవంత్, దాతలు ఆదుకోవాలని తల్లి వేడుకోలు



వివరాలు వెల్లడిస్తున్న బాలుడి తల్లి అనూష

బర్కత్‌పుర, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): చిన్న వయసులోనే మధుమేహం, కాలేయ వ్యాధుల బారిన పడిన తన కుమారుడిని ప్రభుత్వం, దాతలు ఆదుకోవాలని ఓ తల్లి వేడుకుంది. నిజామాబాద్ జిల్లా బీమ్‌గల్ మండలం బాబాపూర్ గ్రామానికి చెందిన అనూష కుమారుడు రితిక్ మూడో తరగతి చదువుతున్నాడు. తండ్రి ఆటోడ్రైవర్. రితిక్ రెండేళ్ల వయసులోనే మధుమేహం, కాలేయ వ్యాధుల బారిన పడ్డాడు. అప్పటి నుంచి తల్లితండ్రులు అతన్ని హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రిలో చూపిస్తూ నిత్యం ఇన్సులిన్ ఇంజక్షన్‌లు, మందులు వాడుతున్నారు. తమ కుమారుడి వైద్య ఖర్చుల కోసం ఇప్పటికే ఉన్న ఇంటిని అమ్మేశామని, ప్రస్తుతం తమ వద్ద చిల్లిగవ్వ లేదని బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్ వద్ద బాలుడి తల్లి అనూష మాట్లాడుతూ వాపోయారు. నెలకు మందులు, ఇంజక్షన్లకు రూ. 20 వేలు ఖర్చవుతోందని, డబ్బులు అయిపోవడంతో అప్పు చేసి బతికించుకుంటున్నామని చెప్పారు. తన కుమారుడి వైద్యానికి సీఎం రేవంత్‌రెడ్డి సహాయం అందించాలని దాతలు కూడా ముందుకు వచ్చి ఆదుకోవాలని అనూష కోరారు.

సర్వేపై ప్రజలు ఏమంటున్నారు?

ఇంటింటి సర్వే బృందంతో సీఎం రేవంత్ .. తన కుటుంబ వివరాలు నమోదు



సర్వే బృందంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

» నేడు సీఎం ఢిల్లీ పర్యటన

హైదరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసానికి వచ్చిన సర్వే బృందానికి తన కుటుంబ వివరాలు అందజేశారు. ఈ సందర్భంగా సర్వే బృందంతో మాట్లాడిన ముఖ్యమంత్రి.. సర్వేపై ప్రజల నుంచి ఎలాంటి స్పందన వస్తుందని ఆరా తీశారు. హైదరాబాద్ పరిధిలో ఉంటున్న ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, ఐఏయస్, ఐపీయస్‌ల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి వివరాలను నమోదు చేయాలని ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. అలాగే, ప్రభుత్వ ఉద్యోగులందరూ సర్వేలో పాల్గొని వివరాలు నమోదు చేసుకునేలా చూడాలని అన్నారు. ఇందుకు సంబంధించిన ఆదేశాలను జారీ చేయాలని ఉన్న తాధికారులను ఆదేశించారు. వీలైనంత తొందరగా కుల సర్వేను పూర్తి చేయాలని సూచించారు. కాగా, సీఎం కుటుంబ వివరాల నమోదు కార్యక్రమంలో ఎన్యుమరేటర్ల వెంట హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్‌రెడ్డి ఉన్నారు. కాగా, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం న్యూఢిల్లీ వెళుతున్నారు. ఢిల్లీ వేదికగా శుక్రవారం జరిగే కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) సమావేశంలో పాల్గొంటారు. కాగా, మహాత్మ జ్యోతిరావుపూలే వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో పూలే చిత్రపటానికి గురువారం నివాళులర్పించారు.

39,51,469 ఇళ్ల సమాచారం కంప్యూటరీకరణ పూర్తి

సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల గణన సర్వేలో భాగంగా 39,51,469 నివాసాల సమాచారం కంప్యూటరీకరణ పూర్తయిందని ప్రభుత్వం గురువారం ప్రకటించింది. సమాచార కంప్యూటరీకరణలో ములుగు జిల్లా(82.5 శాతం) అగ్రస్థానంలో ఉండగా, యాదాద్రి భువనగిరి (74.2 శాతం), సిద్దిపేట(64.5 శాతం) వరుసగా తర్వాతి స్థానాల్లో ఉన్నాయని పేర్కొంది. రాష్ట్రంలో ఇంకా 6,59,839 నివాసాలలో సర్వే చేపట్టాల్సి ఉందని వెల్లడించింది. జీహెచ్‌ఎంసీ పరిధిలో 81.5 శాతం సర్వే ప్రక్రియ పూర్తయిందని, మరో 4,54,240 నివాసాల సమాచారాన్ని సేకరించాల్సి ఉందని ప్రకటించింది.

మీరు రుచి చూశాకే విద్యార్థులకు పెట్టండి

విద్యార్థులకు కలుషిత ఆహార ఘటనలపై సర్కారు సీరియస్.. విచారణ నిమిత్తం రాష్ట్రస్థాయి త్రిసభ్య టాస్క్‌ఫోర్స్ కమిటీ

హైదరాబాద్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లు, గురుకుల విద్యాలయాల్లో కలుషిత ఆహారం తిని విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్న సంఘటనలను సర్కారు తీవ్రంగా పరిగణిస్తోంది. తరచూ ఇలాంటి ఉదంతాలు బయట పడుతుండడంపై ఆగ్రహంగా ఉంది. నారాయణపేట జిల్లా మాగనూరు ఉన్నత పాఠశాలలో వారం వ్యవధిలోనే మూడుసార్లు.. మధ్యాహ్న భోజనం కలుషితం కావడం, ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థిని చౌదరి శైలజ కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై మరణించడం వంటి ఘటనల నేపథ్యంలో దిద్దుబాటు చర్యలు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా హాస్టళ్లు, గురుకులాలు, ఆస్పత్రుల్లో జరిగిన ఇలాంటి ఘటనలకు కారణాలు, బాధ్యులను గుర్తించడానికి రాష్ట్ర స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసింది. అలాగే..విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా.. అన్ని సంక్షేమ వసతి గృహాలు, గురుకుల విద్యాలయాలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 'సంస్థాగత ఆహార భద్రత కమిటీ'లను ఏర్పాటు చేసింది. ఈ కమిటీలు ఆహార పదార్థాలను రుచి చూసిన తర్వాతనే విద్యార్థులకు వడ్డించాల్సి ఉంటుందని ఆదేశించింది. విద్యార్థుల సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని, వారికి సురక్షిత ఆహారాన్ని అందించాల్సి ఉందని స్పష్టం చేసింది. ఈమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి గురువారం వేర్వేరు ఉత్తర్వులను జారీ చేశారు.

టాస్క్‌ఫోర్స్ కమిటీలో ఎవరెవరంటే..

కలుషిత ఆహార ఘటనలపై విచారణకు సర్కారు నియమించిన త్రిసభ్య టాస్క్‌ఫోర్స్ కమిటీలో.. రాష్ట్ర ఆహార భద్రత కమిషనర్, సంబంధిత విభాగాధికారి(హెచ్‌వోడీ)/అదనపు డైరెక్టర్, జిల్లా స్థాయి సంబంధిత శాఖ అధికారి (డీఎస్‌డబ్ల్యూవో/డీటీడబ్ల్యూవో/డీబీసీడబ్ల్యూవో/డీఏఈ తదితరులు)లతో ఈ టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసింది. విద్యార్థులకు ఆహార భద్రత కల్పించడంతోపాటు.. సంస్థాగత తనిఖీ యంత్రాంగాన్ని పెంపొందించాలన్న ఉద్దేశంతో సర్కారు దీన్ని ఏర్పాటు చేసింది. కలుషిత ఆహార సంఘటనలు చోటు చేసుకున్న అన్ని హాస్టళ్లు, గురుకులాలు, అంగన్‌వాడీ కేంద్రాలను ఈ కమిటీ సందర్శించి, విచారణ జరిపి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నివేదిక సమర్పిస్తుంది.

ఆహార భద్రతా కమిటీల్లో ఎవరంటే..

రాష్ట్రంలోని అన్ని సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన 'సంస్థాగత ఆహార భద్రతా కమిటీల్లో కూడా ముగ్గురు చొప్పున సభ్యులుంటారు. ప్రధానోపాధ్యాయుడు/వార్డెన్‌తో పాటు ఆ పాఠశాలలోని మరో ఇద్దరు సిబ్బంది సభ్యులుగా ఉంటారు. ప్రతి విద్యాలయం, పాఠశాలపై పర్యవేక్షణ కోసం ఒక మండల, డివిజన్, జిల్లా స్థాయి అధికారిని నియమించాలని కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది.

ఆహార భద్రతా కమిటీలు చేయాల్సిన పనులు...

గురుకులాలు, హాస్టళ్లలో ఆహారాన్ని తయారు చేసే ప్రతి సందర్భంలోనూ ఈ కమిటీలు ముందస్తుగా స్టోర్ రూమ్‌లు, కిచెన్‌లను తనిఖీ చేయాలి. అవి శుభ్రంగా ఉన్నాయని ధ్రువీకరించిన తర్వాతే వండాలి.

- విద్యార్థులకు వడ్డించే ముందు ఈ కమిటీలు ఆహార పదార్థాలను రుచి చూడాలి. అవి బాగున్నాయని, భద్రంగా ఉన్నాయని రూఢీ చేశాకే విద్యార్థులకు అందించాలి.
- రోజూ స్టోర్ రూమ్‌లు, కిచెన్‌లు, ఆహార పదార్థాల ఫొటోలు తీయాలి. సంబంధిత నోడల్ శాఖలు వీటి కోసం ఒక యాప్‌ను తయారు చేయాలి. నిత్యం తీసిన ఫొటోలను రికార్డుల్లో భద్రపర్చాలి. మొబైల్ యాప్ అందుబాటులోకి వచ్చాక.. ఆ ఫొటోలను రోజువారీగా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

మళ్లీ పాలిషింగ్..

మధ్యాహ్న భోజనం వికటించి విద్యార్థులు అనారోగ్య పాలవుతున్న ఘటనల నేపథ్యంలో.. ఉచిత మధ్యాహ్న భోజనం కోసం సరఫరా చేసిన బియ్యాన్ని మరోసారి పాలిషింగ్ చేయాలని అధికారులు నిర్ణయించారు. సరైన నిల్వ ఏర్పాట్లు లేక.. చాలా చోట్ల బియ్యానికి పురుగులు పడుతున్నాయి. ఇలా చెడిపోయిన, పురుగులు పట్టిన బియ్యాన్ని ఉపయోగించడంతో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభావం పడుతోంది. ఈ నేపథ్యంలోనే.. ఈ బియ్యాన్ని మళ్లీ పాలిషింగ్ చేయాలనే నిర్ణయానికి అధికారులు వచ్చినట్టు సమాచారం.

ఫామ్‌హౌస్ నుంచి కుట్ర

మహిళా, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ల ఆరోపణ

లగచర్ల, దిలావర్పూర్‌లో అధికారుల పై దాడులు, గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ ఘటనల వెనుక కుట్ర దాగి ఉందని మహిళ, ఆర్యవైశ్య కార్పొరేషన్‌ల చైర్ పర్సన్‌లు బండ్రు శోభారాణి, కల్వ సుజాత ఆరోపించారు. 'ఫామ్‌హౌస్' నుంచి కుట్రలు జరుగుతున్నాయని దుయ్యబట్టారు. విద్యాశాఖను సీఎం రేవంత్ చూస్తున్నందున ఆయన్ని అప్రదిష్ట పాలు చేయడానికే కుట్రలు జరుగుతున్నాయన్నారు. హాస్టల్‌లో ఫుడ్‌పాయిజన్ ఘటనల వెనుక ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ కుట్ర ఉందని విమర్శించారు. ప్రవీణ్‌కుమార్, కేటీఆర్ కనుసన్నల్లోనే జరుగుతున్నాయన్నారు.



మోత్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు తినలేక పడేసిన మధ్యాహ్న భోజనం

మధ్యాహ్న భోజనం ముద్దముద్ద

» తినలేక పడేసిన విద్యార్థులు

» బియ్యంలోనే లోపం ఉందన్న హెచ్‌ఎం

» యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు జడ్పీ పాఠశాలలో ఘటన

మోత్కూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): హాస్టళ్ల, పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఒక వైపు అధికారులు తనిఖీలు నిర్వహిస్తుండగా కొందరి నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులకు నాణ్యతలేని భోజనమే అందుతోంది. గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు జడ్పీ ఉన్నత పాఠశాలలోని 300 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండారు. భోజనంలో ముద్దలు, ముద్దలుగా ఉన్న అన్నం వడ్డించడంతో తినడానికి వీలుకాక విద్యార్థులు పడేశారు. డబ్బులు ఉన్న కొందరు పిల్లలు ఆకలికి తట్టుకోలేక హోటల్‌కు వెళ్లి టిఫిన్ చేయగా, మిగతా విద్యార్థులు కడుపు మాడ్చుకున్నారు. ఈ విషయమై ప్రధానోపాధ్యాయుడు టి.గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. గతంలో ఉన్న బియ్యంలో పురుగులు ఉండగా మంగళవారం వాటిని గోదాంకు పంపి, వేరే బియ్యం తెప్పించామన్నారు. ఆ బియ్యంతో వంట చేస్తే ముద్దలు, ముద్దలు అయిందని ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.



వంటను పరిశీలిస్తున్న మంత్రి పొన్నం, పక్కన కలెక్టర్ మనుచౌదరి

సలహాలు, సూచనలు ఇవ్వండి

» విద్యార్థులతో రాజకీయాలు వద్దు: పొన్నం

» సిద్దిపేట మహాత్మా జ్యోతిరావుపూలే గురుకులాన్ని తనిఖీ చేసిన మంత్రి

సిద్దిపేట కల్చరల్, హైదరాబాద్, మాగనూరు, కొండాపూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇవ్వాలే కానీ విద్యార్థులు, గురుకులాలతో రాజకీయం చేయొద్దని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రతిపక్షాలకు హితవు పలికారు. సిద్దిపేటలోని మహాత్మా జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలను గురువారం కలెక్టర్‌తో కలిసి మంత్రి తనిఖీ చేశారు. వంట సిబ్బందితో మాట్లాడి విద్యార్థులకు అందించే అన్నం, కూరలను పరిశీలించారు. ఎక్కడా ఎలాంటి లోపం తలెత్తకుండా చూసుకోవాలని సూచించారు. డీఎంహెచ్‌వో, డీఆర్డీవో, డీపీవో, స్థానిక పంచాయతీ కార్యదర్శులతో త్వరలో కమిటీలు ఏర్పాటు చేస్తామని, అవి 15 రోజులకు ఒకసారి గురుకులాలను సందర్శిస్తాయని చెప్పారు. అనంతరం మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన చిత్రపటానికి పొన్నం పూలమాల వేసి నివాళులర్పించారు. నారాయణపేట జిల్లా మాగనూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలను రాష్ట్రమహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద పరిశీలించారు. విద్యార్థులు అధైర్యపడకుండా మధ్యాహ్న భోజనం చేయాలని అన్నారు. ఏజెన్సీ నిర్లక్ష్యం, ఉపాధ్యాయుల పర్యవేక్షణ లేకపోవడం వల్లనే ఫుడ్ పాయిజన్ ఘటనలు జరిగినట్లు తెలుస్తోందని ఆమె పేర్కొన్నారు. గురుకుల పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని వడ్డించాలని విద్యాశాఖ కమిషన్ రాష్ట్ర చైర్మన్ ఆకునూరి మురళి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని గురుకుల పాఠశాలలు పరిశీలించి, పది రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తానని చెప్పారు. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మల్లేపల్లి ఎస్సీ బాలికల వసతిగృహం, మండల కేంద్రమైన కొండాపూర్‌లోని కస్తూర్బా బాలిక వసతిగృహాలను ఆయన గురువారం తనిఖీ చేశారు. టిఫిన్, భోజనం, టాయిలెట్ల శుభ్రత గురించి విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వంటగదులను, టాయిలెట్లను పరిశీలించారు. ఆయన వెంట జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు, వార్డెన్లు ఉన్నారు. కాగా, ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ ఎందుకు గురుకులాల బాట పట్టారని, గురుకుల వ్యవస్థను గుప్పిట్లో పెట్టుకుని భ్రష్టు పట్టించినందుకా అని మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రశ్నించారు. గురువారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, గురుకులాల కార్యదర్శిగా ప్రవీణ్‌కుమార్ పని చేసిన సమయంలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.

కాంగ్రెస్‌తోనే రైతు రాజ్యం

రాష్ట్రంలోని ప్రాజెక్టులు పూర్తిచేసే బాధ్యత కాంగ్రెస్‌ది.. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

» 30న రైతులకు మరో శుభవార్త: మంత్రి దామోదర

» ఇబ్బందులున్నా సంక్షేమ పథకాలు: మంత్రి జూపల్లి

» పాలమూరులో రైతు ఉత్సవాలు ప్రారంభం



రైతులు ఏర్పాటు చేసిన వ్యవసాయ స్టాళ్లను సందర్శిస్తున్న మంత్రులు తుమ్మల, దామోదర, జూపల్లి

మహబూబ్‌నగర్/ హైదరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీతోనే రైతురాజ్యం సాధ్యమవుతుందని రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రైతులకు పదేళ్లలో బీఆర్‌ఎస్ పార్టీ చేయని మేలు, పది నెలల్లోనే కాంగ్రెస్ పార్టీ చేసి చూపిందని ఆయన చెప్పారు. పాలమూరులో మూడ్రోజులపాటు జరుగుతున్న రైతుపండగ కార్యక్రమాలు గురువారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మంత్రులు, తుమ్మల దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, జిల్లా ఎమ్మెల్యేలు కలిసి పద్మశ్రీ అవార్డు గ్రహీత రైతు చింతల వెంకటరెడ్డితో రైతు పండగను ప్రారంభించారు. అనంతరం రైతులను ఉద్దేశించి తుమ్మల మాట్లాడుతూ, పరిస్థితుల ప్రభావంతో ప్రభుత్వం ఏదైనా చేయలేకపోతే రైతుల కాళ్ళు పట్టుకుంటాం, వారికే చెప్పుకుంటాం తప్పిస్తే.. ఎవరికీ తలవంచే ప్రసక్తే లేదని అన్నారు. పాలమూరు రంగారెడ్డితో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులు పూర్తి చేసే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదని తుమ్మల స్పష్టం చేశారు. అనంతరం మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ, వ్యక్తుల కన్నా వ్యవస్థే శాశ్వతమని అన్నారు. 30న సీఎం రైతులకు మరిన్ని శుభవార్తలు చెప్పబోతున్నారని వెల్లడించారు. రాష్ట్రం అప్పుల్లో ఉన్నా సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నామని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. రూ. 18 వేల కోట్ల రుణమాఫీతో పాటు సన్నధాన్యానికి బోనస్ ఇస్తున్నామని ఆయన గుర్తుచేశారు. అనంతరం పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతల వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, సేంద్రీయ వ్యవసాయంతో పెట్టుబడులు తగ్గి లాభాలు పెరుగుతాయన్నారు. రసాయనాలు వాడకం కన్నా సేంద్రీయ ఎరువులు వాడకం వల్ల అధిక దిగుబడి వస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన 150 వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ స్టాళ్ళను మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు సందర్శించారు.

ఏం ఉద్ధరించారని రైతు ఉత్సవాలు: బీజేపీ

రైతులను ఏం ఉద్ధరించారని రైతు ఉత్సవాలు నిర్వహిస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణీ రుద్రమ కాంగ్రెస్ పార్టీని ప్రశ్నించారు. వరంగల్ డిక్లరేషన్‌లో ఇచ్చిన 9 హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయకుండా మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి విజయోత్సవాలు నిర్వహించుకునే అర్హత లేదని అన్నారు.

2026 ఖేలో ఇండియా హైదరాబాద్‌లో

సీఎం రేవంత్ వినతిపై కేంద్రం సానుకూలం

న్యూఢిల్లీ, నవంబర్28 (ఆంధ్రజ్యోతి): ఖేలో ఇండియా-2026 పోటీలకు హైదరాబాద్ వేదిక కాబోతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తిపై కేంద్రం సానుకూలంగా స్పందించింది. 2025లోనే నిర్వహించాలని సీఎం కోరగా, ఇప్పటికే బిహార్‌లో నిర్వహించాలని నిర్ణయించిన నేపథ్యంలో 2026లో నిర్వహించేందుకు కేంద్రం సుముఖత వ్యక్తం చేసింది. రాష్ట్రంలో క్రీడల నిర్వహణకు ఉన్న సౌకర్యాలను వివరిస్తూ సీఎం రేవంత్ రాసిన లేఖను రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఢిల్లీలోని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్ రెడ్డి తోపాటు ఎంపీలు మల్లు రవి, రామసహాయం రఘురామిరెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, చామల కిరణ్‌కుమార్ రెడ్డి కేంద్ర క్రీడల శాఖ మంత్రి మన్‌సుఖ్ సింగ్ మాండవీయకు అందజేశారు.

కేంద్రానికి సీఎం రేవంత్‌రెడ్డి లేఖ

"హైదరాబాద్ నగరంలో 32వ జాతీయ క్రీడలు (2002లో), ఆఫ్రో ఏషియన్ గేమ్స్, 7వ మిలిటరీ గేమ్స్ సహా అనేక జాతీయ స్థాయి పోటీలు జరిగాయి. రాష్ట్రంలో క్రీడా రంగానికి గత పదేండ్ల పాలనతో పోలిస్తే ప్రస్తుత ప్రభుత్వం ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుంది. జాతీయ స్థాయి పోటీలను నిర్వహించడానికి అవసరమైన అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయి. గచ్చిబౌలిలోని స్పోర్ట్స్ కాంప్లెక్సులో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్, సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్, హాకీ టర్ఫ్, షూటింగ్ రేంజ్, సరూర్‌నగర్‌లో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం, సింథటిక్ టెన్నిస్ కోర్ట్, స్కేటింగ్ ట్రాక్, ఔట్ డోర్ స్టేడియం, ఎల్బీ స్టేడియంలో ఇండోర్ స్టేడియంతో పాటు టెన్నిక్ కాంప్లెక్స్, ఫుట్ బాల్ గ్రౌండ్, కేవీబీఆర్ ఇండోర్ స్టేడియం, హుస్సేన్ సాగర్‌లో వాటర్ స్పోర్ట్స్ నిర్వహించే సౌకర్యం, ఉస్మానియా క్యాంపస్‌లో సైక్లింగ్ వెల్‌డ్రోమ్, సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్, స్విమ్మింగ్ పూల్, స్కేటింగ్ ట్రాక్, జింఖానా-2 గ్రౌండ్‌లో ఫుట్ బాల్ గ్రౌండ్‌తో పాటు ఔట్ డోర్ గేమ్స్ నిర్వహించే వసతులు ఉన్నాయి. గతేడాదితో పోలిస్తే ఈసారి బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం పది రెట్ల మేర క్రీడల కోసం కేటాయింపులను పెంచింది. కేవలం క్రీడల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు మాత్రమే కాకుండా క్రీడాకారులు చేరుకునేలా రైలు, విమాన సౌకర్యాలు కూడా ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వడం మాత్రమే కాకుండా యువతను ప్రోత్సహించేలా ప్రత్యేక పాలసీని కూడా రూపొందిస్తున్నది." అని కేంద్రానికి రాసిన లేఖలో సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. సీఎం వినతిపై కేంద్ర క్రీడల మంత్రి మాండవీయ సానుకూలంగా స్పందించారని, 2026లో హైదరాబాద్‌లో పోటీలు నిర్వహించేందుకు సూత్రప్రాయంగా అంగీకరించినట్టు జితేందర్ రెడ్డి తెలిపారు.

రూ.200 కోట్లతో 'బన్యన్ నేషన్' విస్తరణ

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్ అంకుర సంస్థ 'బన్యన్ నేషన్' రూ.200 కోట్ల పెట్టుబడితో భారీ విస్తరణ చేపట్టేందుకు ముందుకొచ్చిందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. గురువారం ఆ సంస్థ ప్రతినిధులతో భేటీ తర్వాత మంత్రి మాట్లాడారు. ప్రస్తుతం పటాన్‌చెరు మండలంలోని పాశమైలారం పారిశ్రామిక వాడలో 15 వేల టన్నుల వార్షిక సామర్థ్యంతో 'బన్యన్ నేషన్' రీ సైక్లింగ్ పరిశ్రమను నిర్వహిస్తోంది. రూ.200 కోట్లతో దీనిని 45 వేల టన్నులకు విస్తరించడానికి ఏర్పాట్లు చేసుకుంటోందని మంత్రి చెప్పారు. విస్తరణ పూర్తయితే మరో 500 మందికి ఉపాధి లభిస్తాయని వివరించారు. రీసైక్లింగ్ చేసిన ప్లాస్టిక్‌ను ఈ సంస్థ యూనిలివర్, టాటా మోటార్స్ లాంటి పెద్ద కంపెనీలకు విక్రయిస్తోందని తెలిపారు. రూ.100 కోట్ల వార్షిక టర్నోవర్ ఉన్న 'బన్యన్ నేషన్' లాభాల్లో నడుస్తోందన్నారు. కొత్త ప్లాంట్ల ఏర్పాటుకు అవసరమయ్యే భూమి కేటాయింపుపై టీజీఐఐసీ నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. మరో కార్యక్రమంలో.. శేరిలింగంపల్లి వాసవి స్కైసిటీ టవర్స్‌లో ఏర్పాటుచేసిన ఐటీ కంపెనీ-- వతానియా సొల్యూషన్స్ కార్యాలయాన్ని మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించారు. ఆయన వెంట చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ఉన్నారు.

పీకల్లోతు నష్టాల్లో డిస్కమ్‌లు

- దేశవ్యాప్తంగా రూ.6.76 లక్షల కోట్ల భారం
- నష్టాల్లో ఐదో స్థానంలో తెలంగాణ సంస్థలు
- రూ.6.61 లక్షల కోట్ల అప్పుల ఊబిలో డిస్కమ్‌లు

హైదరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): దేశమంతటా విద్యుత్ వెలుగులు పంచుతున్న ప్రభుత్వ రంగ విద్యుత్ పంపిణీ సంస్థలను కారు చీకట్లు అలుముకుంటున్నాయి. ఏటికేడు ఆర్థికంగా బలహీనపడిపోతున్న డిస్కమ్‌లు ప్రస్తుతం పీకల్లోతు నష్టాల్లో కూరుకుపోయాయి. నష్టాలపరంగా తెలంగాణ డిస్కమ్‌లు దేశంలో ఐదో స్థానంలో ఉన్నాయి. దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగంలోని విద్యుత్ పంపిణీ సంస్థలు 2015-16లో రూ.3,74,099 కోట్ల నష్టాల్లో ఉండగా.. 2022-23 నాటికి రూ.6,76,681 కోట్ల నష్టాలను మూటగట్టుకున్నాయి. అదే సమయంలో తెలంగాణ డిస్కమ్‌ల నష్టాలు రూ.16,520 కోట్ల నుంచి రూ.60,922 కోట్లకు పెరిగిపోయాయి. నష్టాలపరంగా రూ.1,62,507 కోట్లతో తమిళనాడు దేశంలోనే మొదటి స్థానంలో ఉండగా, రూ.92,070 కోట్లతో రాజస్థాన్ రెండో స్థానం, రూ.91,632 కోట్లతో మూడో స్థానంలో ఉత్తరప్రదేశ్, రూ.64,843 కోట్లతో నాలుగో స్థానంలో మధ్యప్రదేశ్.. ఆ తర్వాత తెలంగాణ ఉన్నాయి. డిస్కమ్‌ల ఆర్థిక పరిస్థితిపై రాజ్యసభలో ఎంపీ సంజయ్ కుమార్ ఝా అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా కేంద్రం ఈ వివరాలను వెల్లడించింది. 2014-15 నుంచి 2024-25లో గత జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం దాకా తెలంగాణ డిస్కమ్‌ల నష్టాలు రూ.64,867.66 కోట్లు. దేశ వ్యాప్తంగా ప్రభుత్వ రంగ డిస్కమ్‌ల అప్పులు 2015-16లో రూ.4,08,941 కోట్లు ఉండగా, 2022-23 నాటికి రూ.6,61,263 కోట్లకు చేరాయి. అదే సమయంలో తెలంగాణ డిస్కమ్‌ల అప్పులు రూ.13,944 కోట్ల నుంచి రూ.35,883 కోట్లకు పెరిగాయి.

కరెంటు చార్జీల పెంపులేనట్లే..?

- సిద్ధమైన వార్షిక ఆదాయ అవసరాల పిటిషన్
- రేపు లేదా వారం, పది రోజుల్లో దాఖలుకు అవకాశం

హైదరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వచ్చే(2025-26) ఆర్థిక సంవత్సరానికి గాను కరెంటు ఛార్జీలను పెంచకూడదని డిస్కమ్‌లు భావిస్తున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉన్న ఛార్జీలనే కొనసాగించాలనే ఆలోచనతో ఉన్నాయి. ఈ మేరకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను వార్షిక ఆదాయ అవసరాలు(ఏఆర్ఆర్), టారిఫ్ ప్రతిపాదనలను రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(టీజీఈఆర్సీ)లో దాఖలు చేయాలని డిస్కమ్‌లు నిర్ణయించాయి. ఈ నేపథ్యంలో పిటిషన్లకు తుదిరూపు ఇస్తున్నాయి. శనివారం లేదా వారం, పది రోజుల్లో పిటిషన్లు దాఖలు చేసే అవకాశాలున్నాయని సమాచారం. ఎలక్ట్రిసిటీ చట్టం ప్రకారం రానున్న ఆర్థిక సంవత్సరానికి గాను ఏటా నవంబరు 30లోపు డిస్కమ్‌లు ఏఆర్ఆర్‌లు దాఖలు చేసి, ఈఆర్సీ అనుమతి తెచ్చుకోవాలి. అయితే నెల కిందటే కొత్త టారిఫ్ అమల్లోకి వచ్చింది. కరెంట్ ఛార్జీల పెంపు లేనందున.. వారం, పది రోజుల్లో ఏఆర్ఆర్ దాఖలు చేసే అవకాశాలున్నాయని తెలుస్తోంది.

ప్రభుత్వ పరిహారంతో అప్పులు తీర్చవచ్చని గల్ఫ్ ప్రవాసీ ఆత్మహత్య

ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి: తాను చనిపోతే తన కుటుంబానికి రేవంత్ సర్కార్ అందించే రూ.5 లక్షల ఆర్థిక సహాయంతో కొంత మేర అప్పులు తీరుతాయనే భావనతో గల్ఫ్‌లో తెలంగాణ ప్రవాసీ ఒకరు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నిజామాబాద్ జిల్లా ఆర్మూరు మండలం రాంపూర్ గ్రామానికి చెందిన గంట చిన్న ముత్తన్న(55) సుదీర్ఘకాలం పాటు ఖతర్‌లో పని చేసి కొన్నాళ్ల క్రితం భారత్‌కు తిరిగి వచ్చి పాల వ్యాపారం చేసి అప్పుల పాలయ్యాడు. ఏడాదిన్నర క్రితం మళ్లీ ఖతర్‌కు చేరుకున్నాడు. అయితే ఖతర్‌లో యజమానితో వివాదం తలెత్తడంతో ఆయన వద్ద పని మానేసి కూలీ పనులు చేసుకుంటూ గడుపుతున్నాడు. ఓ వైపు అప్పుల బాధ.. మరోవైపు సరైన పనిలేదు.. ఈ క్రమంలో భారత్‌కు తిరిగి వచ్చేయాలని విమాన టికెట్ కొనుక్కునేందుకు ఖతర్‌లో అప్పు కూడా చేశాడు. అయితే గల్ఫ్‌లో మరణిస్తే తెలంగాణ సర్కార్ గల్ఫ్ మృతుల కుటుంబాలకు ఇచ్చే రూ.5 లక్షల ఆర్థిక సహాయంతో అప్పులు తీరాయని భావించి.. టికెట్ కోసం అప్పు చేసిన డబ్బును కూడా కుటుంబానికి పంపి, చిన్న ముత్తన్న ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది. మృతుడి కుటుంబ పరిస్థితి తెలుసుకుని చలించిన ఆర్మూర్ శాసన సభ్యుడు పైడి రాకేశ్ రెడ్డి ఖతర్‌లోని తన మిత్రులకు సహాయంతో చిన్న ముత్తన్న మృతదేహం బుధవారం భారత్‌కు చేర్చారు.

10వ తరగతిలో ఇంటర్నల్ మార్కుల రద్దు

(మొదటిపేజీ తరువాయి)

ఆధారంగానే(100%) విద్యార్థులకు సంబంధించిన గ్రేడింగ్‌ను నిర్ణయిస్తారు. అయితే.. ఎస్ఏ పరీక్షలు యథావిధంగా కొనసాగుతాయి. ప్రైవేట్ స్కూళ్లలో విద్యార్థులకు ఇంటర్నల్ మార్కులను ఎక్కువగా నమోదు చేయడం, ఆ స్థాయిలో ప్రభుత్వ స్కూళ్లల్లో మార్కులను వేయకపోవడం వంటి విషయాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఇక ఆన్సర్ బుక్‌లెట్ల విషయంలోనూ విద్యాశాఖ కీలక మార్పులు చేసింది. ఇకపై అదనపు ఆన్సర్‌షీట్ ఇవ్వకుండా.. ప్రధాన బుక్‌లెట్‌ను 24 పేజీలతో అందజేస్తారు. ఇంతకు ముందు విద్యార్థి 4 పేజీల ప్రధాన ఆన్సర్‌షీట్‌ను పూర్తిచేస్తే.. ఆ తర్వాత నాలుగేసి పేజీల అదనపు ఆన్సర్ షీట్లను ఇచ్చేవారు. ఈ విధానాన్ని స్వస్తిపలుకుతూ.. ఇప్పుడు 24 పేజీల జవాబు పత్రాన్ని పరిచయం చేయనున్నారు. కాగా.. గతంలో 11 పేపర్లుగా ఉన్న పదోతరగతి పరీక్షలను కొవిడ్ సమయం నుంచి ఆరు పేపర్లకు కుదించిన విషయం తెలిసిందే.! ఈ విధానం యథాతథంగా కొనసాగుతుంది. సైన్స్ పేపర్‌ను మాత్రం ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్‌గా రెండు పరీక్షలుగా నిర్వహిస్తారు.

టెన్త్ ఫీజు గడువు పొడిగింపు!

పదో తరగతి వార్షిక పరీక్షల ఫీజు గడువును పొడిగిస్తూ విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది. నిజానికి ఫీజు గడువు గురువారంతో ముగిసింది. అయితే.. విద్యార్థుల సౌలభ్యం కోసం ఎలాంటి ఆలస్య రుసుం లేకుండా.. ఈ తేదీని డిసెంబరు 5వ తేదీ వరకు పొడిగించారు. రూ. 50 లేట్ ఫీజుతో డిసెంబరు 12వ తేదీ వరకు.. రూ.200 లేట్ ఫీజుతో డిసెంబరు 19 వరకు, రూ.500 లేట్ ఫీజుతో డిసెంబరు 30 వరకు ఈ గడువును పొడిగించారు

12న విచారణకు హాజరు కావాలి

(మొదటిపేజీ తరువాయి)

జారీ చేసింది. తన కుమారుడు నాగచైతన్య, సమంత విడాకులకు సంబంధించిన అంశంలో.. కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై నాగార్జున పరువునష్టం కేసు దాఖలు చేసిన విషయం తెలిసిందే. మంత్రి నిరాధార వ్యాఖ్యల కారణంగా తమ కుటుంబం పరువు ప్రతిష్ఠలకు తీవ్ర భంగం వాటిల్లిందని, తనతోపాటు తన కుటుంబ సభ్యులు తీవ్రమైన వేదనకు గురయ్యారని పిటిషన్‌లో నాగార్జున తెలిపారు. మంత్రిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. విచారణ సందర్భంగా నాగార్జున కోర్టుకు హాజరై వాంగ్మూలం ఇచ్చారు. ఈ కేసుపై నాంపల్లి కోర్టు తాజాగా గురువారం విచారణ జరిపింది. నాగార్జున పిటిషన్‌ను పరిగణనలోకి (కాగ్నిజెన్స్) తీసుకుంది. ఈ మేరకు బీఎన్ఎస్ సెక్షన్ 356 కింద కొండా సురేఖపై కేసు నమోదుకు ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణకు మంత్రి కొండా సురేఖ వ్యక్తిగతంగా హాజరుకావాలని పేర్కొంటూ విచారణను డిసెంబర్ 12కు వాయిదా వేసింది.

ఇథనాల్ పరిశ్రమపై కిం కర్తవ్యం?

(మొదటిపేజీ తరువాయి)

రద్దు నిర్ణయం కూడా కేంద్రానిదే అని రాష్ట్ర ప్రభుత్వంలో అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పెట్రోల్ వినియోగంతో వెలువడుతున్న పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించాలంటే అందులో కొంత శాతం ఇథనాల్ కలపాలన్నది కేంద్ర ప్రభుత్వ విధానం. పెట్రోల్‌లో 1.53 శాతం ఇథనాల్ కలిపేందుకు 2013-14లో కేంద్రం అనుమతించగా.. దీన్ని 2020-21లో 8.04 శాతానికి పెంచింది. దీంతో దేశంలో ఇథనాల్ డిమాండ్ ఒక్కసారిగా పెరిగిపోయింది. 2025 నాటికి దీన్ని 20 శాతానికి పెంచాలని కేంద్రం లక్ష్యంగా నిర్దేశించుకుంది. అయితే దేశ అవసరాలకు సరిపడా ఇథనాల్ అందుబాటులో లేదు. ప్రస్తుత అవసరాలకు సరిపడా కావాలన్నా దిగుమతి చేసుకోవాల్సిందే. ఇథనాల్‌ను దేశీయంగా తయారు చేయాలన్న లక్ష్యంతో కేంద్రం గత కొన్నేళ్లుగా రాష్ట్రాలను ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగానే గతంలో నిర్మల్ జిల్లాలో ఇథనాల్ పరిశ్రమకు కేంద్రం అనుమతులు ఇచ్చింది. పాడైన, మిగులు వ్యవసాయ ఉత్పత్తులతో ఇథనాల్ తయారుచేయవచ్చని కేంద్రం అనుమతిస్తోంది. మన దేశంలో ముఖ్యంగా చెరకు, మొక్కజొన్న లాంటి వ్యవసాయ ఉత్పత్తులతో తయారుచేస్తున్నారు. దీంతో ఈ వ్యాపారంలో ఎక్కువ ప్రయోజనం రైతులకే కలుగుతోందని, కాలుష్యం తగ్గుతోందని కేంద్రం సమర్థించుకుంటోంది. కోటి లీటర్ల ఇథనాల్ కలిపిన పెట్రోలు 20 వేల టన్నుల కార్బన్ డయాక్సైడ్‌ను తగ్గిస్తుందని పేర్కొంటోంది. అయితే నిపుణులు, పర్యావరణవేత్తలు మాత్రం మరోలా చెబుతున్నారు. వ్యవసాయ ఉత్పత్తులు వినియోగించే ఇథనాల్ పరిశ్రమల నుంచి వాయు కాలుష్యం తీవ్రత ఎక్కువగా ఉంటుందని, వెలువడే హానికారక రసాయనాలతో స్థానికులకు శ్వాసకోశ వ్యాధులు వస్తాయని హెచ్చరిస్తున్నారు. కాగా, 2013-14లో దేశంలో 13 కోట్ల లీటర్ల ఇథనాల్ విక్రయాలు జరగ్గా అది 2020లో 21 వేల కోట్ల లీటర్లకు చేరింది.

పెట్రోల్‌లో కలిపే ఇథనాల్ పేరుతో..

నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో కేంద్ర ప్రభుత్వం ఫ్యూయల్ ఇథనాల్ పరిశ్రమకు అనుమతించింది. దీని ప్రకారం పెట్రోల్‌లో కలిపేందుకు అవసరమయ్యే ఇథనాల్ మాత్రమే తయారుచేయాలి. దీనికోసం ప్రత్యేక రాయితీలూ ఇచ్చింది. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇందులో మరిన్ని ఉత్పత్తుల తయారీకి అనుమతులు ఇచ్చింది. మద్యం తయారీలో అవసరమయ్యే ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కహాల్, ఇండస్ట్రియల్ అబ్జల్యూట్ ఆల్కహాల్ ఉత్పత్తికీ అనుమతులిస్తూ గత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. స్థానిక గ్రామ పంచాయతీ అనుమతులు, నిరభ్యంతర పత్రం (ఎన్వోసీ) తీసుకోకపోవడం, ప్రజాభిప్రాయ సేకరణ లేకుండానే పరిశ్రమలను స్థాపించవచ్చని గత ప్రభుత్వం మినహాయింపులు సైతం ఇచ్చింది. 2022 డిసెంబరులో పీఎంకే డిస్టిలేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి ఈ అనుమతులు జారీ చేసింది. దీని ఆధారంగా జూన్ 15, 2023న నీటిపారుదల శాఖ నీటి కేటాయింపులు కూడా చేసేసింది. ఎలాంటి ప్రజాభిప్రాయ సేకరణ లేకపోవడంపై స్థానికుల్లో ఇప్పటికే తీవ్ర ఆగ్రహం ఉండగా.. అకస్మాత్తుగా పరిశ్రమ ప్రహరీ గోడ నిర్మించడంతో ఆందోళన తీవ్రరూపం దాల్చింది. దీనిని రాష్ట్ర ప్రభుత్వం తాత్కాలికంగా నిలుపుదల చేసినా.. రద్దు అధికారం మాత్రం కేంద్రం చేతుల్లోనే ఉందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. కేంద్రం అనుమతించిన విధంగా కేవలం ఫ్యూయల్ ఇథనాల్ ఉత్పత్తికి మాత్రమే అనుమతించి ఇతరవాటి అనుమతులు రద్దు చేయడమా? పరిశ్రమ అనుమతులు పూర్తిగా రద్దు చేయాలని కేంద్రానికి సిఫారసు చేయడమా? అన్న విషయంపై ప్రభుత్వంలో ఉన్నతస్థాయిలో చర్చ నడుస్తోంది.



ఇథనాల్ పరిశ్రమ వద్దంటూ రోడ్డుపైనే భోజనాలు చేస్తున్న మహిళా రైతులు(ఫైల్)

దాడుల వెనుక రాజకీయ కుట్రలు



త్వరలో బయటపెడతాం: మంత్రి సీతక్క

హైదరాబాద్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేయడానికి జరుగుతున్న దాడులు, ఘటనల వెనుక రాజకీయ కుట్రలు దాగి ఉన్నాయని, త్వరలో వాటిని బయట పెడతామని మంత్రి సీతక్క అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా దిలావర్పూర్‌లో గ్రామసభ పెట్టకుండానే గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2022లోనే ఇథనాల్ ఫ్యాక్టరీకి అనుమతులిచ్చిందని ఆరోపించారు. గురువారం సీతక్క విలేకరులతో మాట్లాడుతూ ఇథనాల్ పరిశ్రమ డైరెక్టర్లుగా బీఆర్ఎస్ హయాంలో మంత్రిగా పనిచేసిన తలసాని శ్రీనివాస్ యాదవ్ కొడుకు, తలసాని వియ్యంకుడు పుట్టా సుధాకర్ కొడుకు ఉన్నారని పేర్కొన్నారు. రెండేళ్ల క్రితం గ్రామసభ పెట్టకుండా అప్పటి మంత్రి కేటీఆర్ అనుమతించారని, దానిపై అప్పటి సీఎం కేసీఆర్ సంతకం చేశారని ఆరోపించారు. ఇథనాల్ ఫ్యాక్టరీ అనుమతికి బీజేపీ మద్దతు తెలిపిందని విమర్శించారు. గ్రామసభ పెట్టకుండా అనుమతి ఇచ్చినందుకు నిరసనగా అప్పట్లో తాము ధర్నాలు చేసినట్టు చెప్పారు. బీఆర్ఎస్ వాళ్లే అనుమతించి.. నేడు వారే మళ్లీ అధికారులపై దాడులకు తెగడుతున్నారని మండిపడ్డారు. గ్రామసభ నిర్వహించకుండా అనుమతి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. దీనిపై త్వరలో కేసీఆర్ సంతకాలతో ఉన్న ఆధారాలన్నీ బయటపెడతామన్నారు. ఈ విషయాలపై అసెంబ్లీలో చర్చ పెడతామన్నారు. కేటీఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే దిలావర్పూర్ రావాలని, తాము కూడా వస్తామని, ఎవరు అనుమతి ఇచ్చారో తేలుద్దామని సవాల్ విసిరారు. కేటీఆర్ ఇప్పటికైనా తప్పును ఒప్పుకోవాలని సీతక్క సూచించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు 50మంది విద్యార్థులు మృత్యువాతపడితే మంత్రులెవ్వరూ వెళ్లలేదన్నారు. వాంకిడి విద్యార్థిని చనిపోవడం దురదృష్టకరమన్నారు. ఆ విద్యార్థినికి మెరుగైన వైద్య చికిత్స అందించేందుకు రూ.4 లక్షలు ఖర్చు చేశామని, అయితే కార్డియాక్ అరెస్ట్‌తో చనిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

ఇథనాల్ పరిశ్రమతో సంబంధం లేదు: తలసాని



హైదరాబాద్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఇథనాల్ పరిశ్రమతో తమ కుటుంబానికి ఎలాంటి సంబంధం లేదని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. రాజమండ్రి దగ్గర డిస్టిలరీస్ కంపెనీలో 8 మంది డైరెక్టర్లలో ఒకరిగా గతంలో తన కుమారుడు ఉండడం వాస్తవమేనని, 2016లోనే రాజీనామా చేశారని తెలిపారు. గురువారం విలేకర్ల సమావేశంలో తలసాని మాట్లాడారు. ఇథనాల్ పరిశ్రమ తన కుటుంబానిదని నిరూపిస్తే దాన్ని రాసిస్తానని, దిలావర్‌పూర్ గ్రామ ప్రజలకు జవాబు చెప్పాల్సింది ప్రభుత్వమేనని పేర్కొన్నారు. ఇథనాల్ పరిశ్రమకు పర్మిషన్లు ఇచ్చేది కేంద్ర ప్రభుత్వమేనని, రాష్ట్రంలో ప్రజల దృష్టి మరల్చే రాజకీయాలు నడుస్తున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి సంవత్సరమైందని, రాష్ట్ర ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నారన్నారు.

నిర్దిష్ట గడువులోగా 'ధరణి' సమస్యల పరిష్కారం

పలు మాడ్యూల్స్‌పై సీసీఎల్ఏ కొత్త మార్గదర్శకాలు

హైదరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నూతన రెవెన్యూ చట్టాన్ని(ఆర్వోఆర్-2024) తీసుకురాబోతున్న వేళ ధరణి పెండింగ్ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ధరణిలో పెండింగ్‌లో ఉన్న పలు దరఖాస్తులను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించేలా అధికారులను ఆదేశించింది. ఇందుకు సంబంధించి గతంలో ఇచ్చిన మార్గదర్శకాలను సవరించి భూపరిపాలనా కమిషనర్(సీసీఎల్ఏ) నవీన్ మిత్తల్ గురువారం నూతన మార్గదర్శకాలు జారీ చేశారు. అలాగే, ధరణిలోని పెండింగ్ సమస్యల పరిష్కారానికి కలెక్టర్లు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆదేశించారు. కాగా,ధరణి మాడ్యుల్‌లో టీఎం-3 కింద మ్యుటేషన్ కోసం వచ్చిన దరఖాస్తులను, టీఎం-24 కింద కోర్టు కేసు ద్వారా పట్టాదారు పాస్ పుస్తకం కోసం వచ్చిన దరఖాస్తులు, టీఎం-31 పట్టాదారు పాస్‌పుస్తకం జారీ అయ్యాక లేదా నాలా కన్వర్షన్ అయ్యాక ఇల్లు, ఇంటి స్థలం రికార్డుల సవరణకు వచ్చే దరఖాస్తులు, టీఎం-33 కింద పాస్‌పుస్తకంలో తప్పుల సవరణకు వచ్చే దరఖాస్తులను, పేరు మార్పు వంటి వాటిపై అదనపు కలెక్టర్లు(రెవెన్యూ) మూడు రోజుల వ్యవధిలో నిర్ణయం తీసుకోవాలని కొత్త మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. తహసీల్దారు, ఆర్డీవో చేసిన సిఫారసుల ఆధారంగా అదనపు కలెక్టర్లు ఆయా దరఖాస్తుల ఆమోదం లేదా తిరస్కరణపై మూడు రోజుల్లోగా నిర్ణయం తీసుకోవాలి. ఒక వేళ ఏదైనా దరఖాస్తును తిరస్కరిస్తే అందుకు కారణాన్ని అదనపు కలెక్టర్లు స్పష్టం చెయ్యాలి. కాగా, టీఎం-4 మాడ్యుల్ కింద వచ్చే పట్టాదారు పాస్‌పుస్తకం లేకుండా వారసత్వంగా వచ్చే అసైన్డ్ భూములు, టీఎం-27 పెండింగ్ నాలా దరఖాస్తులు, టీఎం-33 సర్వే నంబరు కాపీల మీద డిజిటల్ సంతకం కోసం వచ్చే దరఖాస్తులు, జీఎల్ఎం మాడ్యుల్ గ్రీవెన్స్ ఫర్ ల్యాండ్ మ్యాటర్- కింద సర్వే నంబరు పత్రాల మీద డిజిటల్ సంతకం కోసం వచ్చే దరఖాస్తులపై ఆర్డీవో స్థాయిలో తుది నిర్ణయం తీసుకోవాలి. ఆయా మాడ్యుల్స్ కింద ఉన్న పెండింగ్ దరఖాస్తులపై కలెక్టర్ స్థాయిలో 7 రోజులు, అదనపు కలెక్టర్ స్థాయిలో మూడు రోజులు, ఆర్డీవో స్థాయిలో మూడు రోజులు, తహసీల్దార్ స్థాయిలో ఏడు రోజుల వ్యవధిలో నిర్ణయం తీసుకోవాలని గతంలో ఇచ్చిన ఆదేశాలనే తాజా సర్క్యులర్‌లో సీసీఎల్ఏ ప్రస్తావించారు. కాగా, 'ధరణి' పెండింగ్ దరఖాస్తులు 3.49 లక్షల ఉండగా వాటిలో 2.35 లక్షల దరఖాస్తులను ఇప్పటిదాకా అధికారులు పరిష్కరించారు. ఇంకా లక్షా 5వేల దరఖాస్తులను పరిష్కరించాల్సి ఉంది.

ఎన్ఎండీసీ బ్యాంకు ఖాతా సీజ్

హైదరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని నవరత్న కంపెనీల్లో ఒకటైన నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్ఎండీసీ) చరిత్రలో తొలిసారిగా.. కంపెనీ బ్యాంకు ఖాతా సీజ్ అయింది. వీటీసీ ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ, ఆ కంపెనీ ఎండీ వీ ధనంజయరావుకు ఎన్ఎండీసీకి మధ్య ఏర్పడిన ఓ వాణిజ్య వివాదంలో డిక్రీ హోల్డర్ అయిన వీటీసీ ఇంజినీరింగ్ ప్రైవేట్ కంపెనీకి అనుకూలంగా హైదరాబాద్ కమర్షియల్ కోర్టు అవార్డు జారీచేసింది. ఈ అవార్డును అమలు చేయడంలో విఫలమైనందుకు మాసబ్‌ట్యాంక్ ఖనిజ్‌భవన్ ఎస్బీఐ బ్యాంకులో ఉన్న ఎన్ఎండీసీ ఖాతా నుంచి నగదు ఉపసంహరణలు చేయకుండా కోర్టు నిషేధం విధించింది. ఈ మేరకు బ్యాంకు మేనేజర్‌కు ఉత్తర్వులు జారీచేసింది. ఈ కేసులో తదుపరి విచారణ డిసెంబరు 2కు వాయిదా పడింది.

ఆ భూమిపై ఆధారాలు చూపండి

ఈడీ ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈఐపీఎల్‌తోపాటు నలుగురికి నోటీసులు

- 100 ఎకరాల భూదాన్ భూమిలో 50 ఎకరాలు అమ్మేసినట్లు పేర్కొన్న ఈడీ
- డిసెంబరు 6న ఆధారాలతో హాజరుకావాలి
- భూదాన్ బోర్డు కార్యదర్శి ఆదేశాలు

హైదరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారంలో భూదాన్‌బోర్డుకు చెందిన భూమి చేతులు మారడంపై ఓ సంస్థతోపాటు నలుగురు వ్యక్తులకు భూదాన్ బోర్డు కార్యదర్శి నోటీసులు పంపారు. నాగారంలో భూదాన్ బోర్డు పరిధిలో ఉన్న 100 ఎకరాల్లో సుమారు 50 ఎకరాలు చేతులు మారినట్లు ఇటీవల ఈడీ రాష్ట్ర డీజీపీకి అందించిన ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది. మనీల్యాండరింగ్ నిరోధక చట్టం కింద రంగారెడ్డి జిల్లా మాజీ కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్లపై ఈడీ కేసు నమోదు చేసింది. వారిపై ఈడీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో నాగారంలో అక్రమ లావాదేవీలు జరిగాయని పేర్కొంది.. దీంతో ఎఫ్ఐఆర్‌లో ఉన్న వివరాల ఆధారంగా భూదాన్ యజ్ఞ బోర్డు కార్యదర్శి తాజాగా ఈఐపీఎల్ గ్రూప్‌తో పాటు ఖాదరున్నీసా, ఎస్ సంతోష్‌కుమార్, బొబ్బిలి విశ్వనాథ రెడ్డి, మహేశ్వర్‌లకు నోటీసులు పంపారు. ఈ నోటీసుల్లో డిసెంబరు 6న సంబంధిత వ్యక్తులు నాంపల్లిలోని బోర్డు కార్యాలయం ఎదుట ఉదయం 11 గంటలకు హాజరు కావాలని పేర్కొన్నారు. ఆ భూమి తమది అని రుజువు చేసేందుకు నోటీసులు అందుకున్న వారి వద్ద ఉన్న అన్ని ఆధారాలతో రావాలని నోటీసుల్లో సూచించింది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారంలో సర్వే నం.181/3/2లో 0.11 గుంటల భూమికి సంబంధించి ఖాదరున్నీసా, ఇదే గ్రామంలో సర్వే నం.181/4/1/1/1/1/2/1లో 1.02 ఎకరాలకు సంబంధించి ఎస్.సంతోష్ కుమార్‌కు, సర్వే నం.181/4/1/2/1లో 1.20 ఎకరాలకు సంబంధించి బొబ్బిలి విశ్వనాథరెడ్డికి, సర్వే నం.181/4/1/1/1/1/1లో 1.10 ఎకరాలు, 181/1/1/1/1/2/2లో 1.35 ఎకరాలు, 181/4/1/1/1/2లో 3.30 ఎకరాలు, 181/4/1/1/2లో 0.18 గుంటలు, సర్వే నం.181/4/2లో 3.30 ఎకరాలు, 181/5/1/1/1/2లో 3.30 ఎకరాలు ఇలా మొత్తం 33.4 ఎకరాలకు సంబంధించి ఈఐపీఎల్ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి నోటీసులు పంపింది. వీరితోపాటు నాగారంలో సర్వే నం. 181కి సంబంధించిన రికార్డులతో హాజరు కావాలని మహేశ్వరం మండల తహసీల్దార్‌కు కూడా నోటీసులు ఇచ్చారు. ఈ భూముల అక్రమాలకు సంబంధించి గతంలో భూదాన్ బోర్డు ఫిర్యాదు చేసినా పోలీసులు కేసులు నమోదు చేయలేదు. ఈడీ ఎఫ్ఐఆర్ నేపథ్యంలో ఈ దఫా కేసులు నమోదు చేయక తప్పని పరిస్థితి పోలీసులకు, రెవెన్యూ అధికారులకు ఏర్పడింది.

భూదాన్ భూముల రిజిస్ట్రేషన్లపై అధికారుల విచారణ

బాధ్యులపై కేసు నమోదు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కందుకూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం తిమ్మాపురం గ్రామంలో ఉన్న భూదాన్ భూముల కొనుగోలుకు సహకరించిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. గత నెల 28న 'నాయకుల భూదాహం.. అధికారుల భూదానం' శీర్షికతో ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై పోలీసులు, రెవెన్యూ అధికారులు స్పందించి ఇన్‌చార్జి ఆర్డీవో అనంతరెడ్డి నేతృత్వంలో విచారణ చేపట్టారు. భూదాన్ భూములు ఎలా రిజిస్ట్రేషన్ జరిగాయనే కోణంలో ఏసీపీ లక్ష్మీకాంతరెడ్డి ఆధ్వర్యంలో సీఐ సీతారాం విచారణ చేపట్టి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తిమ్మాపురం రెవెన్యూ పరిధిలోని 6/1, 147, 167/1, 167/9, 453, 454, 444, 573, 574, 575, 455, 576, 129, 130, 161 సర్వే నంబర్లలో 111 ఎకరాల 11 గుంటల భూదాన్ భూములు ఉన్నాయి. అందులో 39 ఎకరాల 18 గుంటల భూముల రికార్డులు తారుమారు చేసి రియల్ వ్యాపారులు పట్టా భూములుగా మార్పిడి చేసుకున్నారు. ఈ భూముల విలువ మార్కెట్‌లో సుమారు 200 కోట్ల వరకు ఉంటుంది.

దొంగతనం మోపడంతోనే తల్లీకొడుకుల ఆత్మహత్య!

జోగిపేట వద్ద మంజీరాలోకి దూకి బలవన్మరణానికి పాల్పడిన ఘటనలో వీడిన మిస్టరీ!

- ఆటో, బైక్ చోరీ ఘటనపై స్థానికుల నిలదీత
- నేరం మోపిన నలుగురి అరెస్టు.. రిమాండ్

జోగిపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా జోగిపేట సమీపంలోని చింతకుంట వద్ద వంతెనపై నుంచి రెండ్రోజుల క్రితం మంజీరా నదిలోకి ఓ యువకుడు, అతడి తల్లి దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన వెనుక మిస్టరీ వీడింది. తమపై దొంగతనాన్ని మోపడం, ఆ నేర ఘటనలో ఇరుక్కుపోయామని భావించి ఇద్దరూ తీవ్ర మనస్తాపం చెంది బలవన్మరణానికి పాల్పడినట్లు సమాచారం. మృతులు చింతకుంట గ్రామానికి చెందిన వడ్ల శ్యామ్ (28), అతడి తల్లి బాలామణి (48). జోగిపేట సీఐ అనిల్ కుమార్ గురువారం కేసు వివరాలను వెల్లడించారు. సంగారెడ్డికి చెందిన చాంద్ పాషాకు అందోలు మండలం చింతకుంటకు చెందిన మహిళతో వివాహమైంది. తల్లిగారింట్లో ఉన్న భార్యను తీసుకువెళ్లేందుకు చాంద్ పాషా ఈనెల 24న కొత్తదైన తన సొంత ఆటోలో చింతకుంటకు వచ్చాడు. ఆ వాహనాన్ని తన అత్తగారి ఇంటి వెనుక పార్క్ చేశాడు. మర్నాడు తెల్లవారుజామున నిద్రలో ఉన్న చాంద్‌పాషాకు మెదక్ జిల్లా కొల్చారం మండలం బుజరంపేట నుంచి ఓ ఫోన్ కాల్ వచ్చింది. 'ఫలానా నంబరు గల ఆటో నీదేనా' అని ఆవలివైపు వ్యక్తి చాంద్‌పాషాను ప్రశ్నించాడు. తనదేనని చాంద్‌పాషా చెప్పగా.. 'నీ ఆటో మా ఊర్లో ఉంది' అని ఆవలివైపు వ్యక్తి చెప్పాడు. కంగారుపడ్డ పాషా ఇంటి వెనుకకు వెళ్లి చూడగా అక్కడ తన ఆటో కనిపించలేదు. అయితే ఆ రోజు రాత్రి ఇంటి వెనుక నుంచి ఆటోతో బయలుదేరిన దొంగ బుజరంపేట వైపు వెళ్లాడు. ఆ ఊర్లో ఓ చోట బురదలో ఆటో కూరుకుపోయింది. ఎంత ప్రయత్నించినా అది బయటపడకపోవడంతో దొంగ, ఆ ఆటోను వదిలేసి.. అక్కడ పార్క్ చేసి ఉన్న మరొకరి బైక్‌తో అక్కడి నుంచి పరారయ్యాడు. అయితే ఆ బైక్, చింతకుంటకు చెందిన వడ్ల శ్యామ్ ఇంటి వద్ద ఉందని చాంద్‌పాషాకు తెలిసినట్లు సమాచారం. దీంతో అతడు నేరుగా ఊర్లోని శ్యామ్ ఇంటికి వెళ్లాడు. 'మా ఆటోను నువ్వే ఎత్తుకుపోయినవు. అట్లనే బుజరంపేటకు చెందిన బైక్ కూడా నువ్వే అక్కడి నుంచి ఎత్తుకొచ్చినవు' అని నిలదీశాడు. కంగారుపడిపోయిన శ్యామ్ తాను ఎలాంటి దొంగతనం చేయలేదని చెప్పాడు. చాంద్ పాషా వినిపించుకోకుండా.. 'నా ఆటోనైనా తెచ్చివ్వు. లేదంటే రూ.5లక్షల జరిమానా అయినా కట్టు' అని శ్యామ్‌ను బెదిరించాడు. అయితే ఈ దొంగతనం పంచాయతీ తేల్చుకునేందుకు బుజరంపేట వెళ్లాలని శ్యామ్, అతడి తల్లి బాలామణి నిర్ణయించుకున్నారు. ఇద్దరూ కలిసి తమది కాని ఆ వివాదాస్పద బైక్‌పైనే 26న రాత్రి బుజరంపేటకు బయలుదేరారు. మార్గమధ్యలో ఇద్దరూ ఏమనుకున్నారో ఏమో గానీ ఊరి సమీపంలోని వంతెనపై బైక్‌ను పార్క్ చేసి.. మంజీరా నదిలోకి దూకారు. మర్నాడు, అంటే బుధవారం (27న) మృతదేహాలను పోలీసులు వెలికితీశారు. శ్యామ్‌పై దొంగతనాన్ని మోపి.. అతడిని, ఆమె తల్లిని ఆత్మహత్యకు ప్రేరేపించారంటూ పోలీసులు చాంద్‌పాషాతో పాటు మొల్ల గుడ్డి మౌలానా, మహబూబ్ అలీ, శ్రీను, శ్రీశైలంపై కేసు నమోదు చేశారు. వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.



వడ్ల బాలామణి, వడ్ల శ్యామ్(ఫైల్)

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.